

శ్రీబృందావన మహిమామృతము
ద్వితీయ భాగము



శ్రీ రాధాదేవి



శ్రీ ప్రబోధానంద సరస్వతీపాదులు



శ్రీ రాధికా ప్రసాద్ మహరాజ్



శ్రీ రాధామహాలక్ష్మి అమ్మ

# శ్రీబృందావన మహిమామృతము

## ద్వితీయ భాగము


మూలము

**శ్రీప్రబోధానంద సరస్వతీపాదులు**

అనువాదము

**రసమణి**



ప్రకాశకులు

**శ్రీరాధా మహాలక్ష్మి ఆశ్రమం**

శ్రీ బృందావన ధామం, మధురజిల్లా

ఉత్తరప్రదేశ్

సర్వస్వామ్య సంకలితము

ప్రథమ ముద్రణ **ఆగష్టు, 2020**

ప్రతులు : 100

**వెల : అమూల్యము**

ప్రతులకు

**1) శ్రీరాధాకృష్ణ మందిరము**
5/5 అరండల్‌పేట,
గుంటూరు - 522 002
ఫోన్ : 0863-2233933

**2) శ్రీరాధా మహలక్ష్మి ఆశ్రమ్**
బడేకుంజ్, గోపేశ్వర్ ఆలయ వీధి,
బృందావన్ **(U.P.)** - 281 121
ఫోన్ : 0565-2442583

ముద్రణ : **సుదర్శన్ ప్రింటర్స్,** 17/2, అరండల్‌పేట, గుంటూరు.
ఫోన్ : 2246245

డి.టి.పి. : **శ్రీవల్లి గ్రాఫిక్స్,** గుంటూరు. సెల్ : 9966043946.

శ్రీరాధే

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | అమ్మమాట | v |
| | ముందుమాట | ix |
| 1. | ఆరవ శతకము | 1 – 39 |
| 2. | ఏడవ శతకము | 40 – 72 |
| 3. | ఎనిమిదవ శతకము | 73 – 105 |
| 4. | తొమ్మిదవ శతకము | 106 – 146 |
| 5. | పదవ శతకము | 147 – 187 |
| 6. | పదకొండవ శతకము | 188 – 236 |



శ్రీరాధే

# అమ్మమాట

**27.6.2020, 5 P.M.,**

**గుంటూరు ఆశ్రమం.**

పరమపూజ్యులైన నాన్నగారి దివ్య ఆశీస్సులతో; వారు బృందావనం గురించి చాలా అనుభవపూర్వకంగాను, రాధాకృష్ణులయందు ఉండే భక్తి అనురాగంతోను చెప్పారు. బృందావనం మీద ఉండే భావాన్ని ఎంత వర్ణించినా అదితరగదు అని వారు చెప్పి ఉన్నారు. బృందావనం పూర్తిగా అమ్మ యొక్క స్వరూపమే! నాన్నగారు "బృందావనమే నీ రూపంబు కాదే" అన్నారు. అమ్మరూపం! ఆ రూపం ధరించింది అమ్మ!

భగవంతుడు భక్తుడి ప్రీతికోసం తాను ఏయే రూపాలు ధరించి, ఏయే భావాలతో, ఏ విధమైన లీల జరుపుతాడో దానిని భక్తునికి, సఖియలకు వారు ఆధామ విశేషాన్ని గురించి పరిపూర్ణమైన రసాన్ని పంచుతూ ఉంటారు. అలాగే ప్రబోధానంద సరస్వతిగారికి బృందావనం గురించి ఎంత వర్ణించినా తృప్తి కలగటం లేదు. ఎలా వర్ణించినా తృప్తి అనేది లేదు. జీవులను ఉద్దేశించి, ఈ మాయాలోకంలో కొట్టుమిట్టాడుతున్న జీవులను చూచి, వారిని సంబోధిస్తూ, "మీరు కూడ బృందావనాన్ని ఆశ్రయించండి! బృందావనాన్ని ఆశ్రయిస్తే దొరకనిదంటూ ఉండదు. ఇచట దొరకనిది ఏదైనా లభింపకుండ ఉండదు" అన్నారు. వారు చెప్పినట్లుగా, ఒక కల్పవృక్షం కిందకూర్చొని, దానిని కోరుకుంటే కాని ఇవ్వదు అనుకుంటారు. కాని ఆ కల్పవృక్షాన్ని కోరుకొననక్కరలేదు. అయాచితంగా అలా ఇస్తూ ఉంటుంది. ఆ కల్పవృక్షాన్ని ఆశ్రయించు! 'అక్కడ ఉండి కూడా, అనేకమైన ప్రదేశాలకి వెళ్లి, అనేకమైన దేవతలను ఎందుకు కోరుకుంటావు మనసా! ఎందుకు బిచ్చమెత్తు కుంటున్నావు ? ఇక్కడ ఒక కల్పవృక్షంకాదు, అనేకమైన కల్పవృక్షాలు

కోట్లకొలది ఉన్నాయి. అలాంటి కల్పవృక్షముల కింద ఉండి కూడ నువ్వు బయట యాచిస్తున్నావు. యాచించకే మనసా!' అని సంబోధించి చెప్పారు.

జీవుడికి మామూలుగా ఈమాయలో స్వార్థపూరితమైన కోరికలు, స్వసుఖమైన కోరికలు, తన పరివారానికి సంబంధించిన కోరికలు ఇవన్నీ వాడిని పీడిస్తూ ఉంటాయి. ఆ కోరికలకే దేవతలను ఆశ్రయిస్తూ ఉంటారు. ఆ దేవతల ద్వారా వాళ్లు పొందుతూ ఉంటారు. ఈ దేవతలకి తగిన శక్తిని, తగిన వరశక్తిని ఇచ్చేది కూడా ఆ మూలమని ఎవరికీ తెలియదు. 'అలా యాచించకు! నిజమైన కల్పవృక్షం కింద ఉన్నావు. నీకు సమస్తం చేకూరుతుంది' అని ఆయన చెప్పారు. 'మూలాన్ని ఆశ్రయించు. ఇంటింటికీ వెళ్లి బిచ్చం ఎత్తకు దేవతల దగ్గర' అని ఆయన సంబోధించారు.

ఎంత విషయాదులతో ఉన్నా, ఎన్ని రకాలుగా అరిషడ్వర్గాలు ఉన్నా బృందావనంలో నివసించాలి అనే ఒక చిన్న కోరిక ఉంటే చాలట! అక్కడ నివసించాలి అనే కోరిక ఉండటమే చాలా గొప్ప విషయంట! అక్కడ ఉండటంతో ఆ ధామమునందు నిష్ఠ, ఆ ధామమునందు తిరుగాడుతున్న రాధాగోవిందులయందు మనసు కలిగియుండుట – ఇవి ఉండటం వలన వాళ్ల కృప చేత మొత్తం ఈ అరిషడ్వర్గాలు, ఈ మాయ అన్నీ పక్కకి వెళ్లిపోతాయి అన్నారు. ఆయన స్పష్టంగా, ఆయన చూస్తూ ఈ విధంగా చెప్పారు. ఎంత వర్ణించినా ఆ బృందావనాన్ని ఆయనకి తృప్తితీరలేదు. బృందావనం దివ్యమైన వృక్షాలతోటి, దివ్యమైన పక్షిగణాలతోటి విరాజమానమై ఉన్నది. ఆ వృక్షరాజములు వజ్ర, వైడూర్య, కనక భూషితమై వెలుగొందుతున్నాయి. ఆ పక్షిగణములు కూడ స్వర్ణకాంతితో ఉన్నాయి. వాటికలకలారావములు, అక్కడి సఖీగణం కూడ ఆనంద ఆవేశంతో ఉన్నారు. బృందావనమే దీనంతటికీ మూలం అన్నారు.

రాధాకృష్ణుల యొక్క అనుక్షణ రసవర్ధమానానికి బృందావనమే అన్నారు. ఆ బృందావనంలో జీవించటమే గొప్ప విశేషం! అక్కడ ఉండి కూడా రాధాకృష్ణుల యందు మనసు లగ్నం కాకపోతే, బృందావనమునందు నిష్ఠ

లేకపోతే వాడికి ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందో చెప్పలేమని చెప్పారు. కాబట్టి బృందావనాన్ని ఆశ్రయించు! ఎన్ని రకాలైన దుర్గుణాలు ఉన్నప్పటికి కూడాను, అక్కడ నివసించాలి అని లోపల చిన్న లేశమాత్రమైనా ఉంటే చాలట! ఆ బృందావనం అంత కరుణామయి! అంత రక్షిస్తుందట. తాను రాధాకృష్ణులతో అనుభవం పొందిన రసాస్వాదనను ఆ రసాన్ని అందజేస్తుందట. బృందావనం అలాంటిదని చెప్పారు. అలాంటి బృందావనాన్ని ఎంత వర్ణించినా తనివి తీరదని ప్రబోధానంద సరస్వతిగారు చెప్పారు.

రాధాకృష్ణులు నిరంతరం ఆ బృందావనాన్ని వర్ణిస్తూ, గుణ గానం చేస్తూ, ఆ బృందావనాన్ని తలుచుకుంటూ వాళ్లు ఉంటున్నారుట. అక్కడ ఉండే పక్షిగణాలు, అక్కడ ఉండే వృక్షరాజములు అంతా, అలౌకికమైన ఆ ప్రకృతి అంతా ఆనందదరస అనుభూతితో అవి ఉప్పొంగిపోయి ఉంటాయట! అలాంటి స్థితి బృందావనం అంటే! బృందావనమే మూలమని చెప్పారు. బృందావనమే తమ నిజధామం అన్నారు, 'రాధారాణి కుంజభవనం' అన్నారు. అలాంటి బృందావనాన్ని ఎంత వర్ణించినా తృప్తి తీరలేదు ప్రబోధానంద సరస్వతిగారికి. 'రండి, బృందావనంలో నివసించండి! మీరు జన్మరాహిత్యం చేసుకొని, ఆ రసానుభూతిని పొందాలంటే బృందావనం ఒక్కటే! ఇంక ఎక్కడికి వెళ్లినా అది దొరకదు' అని చెప్పారు. 'కాబట్టి బృందావనాన్ని ఆశ్రయించండి. బృందావనంలో నివసించండి, బృందావనంలో ఆ రసానుభూతిని పొందండి' అని ఆయన జీవులను సంబోధిస్తూ ఆ బృందావనాన్ని వర్ణించారు. ఎంత వర్ణించినా తనివితీరదని చెప్పారు. అక్కడి వృక్షాలు ఆనందానుభూతితో అలా వర్షిస్తు ఉంటాయట, పూలవర్షం కురిపిస్తాయట.

రాధాకృష్ణులు అలా సంచరిస్తూ ఉంటే ఆ సంచరించటానికి వారికి తగిన అనుకూల పరిస్థితులను ఏర్పరుస్తూ ఉంటాయట. అక్కడ చంద్రుడులేడు, సూర్యుడు లేడు. వారి యొక్క దివ్య వైభవమే, దివ్యకాంతియే ఆ బృందావనమంతా ప్రకాశవంతంగా నిండిపోయి ఉంటుందట! అలాంటిది బృందావనం! బృందావనంలో రాధాజీ నడుస్తూ ఉంటే ఆ వృక్షరాజములు

అలా దారి చూపిస్తూ ఉంటాయట! ప్రబోధానంద సరస్వతిగారి అనుభవం : అమ్మ ఒకసారి ఒక కుంజలో ఉన్నదట. కన్నయ్య వెతుకుతున్నాడు. అక్కడ ఉండే ఆ లతలు చేతుల వలె అమ్మ ఉండే కుంజ యొక్క అంతర్భాగానికి తీసుకొని వెళ్ళి చూపించాయట. ఎంత చిత్రంగా ఆయన ఆ అనుభూతిని పొందారో! నిజమైన బృందావన వైభవం అలాంటిది! అమ్మ యొక్క వైభవాన్ని ఆ విధంగా ప్రకటీకృతం చేశారు.

రాధాజీ చరణ ధ్యానాన్ని గురించి, చరణ స్మృతి గురించి, చరణ భజన గురించి ఆయన ఎక్కువగా వర్ణించి చెప్పారు. కాబట్టి జీవుడు రాధని ఆశ్రయిస్తే ఆ బృందావన రసం అంతా తప్పకుండా అనుభవం కలుగుతుందని చెప్పారు. ఇలాంటి బృందావనాన్ని ఎంత వర్ణించినా తనివితీరదని చెప్పారు. నాన్నగారు కూడా "బృందావన మహిమ వర్ణింపతరమా ఆదిశేషునికైన కీర్తింపవశమా" అని చెప్పారు. కాబట్టి వేయి నాలుకలు ఉన్న ఆదిశేషుడికే కాదు, బ్రహ్మాది దేవతలకు కూడా ఆధామాన్ని వర్ణించటానికి తరం కాలేదు. వాళ్లు కూడా, వైకుంఠధామంలో ఉండే శ్రీమన్నారాయణుడు, లక్ష్మీదేవి కూడా ఆబృందావన రసం కోసం లాలసతో ఉంటారట! అలాంటిది బృందావనం అని చెప్పారు. ఆయన దివ్యమైన అనుభూతులతో బృందావనాన్ని గురించి వర్ణించి చెప్పారు.

ఆరవ శతకం నుండి పదకొండవ శతకం వరకు రెండవ భాగంగా ప్రచురింపబడుతున్నది. ఇదంతా నాన్నకృప! బృందావనంతో అనుసంధానం బాగా కలిగి ఉండాలని, బృందావనాన్ని మరచిపోకుండ నిరంతరం స్మృతిలో ఉండాలని నాన్నగారు మనకి ఇలాంటి రుచికలిగిన మహారసగ్రంథాన్ని అందించారు.

**జయ జయ శ్రీరాధే!**

**శ్రీరాధాసఖీచరణ కమల రేణువు**

శ్రీరాధే

# ముందుమాట

"క్షణం చరణ విచ్ఛేదాచ్ఛ్రీశ్వర్యాః ప్రాణ హారిణీమ్
పదారవింద సంలగ్నతయైవాహర్నిశం స్థితామ్" 8-22

ఆ ఏకాంతసఖి క్షణకాలమైనా శ్రీరాధాచరణసేవను ఆపివేస్తే తన ప్రాణేశ్వరి ప్రాణాలకు హాని కలిగించినదిగా ఔతుంది. కనుక అహర్నిశలు శ్రీరాధా పదసేవలో నిమగ్నయై ఉంటుంది!

అంతరంగ సఖి క్షణకాలమైనా శ్రీసేవకు దూరమైతే తన సఖికి ఏమయిందో అనే శంకతో రాధాజీ ప్రాణాలకే హాని కలుగుతుందట! రాధాజీ ప్రాణాలకు ఎక్కడ ప్రమాదం వస్తుందో అని సఖి తత్పరయై నిర్విరామంగా ఆదేవి పదపద్మాలను ఆరాధిస్తూ ఉంటుంది. అద్భుతమైన ఈ శ్లోకంలో శ్రీప్రబోధానందుల దర్శనానుభూతి వేదాతీతమైన అన్యోన్యసేవాసుఖాన్ని స్పష్టం చేస్తున్నది. శ్రీరాధాగోవిందులకు, సఖీమణులకు, శ్రీబృందావనానికి నడుమ వెలుగుతున్న దివ్యప్రేమరసధార "శ్రీబృందావన మహిమామృతము" అను ఈ దివ్యగ్రంథంలో రసార్ద్రమై ప్రవహిస్తున్నది.

'పవిత్రమైన బృందావనం క్షుధార్తులకు మధురభోజనం, దాహార్తులకు శీతల జలము, వేడిమితో బాధపడేవారికి శీతల సరోవరము, దరిద్రులకు పరమధనము, యోగులకు బ్రహ్మానంద స్వరూపం, సమస్త జీవులకు ప్రాణతుల్యము' (6-16)! మహానందానికి మూలమైన శ్రీబృందావనంలో మృత్యుపర్యంతం నివసిస్తామని ప్రతిజ్ఞచేసిన వ్యక్తిని శ్రీరాధాకృష్ణులు "అతడు ఎట్లున్నాడు ?" అని యోగక్షేమాలను గూర్చి తెలుసుకుంటూ ఉంటారు

(6–35). అంటే అట్టి వానిని తమ బంధువుగా భావిస్తారట! సహజంగానే జీవులపై కరుణను వర్షించే శ్రీరాధామాధవులు తమ బంధువుగా భావించే వ్యక్తిని ఇంకెంతగా అనుగ్రహిస్తారో ఊహించలేము.

శ్రీరాధా సాకార, నిరాకార రసతత్వ సమన్వయమును శ్రీప్రబోధానందులు దాదాపు గ్రంథమందంతట స్పష్టం చేశారు. రాధాజీకి, సఖీమణులకు మధ్య వెలుగుతూ ఉండే రసానుబంధాన్ని మనోహరంగా వర్ణించారు. అంతేకాదు; బృందావనములోని వృక్షములు కేవల వృక్షములు కావని, అనంతకనకమణి జటితములైన మహామహిమాన్వితములని వారు దాదాపు అన్ని శతకములలోను స్పష్టం చేశారు. గ్రంథమంతా అపూర్వమైన ఆలంకారికశైలితోను, వర్ణనారీతితోను, భావుకతతోను నిండి ఉన్నది. ప్రతి వర్ణన శ్రీప్రబోధానందుల దర్శనానుభూతియే!

రసగురుదేవులైన శ్రీరాధికాప్రసాదుల దివ్యానుగ్రహం వలన, అంజనీ అమ్మగారి ఆశీస్సుల వలన ఈ దివ్యగ్రంథాన్ని అనువదించే భాగ్యం లభించింది. కొన్నికొన్నితావులలో శ్రీప్రబోధానందుల భావం మరింతలోతుగా ఉండటం వలన అందుకొనటం కష్టం ఔతున్నది. ఆయా సందర్భాలలో అంజనీ అమ్మను అడిగి తెలుసుకొనటం జరిగింది. రసతత్వపు ప్రీతిరీతి రసికమహాత్ములకే కదా తెలుస్తుంది!

శ్రీబృందావనం పరమానంద స్వరూపమని, సాటిలేని మహామాధుర్యచిద్ఘన రూపమని అంటూ; ఆధామంలో హరిభక్తులకు కూడ అలభ్యమైన ఒకానొక అనిర్వచనీయ వస్తువు (శ్రీరాధ) ఉన్నదని శ్రీప్రబోధానందులు ప్రకటించారు. అట్టి రాధాలీలలకు వేదికయై,

రాధాస్వరూపమే అయిన బృందావన మహిమను ఆ మహాత్ముడు తనివితీర వర్ణించారు. ఎంత వర్ణించినా ఇంకా అతృప్తియే!

'రాధాసఖి' అని బృందావన మహాత్ములచే స్తుతింపబడిన మన గురుదేవులు శ్రీరాధికాప్రసాదులు ఆ అనిర్వచనీయమైన వస్తువును (రాధాజీని) చిన్నారి తల్లిగా మనకు అందించారు. అటువంటి అపురూపమైన 'రసఖని' పద సన్నిధికి భావధ్యానముతో చేరుకోవాలని ప్రేమమీరగా బోధించారు. బ్రహ్మేశ్వరాది దేవతలకు కూడ ధ్యానంలో సైతం రాధాపదరజము కూడ లభించదని శ్రీరాధాసుధానిధి చాటి చెప్పింది. వేదాతీతయైన అంతటి రాధాజీకి శ్రీరాధికాప్రసాదులు అంతరంగసఖి, రాధాసఖి! అట్టి సఖి సద్గురువుగా లభించి, మనలనందరినీ తరింపజేయటమే లక్ష్యంగా భౌమజీవితాన్ని గడిపింది. బాహ్యదేహాన్ని ఉపసంహరించుకున్న తరువాత కూడ జీవోద్ధరణ అనే పావన వ్రతానికి కట్టుబడి మనలను నడిపిస్తున్నారు.

సంస్కృత శ్లోకములలో సందేహ నివృత్తికి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి సహకరించారు. ఆమెపై నిరంతరం గురుకృప వర్షించాలని కోరుకుంటున్నాను.

"శ్రీబృందావన మహిమామృతము" అను ఈ దివ్యగ్రంథములోని 6వ శతకము నుండి 11వ శతకము వరకు రెండవ భాగముగా రూపుదిద్దుకున్నది. ఇందులో కూడ పలుతావులలో ఛందోభంగము కన్పిస్తున్నది. మనం ముందే అనుకున్నట్లు, లభించిన 17 శతకములను ఎట్లున్నదానిని అట్లే పరిష్కర్తలు అందించారే తప్ప చేర్పులు, మార్పులు, దిద్దుటలు చేయలేదని తోస్తున్నది. 12వ శతకము నుండి 17వ శతకము వరకు ఉన్న మూడవ భాగము కూడ గురుకృపతో త్వరలో రావాలని కోరుకుంటున్నాను.

"నేనెటు దీర్చుకొందునె ఋణమేరీతి
దెలుపుకొందునె మది స్థిరము పరము
నీవని నమ్మితి, నెమ్మిజూపువిధము
ప్రీతి రీతిగదోచె, ప్రేమలహరి
వైరసధారల భావలీలాగతి
ప్రకటించు గురుదేవ! పావనమగు
రాధాకుటుంబపు బంధము మధురమై
మదివెల్గుచుండెనమ్మ నిజ జీవ
నమ్ము నీ సొమ్ము, చేకొమ్ము! నెమ్మిగొల్వ
వెంట నుండుదు వనుటభావితరములకు
నిత్యసత్యసందేశమై నెగడుగాక
రాధయే ప్రేమ రంజిత రవళికాగ"

సదా శ్రీరాధాసఖీ చరణకమల సన్నిధిలో
**రసమణి**

# ఆరవ శతకము

**సర్వానేవ సదా స్తువంస్తత ఇతః సర్వాన్ సదా ప్రీణయన్**
**సర్వేషాం సుఖసంపదః స్వభిలషన్ సర్వాత్మభావం భజన్**
**సర్వాగ్రే వినయాతిభావ నమితగ్రీవో నిరస్తాఖిలా**
**పేక్షస్తు స్వయమావసామ్యహమిదం వృందావనం పావనమ్** **1**

అందరినీ సదా స్తుతిస్తూ, అందరినీ సంతోషపరుస్తూ, అందరికీ సుఖసంపదలు కలగాలని కాంక్షిస్తూ ఉంటాను. అందరి యందు సమభావంతో ఉంటూ, అందరి ముందు వినయపూర్వకంగా తలవంచి ప్రవర్తిస్తూ, దేనియందు కాంక్షలేకుండ నేను ఈ పవిత్రమైన బృందావనంలో నివసిస్తాను!

**మాయాం కాంచన కామినీమయ మహామోహాంధతాకారిణీమ్**
**సర్వస్వార్థ నివారిణీం నిజగుణశ్రేయః సముత్సారిణీమ్**
**ప్రాజ్ఞస్యాపి ప్రతారిణీమతి మృషేవోదాస్య సచ్చారుతామ్**
**దూరాదేవ మహాభయాత్ పరిహరన్ సేవేత వృందావనమ్** **2**

కామినీ కాంచనములతో (స్త్రీతోను, బంగారముతోను) మహామోహాంధులుగా చేసెడి 'మాయ' సమస్తమైన స్వార్థము (మంచి విషయము)లను చెడగొడుతుంది, నీ మంచి గుణములను దూరం చేస్తుంది, బుద్ధిమంతులను కూడ వంచిస్తుంది. సుందరమైన, రమణీయమైన ఈ మాయను మిథ్యగా ఎరిగి; దూరము నుండియే దానిని త్యజించి, శ్రీబృందావనమును సేవించుటయే కర్తవ్యము!

**శ్రీశాద్యైరపి దుర్లభాద్భుతపదాకాంక్షీ నిహీనోఽప్యహో**
**నిత్యం త్వయ్యపరాధకృత్తవ రసం నైవాణుమప్యాప్లవన్**
**నైవ త్యక్తుమిహోత్సహే కువిషయాన్ ధర్మాది విస్మారకాన్**
**తల్లజ్జా భయశోకమోహవలితం మాం త్రాహి వృందావన** **3**

హే బృందావనమా! నేను అతిహీనుడినై ఉండి కూడ లక్ష్మీ, నారాయణాదులకు కూడ దుర్లభమైన ఆ అద్భుతపదమును కోరుకుంటున్నాను. నిత్యము నీ పట్ల అపరాధం చేస్తున్నాను. అణుమాత్రం కూడ నీ శ్రీరసంలో తేలియాడటం లేదు. ధర్మాదులను మరచిపోవునట్లు చేసెడి చెడు విషయాలను కూడ త్యజింపలేదు. లజ్జ, భయము, శోకము, మోహముల చేత చుట్టివేయబడి ఉన్నాను. నీవే నన్ను రక్షించాలి!

**నిత్యం కామః కిమపి కురుతే దుసహాం మర్మపీడా**
**మాంధ్యం క్రోధః కిమపి కురుతే క్షోభయేల్లోభః ఉచ్చైః**
**దంభాసూయా మద పిశునతా మత్సరాద్యైః సుపూర్ణః**
**స్వార్థాత్ భ్రష్టస్తదిహ శరణం యామి వృందావన! త్వామ్ 4**

హే బృందావనమా! కామం ఎంతెంతో అసహ్యామైన మర్మపీడను (చెప్పరాని బాధను) నిత్యమూ కలిగిస్తున్నది. క్రోధం ఎంతగానో అంధుడిని చేస్తున్నది. లోభం అత్యంత క్షుభితునిగ చేస్తున్నది. దంభం, అసూయ, మదం, దుర్మార్గం, మాత్సర్యం మున్నగువానిలో పూర్తిగా లీనమైపోయి స్వార్థం (మంచి గుణముల) నుండి భ్రష్టుడినైనాను. ఇప్పుడు నిన్ను శరణు కోరుకుంటున్నాను.

**భో భో ధన్య శిరోమణీ! భగవతః పాదాంబుజైకాంతిక**
**ప్రేమ్ణశ్చేత్ పరమం రహస్యమతి దుష్ప్రాప్యం చ సంప్రేప్స్యసి**
**తత్వం నిత్యవిహార మందిరమిదం శ్రీరాధికా కృష్ణయోః**
**ఆద్య స్వాద్య రసాత్మకాఖిల సమృధ్యాఽధ్యాసస్వ వృందావనమ్ 5**

హే ధన్య శిరోమణీ! భగవంతుని చరణకమలముల ఏకాంత ప్రేమ యొక్క అతిదుర్లభమైన పరమ రహస్యాన్ని బాగుగా పొందాలని నీకు ఇచ్ఛ ఉన్నట్లు అయితే ఆద్యము, ఆస్వాద్యము, రసాత్మకము, సమస్తభావ పూర్ణమునైన శ్రీరాధాకృష్ణుల నిత్య విహార మందిరమైన ఈ బృందావనములో నివసించు!

**భోగేచ్ఛా యది సర్వభోగమిహ కిం భుంక్షే న సర్వోత్తమమ్**
**మోక్షేచ్ఛా యది సర్వసాధనగణక్లేశం వినైవాత్ర హి**
**భక్తించేద్భగవత్యభీప్ససి పరాం తస్యా రహస్యం పరమ్**
**త్వత్రైవేత్యవధార్య సర్వజనతో వృందావనం సేవ్యతామ్ 6**

నీకు భోగాలు పొందాలనే ఇచ్ఛ ఉంటే, సర్వోత్తమమైన సమస్త భోగాలను ఇక్కడ భోగించలేవా ? మోక్షం పొందాలని ఇచ్ఛ ఉంటే సమస్త సాధనాల క్లేశం లేకుండగనే దానిని నీవు పొందగలవు! భగవద్భక్తిని పొందాలనుకుంటే పరమరహస్యమైన ఆ భక్తిని కూడ ఇక్కడే పొందగలవు. అన్ని లోకాల నుండి సమస్త తత్వాలను గ్రహించి, శ్రీబృందావనమును మాత్రమే సేవించు!

అంటే శ్రీబృందావనాన్ని భక్తితో సేవిస్తే పొందలేనిది ఏమీ లేదని భావం!

**త్రైగుణ్యాత్పరముజ్జ్వలం భగవతో ధామాస్తి విద్యామయమ్**
**తత్రాత్యుజ్జ్వలముల్లసత్యతి మహాశ్చర్య శ్రివృందావనమ్**
**తత్రానంగ రసోన్మదం నిశిదివా దివ్యం కిశోరద్వయమ్**
**గౌరశ్యామమతీవ కాంతమధురం క్రీడత్ కదా లాలయే 7**

త్రిగుణములకు ఆవల విద్యామయమైన భగవద్ధామము ఉన్నది. అందు మహాశ్చర్య శోభాయుక్తమైన అత్యుజ్వల బృందావనము ప్రకాశిస్తున్నది. అక్కడ అహర్నిశలు అనంగరసోన్మత్తులైన గౌరశ్యామవర్ణయుగళ కిశోరులు అతిశయ రసమయ మధుర క్రీడను సల్పుచున్నారు. నేను వారి సేవను ఎప్పుడు పొందగలను ?

**అంగేఽంగేఽనంత పారాః కిరదతి మధురాశ్చర్యలావణ్యవన్యా**
**గౌరశ్యామాభిరామాః స్మరవికృతి చమత్కార కోటీశ్చ విభ్రత్**
**నిత్యాశ్చర్య కిశోరద్వయమురుపులకం యద్రసావిష్టముచ్చైః**
**కుంజే కుంజే విహారి స్మర హృదయ సదా శ్రీల వృందావనం తత్ 8**

గౌరశ్యామ వర్ణ శోభితులై, అత్యంత రమణీయ మూర్తులై, అతిమధుర లావణ్యము యొక్క హద్దులులేని అనంత కాంతులను ప్రసరింపజేస్తూ, అనంగ రసవశులై కోటికోటి చమత్కృతులతో పులకితులై, రసావిష్ట చిత్తముతో, నిత్యాశ్చర్యమయ శ్రీయుగళ కిశోరులు శ్రీబృందావనములోని కుంజ నికుంజలలో విహరిస్తున్నారు. ఓ హృదయమా! నిరంతరము అట్టి శ్రీబృందావనమును స్మరించు!

**ఐశ్వర్యం పరమంచ వేత్తి న మనాక్ నాన్యంచ కించిద్రసమ్**
**న స్థానే పరతః కదా త్వనుగతం నో వా కృతోఽప్యాగతమ్**
**కైశోరాదపరం వయో న హి కదాప్యాసాదయన్న క్షణమ్**
**క్రీడాతో విరతం తదేక మిథునం వృందావనే నందతి 9**

పరమైశ్వర్యం యొక్క బిందు మాత్రం కూడ తెలియదు. అన్యరస పరిచయం లేదు. అన్యప్రదేశాలకు రాకపోకలు లేవు. కిశోర అవస్థతప్ప ఇతర అవస్థలేదు. క్రీడించని క్షణం ఒక్కటి కూడా లేదు. అటువంటి ఒక అనిర్వచనీయమైన యుగళం బృందావనంలో ఆనందిస్తున్నది.

**ప్రేమానంద రసాతి విహ్వలతమే నానాచమత్కారభృత్**
**దివ్యానేకమణిస్థలే బహుల సద్వల్లీ ద్రు గుల్మాదికే**
**దివ్యైః పక్షిమృగైః సరోవర సరిచ్ఛైలాదిభిశ్చాద్భుతే**
**శ్రీవృందా విపినే కదాను లలితైకాత్మ్యయం కిశోరం భజే 10**

హా! ప్రేమానందరసంలో అత్యంత విహ్వలమై; అనేకములైన చమత్కారములతో కూడి దివ్యాతి దివ్యమణిమయ ప్రదేశములతో శోభితమై; ఉత్తమోత్తమమైన అనేక పొదలు వృక్షములతో భూషితమై; దివ్య పక్షి మృగములతో వ్యాపితమై; సరోవర, నదీ, పర్వతాదులతో అద్భుత పూర్ణమైనది శ్రీబృందావనము! అట్టి శ్రీబృందావనములో ఎప్పుడు నేను లలిత ఏకాత్మ స్వరూపులైన శ్రీయుగళ కిశోరులను భజింపగలను ?

**రాధాకృష్ణౌ పరమ కుతకాత్ ఖేలతో యత్తలేషు**
**భుంజాతే యత్ఫలమతిరసం యత్ప్రసూనాది భూషౌ**
**యచ్ఛాఖాస్థైః సురుచిర ఖగై ర్మౌనిభిర్నిర్నిమేషైః**
**పీతాలాపామృతరుచి సుధౌ తాంస్తరుంశ్చింతయామి 11**

శ్రీబృందావనములోని వృక్షముల క్రింద శ్రీరాధాకృష్ణులు పరమ కుతూహలముతో క్రీడిస్తూ ఉంటారు. మిక్కిలి రసముతో కూడిన ఫలములను భుజిస్తారు. ఆ పుష్పాలను ఆభరణములుగ ధరిస్తారు. ఆ శాఖలపై కూర్చుండి మౌనమనోజ్ఞమైన పక్షులు చేసే ఆలాపామృతాన్ని, (శబ్దములు అనెడు అమృతాన్ని), లావణ్యామృతాన్ని పానం చేస్తారు. శ్రీబృందావనములోని అట్టి వృక్షములను నేను ధ్యానిస్తున్నాను.

**నానాకారాన్ దివ్యనానాఫలాదీన్ రాధాకృష్ణప్రీతయే యే వహంతి**
**నానా సంస్థానోద్భవాంతర్ధి భాజో వందే వృందారణ్యధన్య ద్రుమాంస్తాన్ 12**

అనేకములైన ఆకృతులతో అనేక ప్రకారములైన దివ్యాతిదివ్య ఫలములను శ్రీరాధాకృష్ణుల ప్రీతికై వహించి; అనేకములైన భావములతో సన్నివిష్టమై (నిలిచి) ఆవిర్భవిస్తూ, అదృశ్యమౌతూ ఉండెడి శ్రీబృందావనములోని ఆ ధన్య వృక్షములకు నేను నమస్కరిస్తున్నాను.

**రాధాకృష్ణానురాగాన్ముకులపులకినో మాకరందౌఘబాష్పాన్**
**తత్తాదృక్ వాతచంచత్కిసలయ కరతో దివ్యనిత్యం దధానాః**
**సత్పుష్పశ్రేణిహాసాః ఖగకుల విరుతైః సంస్తువంతః ఫలాదే**
**ర్భారైర్నమ్రా ద్రుమాస్తే మమ పరమ ముదే సంతు వృందావనీయాః 13**

శ్రీరాధాకృష్ణులపట్ల గల అనురాగమువలన వృక్షము ముకుళ (మొగ్గ) రూపముతో పులకిస్తున్నది. మకరందమును ప్రవహింపజేయటమనెడి సాకుతో

అశ్రువులను కురుస్తున్నది. మెలమెల్లగా వీస్తున్న గాలి చేత ఊగుతున్న చిగుళ్లు అనెడి హస్తభంగిమలతో దివ్యనృత్యం చేస్తున్నది. పూవు బాగుగా వికసించటమనెడి మిషతో నవ్వుతున్నది. పక్షుల కోలాహల ధ్వని రూపంగా చక్కగా స్తుతిస్తున్నది. ఫలాదుల భారంతో వంగి ఉన్న ఆ బృందావన వృక్షరాజము నాకు పరమానందాన్ని ఇస్తున్నది.

**యే ద్రాఘిష్ఠాతి హ్రస్వా అతిఘన విరలాశ్ఛాయయా శీతలోష్మా**
**నిశ్ఛ్విభ్రాః కోటరాఢ్యా అతిశిశు తరుణాస్తా నవాఢ్యాః స్థవిష్ఠాః**
**శ్రీరాధాకృష్ణయోః కామపి రసలహరీం సంతతం వర్ధయంతః**
**శాఖీంద్రాస్తే తదిచ్ఛామయతను విభవా భాంతి వృందావనీయాః 14**

శ్రీబృందావనమునందలి శ్రేష్ఠవృక్షము శ్రీరాధాకృష్ణుల ఇచ్ఛానుకూలముగ రూపధారణ చేసి, శ్రీయుగళ కిశోరుల అనిర్వచనీయ రసప్రవాహాన్ని నిరంతరం వృద్ధి చేస్తూ ప్రకాశిస్తూ ఉంటుంది. అది ఒక మారు అతిదీర్ఘంగాను, మరొకమారు అతి లఘువుగాను రూపధారణ చేస్తుంది. అతిఘనముగాను, తేలికగాను; శీతలంగాను, ఉష్ణంగాను; రంధ్రములు లేకుండగను, బాగా బోలుగాను ఉంటుంది. అత్యంత చిన్నదిగాను ఉంటుంది, తరుణంగాను ఉంటుంది. సూక్ష్మంగా ఉన్నా, సమయానుకూలంగా అతిస్థూలంగా ఔతుంది.

శ్రీబృందావన వృక్షరాజము శ్రీరాధాకృష్ణుల ప్రీతికై విథవిథములుగ రూపధారణచేసి, అనిర్వచనీయమైన వారి ప్రేమను నిరంతరం వృద్ధి పొందునట్లు చేస్తుంది.

**ఏకాంతేషు విచింతయన్నిరవధి శ్రీరాధికా కృష్ణయో**
**స్తద్రూపం సకలాద్భుతం రసమయీర్లీలాశ్చ సర్వాద్భుతాః**
**ప్రాప్తైకాంత నిరంతరోజ్జ్వల మహాభావో మహాభాగ్యతః**
**సర్వేహా వినివృత్తి నిత్యసుఖభాక్ కోఽప్యస్తి వృందావనే 15**

శ్రీరాధాకృష్ణుల సర్వాద్భుత రూపమాధుర్యమును, సర్వాద్భుత రసమయ లీలను ఏకాంతంలో నిరంతరం చింతన చేస్తూ, చేస్తూ; మహాభాగ్యవశం చేత నిరంతరం ఉజ్వల రసమహాభావము యొక్క శ్రేష్ఠదశను పొంది; సమస్త కార్యకలాపాలను విరమించి సుఖియైన ఒకానొక భాగ్యశాలి మాత్రమే శ్రీబృందావనంలో నివసిస్తాడు!

**అన్నం మిష్టమివ క్షుధాఽతి వికలస్యాంభో యథా శీతలమ్**
**సంక్లిష్టస్య పిపాసయా హిమహ్రదస్తప్తస్య ధర్మైరపి**
**రంకస్యేవ మహానిధిః పరమివ బ్రహ్మామృతం యోగినామ్**
**భూతానామివ జీవనం భవతు మే వృందావనం పావనమ్ 16**

పవిత్రమైన శ్రీబృందావనం క్షుధార్తులకు (ఆకలితో బాధపడేవారికి) మధుర భోజనంతో సమానంగాను, దాహార్తులకు శీతల జలముల వంటిదిగాను. వేడిమితో బాధపడేవారికి శీతల సరోవరం వంటిదిగాను, దరిద్రులకు మహాధనరాశిగాను, యోగులకు పరమబ్రహ్మామృతం వంటిదిగాను, సమస్త ప్రాణులకు జీవనతుల్యమైనదిగాను పరమ ప్రియతమమై ఉన్నది.

**వాంఛాతీత మహాఫలాని దిశతః స్వోదారతావేశతో**
**దివ్యానల్ప మహీరుహానగణితానత్యల్పకాన్ కుర్వతః**
**స్వానందామృత శుద్ధ చిద్రసఘనాన్ కృష్ణానురాగాప్లుతాన్**
**వందేఽద్వంద్వ మునీంద్ర వృంద వినుతాన్ వృందాటవీ శాఖినః 17**

తమ ఔదార్యం చేత వాంఛాతీతమైన మహాఫలాలను ఇచ్చునవి; అగణితములైన దివ్యాతిదివ్య మహావృక్షాలను కూడ తుచ్ఛమనిపించునవి; స్వానందామృత శుద్ధ చిద్రసఘన స్వరూపమైన కృష్ణానురాగములో తేలియాడుచు, ద్వంద్వాతీతులైన ముని శ్రేష్ఠుల చేత కూడ స్తుతింపబడునవి అయిన శ్రీబృందావన వృక్షరాజములకు నేను నమస్కరిస్తున్నాను.

**స్వయం నిత్యోత్తీర్ణాం స్త్రిగుణ విభవాపార జలధేః**
**పరానప్యుత్తార్యోన్మద హరిరసాబ్ధ్యాప్లుతి కృతః**
**మహార్థాన్ యోగీంద్రైరపి దురుపలంభాన్ వితరతో**
**భజానన్య ప్రేమ్ణా దయిత తమ వృందావన తరూన్** **18**

శ్రీబృందావన శ్రేష్ఠవృక్షములు నిత్యత్రిగుణాత్మక మాయా విభూతి యొక్క అపార సముద్రమును స్వయముగ దాటినవి. అవి అందరినీ ఆ మాయా సముద్రమును దాటించి, ఉన్మాదనకారియైన హరిరససాగరములో స్నానం చేయిస్తాయి, యోగీంద్రులకు కూడ దుర్లభమైన మహా పురుషార్థములను వారికి వితరణ చేస్తాయి. శ్రీబృందావనములోని అట్టి ప్రియతమ వృక్షములను అనన్యప్రేమతో సేవించు!

**జ్యోతిః పూరైర్విచిత్రైః పరమ సువిమలైః పూరయంతోఽఖిలాశా**
**మాధ్వీకాసారవర్షైః సుసురభిమధురైర్మాదయంతో జగంతి**
**చిత్రైః పుష్పైః ప్రవాలై రసమయ సుఫలైర్గుచ్ఛకైర్జాలకైశ్చ**
**శ్రీవృందాకాననేఽస్మిన్ విదధతి పరమానందవృందం ద్రుమేంద్రాః 19**

శ్రీబృందావన వృక్షాలు తమ పరమ విమల విచిత్ర కాంతి ప్రవాహంతో దశదిశలను పరిపూరితం చేస్తున్నాయి. సుగంధపూర్ణమైన మధుర ఉత్కృష్ట మకరంద ధారలను వర్షిస్తూ చతుర్దశ లోకాలను ఉన్మత్తం చేస్తున్నాయి. ఆ శ్రేష్ఠ వృక్షాలు విచిత్రమైన పుష్ప, పల్లవాలతోను; రసమయమైన సుందరమైన పండ్ల గుత్తులతోను; వికసించీ వికసించని మొగ్గలతోను పరమానందరాశిని ప్రదానం చేస్తున్నాయి.

**ఆయాంతౌ వీక్ష్య యే స్వం తలమతి రసికౌ రాధికా కృష్ణచంద్రౌ**
**చంద్రోఘైర్దివ్యదివ్యైరపి కిమపి న సంస్పృష్ట వక్త్రేందుకాంతీ**
**సద్యః సంత్యజ్య సత్పల్లవ కుసుమచయం తల్పకం కల్పయంతి**
**శ్రీవృందారణ్య ధన్యద్రుమతను భగవత్పార్షదాంస్తాన్ భజంతు** **20**

దివ్యాతి దివ్యములైన చంద్రసమూహములు ఎవరి ముఖచంద్ర కాంతిని ఏవిధంగాను స్పృశింపనైన స్పృశింపలేవో ఆ శ్రీరాధా కృష్ణచంద్ర నామక రసికయుగళ కిశోరులు తమ నీడలోకి రావటం చూచి; శ్రీబృందావనంలోని ధన్య వృక్షశరీరధారులైన భగవత్ పార్షదులు నిరంతరం ఉత్తమోత్తమమైన పల్లవములను, పూవులను వర్షించి శయ్యారచన చేస్తున్నారు. వారిని సేవించండి!

(అనగా ఆ ధన్యాతి ధన్యములైన వృక్షములను సేవింపుడని భావము.)

**యేషాం ఛాయాసు శీతాస్వతిమధురసుధా శీకరాసార వర్షైః**
**మూలే సంసిక్తగాత్రౌ యదుదిత కుసుమాద్యాస్తరేషూపవిష్టౌ**
**శ్రీరాధాకృష్ణచంద్రౌ యదుపహృత మహాస్వాదిమ శ్రీఫలాని**
**స్వాదేతే సంస్తువంతౌ మిథ ఉరు రసదౌ నౌమి వృందావనద్రూన్ 21**

శ్రీబృందావన వృక్షముల శీతల ఛాయలో కుసుమాదులతో రచితమైన శయ్యపై కూర్చుండి శ్రీరాధాకృష్ణులు మధుర సుధాబిందు ధారలలో తడుస్తున్నారు. అనంతరస ప్రదాతలైన శ్రీయుగళ కిశోరులు తమ మాటలతో రుచికరమైన ఫలములను ప్రశంసిస్తూ భుజిస్తున్నారు. శ్రీబృందావనములోని అట్టి వృక్షములకు నేను నమస్కరిస్తున్నాను.

**అనంతామోదాఢ్యైర్వివిధ రుచిరానంత కుసుమైః**
**అనంతైరానంద ద్రవమయ మరందౌఘ నివహైః**
**అనంతైః శ్రీశాఖాభరితఫలగుచ్ఛైః కిసలయైః**
**అనంతాన్ శ్రీవృందావన వరతరుం చింతయ మనః 22**

ఓమనసా! అనంత సుగంధ పూర్ణము, అనేకములైన అనంత రుచిర పుష్పములతో శోభితము, అనంత ఆనంద ద్రవమయ మకరంద ప్రవాహ యుక్తము, అనంత సుందర ఫలగుచ్ఛ భరితము, అనంత శాఖా పల్లవ యుక్తమునైన శ్రీబృందావన అనంత వృక్షసమూహములను ధ్యానింపుము!

**అస్తి స్వస్తిక రూపిణీ క్వచిదహో కుత్రాపి చక్రాకృతి**
**ర్వృత్తా క్వాపి తథాయతా క్వచిదథో హ్రస్వాథ చంద్రార్ధవత్**
**క్వాప్యాభాతి చతుష్క కంకణకలా రాసాయ రత్నోజ్జ్వలా**
**క్వాప్యల్పోచ్చవిచిత్రమండనకలా వృందావనీయావనీ 23**

శ్రీబృందావన భూమి ఒకమారు స్వస్తికరూపిణిగా ఉంటుంది, ఒకచో చక్రాకృతిగా వర్తులాకారముగాను, చిన్నదిగాను ఉంటుంది. మరొకచో అర్ధచంద్రాకారముగా ఉంటుంది. ఇంకొకచో రాసలీలకై ఏర్పడు రత్నమయ, ఉజ్వల చతుష్క ఆకృతిగా లేదా గోళాకారముగ గోచరిస్తుంది, అతి సూక్ష్మంగాను ఉంటుంది. వేరొకచో కొద్దిగా పైకి ఉండి, విస్తృతమైన భూషిత కళయై విద్యాప్రకాశంతో శోభిస్తూ ఉంటుంది.

**సోపానైర్మణినిర్మితైః సురుచిరావైచిత్ర్య కోట్యోజ్జ్వలైః**
**బద్ధా రత్నచయైః సుతుంగసుభగా సంశోభితా తూపరి**
**రత్న స్వర్ణమయ ద్రుమవల్లినివహైః శాఖాది గుచ్ఛాదిభిః**
**శ్రీమన్మండపరూపితాంతరయుక్తాభూర్భాతి వృందావనే 24**

మణిమయములైన సోపానములతో శోభితమై; అనేక ప్రకారములైన, విచిత్రములైన కోటికోటి ఉజ్వల రత్నములతో కూర్పబడి, మిక్కిలి ఎత్తుగాను, సుందరముగాను ఉన్న పైభాగముతో శోభితమై; రత్నజటిత సువర్ణమయ వృక్షముల గుచ్ఛములతో పరమరమణీయమైన మండపరూపధారణ చేసిన శ్రీబృందావన భూమి శోభాయమానముగా ఉన్నది.

**న్యస్యోత్సంగే పులకిత వపుః ప్రేయసీం వేశయిత్వా**
**బారం బారం స్వయమతికృత శ్లాఘినో హాసయంస్తామ్**
**మధ్యేమధ్యే తరల తరలోఽనంగ చేష్టా వితన్వన్**
**వృందారణ్యే సుఖయతు సదా రాధికాకాముకో నః 25**

ప్రేయసి యొక్క వేషవిన్యాసంతో (ఆమె వేషాన్ని తాను ధరించి) ఆమెను తన ఒడిలో కూర్చుండ బెట్టుకొని పులకితుడు ఔతూ, మాటిమాటికీ అనేక ప్రశంసలు చేస్తూ ఆమెను నవ్విస్తూ, మళ్లీ మళ్లీ అతిశయించిన చంచలత్వాన్ని పొందుతూ, వివిధములైన అనంగచేష్టలను విస్తరింపజేస్తున్న శ్రీరాధాలంపటుడు ఆ శ్రీకృష్ణుడు మాకు సుఖప్రదానము చేయునుగాక!

**చిజ్జ్యోతిర్మయ భూమి చిన్మయలతావల్లిద్రుమం చిద్ఘన**
**స్ఫూర్జత్పక్షిమృగం చిదేకరసవార్యాపూర్ణ ఫుల్లత్సరః**
**చిద్రూపాద్రి నదీ తడాగ మణిధాత్వంభోధరంతు స్ఫుర**
**న్నానా మంజునికుంజపుంజమిహ చిద్ధామైవ వృందావనమ్ 26**

ఈ బృందావన భూమి చిత్జ్యోతిర్మయము! లతలు, తీగలు, వృక్షాదులు కూడ చిన్మయములు. పక్షి, మృగాదులు అన్నీ కూడ చిద్ఘనములు. వికసించిన పుష్పాలతో నిండి ఉన్న సరోవరములు కూడ చిద్రసజల పూర్ణములు. పర్వతములు, నదులు, తటాకములు, మణిధాతువులు, మేఘాదులు అన్నియును చిన్మయములు. ఈ విధముగా అనేకములైన మనోహర నికుంజలతో కూడియున్న శ్రీబృందావన ధామమంతయు చిన్మయమే అయి ఉన్నది.

**నానాశక్తీః ప్రకటయతి యోఽచింత్య నానా తనూభిః**
**ర్ధత్తే తాశ్చ స్వయమపి కదాప్యత్యమర్యాద రూపాః**
**నానావస్థా దధదురు విధాన్ యోఽభివర్యేద్రసౌఘామ్**
**తం శ్రీరాధారసవశమహం నౌమి వృందావనేందుమ్ 27**

శ్రీకృష్ణచంద్రుడు అనేకములైన, అచింత్యములైన మూర్తిధారణలు చేసి, నానా విధములుగా శక్తిని ప్రకటిస్తున్నాడు. అప్పుడప్పుడు తన అపరిమితమైన రూపమాధురిని విస్తరింపజేస్తూ, అనేక భావభావితుడై బహువిధాలుగా రసధారను వర్షిస్తున్నాడు. శ్రీరాధారసవశవర్తియైన ఆ బృందావన చంద్రునికి నమస్కరిస్తున్నాను.

**అంకే పంకేరుహ వరముఖీం నిత్యమేవ స్ఫురంతీమ్**
**ప్రేమార్ద్రాత్మా పులకిత తనుర్లాలయన్ హృష్టరోమా**
**కుర్వన్ కాంచిన్నవనవరతిం భిక్షితుం చిత్రగోష్ఠీమ్**
**వృందారణ్య వ్రతతినిలయే భాతి రాధావిలాసీ 28**

శ్రీహరి నిత్యము సుందరియు,కమలముఖియునైన శ్రీరాధను తన ఒడిలో కూర్చుండ బెట్టుకొని, ప్రేమార్ద్ర చిత్తముతో పులకితుడై లాలిస్తూ ఉంటాడు. ఒకానొక అనిర్వచనీయ, నవనవాయమాన రతిని అర్థిస్తూ విచిత్రమైన సంభాషణ చేస్తూ ఉంటాడు. శ్రీరాధా విలాసియైన ఆ శ్యామసుందరుడు శ్రీబృందావన లతాగృహములో శోభిస్తున్నాడు.

**యే వృందావనమావసంతి యది వా స్పృష్ట్వాఽథ దృష్ట్వాగతా**
**ధ్యాయంతి ప్రణమంతి తద్గుణ గణాన్ గాయంతి శ్రుణ్వంతి వా**
**మూర్ధ్నా విభ్రతి తద్రజః క్వచన తత్సంబంధ సంబంధిన**
**స్తానత్యన్నయతే పరం పదమహో వృందావనం పావనమ్ 29**

ఓహో! శ్రీబృందావనవాసులను దర్శించు లేదా వారిని స్పృశించు! బృందావనం నుండి అన్యత్ర వెళ్లినవారు బృందావాసులను స్మరించటమో, వారికి ప్రణామం చేయటమో, వారి గుణములను కీర్తించటమో లేక శ్రవణం చేయటమో, లేక వారి పదధూళిని శిరసుపై ధరించటమో, ఏవిధంగానైనా బృందావనానికి సంబంధించిన వస్తువులతో సంబంధం కలిగి ఉంటే వారికి పావన బృందావనం పరమపదాన్ని ప్రదానం చేస్తుంది.

**మహాశ్చర్యాం రీతిం దృశి వచసి గత్యాదిషు దధ**
**న్మహా ప్రేమావేశోన్మద మదనవైవశ్య మధురమ్**
**అహో యత్రైవానందతి సహజకైశోరకమహో**
**ద్వయం గౌర శ్యామం తదుదయతి వృందావనమిదమ్ 30**

ఓహో! చూపు, మాట, నడకలలో మహాశ్చర్యరీతిని వహించి; మహాప్రేమావేశం చేత ఉన్మత్తం చేసే అనంగునికి వశీభూతులై మధురమూర్తి ధారణ చేయు సహజ కిశోరగౌరశ్యామ యుగళం ఇక్కడ ఆనందాన్ని ఉత్పన్నం చేస్తున్నారు. ఆ ప్రదేశం ఈ శ్రీబృందావనమే!

**విచిన్వంతం నీలానలక నికరాంశ్చారుకరజై**
**ర్విజిఘ్రంతం ఫుల్లద్వదన కనకాంభోజమసకృత్**
**విచుంబంతం బింబాధరమసకృదున్నమ్య చిబుకమ్**
**నిధాయాంకే రాధాం స్మర మదనమూర్తిం మధుపతిమ్ 31**

సుందరమైన వ్రేళ్లతో నీలిముంగురులను సవరిస్తూ, స్వర్ణకమలమువంటి ప్రఫుల్లవదనమును మాటిమాటికి ఆఘ్రాణిస్తూ, రాధాజీని ఒడిలో కూర్చుండజేసి, గడ్డమును పైకెత్తి పునఃపునః ఆమె బింబాధరమును ముద్దుగొనుచునున్న ఆ మదనమూర్తి మధుపతిని స్మరించు!

**అహో గౌరశ్యామే మధుర మధురే దివ్యమహసీ**
**కిశోరే సర్వాంగోత్థిత మదనబాధాతి వివశే**
**రతిక్రీడాంభోధావతి విహరతీ పారరహితే**
**సుభావైః శ్రీవృందావన నవనికుంజేషు భజత 32**

ఓహో! మధురాతి మధురమైన దివ్యగౌరశ్యామ యుగళకిశోరులు తమ సర్వాంగముల నుండి ఉదయించిన మదన బాధచేత వివశులైనారు. అవధులు లేని ప్రేమకేళీసాగరంలో అతిశయ విహారం చేస్తూ, శ్రీబృందావన నవనికుంజలలో స్థితులై ఉన్నారు. అట్టి యుగళ కిశోరులను ఉజ్వల భావంతో భజించు!

**సఖ్యగ్రేఽ తిరుషా నిరస్య రమణం సంకేత కుంజం ప్రతి**
**ప్రోచ్య ప్రోషితమాలివృందమపి వాక్చాతుర్యతోఽ పాస్యతత్**
**యాంతీం మన్మథపీడితాం రసయుతాం రాధామనుప్రస్థితామ్**
**శృంగార వ్యంజనాదినా కురు మనస్యేకాం రహః కింకరీమ్ 33**

శ్రీరాధ సఖియల సమక్షంలో నాగరమణియైన శ్రీకృష్ణునిపై మిక్కిలి క్రోధంతో నిరసన చూపిస్తూ, సంకేత కుంజకు వెళ్లుదమని సంజ్ఞ చేసింది. ఈ వైపు ఉన్న సఖియలకు వాక్చాతుర్యంతో తెలియునట్లు చేసి, వారిని అక్కడే వదలివెళ్లినది. అనంగ పీడితయు, రసమయియునైన శ్రీరాధ వారి వైపునకు వెళ్లినది. ఆ వెనుక వెనుక ఒక ఏకాంతదాసి అలంకరించుట అను మిషతో చెంతకు వెళ్లినది. ఈ లీలను మనసులో స్మరింపుము!

**గలద్వరపటం తృటత్స్రగురు హార కాంచీగుణమ్**
**శ్లథచ్చికుర బంధనం తిలక కజ్జలాది క్షయమ్**
**సదావహిత కింకరీ నికర సర్వసంపాదకమ్**
**స్మర స్మరవిచేతనం ద్విపరధామ వృందావనే 34**

(వారి) సుందరమైన వస్త్రములు జారిపోవుచు; హారములు, వడ్డాణము మున్నగునవి తెగిపోవుచు; కేశబంధనం చెదరిపోవుచు; తిలకము, కాటుక మున్నగువాని చిహ్నములు కూడ లేకుండ (పరిస్థితి) ఉన్నది. ఐనను, నిత్యము సావధాన చిత్తులై ఉండెడి సఖీబృందము పరిస్థితినంతటిని చక్కదిద్దుచుందురు. బృందావనములో ఈ ప్రకారముగా ప్రేమవివశులైయుండు శ్రీయుగళ కిశోరులను స్మరింపుము!

**శ్రీమద్బృందావన భువి మహానంద సామ్రాజ్య కందే**
**వందే యం కంచన విరచితా మృత్యువాస ప్రతిజ్ఞమ్**
**శ్రీగాంధర్వా రసికతిలకౌ స్వేషు యోగ్యం యమేకమ్**
**జ్ఞాత్వాఽన్యోన్యం విమృశత ఇదం కీదృశోన్వేష భావ్యః 35**

మహానంద సామ్రాజ్యమునకు మూలమైన శ్రీబృందావనములో మృత్యుపర్యంతము నివసింతుమని ఎవరు ప్రతిజ్ఞ చేయుదురో అట్టి మహాపురుషునికి నేను నమస్కరిస్తున్నాను. ఎందుకంటే శ్రీరాధ, రసిక చూడామణియైన శ్రీకృష్ణుడు అతడిని తమ సేవకులలో శ్రేష్ఠునిగా గుర్తించి; "అతడు ఎట్లు ఉన్నాడు ?" – అని పరస్పరము పరామర్శ చేయుచుందురు.

(అనగా అతని యోగక్షేమములు గమనించుచుందురని భావము.)

**చంద్రాణాం కోటికోటేరుదయమివ నయన్నర్మ హాసచ్ఛటాభిః**
**భ్రుక్షేపాద్యైర్విచిత్రాః సృజదివ పరమాశ్చర్య కందర్పకోటిః**
**మంత్రాక్షేపాదివాణ్యా స్రవదివ శిశిరానంద మాధుర్యకోటి**
**రాధాకృష్ణాభిధానం భజత తదుభయంధామ వృందావనాంతః 36**

శ్రీరాధాకృష్ణుల చిరుమందహాస కాంతుల నుండి కోటికోటి చంద్రులు ఉదయిస్తారు; కనుబొమలు, క్రీగంటి చూపుల నుండి విచిత్రమైన, ఆశ్చర్యకరమైన కోటికోటి మన్మథులు ఉత్పన్నం ఔతారు. వారి పిలుపు, ఆక్షేపాది వాక్యాల నుండి శీతల, ఆనంద, మాధుర్యధార ప్రవహిస్తుంది. శ్రీబృందావన విహారులైన ఆ శ్రీరాధాకృష్ణ యుగళ కిశోరులను సేవించు!

**వృందావనం పరమపావనమప్రమేయ**
**మాధుర్యముజ్జ్వల చిదేకరసాత్మభావమ్**
**శ్రీరాధికా మదనమోహన కేలి కుంజ**
**పుంజైః సురంజిత సుమంజు చిరం జపామి 37**

పరమ పావనము, అవధులు లేని మాధుర్యము చేత భూషితము, ఉజ్వల చిన్మయ రసఘన మూర్తులైన శ్రీరాధామదనమోహనుల కేళీకుంజలతో రంజితము, మనోహరమునైన శ్రీృందావన నామమును నేను చిరకాలముగా జపిస్తున్నాను.

**రాధాం నిత్యం పరిచర హరిప్రేమ సారైరగాధామ్**
**బాధాం సర్వాం స్మర న హి తనుంచాపరాధాన్న రక్ష**
**మా యాహ్యార్తేః క్వచిదపి వినా ధామ రాధారసాంధమ్**
**మా ధావాజ్ఞ! క్వచిదసులభం ధామ వృందావనం హి 38**

హరిప్రేమసారమైన, అతి అగాధమైన శ్రీరాధకు నిత్యము పరిచర్య చేయి! బాధలను గూర్చి కొంచమైనా చింతించకు. శరీర సంబంధమైన అపరాధాల నుండి కూడ రక్షించుకొనవద్దు. ఆర్తుడవైనప్పటికీ శ్రీరాధారసోన్మత్తమైన శ్రీబృందావనాన్ని విడచి ఎక్కడికీ వెళ్లవద్దు. ఓ అజ్ఞుడా! ఎక్కడికీ పరుగు తీయకు. ఎందుకంటే శ్రీబృందావన ధామం అతి దుర్లభమైనది!

**అక్షైః కుత్రాపి ఖేలత్ క్వచన నిలయనైః కుత్ర చిచ్చోరికాభి**
**ర్వల్లీ వృక్షానుకృత్యా క్వచన నను మిథః క్వాపి హిందోలనేన**
**క్వాప్యాశ్చర్య ప్రహేల్యా క్వచన ఖగమృగాదీ హితైః క్వేంద్రజాలైః**
**వృందారణ్యేతిదివ్యం కిమపి విజయతే గౌరనీలం ద్విధామ 39**

శ్రీయుగళము ఒకచో పాచికలు ఆడుచు, మరొకచో పరుగుపందెముల నాడుచు, వేరొకచో దొంగాట ఆడుచు, ఇంకొకచో లతలను వృక్షాలను అనుకరించుచు, అన్యత్ర ఊయెలనూగుచు ఆడుకొనుచున్నారు. వారు ఒక ప్రదేశములో ఆశ్చర్యకరమైన ప్రహేళికతోను, వేరొకచోట పశుపక్ష్యాదుల చేష్టలతోను, ఇంకొక చోట ఇంద్రజాలాది విద్యలతోను ఆడుచున్నారు. ఇట్లు బృందావనములో క్రీడించుచున్న అతి దివ్య గౌరనీల యుగళ కిశోరులకు జయమగునుగాక!

**సుఖవపురవతారాః సంతి శౌరేః కియంతుః**

**కతి కతి విజయంతే మూర్తయో నాతిదివ్యాః**

**న చ రుచిరతమాః కాః సంతి సాక్షాదవస్థా**

**స్తదపి మధుర ఏకో రాధికా నాగరో మే 40**

శ్రీహరి వహించిన అనేకములైన ఆనందకర అవతారములు ఉన్నవి. ఎన్నెన్నో దివ్యమూర్తులు విజయములు పొందినవి. రుచికరములైన సాక్షాద్వస్తు రూప విగ్రహములు కూడ విరాజమానమై ఉన్నవి. కాని, నాకు శ్రీరాధా మాధవులు మాత్రమే అత్యంత మధుర స్వరూపులు!

**రాధావృందావనాఖ్యే వన ఇతి పరమోభాతి ఘోషః పురాణే**

**తేనాస్యా న వ్రజేఽపి ప్రకటమతి మహాశ్చర్య పూర్ణస్వరూపమ్**

**అస్యాః ప్రేమాసమోర్ధ్వః స హి పరపురుషః సర్వభావేన సిద్ధ**

**స్తస్మాద్రాధేఽత్యభిఖ్యా తదతి వశ హరిం పశ్య వృందావనేందుమ్ 41**

శ్రీరాధ బృందావననామక వనములో అతిశయ శోభతో విరాజమానయై ఉన్నదని పురాణములు ఘోషించుచున్నవి. మహాశ్చర్య పూర్ణ స్వరూపమైన శ్రీరాధ వ్రజములో కూడ ప్రకటితము కాలేదు. శ్రీరాధ యొక్క కృష్ణప్రేమ సాటిలేనిది, ఆ శ్రీకృష్ణుడు పరమపురుషుడు! కనుక ఆమెకుగల 'రాధా' నామము అన్ని విధములుగా సార్థకము! ఆ దేవికి మిక్కిలి వశవర్తియైయుండు బృందావన చంద్రుడిని నీవు దర్శించుము!

**సర్వః ప్రేమశిరోమణేః పరచమత్కారః సముజ్జృంభతే**

**రాధాయాం పరమున్నతిర్మధుపతేస్తామన్వశేష శ్రియామ్**

**సా వృందావన ఏవసమ్యగుదితా పూర్ణైక మాధుర్యభూ**

**స్తద్భావేనపరేణ చింతయ మన స్తాంతం తదత్యుజ్జ్వలమ్ 42**

ప్రేమ శిరోమణియొక్క పరమ చమత్కారము సర్వత్ర అత్యంతముగ ప్రకాశిస్తున్నది. ఇంకను, శ్రీశ్యామసుందరుడు శ్రీరాధా సన్నిధిలో ఉన్నపుడు అశేష సౌందర్యమూర్తియైన శ్రీరాధలో ఆ ప్రకాశము అత్యధికముగ ఉదయిస్తుంది. పరిపూర్ణ మాధుర్యఖనియైన శ్రీరాధ కూడ శ్రీబృందావనములోనే సమ్యగ్రూపముతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఓ మనసా! పరాకాష్ఠను పొందిన ఆ అత్యుజ్వల రసమును తద్భావభావితుడవై చింతింపుము!

**శ్రీమద్బృందావన శ్రీర్మమహృది సకృదప్యస్తు సర్వేశ్వరాణామ్**
**సర్వానందాతిసారం కిమపి రసయతామప్యహో మోహదాత్రీ**
**సాஉత్యాశ్చర్యహరేః శ్రీప్రకృతిరథ కృతిర్భాతు మే వార్షభాన**
**వ్యేకాంఘ్రి శ్రీనఖేందుచ్ఛవిమధురిమణి స్వాంత విశ్రాంతిరస్తు 43**

ఓహో! అనిర్వచనీయమైన, సర్వానందాతిసారమైన రసమును ఆస్వాదించు సర్వేశ్వరులను కూడ మోహితులను చేయు శ్రీబృందావన శోభ ఒక్కమారైనను నా హృదయములో ఉదయించునుగాక! అది అత్యాశ్చర్యమయ శ్రీహరి శోభా సంపత్తి శాలినియైన ప్రకృతి యొక్క కృతి విశేషము, అది నా హృదయములో ప్రకాశించును గాక! శ్రీవృషభానునందినియైన శ్రీరాధా చరణముల నఖ చంద్రకాంతి మాధుర్యము నందు నాకు పూర్తి విశ్రాంతి లభించునుగాక! ఇదియే నా ప్రార్థన!

శ్రీబృందావనమునకు, శ్రీరాధా చరణకమలములకు అంకితము కావలెనని భావము!

**ఏకైకాంగచ్ఛటాభిర్భరిత దశదిశో గౌరనీలోజ్జ్వలాభి**
**ర్నిత్యే కైశోర ఏవాద్భుత వయసి సతో నిత్యకామార్దితస్య**
**అత్యాశ్చర్యైరనంతైర్నవ మదనకలా కౌతుకై రాత్ర్యహాని**
**శ్రీవృందారణ్యకుంజే నయత ఉరురతిం వింద తద్యుగ్మధామ్నః 44**

శ్రీగౌరశ్యాముల ఏకైక శరీరకాంతి దశదిశలను పరిపూర్ణం చేస్తున్నది. వారు నిత్య, అద్భుత కిశోర అవస్థలో నుండి, నిత్యప్రేమ పరాయణులై, అత్యాశ్చర్య అనంత నవకామ కళాకుతూహలముతో బృందావనములో అహర్నిశలు గడుపుచున్నారు. అట్టి శ్రీయుగళ కిశోరుల గొప్ప ప్రేమ ప్రాప్తించునుగాక!

**నిత్యం పీడయతోఽపి నైవ మనసాఽప్యా పీడయన్ యద్గతాన్**
**జంతూన్ భక్తిభరాన్నమంశ్చ సతతం శక్త్యా ప్రియైః పూరయన్**
**లాభాలాభ జయాజయోన్నతి విపన్మానాపమానాదికే**
**తుల్యః కృష్ణ నివిష్టధీరధివసన్ వృందావనం వంద్యతామ్ 45**

శ్రీబృందావన వాసులైనవారు ఎవరైన ఒకవేళ నిత్యమూ బాధను కలిగిస్తున్నా, వారికి మనసులో కూడ బాధ కలిగించవద్దు. ఇంకా; నిరంతరం వారికి భక్తిపూర్వకంగా నమస్కరిస్తూ, నీ శక్త్యనుసారం ప్రియ వస్తువులను దానం చేస్తూ వారి లేమిని పోగొట్టు! ఏ వ్యక్తి శ్రీకృష్ణుడిని మనసులో నిలుపుకొని లాభనష్టాలలోను, జయాపజయాలలోను, ఉన్నతి అవనతిలోను, మానావమానాలలోను సమబుద్ధితో ఉంటూ; బృందావనంలో నివసిస్తాడో అట్టి వానికి నమస్కరిస్తున్నాను.

శ్రీకృష్ణుడిని మనసులో నిలుపుకొనటం, అన్నింట సమబుద్ధితో ఉండటం, బృందావన వాసం చేయటం – ఈ మూడు లక్షణాలు కలవారు వందనీయులు అని భావం!

**దూర్వాచ్యాని సహస్రశః పరిభవాన్నీచైః కృతాన్ కోటిశో**
**భక్ష్యాచ్ఛాదనవాసకుట్యమిలనాత్ దుఃఖాన్యలం కోటిశః**
**కామాద్యైరతిపీడయా చ మనసో వైకల్యమాత్యంతికమ్**
**యే సోఢ్వాఽపి వసంతి కేలివిపినే కృష్ణస్య తేభ్యో నమః 46**

సహస్ర సహస్ర దుర్వచనాలను; నీచులు చేసే కోటి కోటి నిందలను; భోజన, వస్త్ర, గృహాదులు లేక కలిగెడి అనేకములైన దుఃఖములను; కామాదుల వలని మిక్కిలి బాధను, అత్యధికమైన మానసిక వికలతను సహిస్తూ; శ్రీకృష్ణుని విలాసభూమియైన శ్రీబృందావనములో ఎవరు నివసిస్తారో వారికి నమస్కరిస్తున్నాను.

**దోషాన్న స్థిర జంగమేషు కలయన్ కస్యాపి నోద్వేజయన్**
**కించిద్యత్తదయత్నలబ్ధ మితభుక్ చిత్తేఽపి న స్త్రీక్షణః**
**శ్రీరాధామురలీధరోజ్జ్వల యశః శృణ్వన్ గృణన్ సంస్మరన్**
**యో వృందావనమావసేన్మధుర ధీర్ధన్యాయ తస్మై నమః 47**

స్థావర, జంగమముల పట్ల దోషదృష్టి లేకుండ; ఎవరి యందు కూడ ఉద్వేగమును పొందక; ప్రయత్నము లేకుండ లభించిన దానిని భుజిస్తూ; మనసులోనైన స్త్రీజాతిని చూడకుండ కేవలము శ్రీరాధామురలీధరుల ఉజ్వల యశస్సును వినటం, కీర్తించటం, స్మరించటం చేస్తూచేస్తూ ఏమధురబుద్ధిగల వ్యక్తి బృందావనంలో నివసిస్తాడో ఆ మహాభాగ్యశాలికి నేనునమస్కరిస్తున్నాను.

పైలక్షణములు కలవాడే మధుర బుద్ధికల వ్యక్తి! అతడే బృందావనంలో నివసింపగల మహాభాగ్యశాలి!

**శ్రీవృందాటవి! హంత సంవృణు నిజాం మాయాం మహాధీశితుః**
**మాయాతస్త్వయి నో విభేమి జనయేత్ కంపం త్వదీయా పునః**
**స్వం స్వీయం సుఖచిద్ఘనం బత యయా సందర్శ్యతేఽన్యాదృశమ్**
**దూరాదేవ పతంతి నష్టమతయో జాతాపరాధా యతః 48**

హే శ్రీబృందావనమా! నీవు నీ మాయను కప్పి ఉంచు! మహాధీశ్వరుని కృపచేత నాకు ఇక్కడ ఎవరి వలన కూడ భయం లేదు. కాని నీ మాయ నాకు

కంపం కలిగిస్తున్నది. ఎందుకంటే ఆ మాయ నీతోనే, నీయందే అవస్థితమై (ఉండి) నీ సుఖచిద్ఘన వస్తువులను అన్యప్రకారంగా గోచరింప జేస్తున్నది. అది చూచిన నష్టబుద్ధికల పురుషుడు అపరాధియై దూరము నుండియే అధోగతిని పొందుతున్నాడు.

**హా వృందాటవి! కిం కరోమి న మనాంగ్ దుష్టేంద్రియాణాం గణా**
**ఉల్లంఘ్యాఖిల లోకధర్మపదవీమాధావతాం కుత్సితే**
**నాకర్ష్టే మన శక్తిరస్తి ఘటతేఽ క్షమ్యోఽ పరాధస్త్వయి**
**క్వాప్యన్యత్ర న మే సుఖం తదగతిం మా ముంచ మా ముంచ మామ్ 49**

హా బృందావనమా! ఏమి చేయను ? సమస్త ధర్మమార్గాలను ఉల్లంఘిస్తూ, చెడు విషయాల వైపు వెళ్లునట్లు చేసెడి దుష్ట ఇంద్రియాల సంఖ్య కూడ తక్కువ కాదు. వాటిని ఆపే శక్తి కూడ నాకు లేదు. ఈ కారణం చేత నీ పట్ల క్షమింపరాని అపరాధం జరుగుతున్నది. కాని, ఎక్కడ కూడ నాకు సుఖం లేదు. నీ శరణు కోరుతున్నాను. నన్ను విడువకు, నన్ను విడువకు!

**నైవాన్యత్ర క్షణమపి మయా శక్యతే స్థాతుమత్రా**
**మృష్యాత్యుచ్చైరసమ కుధియో జాయతే మేఽ పరాధః**
**హాహా వృందావన! కువిషయైకాశయా లోకధర్మౌ**
**త్యక్త్వా స్వైరం విచరతి మయి త్వత్కృపా భావినీ కిమ్ ? 50**

“అన్యత్ర క్షణకాలం కూడ నేను ఉండను” – ఇట్టి అతి గంభీరమైన వివేచన చేసియు, మందబుద్ధినైన నేను అపరాధిని ఔతున్నాను. హాహా బృందావనమా! చెడు విషయాల పట్ల ఆశతో లోక ధర్మాలను త్యజించి, ఇచ్ఛానుసారంగా సంచరిస్తున్న నాపై నీవు కృప చూపిస్తావా ?

**మహోశ్చర్యోదార్యాః పరమ కరుణార్ద్రార్ద్ర హృదయా**
**మహాదివ్యానంత స్వరస విలసత్ వైభవభరాః**
**హరిప్రేమావేశ ప్రకట పులకాశ్రు వ్యతికరాః**
**పరాం వృందారణ్యే విదధతు మయి స్వీకృతిమగాః 51**

శ్రీబృందావన వృక్షములు మహోశ్చర్యమయ, ఉదారతాశీల, పరమ కరుణామయ, ఆర్ద్రహృదయ, దివ్యానంత రసవిలాసమయ వైభవ పూర్ణములు! హరియందలి ప్రేమావేశము చేత పులకాశ్రువులను స్రవించునట్టి ఆ బృందావన వృక్షరాజములు నన్ను పరమ ఉత్తమరూపముతో స్వీకరించునుగాక!

**అమీ రాధాకృష్ణప్రణయ రసపూర్ణ విటపిన**
**స్తయోః ప్రీత్యై నానాద్భుత ఫలప్రసూనాని దధతి**
**తదిచ్ఛాతో హస్తే స్వయమురు పతిష్ణూని విహగా**
**రవైర్భృంగీతైరపి చ మధురైర్వ్విభ్రతి ముదమ్ 52**

ఇక్కడి సమస్త వృక్షములు శ్రీరాధాకృష్ణుల ప్రణయరసముతో పరిపూర్ణములై ఉంటాయి. అవి శ్రీయుగళ కిశోరుల ప్రీతికై అనేకములైన ఫల పుష్పములను ధరిస్తాయి. ఫల పుష్పాదులను వారి ఇచ్ఛానుసారము వారి చేతులలో మళ్లీ మళ్లీ పడునట్లు వేస్తూ ఉంటాయి. ఆ వృక్షములు పక్షి సమూహముల సుందర ధ్వనితోను, భ్రమరముల గుంజారవముతోను కూడ శ్రీయుగళ కిశోరులు ఆనందించునట్లు చేస్తాయి.

**యే శ్రీరాధా మురలీధరయోః శ్రీలపాదారవింద**
**స్పర్శానందాత్ పులకిత తను స్యందమానాశ్రుధారాః**
**యత్పుష్పాద్యైః స్వయమతి రసాత్తౌ మిథో వేశయేతామ్**
**వృందారణ్యద్రుమతను మహాధన్య ధన్యాన్నమస్తాన్ 53**

ఏ వృక్షములు శ్రీరాధా మురళీధరుల శ్రీచరణకమల స్పర్శానందము చేత పులకిత శరీరములతో అశ్రుధారలను వర్షిస్తూ ఉంటాయో, ఏ వృక్షముల పుష్పాదులతో శ్రీయుగళ కిశోరులు అత్యంత రసయుక్తులై పరస్పరం వేషభూషారచన చేసుకుంటారో ఆ బృందావన వృక్షస్వరూపులైన ధన్యాతి ధన్య మహాపురుషులకు నమస్కరిస్తున్నాను.

**కించిత్ ఖర్పర ఘర్షణేన విదధద్దివ్యాంగ రాగం మిథః**
**స్యూతైర్దివ్యదలైః స్తుతైః కృతపటం పుష్పాదిభిర్భూషితమ్**
**పీత్వా స్యంది మధూత్పుటైః స్థలశయం శ్లిష్ట్వా ప్రశస్య ప్రియమ్**
**గౌరశ్యామమహో ద్వయం మమ తదానందాబ్ధి వృందావనే 54**

శ్రీయుగళము ఖర్పరను బాగుగా రుద్ది దివ్యమైన అంగరాగముగ చేసికొని; సుందరము, రమణీయమునైన దివ్యపత్రములను (ఆకులను) కుట్టి వస్త్రములుగ ధరించి; పుష్పాదులతో అలంకారము చేసికొని; పత్రములతో చేసిన రెండు పాత్రలలో మధువును పానం చేసి, ఆ క్రింద శయినించి; పరస్పరం ఆలింగనం చేసికొని, ప్రశంసించుకుంటున్నారు. నా ప్రియమైన ఆ గౌరశ్యామ యుగళ కిశోరులు అట్లు ఆనంద సముద్రమైన శ్రీబృందావనములో విరాజమానులైనారు.

**విస్రస్తం వరకేశబంధముదయద్రోమాంచ పుంజం స్ఖలత్**
**వాక్పీయూషభరం త్రుటిన్మణి సరస్రక్ ఖండితాలేపనమ్**
**యత్తత్క్లప్త పరిచ్ఛదం రసమయీం యత్తద్విచేష్టాం దధత్**
**ధామద్వంద్వమనంగ విహ్వలముపైమ్యేకాత్మ వృందావనే 55**

శ్రీయుగళ కిశోరుల కేశబంధనం విడివడిపోయింది. ఇరువురు పులకితులై ఉన్నారు. నడక తడపడుతున్నది. వారు వచనామృత ప్రవాహాన్ని వర్షిస్తున్నారు. మెడలోని మణిమాల విరిగిపోయింది. కస్తూరి మున్నగు సుగంధ ద్రవ్యాలతో

సర్వాంగములు శోభిస్తున్నాయి. అత్యంత సూక్ష్మమైన వస్త్రమును కటి (నడుము)పై ధరించి ఉన్నారు. ఈ విధంగా రసమయమైన విశిష్ట స్వభావంతో ప్రేమాతురులై ఉన్న శ్రీయుగళ కిశోరులను బృందావనంలో దర్శిస్తున్నాను.

**వృందారణ్యే భ్రమదతిరసావేశతో ఘూర్ణమానమ్**
**గౌరశ్యామం కిమపి మధురం ధామయుగ్మం కిశోరమ్**
**మాలావస్త్రాదికమపి తతః పూర్యమాణం ముహుస్తైః**
**దాసీవృందైరతి పురుముదా సేవ్యమాస్తాం కదాపి 56**

శ్రీబృందావనంలో సంచరిస్తూ, అతిశయించిన రసవశులై ఇటునటు విహరిస్తున్న ఒకానొక మధుర గౌరశ్యామ యుగళ కిశోరులు విరాజమానులైనారు. దాసీబృందం నిరంతరం మాల, వస్త్రాదికాలతో ఆనందపూర్వకంగా వారి శోభను వృద్ధి చేస్తూ, వారికి సేవ చేస్తున్నారు.

**శ్రీవృందావన నిత్యకేలి కలయాచాహర్నిశం మన్మథా**
**క్రాంతం నిత్యకిశోరమోహన మహోద్వంద్వం కిమప్యద్భుతమ్**
**ప్రత్యంగోచ్ఛలదప్రమేయ మధుర శ్రీగౌరనీలోజ్జ్వల**
**జ్యోతిః పూర్ణసుధాబ్ధిలీన చిదచిద్భేద ప్రపంచం భజే 57**

ప్రేమాతురులైన నిత్యకిశోరులు శ్రీబృందావనంలో అహర్నిశలు నిత్యకేళీకళను ప్రకటిస్తున్నారు. అద్భుత, మనోహర యుగళమైన వారి ప్రత్యంగము నుండి ఎగసిపడుతున్న మధురము, శోభాయుక్తము, గౌరనీలాత్మకము, ఉజ్వల జ్యోతి పూర్ణమునైన అమృత సముద్రములో స్థావర, జంగమాత్మకమైన లోకము విలీనం ఔతున్నది. అట్టి శ్రీయుగళకిశోరులను భజించు!

**విటపే విటపే దలే దలే ప్రతిపుష్పం ఫలపల్లవాదిషు**
**బహు సౌరభ సీధురోచిషః స్మరవృందావన దివ్యశాఖినః 58**

ప్రతి కొమ్మలోను, ప్రతి ఆకులోను, ప్రతి పుష్పములోను, ప్రతి ఫలపల్లవాదులలోను అతి సౌరభామృత కాంతియుక్తమైన శ్రీబృందావన వృక్షములను స్మరించు!

**పులినే పులినే యమస్వసుర్ద్రుమ వృందైర్హరిచందనాదిభిః**
**విహరన్నవకుంజ మంజులే భజ గౌరాసిత ధామ తద్ద్వయమ్ 59**

శ్రీయమునా తటములలో హరిచందనాది వృక్షములతో రచితమైన నవనవ మనోహర కుంజలలో విహారపరాయణులైన శ్రీగౌరశ్యామ యుగళ కిశోరులను భజించు!

**కనక మరకత శ్రీహరి దివ్యాంగయోస్త**
**న్మధుర మధుర ధామ్నోః కేలివృందం కయోశ్చిత్**
**అతి మధురిమ సాంద్రానంద నిష్యంది వృందా**
**వనమను రససింధోః సారమీక్షే కదా ను 60**

హా! స్వర్ణ లేక మరకతమణి యొక్క శోభను హరించు దివ్యాంగములతో నున్న శ్రీయుగళము అనిర్వచనీయమైన మధురాతిమధుర స్వరూపులు! శ్రీబృందావనములో ప్రకటితులై, అతి మధురసారమైన ఘనానందమును వర్షించు రససాగర సారస్వరూపులైన వారి లీలలను ఎప్పుడు దర్శిస్తాను ?

**శ్రీగాంధర్వా ప్రాణబంధోః పదాబ్జద్వంద్వోన్మీలత్ ప్రేమపీయూష సింధోః**
**స్వాదంతేఽత్యాశ్చర్య మాధుర్య ధారాః శ్రీమద్బృందాకాననే కేఽపిధన్యాః**
**61**

శ్రీబృందావనవాసియైన ఒకానొక భాగ్యశాలి మాత్రమే శ్రీరాధామాధవుల యుగళ చరణకమలముల నుండి స్రవిస్తున్న ప్రేమామృత సముద్రపు అత్యాశ్చర్యకరమైన మాధుర్యధారను ఆస్వాదింపగలరు!

**సర్వానందాచ్ఛాదకానందసారా సారాన్ వర్షన్ ప్రేమవర్షా ప్రకర్షాన్**
**వృందారణ్యే సద్రుమైర్దుర్దినే శ్రీకృష్ణాంభోదో భాతి రాధా తడిత్వాన్ 62**

అది సమస్త ఆనందరాశులను ఆచ్ఛాదింపగల (సర్వవ్యాపకమైన) ఆనంద సారము! ఆ ప్రేమ వర్షము ప్రవహిస్తున్న ఈ బృందావన వృక్షముల వెనుక నుండి శ్రీరాధారూప విద్యుల్లతతో కూడిన శ్రీకృష్ణరూపమేఘము ఉదయిస్తున్నది.

**వికచ నవసుహేమ చంపకేందీవర దల వృంద సుగౌరనీల భాసోః**
**స్ఫురతు చరితవృందమేవ వృందావనభువి నూతన దివ్యగోపయూనోః 63**

వికసించిన నవహేమ చంపక, నీల కమల దళముల వలె ఉజ్వలమైన గౌరనీల కాంతియుక్తులైన వారు (శ్రీయుగళము) దివ్యగోపగోపికలతో బృందావనములో ప్రకాశిస్తున్నారు. ఆ యిరువురి లీలలు నా హృదయములో స్ఫురించునుగాక!

**ద్రుత కనక మహేంద్రనీల రోచిర్ద్వితయమహః స్ఫురదాద్య యౌవనశ్రీ**
**నిరవధి మదనోన్మదావఘూర్ణం పరిచర చారుకదంబ కుంజవీథ్యామ్ 64**

తప్తస్వర్ణము, ఇంద్రనీలమణి వంటి కాంతితో కూడిన శ్రీయుగళము శ్రేష్ఠమైన యౌవన శోభతో ప్రకాశిస్తున్నారు. వారు సుందరమైన కదంబ కుంజ వీథులలో అతిశయించిన ప్రేమమత్తతతో ఇటునటు సంచరిస్తున్నారు. ఆ యుగళ కిశోరులను సేవించు!

**పర రసవర వృందకంద వృందావిపిన మహాద్భుత పుష్పవాటికాయామ్**
**విహరతి మమ గౌరనీలమాత్మద్వయ మతికామ విమోహితం కిశోరమ్ 65**

పరమ రసమయ శ్రేష్ఠ వస్తువులకు మూలమైన శ్రీబృందావన మహాద్భుత పుష్పవాటికలో నా ప్రాణస్వరూపులైన శ్రీగౌరనీలయుగళ కిశోరులు అతిశయించిన ప్రేమ విమోహితులై విహరిస్తున్నారు.

**కుసుమిత వనరాజి మంజుగుంజ న్మధుప కరన్విత కోకిలా కుహూభిః**
**ముహరతి విధురౌ స్మరామి రాధామురళిధరౌ సహసా స్థితౌ నికుంజే 66**

వికసించిన వనములు, భ్రమరముల మనోహర గుంజారవము, కోకిలల కుహు కుహు రావములతో మాటిమాటికి విరహతప్తులు ఔతున్న శ్రీరాధామాధవులు హఠాత్తుగా నికుంజలో విరాజమానులైనారు. నేను వారిని స్మరిస్తున్నాను.

**మాద్యద్భృంగ వరాంగనాభిరభితః సంగీతమంగీకృతమ్**
**కుర్వంతి స్వకుహూ కుహూరితి ముహుః కోలాహలం కోకిలాః**
**లీలా తాండవితం శిఖండిభిరతి ప్రావర్తి వల్లీద్రుమాః**
**సర్వేఽత్యంత సు పుష్పితాస్తవ ముదే రాధేఽద్య వృందావనే 67**

హేరాధా! మత్తిల్లిన భ్రమరములు అక్కడక్కడ గానం చేస్తున్నాయి. కోకిలలు కుహూ కుహూ రవములు చేస్తున్నాయి. నెమళ్లు లీలాతాండవ నృత్యం చేస్తున్నాయి. లతలు, వృక్షములు కూడ చక్కగా వికాసమును పొంది శ్రీబృందావనములో నేడు నీ ఆనందాన్ని వృద్ధి చేస్తున్నాయి.

**పశ్చాదేత్య ప్రియమతి రసాద్యత్ర నేత్రే పిధాయ**
**జ్ఞాతం ముంచత్వమసి లలితేత్యాహ రాధా హసంతమ్**
**సత్యం జ్ఞాతం యదసి పులకిన్యేవ మాలీం హసంతీమ్**
**సందర్శ్యాన్యా శిశిరమరుతం పల్లవేనాజఘాన 68**

ప్రియతముడు వెనుకగా వచ్చి, రసాధిక్యం చేత రాధాజీ కన్నులను మూసి నవ్వసాగినాడు. "నాకు తెలుసును, ముందు వదలి పెట్టు. నువ్వు లలితవి" అని శ్రీరాధ పలికింది. ఒక సఖి నవ్వుతూ, "నువ్వు పులకితవు అవటం చేతకూడ నిజం తెలిసింది" అన్నది. ఇదంతా చూచిన మరొక సఖి పల్లవములతో చల్లనిగాలి తగులునట్లు వీచసాగింది.

('అతడు శ్యామసుందరుడు అని అనవద్దు' అంటూ, అతడే అని సూచించటం ద్వారా తెలియజేశారు. అంటే రాధాజీ కన్నులను మూసినది శ్యామసుందరుడని సఖియలు పరిహాసపూర్వకంగా ఆదేవికి తెలియజేశారు.)

**యత్రానంతరతీ రతిస్మర మహావిస్మాపి రూపశ్రియౌ**
**శ్రీరాధా తదనన్య నాగరమణీ రాత్రిందివం క్రీడతః**
**నిత్యాశ్చర్య కిశోరవేశలలితౌ లోలైః సఖీమండలైః**
**ఏకాత్మోజ్జ్వల భావనాశ్రు పులకైర్నిత్యోత్సవైః సేవితౌ 69**

అనంతమైన రతీ మన్మథులకు కూడ మహా విస్మయం కలిగించే రూప శోభ కల శ్రీరాధయును, ఆమెకు అనన్య నాగరమణియైన శ్రీశ్యామసుందరుడును అక్కడ అహర్నిశలు అనంగకేళి సల్పుతున్నారు. ఏకాత్మ ఉజ్వల భావనాయుక్తులై, అశ్రుపులకిత శరీరులై చంచలిస్తున్న సఖియలు చేస్తున్న నిత్యోత్సవ అనుష్ఠానం ద్వారా నిత్య ఆశ్చర్యమయ కిశోరులైన లలితయుగళమునకు సేవ జరుగుతున్నది.

**రాధాకృష్ణ సుగౌరనీలవపురుద్వేలచ్ఛటాంభో నిధిః**
**పూరైః ప్రేమరసాత్మకస్య చిదచిద్ద్వైతప్రథా ప్రోంజనః**
**శ్రీవృందావనముజ్జ్వలోజ్జ్వలమనాద్యంతోల్లసత్తన్మహా**
**నంగోత్తుంగ విహారరంగమఖిల వ్యాసంగ భంగం భజే 70**

శ్రీరాధాకృష్ణుల గౌరనీల శరీరము అనంత కాంతి సముద్రము! వారి ప్రేమ రసాత్మక ప్రవాహములో చిదచిత్ వస్తువుల భేదస్థితి లుప్తమై పోయింది. అత్యుజ్వలము, అనాది, అనంత ప్రకారములుగా ఉల్లాసశీలమునైన మహా అనంగునికి విహారస్థలియై; తనయందు తప్ప మిగిలిన వస్తువులన్నిటిపై ఆసక్తిని నశింపజేయు శ్రీబృందావనమును నేను భజిస్తున్నాను.

**స్వామిన్యాస్స్వ క్షణమిహ మనాక్ మోహనాత్రైవ తిష్ఠ**
**సమ్యక్ కుర్వే వితత సురతాఽన్యాదృగంగాంబరాది**
**ప్రాప్త ప్రాయా ఇహ హి లలితాద్యాలయోఽన్వేష్యమాణా**
**హాసం హాసం సపది లలితం లజ్జయిష్యంతి సర్వాః 71**

హేస్వామినీ! క్షణకాలము కూర్చుండుము. హే మోహన్! ఇక్కడ కూర్చుండుము. మీకు వస్త్రాదికములు చక్కగా, ఉత్తమ రూపముగా ఉండునట్లు అలంకరిస్తాను. లలితాది సఖీమణులు కూడ మిమ్ము అన్వేషిస్తూ శీఘ్రముగా మీవద్దకు వస్తున్నారు. వారు నవ్వుతూ, నవ్వుతూ మిమ్ము లజ్జితులగునట్లు చేస్తారు. (అని ఒక ఏకాంత సఖి పలికినది.)

**తత్సౌందర్యం కిమపి కలయత్ సన్నవాణీ మరంద**
**స్యందైః సాంద్రప్రసృమర మహాచంద్రికాస్యారవిందే**
**సర్వాంగేషు ప్రకట పులకానంగ వైవశ్యలోలత్**
**గౌరశ్యామాంగకమ విరహం యత్రభాతి ద్విధామ 72**

శ్రీయుగళము గద్గదమైన మాటలు అనెడు మరందధారను వర్షిస్తూ; సాంద్రము,విస్తృతము,మహాజ్యోత్స్నామయమునైన ముఖ కమలము నందు అనిర్వచనీయమైన సౌందర్యమును దర్శిస్తున్నారు. వారి సర్వాంగములు పులకితమైనాయి, అనంగ వివశత్వము చేత చంచలిస్తున్నారు. నిరంతరము కలసియే యుండు ఆ గౌర శ్యామాత్మక శ్రీయుగళము శ్రీబృందావనములో విరాజమానులైనారు.

**యత్రాఽన్యోన్య ప్రణయ సరసావేశ పూర్ణాయతాంగమ్**
**హాసం హాసం రుచిర కలయాఽన్యోన్య సంఘట్టితాంగమ్**
**బారం బారం సురస సమరోత్సాహ సన్నద్ధ మూర్తి**
**జ్యోతిర్ద్వంద్వం విశతి సహసా మంజుకుంజాజిరేషు 73**

అక్కడ యుగళ కిశోరులు పరస్పర ప్రణయ రసావేశము చేత తమ అంగములను పూర్ణము చేస్తున్నారు (అనగా వారి అంగాంగములయందు ప్రణయ రసావేశము నిండియున్నది). ఇరువురు నవ్వుతూ, నవ్వుతూ మనోజ్ఞకలా విలాసులై

ఆలింగనం చేసుకుంటున్నారు. మాటిమాటికీ రసమయమైన ప్రేమ యుద్ధము నందలి ఉత్సాహముతో సన్నద్ధులై వేగిరపాటుతో మంజులకుంజ వేదికలోనికి ప్రవేశిస్తున్నారు.

**వేణీచూడాతిలక రచనైర్గంధ తాంబూల మాల్యైః**
**దివ్యైః సూక్ష్మోజ్జ్వల వరపటైర్దివ్యైర్దివ్యాన్నపానైః**
**సమ్యక్ సంవీజన మృదు పదాంభోజ సంవాహనాద్యైః**
**సఖ్యో రాధామురళిధరణౌ యన్నికుంజే భజంతి 74**

శ్రీబృందావనములోని కుంజలో సఖీమణులు కురులు ముడుచుట; తిలకాదులను రచించుట; గంధ, తాంబూల, మాల్యాదులను అర్పించుట; దివ్యాతి దివ్యసూక్ష్మ ఉజ్వల వస్త్రములను ధరింపజేయుట; దివ్యాతిదివ్యములైన అన్నపానాదులను భుజింపజేయుట; సుందరమైన పంఖాలతో వీచుచు, మృదు పదములను సంవాహనము చేయుటల ద్వారా శ్రీరాధా మురళీధరులకు సేవ చేయుచున్నారు.

**కాశ్చిత్ కుంజాన్నిరవధి పరిష్కుర్వతే శ్రీవిభేదైః**
**గ్రథంత్యన్యా వివిథ కుసుమైర్దివ్యమాల్యాదికాని**
**కాశ్చిద్యుక్త్యా విదధతి ముదా దివ్యగంధ ప్రకారాన్**
**కాశ్చిత్ కుంచంత్యతి వరపటం యత్ర రాధా సుదాస్యః 75**

శ్రీబృందావనములో శ్రీరాధయొక్క ఉత్తమోత్తమ దాసీమణులలో కొందరు నిరంతరము పూవులను పరిష్కరిస్తూ ఉంటారు (ఏరి, వేరు చేయుట). మరికొందరు అందమైన వివిథ పుష్పములతో దివ్యమైన మాలలను తయారు చేస్తుంటారు. ఇంక కొందరు ఆనందముగా దివ్యగంధ ద్రవ్యాదులను ఏర్పరుస్తూ ఉంటారు. మరికొందరు అత్యంత సుందర కాంతితో కూడిన శ్రేష్ఠ వస్త్రములను నేయుటలో నియుక్తులై ఉంటారు.

**తృణీకుర్వత్ సర్వాస్త్రిదశ తరుణీర్నవ్య వయసో**
**మహోమాధుర్యౌఘైరపి సుషమయైకాంగ గతయా**
**వధూవృందం వృందావన భువి భజస్త్రద్రసమయమ్**
**మహోద్వంద్వం నిష్పందయదపి మునీంద్రం స్మర మనః 76**

ఓ మనసా! మహో మాధుర్యమూర్తులు, ఏకాంగస్థిత (ఒకే శరీరమునందు స్థితమై ఉన్న) శోభా స్వరూపులునైన శ్రీయుగళమునందు వ్రజవధూమణులు రసావిష్టచిత్తులై ఉంటారు. వారు దివ్యనవీన యువతీమణులైన సమస్త దేవీగణములను కూడ తృణము (గడ్డిపరక) వలె తృణీకరిస్తారు. వారిని భజించు! మునీంద్రులను కూడ చిత్రిత ప్రతిమలవలె చేయు శ్రీయుగళ కిశోరులను ఈ బృందావనములో సేవించు!

**సా వృందాకానన శ్రీస్తదసమ సుషమా వైభవం గౌరనీల**
**శ్రీదంపత్యోరుదారే నవ వయసి సతోః కేవలానంగ రంగే**
**తాదృక్ ప్రాణద్వయారాధన రసవివశా దివ్యలావణ్యరూప**
**శ్రీభిః పూర్ణాః కిశోర్యోజ్జ్వలిత దశదిశో యూథశో మే స్ఫురంతు 77**

శ్రీబృందావనము యొక్క ఆ శోభ, గౌరనీల కాంతి స్వరూపులైన యుగళకిశోరుల కేవల అనంగరంగమయ నవీన రసము యొక్క ఆ అనుపమ శోభారాశి, ప్రాణప్రియతములైన యుగళ కిశోరుల ఆరాధనా రసము చేత వివశులైన దివ్యలావణ్య రూపశోభా సంపన్నులైన ఆ కిశోరీమణులు, ఆ కిశోరీ సమూహములు దశదిశలలోను ప్రజ్వలితం చేస్తున్న ప్రకాశము నాహృదయములో స్ఫురించుగాక!

**అనంత బ్రహ్మాండావలి వలిత మూల ప్రకృతితః**
**సుదూరే స్వాదీయో జయతి భగవజ్జ్యోతిరమృతమ్**
**తదంతర్వైకుంఠం తదతి రహసి స్వాదిమ మహో**
**మనోభూ బీజాత్మద్యుతి మదిహ వృందావనమిదమ్ 78**

అనంత బ్రహ్మాండరాశిని చుట్టివేసిన మూలప్రకృతికి సుదూరములో అమృతమయము, ఆస్వాదనీయమునైన భగవజ్జ్యోతి జయయుక్తమై ఉన్నది. దాని అంతర్భాగములో వైకుంఠము ఉన్నది. దానికన్నను కూడ అతిగుప్త స్థానములో కామబీజాత్మకము, కాంతిమంతము, ఆస్వాదనీయమునైన శ్రీబృందావనము విరాజమానమై ఉన్నది.

**స్థలం వృందారణ్యే మృదుల విపుల స్వచ్ఛమధురమ్**
**మహాచింతారత్న ప్రచయమయమానంద సదనమ్**
**మహాదివ్యామోదం ప్రణయరస సారాకరమహమ్**
**పరాగాణాం పుంజోజ్జ్వలమతి విచిత్రచ్ఛవి భజే 79**

శ్రీబృందావనము మృదులము, అతిస్వచ్ఛము, మధురమునై, చింతామణి సమూహములతో నిండియున్న ధామము! అది ఆనందమునకు నిలయము, మహాదివ్యసుగంధ పూర్ణము, రససారమునకు నివాసము! అచటి రజము ఉజ్వలమై, అతి విచిత్రమైన కాంతితో నిండి ఉంటుంది. నేను అట్టి బృందావనమును భజిస్తున్నాను.

**ఇహైవ శ్రీరాధామురళిధరణౌ స్వారసిక స**
**న్మిథో భావావిష్టౌ నవనవ వయోరూప మధురౌ**
**మహాప్రేమానందోన్మద రసచమత్కార నికరౌ**
**కిశోర్యోఽత్యాశ్చర్యా నిరవధి భజంతే ప్రణయతః 80**

శ్రీబృందావనములో ఒకరి పట్ల మరొకరు సహజసుందరముగా భావావిష్టులైనట్టి, నవనవ వయోరూప మాధుర్య భూషితులైనట్టి, మహాప్రేమానంద ఉన్మత్తత వలన కలిగిన రస చమత్కార మూర్తులైనట్టి శ్రీరాధామురళీధరులను అత్యాశ్చర్యమయమైన కిశోరీమణులు నిరంతరము ప్రీతి పూర్వకముగ సేవిస్తూ ఉంటారు.

ఈ శ్లోకము నుండి శ్రీసరస్వతీ పాదులు శ్రీరాధా దాసీమణుల ఉజ్వల ప్రకాశమును, భావతీవ్రతను, ప్రేమకాంతిని, జగన్మోహన రూపమును వర్ణిస్తున్నారు.

**రాధాకృష్ణ పదారవింద మకరందాస్వాద మాద్యన్మనో**
**భృంగాః సంతత ముద్గతాశ్రుపులకాస్త్రప్రేమ తీవ్రౌఘతః**
**అత్యానందభరాత్ కదాప్యతిలయే శోచంత్య ఆత్మేశయోః**
**సేవాయా విహతేః స్ఫురంతు మమ తాః శ్రీరాధికారాధికాః 81**

శ్రీరాధా దాసీమణుల మనోభ్రమరము శ్రీరాధాకృష్ణుల చరణకమల మకరందమును ఆస్వాదించి ఉన్మత్తం ఔతూ ఉంటుంది. యుగళ కిశోరుల తీవ్ర ప్రేమ ప్రవాహం వారిలో నిరంతరం అశ్రు, పులకాదులను కలిగిస్తూ ఉంటాయి. ప్రాణేశ్వరులైన యుగళకిశోరుల పట్ల ఆనందవశులై, వారి సేవకు ఎప్పుడైనా విఘ్నం వస్తే పరితపిస్తారు. అట్టి శ్రీరాధా దాసీమణులు నా హృదయంలో స్ఫురింతురుగాక!

**స్వప్రాణ ద్వయ కార్య తస్తత ఇతో లోలాః కపోలస్థలీ**
**ర్వేలత్ కాంచన కుండలాః కటిరణత్కాంచీ క్వణన్నూపురాః**
**చూడా మంజురణత్ కృతైః సుమధురా దిగ్వ్యాపకాంగచ్ఛటా**
**రాధాకర్మకరీః సుహేమలతికాస్తన్వీః కిశోరీః స్మర 82**

శ్రీరాధా దాసీ బృందము తమ ప్రాణేశ్వరులైన యుగళకిశోరులకు సంబంధించిన కార్యవశులై ఇటు, అటు వస్తూ పోతూ ఉంటే వారి కపోలములపై (చెంపలపై) స్వర్ణ కుండలాలు ఊగుతున్నాయి. నడుమునకు ఉన్న వడ్డాణము,పాదములకు ఉన్న నూపురములు ధ్వనిస్తున్నాయి. చూడాభరణము మనోహరమధుర ధ్వనిని చేస్తున్నది. ఆ దాసీమణుల అంగకాంతి దశదిశలను ప్రకాశింపజేస్తున్నది. ఈ ప్రకారంగా సుందర స్వర్ణలతవలె ఉన్న శ్రీరాధా దాసీగణమును స్మరింపుము!

**పృథుకటితట శాటీ విస్ఫురత్ కింకిణీకా**
**శ్చరణకమల సింజన్మంజు మంజీర శోభాః**
**కుచముకుల విరాజత్ కంచులీలోలహారాః**
**స్మరత కనకగౌరీ రాధికా కింకరీస్తాః 83**

విశాలమైన కటిప్రదేశాన చీరపై నున్న వడ్డాణము శోభాయమానముగా ఉన్నది. చరణ కమలములకు శోభస్కరముగా ఉన్న మనోజ్ఞనూపురములు విరాజమానమై ఉన్నాయి. వక్షస్థలముపై ధరించిన చోళీకిపైన ఉన్న హారములు ఇటు అటు ఊగుతూ శోభిస్తున్నాయి. ఈ విథంగా స్వర్ణగౌరాంగియైన శ్రీరాధా దాసీ బృందమును స్మరింపుము!

**మణికనక నిబద్ధానర్ఘ్య ముక్తాద్యనాసా**
**బహులచికురవేణీ విస్ఫురద్రత్నగుచ్ఛాః**
**అమిత కనకచంద్రజ్యోతి సుస్మేర వక్త్రా**
**నవ తరుణిమ లీలాః కాంతి సమ్మోహనాంగీః 84**

మణి, స్వర్ణ జటితమై అమూల్యమైన ముత్యము మున్నగువానిచే నాసిక (ముక్కు) శోభిస్తున్నది. ముడిచిన కేశరాశిపై రత్నగుచ్ఛము ప్రకాశిస్తున్నది. అనుపమానమైన స్వర్ణచంద్రజ్యోతివలె ముఖబింబము మధుర మృదు మందహాసముతో ఉజ్వలముగా ఉన్నది. నవతారుణ్య, లీలా, కాంతిధారతో వారు (శ్రీరాధా దాసీమణులు) అనుపమానమైన జగన్మోహినీరూపముతో ఉన్నారు.

**సహజ మధుర రాధాకృష్ణ తీవ్రానురాగ**
**ప్రసర ముహురుదంచచ్చారు రోమాంచ పుంజాః**
**ప్రతిపదపరివృద్ధానంద సింధావగాధే**
**ప్రతిముహురతిమత్తోత్ఫుల్లితాంగా హసంతీః 85**

శ్రీరాధాకృష్ణుల పట్ల గల సహజ, మధుర, తీవ్ర అనురాగముచే మాటి మాటికి వారియందు సుందర రోమాంచము (అందమైన పులకరింత) కలుగుతున్నది. ప్రతిక్షణము వృద్ధి చెందుచున్న అగాధమైన ఆనందసముద్రములో క్షణక్షణము ఉన్మత్తులై, ప్రఫుల్లితులై వారు (శ్రీరాధాదాసీ బృందము) నవ్వుచున్నారు.

**నవకనక సుగౌరజ్జ్యోతిరంగచ్ఛటౌఘైః**
**ఖచిత దశదిగంతా దివ్యకైశోరరూపాః**
**తదతిరస కిశోర ద్వంద్వ భావోన్మదాంధా**
**వివిధ వసనభూషా భాంతి రాధానుచర్యః 86**

నవ కనక, గౌరజ్యోతిర్మయ అంగముల కాంతితో వారు దశదిశలను ప్రకాశింపజేస్తున్నారు. దివ్యకిశోరవయస్కులై, యుగళ కిశోరుల యందలి రసాతిశయము చేత భావోన్మదమును పొంది, వివిధములైన వస్త్రాభరణములతో అలంకృతులైన శ్రీరాధా దాసీమణులు ప్రకాశిస్తున్నారు.

80వ శ్లోకము నుండి 86వ శ్లోకము వరకు శ్రీసరస్వతీ పాదులు శ్రీరాధా సఖీమణులను, దాసీమణులను; వారి దివ్యశోభను రసపారవశ్యముతో వర్ణించినారు.

**శ్రీమద్బృందావన నవలతా మందిరేష్విందిరేశ**
**ధ్యానాస్పందాత్మని పరిచితేనాద్భుతేందిందిరేణ**
**కేనాప్యన్వేషిత పరరసామోద సర్వస్వయోర్మే**
**శ్రీగాంధర్వా పదకమలయోర్దాస్యమాశాస్యమస్తు 87**

శ్రీబృందావన నవలతా మందిరములో లక్ష్మీకాంతునికి కూడ ధ్యానయోగ్యమైనట్టి, ఒకానొక అద్భుత భ్రమరము (కృష్ణుని) చేత అన్వేషితమైనట్టి శ్రేష్ఠ రసానందమునకు సారమైనట్టి శ్రీరాధాయుగళపదకమల దాస్యమే నాకు పొందతగిన విషయము! ఇదే నా ప్రార్థన!

**చింతారత్న ప్రకర విలసచ్ఛర్కరం సత్వరాగో**
**న్మీలత్పుంజ ప్రకట రసవత్ కృష్ణరాధా పదాంకమ్**
**నానా వర్ణోజ్జ్వల మణిమయం చిద్రసాపార రోచిః**
**శ్రీమద్బృందా విపిన వర భూమండలం సంస్మరామి 88**

శ్రీబృందావనములోని ప్రతి రాతిపలుకు నందు చింతామణి సమూహములు ప్రకాశిస్తూ ఉంటాయి. ప్రతి రజకణమునందు రసికులైన శ్రీరాధాకృష్ణుల పదచిహ్నాపుంజములు ప్రకటితం ఔతూ ఉంటాయి. నానా వర్ణ, ఉజ్వల మణులతో ఖచితమైన, చిద్రసమయమైన, అపారకాంతియుక్తమైన ఆ శ్రీబృందావన శ్రేష్ఠ భూమండలమును నేను సమ్యక్ ప్రకారముగ స్మరిస్తున్నాను.

**వృందారణ్య స్థలీయం సువిమల మృదులా కాంతకాంతా నితాంత**
**విస్ఫూర్జద్దివ్య రత్నచ్ఛవిరతిమసృణానంద సాంద్రాతివాసా**
**శాఖౌఘైః పత్రపూర్ణైరుపరి హిమ తుషారాతపాదిస్తరూణామ్**
**నాత్రాపేక్షాస్తరాదేస్తదుపరి విశతోః ఖేలనం కించిదత్ర 89**

శ్రీబృందావన స్థలి స్వచ్ఛమైనది, కోమలమైనది, శ్రీయుగళ దివ్యరత్నకాంతి యొక్క ఆధిక్యము చేత స్ఫూర్తిని పొందినది. అది అతి సౌకుమార్యమునకు, అత్యంత ఆనందమునకు నివాసస్థానము! ఆయా తావులలో పత్రపూర్ణములైన వృక్షశాఖలు మంచుబిందువులను, ఎండవేడిమిని కూడ సహిస్తూ ఉంటాయి. అక్కడ ఇతరములైన వాని యొక్క ఆవశ్యకత ఎంత మాత్రము లేదు. అక్కడ విరాజమానులై శ్రీయుగళ కిశోరులు అనుపమానమైన లీలను ప్రకటిస్తున్నారు.

**వందే కాంచన దివ్యకాంచనమయీం కాంచిన్మహానీల మ**
**ణ్యుద్దీప్తాం కురువింద వృందలసితామన్యాం పరాం వైద్రుమీమ్**
**వైదూర్యోజ్జ్వలితాంచ కామపి పరాం శ్రీచంద్రకాంతోజ్జ్వలామ్**
**శ్రీవృందావనభూమిమేకరస చిజ్జ్యోతిర్మయీమద్భుతామ్ 90**

శ్రీబృందావనము ఒకచో దివ్యకాంచనమయము, ఇంకొకచో మహానీలకాంతమణిచే ఉద్దీప్తము, వేరొకచో కురువిందములచే ఉల్లసితము, మరొకచో విద్రుమ మణిమయము, ఇంకొకచో వైడూర్యమణులచే ప్రకాశితము, వేరొకచో చంద్రకాంతమణులతో శోభితమునై ఉన్నది. ఈ ప్రకారముగ ఏకరస చిత్జ్యోతిర్మయమైన అద్భుత బృందావన భూమికి నేను నమస్కరిస్తున్నాను.

**దివ్యానంత మహారసాబ్ధి మధుర ద్వీపాయమానాం సదా**
**భ్రాజంతీం సకలోపరి స్మరకలానందైశ్చమత్కారిణీమ్**
**రాధాకృష్ణ మహారసాంధ్య విలుఠత్ సర్వాంగ సంగాద్భుత**
**శ్రీసౌభాగ్యనిధిం స్మరామి సతతం వృందావనీయావనీమ్ 91**

ఈభూమి దివ్య, అనంత రసమునకు ద్వీపము వంటిది. సదా సమస్త జగత్తునకు పైన విరాజమానమై, స్మరకళా ఆనందమునందు చమత్కారము కలిగించునట్టిది. శ్రీరాధాకృష్ణుల మహారసమునందు ముగ్ధత్వమును పొంది, సర్వాంగములతోను (పరిపూర్ణముగ) అచటనే నిలచి ఉండువారికై అద్భుత శోభా సౌభాగ్యనిధియైన శ్రీబృందావన భూమిని నిరంతరము స్మరించుము!

**రాధాకృష్ణ సుకేలి తల్పరచనా లోలాలి వృందం రసా**
**వేశోన్మత్త మృగ ద్విజ ద్రుమ లతావృందం మహామోహనమ్**
**దివ్యానేక నికుంజ పుంజరుచిరం దివ్యోరు రత్నస్థలీ**
**రమ్యం దివ్యసరః సరిన్మణిగిరిం ధ్యాయామి వృందావనమ్ 92**

ఈ బృందావనములో శ్రీరాధాకృష్ణులకై సుందరమైన కేళీశయ్యను రచించుటలో సఖీబృందము నిమగ్నమై ఉన్నది. రసావేశముతో మృగములు, పక్షులు, ద్రుమలతా సమూహములు ఉన్మత్తమై ఉన్నవి. దివ్యమైన అనేక నికుంజ పుంజములు శోభిస్తున్నవి. దివ్యమైన అనేక రత్నస్థలములతో, రమణీయమైన

దివ్యాతిదివ్య సరోవరములతో, నదులతో, మణిమయ పర్వతములతో భూషితమైన ఈ మహామోహన బృందావనమును నేను ధ్యానిస్తున్నాను.

**మాద్యచ్ఛ్రీకృష్ణరాధం మదకల సకల స్థాస్ను సంచారి సత్వమ్**
**మాద్యత్కందర్ప ప్రతిపద గరిమోన్మత్త భూషాంబరాది**
**మాద్యత్కాలేందు తారాద్యుతి మద వివశ స్నిగ్ధ గోపాలబాలా**
**వృందం వృందావనం తత్ స్వయమపి సమదం భాతి భూయో రసౌఘైః 93**

శ్రీబృందావనములో శ్రీరాధాకృష్ణులు ఉన్మత్తులై ఉంటారు. స్థావర, జంగమాత్మకమైన జీవకోటి అంతా మత్తిల్లి మధుర ధ్వని చేస్తూ ఉంటుంది. అక్కడ ఉన్మత్తుడైన కామదేవుని గర్వము కూడ ప్రతి అడుగులోను ఆధిక్యమును సూచించు ఉన్మత్త వస్త్రాభరణముల ద్వారా మత్తిల్లి ఉంటుంది. ఎక్కడ ఆయా సమయాలలో చంద్రతారాదులు కూడ మత్తతను కలిగిస్తాయో; ఎవరు అత్యంత ఉన్మద వివశులైన గోపికలతో శోభిస్తున్నారో; స్వయంగా తాను కూడ మద విహ్వలమై ఉన్నదో ఆ శ్రీబృందావనము రసధారను వర్షిస్తూ పునః పునః శోభిస్తున్నది.

**దివ్యశ్రీ పారిజాతాద్యతి రుచిరవనైః శోభమానామనంతై**
**రశ్రాంతస్త్వం లు సంచింతయ హరిచరణైకాంత భావం వహద్భిః**
**శ్రీమద్బృందాటవీం తాం సకల సురగణైర్వందితామిందు కోటి**
**జ్యోత్స్నైకాంభోధి మగ్నామురుభిరుపనిషద్బృంద వృత్త్యాప్యగమ్యామ్ 94**

అనంతమైన, దివ్యమైన, శోభామయమైన కల్పవృక్షాదులతో కూడిన అతిమనోహర వనములతో భూషితమైనది; శ్రీహరి చరణములయందు ఏకాంతభావము కలిగినది; అనంత దేవతా కోటిచే నమస్కరింపబడునది అయిన ఈ శ్రీబృందావనభూమిని నీవు నిరంతరము చింతింపుము! ఈ భూమి కోటి కోటి చంద్రజ్యోత్స్నామయమైన ఒక (రస) సముద్రములో నిమగ్నమై ఉన్నది. ఉపనిషత్తులు కూడ బృందావన మహిమను గ్రహించుటకు అసమర్థములు!

**అస్మిన్ దుస్తర ఘోర సంసృతితరౌ తాపత్రయేణానిశమ్**
**భ్రాతస్త్వం క్లిసితోఽస్యతీవ న మనాక్ ప్రాన్నోషి సంధుక్షణమ్**
**నైకం సాధనమస్తి శాస్త్రమహదాఖ్యాతం తవాఖ్యాతుమ**
**ప్యంతశ్చింతయ తత్‌హరేః ప్రియతనూర్వృందాటవీ శాఖినః 95**

సోదరా! దుస్తరమైన ఈ సంసార వృక్షముతో నీవు రాత్రింబవళ్లు తాపత్రయముల వలన ఎంతో క్లేశాన్ని పొందుతున్నావా ? బిందుమాత్రముగానైన శాంతి లేదా ? నీకు ఏ సాధన కూడా లేదా ? శాస్త్రములను, మహా ప్రసిద్ధమైన శ్రీహరి కథాదికమును కూడ నీవు ఎరుగవా ? అయితే శ్రీహరి యొక్క ప్రియ శరీరమైన శ్రీబృందావనములోని వృక్షములను మనసులో చింతింపుము!

అనగా భగవత్స్వరూపమైన బృందావన వృక్షములు సంసార తాపత్రయాన్ని నశింపజేస్తాయి, శాంతినిస్తాయి! సాధన, శాస్త్రపరిచయము, భగవద్గాథా పరిచయములను మించిన దివ్యరసస్థితిని అవి అనుగ్రహిస్తాయి అని భావము!

# ఏడవ శతకము

**భజ విమలమనోభూబీజ చిజ్జ్యోతిరేకా**
**బ్ధ్యుదిత సురస దీప్తద్వీప వృందావనద్రున్**
**తదతి మధురగౌరశ్యామ ధామద్వయోరు**
**ప్రణయ పరమ పాత్రీభూత చిత్రీయమాణాన్ 1**

మధురస్వరూపులైన శ్రీగౌరశ్యామ శ్రీరాధాకృష్ణుల అనుపమాన పరమ ప్రణయమునకు చిత్రిత పాత్రమై, నిర్మల కామబీజాత్మక చిజ్జ్యోతి సముద్రము నుండి ప్రకటితమైన మధురరసముతో దేదీప్యమానముగ వెలుగుతున్న ద్వీపము శ్రీబృందావనము! అట్టి బృందావనమును భజింపుము!

**ముక్తాన్ ప్రత్యపి కర్హిచిన్నదదతీ సందర్శనం శుద్ధయా**
**రీత్యా నో శుక నారదాదిభిరపి ప్రాప్తాంగ సంగా మనాక్**
**సా శ్రీకృష్ణపదాబ్జ భక్తిరహహ శ్రీధామ్ని వృందావనే**
**యం కంచిత్ ప్రతికాముకీ తత ఇతో భావేన బంభ్రమ్యతే 2**

ఓహో! ముక్తజనులకు కూడ అరుదుగానైనా దర్శనము నీయని, శుకనారదాదులు శుద్ధభావముతో కొద్దిగానైన సన్నిధానమును పొందలేని శ్రీకృష్ణుని చరణకమల భక్తి ఈ బృందావన ధామములో భావపూర్వకముగ ఇచ్ఛావతియై ఇటునటు సంచరిస్తున్నది.

అనగా, అత్యంత దుర్లభమైన శ్రీకృష్ణభక్తి బృందావనములో ఇచ్ఛావతియై, బృందావాసులకు సులభంగా లభిస్తున్నది అని భావము!

**సర్వస్యోత్కర్షదాయీ భవ సతతమయే నీచనీచః స్వయం స్యా**
**ఏవం వృత్తైవ ధీమన్నధివస మధురం ధామ వృందావనాఖ్యమ్**
**తుల్యౌ మానావమానౌ కురు భజ సమతాం స్తోత్రదుర్వాచ్యకోట్యోః**
**గ్రాసాలాభేమహాసంపది చ భవ సమో ద్విట్సుహృత్తుల్య భావః 3**

ఓహో! 'అందరికీ ఆధిక్యాన్ని ఇవ్వు, నీవు నిరంతరం అల్పాతి అల్పుడైనట్లు ఉండు!' ఓ బుద్ధిమంతుడా! ఈ భావంతో శ్రీబృందావన నామకమైన శ్రీరాధా ధామంలో నివసించు. గౌరవాన్ని, అవమానాన్ని సమానంగా భావించు. ప్రశంస, కోటి దుర్వచనాలు రెండూ సమానమని తెలుసుకో. భోజనం లభించకపోవుట యందు, మహాసంపత్తి లభించుట యందు; అట్లే శత్రువుల యందు, మిత్రుల యందు సమానభావంతో ఉండు!

**కాంత త్వక్ మాత్ర సంఛాదిత వికృతతమ స్త్రీమయామేధ్య పిండమ్**
**థుత్కుర్వర్థానసర్థాన్ విమృశ సుత సుహృద్బాంధవాన్ విద్ధి బంధాన్**
**కష్టం మిష్టాన్న పానాదిషు భజ వసనాద్యుజ్జ్వలత్వే త్రపేథాః**
**సర్వేషాం శిష్య భృత్యాది వదతి వినతోఽధ్యాస్స్వ వృందావనం భోః 4**

కేవలం సుందరమైన చర్మాన్ని కప్పుకున్న వికృతతమ స్త్రీరూప అపవిత్ర దేహాన్ని తృణీకరించు. అర్థమును (ధనమును) అనర్థముగను; పుత్ర, మిత్ర, బంధువులను బంధనములుగను తెలుసుకో! రుచికరమైన భోజనం చేయటాన్ని కష్టంగా భావించు. ఉజ్వలమైన వస్త్రాదికాన్ని ధరించటం నీ శరీరాన్ని కంపింప జేస్తుందని తెలుసుకో! అందరి ఎదుట శిష్య, భృత్యాదుల వలె అతి వినీతునిగ ఉండి శ్రీబృందావనంలో నివసించు!

**రాధారమణ పదాంబుజ మధురిమ సింధోరనంత పారస్య**
**అనుభవితైకః స పరం వృందారణ్యం భజేత యోఽనన్యః 5**

ఎవరు అనన్య భావముతో శ్రీబృందావనమును సేవిస్తూ ఉంటారో వారు మాత్రమే శ్రీరాధారమణ చరణకమలముల అపార మాధుర్య సింధువు యొక్క అనుభవమును పొందగలరు.

**వృందావన గుణకీర్తిం ప్రతి రసనా మే నరీనర్తి**
**పరిజరిహర్తి న యజ్ఞః సకలోపరి యద్వరీవర్తి 6**

శ్రీబృందావన గుణకీర్తిని గానము చేయుటలో నా నాలుక నృత్యము చేస్తూ ఉండునుగాక! ఆ ధామము అన్నిటికన్న పైన విరాజమానమై ఉన్నది. ఈ విషయము తెలిసిన వ్యక్తి శ్రీబృందావనమును ఎన్నటికీ త్యజింపలేడు.

**వృందావన విధురాస్తామాస్తాం వృందావనేశ్వరీ తస్యాః**
**సంతు చ సఖ్యో వృందావనైకతరుపల్లవోఽపి మోహయతి 7**

శ్రీబృందావన చంద్రుని (శ్రీకృష్ణుని) కథను గూర్చి అటుండనిమ్ము, శ్రీబృందావనేశ్వరి (శ్రీరాధ), ఆదేవి సఖీమణులను గూర్చి చెప్పెడిది మాత్రము ఏమున్నది ? శ్రీబృందావన వృక్షము యొక్క ఒక్క పల్లవము కూడ సమస్తజగత్తును మోహింపజేస్తుంది.

అనగా, బృందావన వృక్షపల్లవాదులే జగత్తును సమ్మోహితము చేయగలిగినపుడు ఇక శ్రీరాధాకృష్ణులను గూర్చి, సఖీమణులను గూర్చి చెప్పవలెనా అని భావము!

**రే మంద మందయాఖిల సాధనవృందాని సాంద్రమానందమ్**
**వృందావన భువి వృందారక వృందానాం చ దుర్లభం వింద 8**

ఓ మందమతీ! సమస్త సాధనలు తక్కువవే అని తెలిసికొని, వానిని త్యజించు! ఈ బృందావనములో దేవతలకు కూడ దుర్లభమైన సాంద్రానందమును పొందు!

**మా కురు కర్మ న యోగం న విష్ణు భజనం న వా శ్రవణమ్**
**ధ్రువమవాప్స్యసి పరపదం వృందారణ్యే యథా తథా తిష్ఠన్ 9**

కర్మానుష్ఠానము, యోగసాధన, విష్ణుభజన వద్దు; ఆ విషయమును గూర్చి వినుటకూడ వద్దు. శ్రీబృందావనములో ఏదో ఒక విధముగా నివసింపగలిగితే నీవు పరమపదమును నిశ్చయముగా పొందగలవు!

**సత్కర్మాణి కృతాని శ్రీహరిరారాధితః శ్రుతోపనిషత్**

**ఆమృతి వృందారణ్యే యదైవ సంకల్పితో వాసః 10**

"మృత్యు పర్యంతము బృందావనములో ఉంటాను" – ఇట్టి సంకల్పమును చేసినంతనే సమస్త సత్కర్మలను చేసినట్లే, శ్రీహరిని ఆరాధించటం కూడ పూర్తి అయినట్లే, ఉపనిషత్తులను శ్రవణము చేసినట్లే అగుచున్నది.

**సంతు విధర్మాః శతశః సద్ధర్మా యాంతు సర్వేఽస్తమ్**

**యది వృందావనమంగీకురుతే మమ కా తదా చింతా 11**

శత, శత విధర్మములు తటస్థించినా; సమస్త సద్ధర్మములు లుప్తమైపోయినా శ్రీబృందావనము నన్ను అంగీకరించినట్లు అయితే ఇక నాకు ఏమి చింత ?

బృందావన నివాసము లభిస్తేచాలు; ధర్మాధర్మాలతోను, మరి ఏ యితర విషయములతోను సంబంధము లేకున్నను భయము లేదని భావము!

**ఆశా వ్యధాయి వృందా విపినే వాసాయ యత్నోఽధాయి**

**యది మందధీర్వహిః స్యాం వృందావిపినం కృపాలు పాలయేత్తదపి 12**

శ్రీబృందావనములో నివసించాలి అనే ఆశ నీకు ఉంటే, అందుకు ప్రయత్నం కూడ చేస్తే; మందబుద్ధివై (బృందావనము నుండి) దూరంగా వెళ్లినా దయాళువైన శ్రీబృందావనము నిన్ను రక్షిస్తుంది!

**శ్రీవృందావన శోభా వర్ధిత లోభాపి రాధికా బంధోః**

**అనురూప్య మాధురీణాం పరమ ధురీణా మనో హరతి 13**

అనుపమ మాధుర్యరాశి యొక్క పరమ మాధుర్యాన్ని కలిగియున్నట్టి, శ్రీబృందావన శోభ పట్ల అత్యంత లోభాన్ని కలిగియున్నట్టి శ్రీరాధాజీ తన జీవనమైన శ్రీశ్యామసుందరుని మనసును హరిస్తున్నది.

**ఆనందాపరసీమా, సీమా చ సౌభాగ్యరస సారస్య**

**హరి మధురిమాంత్యసీమా, వృందావనమేవ సేవ్యగుణసీమా 14**

ఆనందమునకు సీమ (హద్దు), సౌభాగ్యరస సారమునకు సీమ, శ్రీహరి మాధుర్యమునకు చరమ సీమ, సేవింపతగిన గుణములకు సీమ శ్రీబృందావనమే!

**విచారితాని శాస్త్రాణి గురవః పర్యుపాసితాః**

**స్వయం సమీక్షితం భూయః సారం వృందావనం పరమ్ 15**

శాస్త్రములను గూర్చి సమీక్షించాము, గురుజనుల సేవ చేయటం కూడ అయినది. కాని నేను స్వయముగా మాటిమాటికి గ్రహించిన ప్రకారము శ్రీబృందావనమే సారవస్తువు!

**సఖే సఖేదో భవసి కిమర్ధం వ్యర్థజల్పితైః**

**వృందావన గుణానేవ శ్రుణూపదిశ గాయ చ 16**

ఓ సఖా! వ్యర్థ ప్రలాపాలు చేస్తూ, చేస్తూ ఏమి ఆట ఆడుకుంటావు ? శ్రీబృందావన గుణగణములను విను, ఉపదేశించు, గానం చేయి!

**కిం తామ్యసి వృథా చింతాసహస్రైర్లోక ధర్మగైః**

**శ్రీమద్బృందావనే దేహమిమం న్యస్య సుఖీభవ 17**

లోకధర్మ విషయాలను గూర్చిన సహస్రచింతలతో ఎందుకు దుఃఖితుడవు ఔతావు ? శ్రీబృందావనములో ఈ శరీరాన్ని ఉంచి (నివసించి) సుఖించు!

**అలం కస్యాపి సంగత్యా తవాలం శాస్త్ర కర్మభిః**

**వృందారణ్య తృణమ్మన్యో ధన్యో న కించిదాచరేత్ 18**

నీకు దేనితోను సంగత్వము అవసరము లేదు. శాస్త్రోక్తమైన కర్మలతో కూడ ఏమీ ప్రయోజనము లేదు. ఎందుకంటే ఏదైనా సరే అది బృందావన

తృణం (గడ్డిపరక)తో సమానమని ఎరిగి కృతార్థుడైనవానికి చేయవలసినది ఏమీ మిగిలి ఉండదు.

**నేత్రే ఉత్పాటయత సపది స్త్రీక్షణే లాలసాచేత్**
**పాదౌ సంచూర్ణయత శిలయా చేద్వహిః స్యాద్యియాసా**
**సద్యః ప్రాణాంస్త్యజతు బలిభిర్నేతుమారభ్యతే చేత్**
**బధ్వా దేహో బహిర కపటాఽఽశాస్తి వృందావనే చేత్ 19**

నీకు స్త్రీని చూడాలి అనే కోరిక కలిగితే నీ రెండు నేత్రాలను పెరికివేయి. శ్రీబృందావనం నుండి వెలుపలికి వెళ్లాలి అనే ఇచ్ఛ కలిగితే రెండు కాళ్లను రాళ్లతో చూర్ణం చేయి. శ్రీబృందావనంలోనే నివసించాలి అనే ఆశతో ఉన్న నిన్ను ఎవరైనా బలవంతంగా కట్టివేసి దూరంగా తీసుకొనివెళ్తే తక్షణమే ప్రాణాలను త్యజించు!

**యః కుర్యాద్గురు తల్పకోటి గమనం హన్యాచ్చ విప్రాబుదమ్**
**స్వర్ణంచాపి హరేత్ పిబేచ్చ మదిరాం సంసర్గవాన్ తాదృశైః**
**అన్యంచోద్భట గోవధాద్యఘచయం కుర్వీత సోఽప్యామృతి**
**శ్రీవృందావనవాస నిశ్చయ సునిర్వాహీ మహాధార్మికః 20**

గురుపత్నితో కోటిమారులు సంగమించినను, బ్రాహ్మణ పత్నులతో సంగమించినను, బంగారమును దొంగిలించుట, మద్యపానము చేయుట, అట్టి పనులను చేయువారితో కలసి ఉండుట, ఇంకను గోవధ మున్నగు అత్యంత మహాపాపములను కూడ చేయుచుండుట – ఇట్టిదుష్కృత్యములను చేసినను మరణ పర్యంతము బృందానివాసమును చేయవలెనని నిశ్చయించుకొని, ఆ నిశ్చయమును ఆచరణలో పెట్టినవాడు మహాధార్మికుడు!

**ధర్మాఖ్యామపి నైవ వేత్తి సకలాధర్మైర్నిగీర్ణోఽసకృ**
**చ్చాండాలైరపి ధిక్కృతిః కుచరితాన్ మ్లేచ్ఛైరపి న్యక్కృతః**
**అత్యుచ్ఛృంఖలయా నిజోరు కృపయా క్షాంత్యాచ వృందావనమ్**
**స్వస్మిన్నామృతిచేద్దదాతి వసతిం ధన్యోఽస్తి వృందావనే 21**

ధర్మానికి సంబంధించిన మాటకూడ ఎరుగనివాడు, అధర్మములన్నిటితో గ్రసింపబడినవాడు (కప్పివేయబడినవాడు), చండాలుని చేత కూడ పదేపదే తృణీకరింపబడినవాడు, తగని పనులు చేయటం చేత మ్లేచ్ఛులచేకూడ బహిష్కృతుడైనవాడు - ఇట్టి వ్యక్తిని కూడ శ్రీబృందావనం అత్యంత కృపతో క్షమించి, మరణ పర్యంతం తన నివాసాన్ని ప్రసాదిస్తే అతని వంటి ధన్యుడు మరొకడు ఉండడు.

**ధర్మాధర్మ వివేక శూన్యమసతాం గోష్ఠీషు సక్తం సదా**
**కామక్రోధమదాదిభిః ప్రతిపదం నిష్పిష్యమాణం బలాత్**
**నైవ ద్వంద్వతితిక్షమీషదపి మాంచేత్ సక్షమా సత్కృపౌ**
**దార్యాత్వం జననీవ రక్షసి తదా నందామి వృందాటవి 22**

హా బృందావనమా! నాకు ధర్మాధర్మముల విచక్షణ లేదు. నిరంతరము దుర్జన సాంగత్యము పట్ల ఆసక్తుడనై ఉన్నాను. కామ, క్రోధ, మదాదులు అనుక్షణము నన్ను బలపూర్వకముగా లోబరచుకుంటున్నాయి. శీతోష్ణములు, మానావమానములు మున్నగు ద్వంద్వములను కొంచెమైనను సహింపలేకున్నాను. ఒక వేళ కృప చూపి, నీ ఔదార్యముతో క్షమాశీలయైన తల్లివలె నన్ను రక్షిస్తే నాకు ఆనందం ప్రాప్తిస్తుంది.

**ఇదమపి భవితా కిం రాధికా కృష్ణ నిత్యా**
**న్మద మదన వినోద వ్యంజి కుంజావలీషు**
**అహని నిశి చ వృందాకాననే సంచరామి**
**ప్రతిపదమతి భావోద్భిన్న రోమాశ్రుధారః 23**

శ్రీబృందావన కుంజలు శ్రీరాధాకృష్ణులకు నిత్యము ఉన్మత్తతను కలిగిస్తూ, అనంగ వినోదమును ప్రదానము చేస్తాయి. ఆ కుంజలలో రాత్రింబవళ్లు పరమ భావపూర్వకముగ మిక్కిలి పులకితుడనై, అశ్రుధారలతో బృందావనములోని ప్రతి ప్రదేశములోను సంచరింపగలనా! అట్టి భాగ్యము నాకు ఎప్పుడు లభిస్తుంది ?

**కదా వా కాలిందీ పులిన నవకుంజేషు కనకో**
**జ్జ్వలం జ్యోతిః కైశోరక సహజమున్మాది మదనమ్**
**సదా ఖేలత్ కేనాప్యతుల హరినీలాభ్ర వపుషా**
**కిశోరేణాత్యుచ్చైర్మధుర పరిపాట్యా హృది భజే 24**

యమునా నదీ తీరములోని నవనికుంజలలో సహజ కిశోరావస్థలోనున్న, మదనోన్మత్తయైన ఒకానొక స్వర్ణవర్ణజ్యోతి (రాధాజీ) అపూర్వ ఇంద్రమణి వర్ణముతోను, మేఘ వర్ణముతోను భాసిస్తున్న ఒకానొక కిశోరునితో (శ్రీకృష్ణునితో) కలసి మధుర పరిపాటితో నిత్యక్రీడ సల్పుతున్నది. నేను వారిని ఎప్పుడు హృదయమందిరములో సేవించుకుంటాను ?

**అద్వైత బ్రహ్మ సజ్జ్యోతిషి జయతి మహానంద సజ్జ్యోతిరైశమ్**
**తస్మిన్ స్వాద్యైక రత్యాత్మక మధుర మహాజ్జ్యోతిరేకం చకాస్తి**
**శ్రీమద్బృందావనం తద్ఘనమిహ తదధి శ్యామలేనాస్తి రాధా**
**నిత్యక్రీడా కిశోరీ స్మర మధురతరం తత్పదద్వంద్వరోచిః 25**

అద్వైత బ్రహ్మమయ జ్యోతియందు మహానందమయమైన సుందర జ్యోతి జయయుక్తమై ఉన్నది. దానియందు ఆస్వాద్యమైన, ముఖ్యరత్యాత్మకమైన మధుర మహాజ్యోతి ఒకటి శోభిస్తున్నది. దానికన్నను ఘనమూర్తియైన శ్రీబృందావనమునకు అధిష్ఠాత్రియు, నిత్యక్రీడా కిశోరియునైన శ్రీరాధ శ్రీశ్యామసుందరునితో కలసి విరాజమానయై ఉన్నది. ఆ శ్రీయుగళ చరణ కమల మధురతర జ్యోతిని స్మరింపుము!

**తద్దాసీయూథ ఏతత్సుఘన ఉరుభిదాశ్చర్య వర్ణాకృతి స్రగ్**
**వస్త్రాలంకార తత్తద్రస లలితకలాపార చాతుర్యవృందే**
**సర్వాశ్చర్యాతి నూత్నోత్తమ వయసి మహాశ్చర్య లావణ్యలాస్యే**
**శ్రీరాధాకృష్ణసేవా సుఖభర సతతోత్ఫుల్ల వల్గుస్మితాస్యే 26**

శ్రీరాధాదాసీమణులు శ్రీరాధాకృష్ణులకై విభిన్నములైన ఆశ్చర్యకర వర్ణములతోను, ఆశ్చర్యకరమైన ఆకృతులతోను ఉండుమాల, వస్త్ర, అలంకారాది సామగ్రిని రచించుట అనే ప్రత్యేక విషయములోను; రసమయమైన లలిత కళాచాతుర్యమును ప్రదర్శించుటలోను నేర్పరులు. అంతేకాక వారు సర్వాశ్చర్య జనకమైన, నూతన సుందర అవస్థాయుక్తమైన, లావణ్యపూర్ణమైన లాస్యముతో శ్రీరాధాకృష్ణులను సేవిస్తూ ఉంటారు. ఆ సేవాసుఖము నందు నిరంతరము మృదుమందహాస పూర్ణులై, ప్రఫుల్లిత వదనములతో ఉంటారు. ఘనీభవించిన శ్రీరాధాచరణకమలకాంతి స్వరూపులై ఆ దాసీమణులు శోభిస్తున్నారు.

**స్వాం మూర్తిర్దివ్యకైశోరక లలిత నవస్వర్ణవల్లీ మనోజ్ఞా**
**మానీల స్నిగ్ధవేణీకృత చికుర శిఖాలోల సద్రత్నగుచ్ఛామ్**
**శ్రీమన్నాసాపుటోద్యత్ కనకమణి సమాసక్త దివ్యైక ముక్తామ్**
**సంపూర్ణ స్వర్ణ చంద్రచ్ఛవి ముఖకమలామోద మాధుర్యధారామ్ 27**

(ఆ దాసీ బృందములో) దివ్య, కిశోర, లలితమూర్తులై స్వర్ణకాంతితో మనోహరముగనున్నవారును; గాఢమైన నీలవర్ణముతో స్నిగ్ధమైన వేణి (కేశములు) యొక్క అగ్రభాగములో ఊగుచున్న సుందర రత్నగుచ్ఛములతో ఉన్నవారును; సుందరమైన నాసికపై స్వర్ణమణిఖచితమైన దివ్యమౌక్తికముతో శోభించువారును కలరు. స్వర్ణకాంతిమయమై, పూర్ణచంద్రకాంతితో సమానమైన వారి ముఖకమల సుగంధము యొక్క మాధుర్యము అట ప్రవహించుచున్నది.

**సంవీత స్వర్ణపద్మాద్భుత ముకుల మనోహారి వక్షోజయుగ్మా**
**మత్యంత క్షీణమధ్యాం నవపృథుల మహాసుందర శ్రీనితంబామ్**
**కాంచీమంజీర హారావలి వలయ ఘటా హేమకేయూర రమ్యామ్**
**దివ్యం సూక్ష్మం నిచోలం శిరసి కటితటే చిత్రశాటీం దధానామ్ 28**

గుండ్రని స్వర్ణకమలమునందు అద్భుతమైన మొగ్గల వలె మనోహరమైన వక్షోజములతో వారు (దాసీమణులు) శోభిస్తున్నారు. వారి నడుము భాగము మిక్కిలి సన్నమై ఉన్నది. వారి నితంబములు సుందరముగాను, స్థూలముగాను ఉన్నవి. వడ్డాణము, మంజీరములు, ముత్యాలమాల, సువర్ణ కుండలములతో శోభిస్తున్న శ్రీరాధాదాసీమణులు శిరసుపై పలుచని శాలువను, కటి ప్రదేశముపై విచిత్రమైన చీరను ధరించినారు.

**ఏకైకాంగచ్ఛటాచ్ఛాదిత సకలదిశం దివ్యతాటంక కర్ణామ్**
**కర్ణార్ధేచాతిచిత్రోజ్జ్వల కనకమయం కర్ణపూరం వహంతీమ్**
**ఉన్మీలద్యౌవన శ్రీమధుర మద మహాశ్చర్యలావణ్య లాస్యామ్**
**రాధాకృష్ణానురాగాత్యవశ సపులకోదశ్రు గౌరాంగ వల్లీమ్ 29**

వారు (దాసీ బృందము) తమ అంగాంగముల నుండి ప్రసరిస్తున్న కాంతితో దశదిశలను ఆచ్ఛాదిస్తున్నారు (కప్పివేస్తున్నారు). చెవులకు దివ్యమైన ఆభరణములను; వానికి పైన విచిత్ర, ఉజ్వల, స్వర్ణమయమైన కర్ణాభరణమును ధరించినారు. వికసించిన యౌవన శోభతో, మధుర, ఉన్మద, మహాశ్చర్య, లావణ్యములతో పరిపూర్ణులై శోభిస్తున్నారు. శ్రీరాధాకృష్ణులయందలి పరమ అనురాగముచే వివశులై, పులకితులై, అశ్రుధారలతో తడిసిన గౌరవర్ణలతలతో సమానముగ ప్రకాశిస్తున్నారు.

**సర్వావస్థాసు నిత్యం స్మర సకల కలాపారగాం నర్మనిర్మి**
**త్యంతాశ్చర్య చాతుర్య తిరమితి నిజప్రాణ సర్వస్వ యుగ్మామ్**
**సాంద్రానంద్దైక సారాంబుధి రసవూడితాం ఘోరఘోరాపదామ**
**ప్యాక్రాంతౌ హంత నాహం మమ కృతిరిహతే గేహదేహాదికేఽస్తు 30**

వారు సమస్త కళలలోను నిపుణులు. పరిహాసం చేయటంలోను, అత్యాశ్చర్యకరమైన చాతుర్యం చూపటంలోను నేర్పరులై తమ ప్రాణేశ్వరులైన యుగళ కిశోరులకు అత్యంత ఆనందాన్ని కలిగిస్తూ ఉంటారు. సాంద్రానందమునకు ఏకమాత్రమైన సారసముద్రరసమునందు నిమగ్నులైయుండు శ్రీరాధా దాసీబృందమును సర్వావస్థలలోను నిత్యము స్మరించు! హా! అత్యంత ఘోరతరమైన ఆపదలతో చుట్టివేయబడినా ఈ దేహము, గృహము మున్నగువాని వలన కలిగెడి 'అహం' (నేను), 'మమ' (నాది) అను బుద్ధి ఉండకుండునుగాక!

**యద్యాద్యాం రతిమిచ్ఛసి ప్రియ! పరప్రేమోల్లసత్సుందరా**
**నంద స్యందమహాప్రకర్ష చరమాశ్చర్యావధిం నిర్మలామ్**
**శ్రీవృందావనమేవ సంశ్రయ తదా సర్వాత్మభావేన త**
**చ్ఛుద్ధ ప్రేమరసం కిశోరమిథునం తత్రైవ యద్వ్యజ్యతే** **31**

హేప్రియా! పరమప్రేమ విలాసమయమును, సుందర ఆనందము సంచరించు మహోత్కృష్ట ఆశ్చర్యమునకు చరమసీమయునైన నిర్మల శృంగార రతి (దివ్యశృంగార రసమును)ని పొందవలెనను ఇచ్ఛ ఉన్నదా! అయితే శ్రీబృందావనమునే అన్ని విథముల సర్వార్పణ పూర్వకముగ ఆశ్రయించు! ఎందుకంటే శుద్ధ ప్రేమరసస్వరూపులైన శ్రీయుగళ కిశోరులు అక్కడే సర్వోత్కృష్ట రూపముతో ప్రకటితులై ఉన్నారు.

**హాసం భర్త్సన తాడనాదిషు సదా కుర్వన్ విషాదం న హి**
**గ్రాసస్యాప్యనుపస్థితౌ వ్యవహరల్లోకేఽతి ముగ్ధార్భవత్**
**నైష్కించిన్య మహాధనో నిజగుణానస్థాపయన్ కర్హిచిత్**
**సర్వాంశ్చిద్వపుషో నమన్ ప్రణయతః సేవస్వ వృందావనే** **32**

ఎల్లప్పుడు తాడన భర్త్సనాదులు (తన్నుట, బెదరించుట) ఎదురైనపుడు నవ్వుతూ ఉండు. ఒక్కమెతుకైనా లభించకపోయినా విచారించకు. లోకుల విషయములో ఏమియు తెలియని బాలకుని వలె వ్యవహరించు. అన్నిటి పట్ల అనాసక్తితో ఉండుటయే పరమ ధనముగా తెలిసికో! ఎక్కడ కూడ నీ గుణగణములను ప్రకటించకు. బృందావనములోని సమస్త చిన్మయ స్వరూపములకు ప్రేమపూర్వకముగ నమస్కరించి, సేవించు!

**అంతర్దృష్టాంతపారేంగిత విమల సదానంద సామ్రాజ్య సాంద్ర**
**స్వాదిష్ట జ్యోతిరాద్య ప్రణయరసమహాబ్ధ్యుత్థిత ద్వీపమధ్యే**
**అత్యుచ్చైర్జాజ్వలీతి ప్రతినవసుషమా మాధురీణాం ధురీణా**
**శ్రీమద్బృందాటవీ తామధివస భజ చ జ్యోతిషీ గౌరనీలే 33**

అంతఃకరణములో అనుభవించి తెలుసుకొనుటకు యోగ్యమైనది; పారావారములేని విమల నిత్యానంద సామ్రాజ్యము ఒకటి ఉన్నది. దాని సారఘనము, మిక్కిలి ఆస్వాదనీయమునైన జ్యోతి, ఆజ్యోతి యొక్క శ్రేష్ఠ ప్రణయ రస సాగరము నుండి ఉద్భవించిన ఒక ద్వీపము! అందలి శ్రీబృందావనము నూత్నశోభను, మాధుర్య సారమును ప్రకాశింపజేయుచు దేదీప్యమానముగ ఉన్నది. అట్టి బృందావనములో నివసించు, ఆ గౌరనీల జ్యోతిస్స్వరూపులైన శ్రీయుగళకిశోరులను భజించు!

**కదాపి న గతం క్వచిన్న చ కుతశ్చిదప్యాగతమ్**
**సదా నవ సుయౌవనం స్మర రసైకమగ్నం సదా**
**గుణైరసదృశాధికైర్మధురిమాంత్య సీమాగతమ్**
**హిరణ్య హరినీలరూఢ మిథునమస్తి వృందావనే 34**

వారు (శ్రీరాధా గోవిందులు) ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లరు, ఎక్కడి నుండి ఎప్పుడూ రారు. (అంటే వారు నిరంతరం బృందావనంలోనే ఉంటారు.) నిరంతరం నవయౌవనసుందరులై, సదాస్మరరసైకమగ్నులై, సాటిలేని గుణములతో మాధుర్యమునకు అంతిమ సీమయై ఉంటారు. స్వర్ణవర్ణ ఇంద్రనీలమణి కాంతితో వెలుగుచుండు ఆ శ్రీయుగళకిశోరులు శ్రీబృందావనమందే విరాజితులై ఉంటారు.

**అనంగరససీమని ప్రణయ మాధురీ సీమని**
**స్ఫురత్తరుణిమాంకురద్యుతి సురూపతా సీమని**
**సుసీమని మహాద్భుత స్మరవిలాసవైదగ్ధ్యో**
**ర్మనోऽస్తు వనసీమని క్వచిదపి ధామని** **35**

ఒకరు (శ్రీకృష్ణుడు) శృంగార రసమునకు అవధి, ప్రణయ మాధుర్యమునకు సీమ, స్ఫురించుచున్న తారుణ్యకాంతి కాగా; మరొకరు (శ్రీరాధ) సుందర స్వరూపమునకు సీమ, మహాద్భుత ప్రేమ విలాసమునకు విదగ్ధతకు సీమ! ఆ యిరువురు క్రీడించుచున్న ధామమునందలి ఒకానొక వన ప్రాంతములో (బృందావనములో) నా మనసు లగ్నమైనది.

**రాధామాధవ ముగ్ధ మన్మథ కలా సర్వస్వ కోషం సమ**
**స్తార్థానాం కృతమోషమద్భుత యశో ఘోషం త్రయీమౌలిషు**
**సర్వస్వాశ్రిత పోషణవ్రతముపేతాశేష దోష క్షమా**
**శీలం ప్రేమరసైకజోషణమహో జాగర్తి వృందావనమ్** **36**

ఓహో! శ్రీబృందావనము శ్రీరాధా మాధవుల ప్రేమ కళాస్వరూపమైన సమస్త సంపత్తికి భాండాగారము! సమస్త పురుషార్థములకు ప్రధాన ఆధారమైన ఋక్ యజుస్సామవేదములు శ్రేష్ఠగుణములలో శ్రీధామము యొక్క అద్భుత యశస్సును వర్ణించినవి. ఆశ్రయించిన జీవులకు సర్వము నిచ్చి వారిని పాలించు

వ్రతము కలది, సమస్త దోషములను క్షమించునది, ప్రేమరసమునందు ప్రీతి కలది అయిన శ్రీబృందావనము శోభించుచున్నది.

**యత్రైవాఖిల కార్యకారణ కథాప్యత్యంతమస్తంగతా**
**యత్రాత్మప్రభవైభవం న చ చిదానందాత్మకం భాత్యహో**
**కృష్ణప్రేమ రసాత్మ సర్వవిభవైర్మాధుర్య సారైర్యుతమ్**
**శ్రీవృందావన నామధామ తదిదం వర్తర్తి సర్వోపరి 37**

శ్రీబృందావనములో సమస్తమైన కార్యకారణముల కథ పూర్తిగా లయించిపోతుంది. అట స్వీయకాంతి వైభవము, చిదానందాత్మకమైనది ఏది కూడ ప్రకాశింపదు. మాధుర్యసారము, కృష్ణప్రేమరసాత్మక వైభవయుక్తమునైన ఆ బృందావన నామక ధామము సర్వోపరిగా విరాజమానమైయున్నది.

**యద్భాసా సకలం విభాతి చిదచిద్ద్వైతం యదత్యద్భుత**
**ప్రేమానంద మహారసైక జలధేర్బిందోర్లవేన ప్రియమ్**
**యత్సత్తామనుసత్త్వయోగి సకలం యన్మాధురీ వైభవా**
**శ్చర్యాణామణుమాత్ర పాత్రమఖిలం వృందావనం తన్నుమః 38**

శ్రీబృందావన కాంతిచే చేతన, జడ వస్తువులు రెండును ప్రకాశిస్తున్నాయి. శ్రీధామము యొక్క అత్యద్భుత, ప్రేమానంద, మహారససాగర బిందువునందలి లవలేశము కూడ జగత్తునకు ప్రియమైనది. ఆ శక్తి (సత్తా) యందు సమస్త శక్తులు గుదిగూర్చబడి ఉన్నాయి. అఖిల జగత్తు బృందావనము యొక్క ఆశ్చర్య, మాధుర్య, వైభవాదుల అణుమాత్రమునకు పాత్రమై ఉన్నది. (అనగా సమస్త జగత్తులు బృందావన మహారస వైభవములోని అణుమాత్రమును పొందగలవేమో అని భావము.) అట్టి బృందావనమునకు నమస్కరిస్తున్నాను.

**ఆశ్చర్యానంత శక్తి శ్రిత పదకమలచ్ఛాయయాశ్చర్య లీలా**
**మాధుర్యౌఘైః సమాప్లావిత నిజ సుమహాభావ నిర్భగ్నసేతుః**
**గౌరశ్యామం కిశోరద్వయమతి మధురానంగ రంగేణ దివ్యమ్**
**యత్రానాద్యంత కాలంనయతి శరణదా సాస్తు వృందాటవీ మే 39**

శ్రీశ్యామాశ్యాములు ఆశ్చర్యకరములు, అనంతశక్తి యుతములునైన తమ చరణకమలముల ఛాయ (నీడ) తోను; ఆశ్చర్యమయము, లీలామాధుర్య ప్రవాహమయమునైన తమ మహాభావముతోను జగత్తును సమాచ్ఛాదనము చేయుచున్నారు. (కప్పివేయుచున్నారు.) అతిమధుర శృంగారమూర్తులైన గౌరశ్యామ యుగళ కిశోరులు అనాదిగా, అనంతకాల పర్యంతము క్రీడించుచున్న ఆ శ్రీబృందావనము నాకు శరణమునిచ్చునుగాక!

**రాగద్వేషాద్యనర్థం జహి జహి భగవన్నామమాత్ర ప్రతాపాత్**
**ద్వైతం దేహాది విస్మారయ సకలమథ స్ఫోరయేస్తుర్య తేజః**
**తద్విస్మార్యాథ సందర్శయ మధురమహస్తద్రహస్యద్భుతౌ ప**
**శ్యావిష్కృత్యాథ వృందావనముపనయ మే నాగరౌ గౌరనీలౌ 40**

భగవంతుని నామమాత్రపు ప్రతాపము చేతనే రాగద్వేషాది అనర్థములను త్యజించు, దేహాదుల యొక్క సమస్త ద్వంద్వ విషయములను మరచిపో! ఇక, తురీయ తేజస్సు నుండి స్ఫూర్తిని పొందు, ఆపై దానిని మరచి ఆ తురీయ తేజస్సునకు మధ్య రహస్య స్థలమునందున్న అనిర్వచనీయ మధుర జ్యోతిని దర్శించు. దానియందున్న అద్భుతమైన శ్రీబృందావనమును ధ్యానించి, సాక్షాత్తు గౌరనీల యుగళ నాగరులను (శ్రీరాధాకృష్ణులను) దర్శించు!

**భీభత్సే విషయే నిరంకుశమసావాత్మేంద్రియైర్ధావతి**
**క్వాప్యాప్నోతి సుఖస్య గంధమపి నాత్యంధస్తథాప్యున్మదః**
**వాధిర్యంగురు శాస్త్ర మిత్ర వచనేష్వాశ్చర్యమేతి శ్రుతి**
**ద్వంద్వం మందమతిః కదా ను శరణం విందామి వృందాటవీమ్ 41**

బీభత్సమైన విషయాలలో అడ్డులేకుండ దేహము, ఇంద్రియాలతోపాటు పరుగుతీస్తున్నాను. ఎక్కడ కూడ సుఖమును వాసనా మాత్రముగనైన పొందుట లేదు. మిక్కిలిగా అంధుడనై కూడ అత్యంత ఉన్మత్తుడినౌతున్నాను. ఆశ్చర్యమేమిటంటే గురు, శాస్త్ర, మిత్ర వచనముల పట్ల నేను బధిరునివలె (చెవిటివాని వలె) ఉంటున్నాను. హా! మందమతినైన నాకు శ్రీబృందావనము ఎప్పుడు ప్రాప్తిస్తుంది ?

**దుఃఖైర్ఘోరతమైర్ధ్రువం పరివృతం యస్యాది మధ్యాంతిమమ్**
**యోఽత్యంతాశు వినశ్వరోఽతి నిరతా యత్రాపి విట్ శూకరాః**
**విణ్మూత్రాది మలం క్షరత్యవిరలం ద్వారైర్ముహుర్వీక్ష్యతే**
**తాదృగ్భోగమహాస్పృహాం కువిషయే మాం త్రాహి వృందాటవి 42**

ఘోరతమమైన దుఃఖములచేత (మానవుని యొక్క) ఆదిమధ్యాంతములు చుట్టి వేయబడి, శీఘ్రముగ వినాశనమును పొందుతూ ఉంటాడు. మలిన పదార్థాలను భుజించే పంది దేనికై ఆశగొని ఉంటుందో, ఏ ద్వారముల నుండి మలమూత్రాదులు నిరంతరము వెలువడుతూ ఉంటాయో – హా! దానినంతటిని మాటిమాటికి చూస్తూ కూడ, నేను చెడు విషయాలను భోగించవలెనని ఎంతగానో కోరుకుంటున్నాను. హే బృందావనమా! నన్ను రక్షించు!

**ప్రేమ్ణా వృందావనస్య త్యజతి యది జనౌ మాదృశః సర్వధర్మాన్**
**నిర్మాత్యేవాపరాధాన్ యది తు భగవతో దుర్నివారేంద్రియౌఘః**
**తేన స్యాద్వాస విఘ్నో యది భవతుతరాం కృష్ణ సత్ప్రేమ సీమ**
**శ్రీమద్బృందావనం మాం కిము నిజకృపయా నావితా యత్ర కుత్ర 43**

శ్రీబృందావనము నందు ప్రేమ గల మావంటి వారు సర్వధర్మాలను త్యజించినను, నివారించుటకు వీలుకాని ఇంద్రియములు ఒకవేళ భగవంతుని పట్ల అపరాధములు చేసినను, బృందా నివాసమునకు విఘ్నము వచ్చినను –

అన్నియు ఇట్లు జరిగిన జరుగనీ! కాని, శ్రీకృష్ణప్రేమకు చరమసీమను పొందిన ఆ శ్రీబృందావనము, నేను అక్కడ ఉన్నను, ఇక్కడ ఉన్నను నన్ను రక్షింపదా ఏమి?

అనగా ఇంద్రియములకు వశమై చరించినను, భగవంతుని పట్ల అపరాధములు చేసినను, బృందానివాసమునకు భంగము వచ్చినను, బృందావనముపై ప్రీతితో ఉన్నవారిని ఆధామము రక్షించునని భావము!

**కేచిత్కుర్వంతి విష్ణోర్భజనమనుదినం కేచన ధ్యానయోగా**
**ద్యన్యే కర్మాణి కేచిద్ధన సుత వనితాద్యేషు నిత్యం సజంతి**
**శ్రీరాధాకృష్ణ నిత్యోన్మద సురతకలారంజితోదార కుంజే**
**ప్రేమ్ణైకాంతేన వృందావిపినమధివసంస్తేషు కోఽహం న జానే 44**

శ్రీరాధాకృష్ణులకు నిత్యము ఉన్మత్తతను కలిగించు శృంగార కళలచే రంజితమైన ఉదార కుంజలో ఎవరెవరు ప్రతిదినము విష్ణుభజన చేస్తూ ఉంటారో, ఎవరెవరు ధ్యాన యోగాదులను అనుష్ఠిస్తూ ఉంటారో, ఎవరెవరు యజ్ఞాది కర్మలను చేస్తూ ఉంటారో, ఇంక ఎవరు ధన, పుత్ర, స్త్రీలయందు ఏకాంతములో ఆసక్తితో ఉంటారో! కాని, వారిలో ఏ భాగ్యశాలి ఏకాంతముగ ప్రేమతో శ్రీబృందావన వాసము చేస్తున్నాడో, వానిని నేను ఎరుగను! (అట్టివారు గుప్తముగ ఉందురని భావము).

**నిస్త్రైగుణ్యం స్ఫురతి కిమపి జ్యోతిరానంద సాంద్రమ్**
**తస్యాత్యంతః ప్రణయ విభవం జ్యోతిరాభాతి కార్ష్ణమ్**
**తస్యాప్యంతర్మధుర మధురం జ్యోతిరస్త్యత్ర వృందా**
**రణ్యం తస్మిన్ భజ రసఖనీ గౌరనీలౌ కిశోరౌ 45**

సత్వరజస్తమోగుణములకు అతీతముగ ఒకానొక సాంద్రానంద జ్యోతి స్ఫురిస్తున్నది. దాని కన్నను మిక్కిలి ఆవల ప్రణయవైభవమయమైన కృష్ణవర్ణ

జ్యోతి ప్రకాశిస్తున్నది. దానికి మధ్య మధురాతి మధురమైన శ్రీబృందావనీయ జ్యోతి వెలుగుతున్నది. అందు విరాజమానులైన రసఖాని (రసమునకు గని) గౌరనీల శ్రీయుగళ కిశోరులను సేవించు!

**నింద్యాత్మోచిత నిందనే హి న మనాజ్ మ్లానోఽపరాధ్యాత్మనో**
**దండేఽకాకుపరోఽవజానతి పరే మత్వాధర్మం స్వం స్థిరమ్**
**దూరాద్దుర్గతవత్ స్థితోఽఖిల జనస్యానుగ్రహార్థీ సదా**
**హీనోఽహం శ్వశృగాలవత్ సుఖఘనే స్థాస్యామి వృందావనే 46**

నిందింపతగిన నా స్వభావం వలన అందుకు ఉచితమైన నిందను పొందటంలో నామనసుకి కొంచెమైనను మాలిన్యం కలుగకుండ, అపరాధి అయిన శరీరం దండింపబడినా దుఃఖం చెందకుండ, ఎవరి వల్లనైనా అవమానం జరిగినా దానిని నా తప్పుగానే పరిగణిస్తూ, దూరంగా దుర్గము (కోట) వలె ఉండి నిత్యం అందరి కృపకై ప్రార్థిస్తూ కుక్కవలె, నక్కవలె హీనుడినై నేను శ్రీబృందా నివాసము చేస్తాను.

**ఘోరామాపదమత్ర సంపదమివావజ్ఞాం చ సన్మానవ**
**న్నిందాం సంస్తువవత్ సఖీనివ రిపూన్నైః స్వం మహామూర్తిమత్**
**మాత్సర్యాణి సుమిత్రతామివ హృదాగృహ్ణన్ మహాదుర్లభ**
**శ్రీరాధా మురలీధరాంఘ్రి రసదే స్థాతాస్మి వృందావనే 47**

ఘోర ఆపదలను సంపదతో సమానంగాను, అవమానమును గౌరవముగాను, నిందను స్తుతిగాను, శత్రువులను బంధువులుగాను, నిఃస్వ అవస్థను మహామూర్తిధారివలెను నా విషయంలో ఇతరులు చూపించే అసూయను మిత్ర సమానంగాను హృదయంలో నిలుపుకొని; శ్రీరాధాకృష్ణుల చరణకమలముల యొక్క మహాదుర్లభమైన రసమును అనుగ్రహించు శ్రీబృందావనంలో నివసిస్తాను.

**శ్రీవృందావన వందనాయ సతతం మూర్ధాస్తు బహ్వాదరో**
**జిహ్వా విహ్వలతాముపైతు సతతం తత్సద్గుణోత్కీర్తనే**
**హస్తౌ తన్నవకుంజ మార్జనవిధౌ పాదౌ చ తత్రాటనే**
**శ్రోత్రే తన్మహిమ శ్రుతౌ దృశిదృశౌ నిత్యం స్మృతౌ స్తాన్మనః 48**

నా శిరస్సు అత్యంతాదరముతో నిత్యము శ్రీబృందావనమునకు నమస్కరించునుగాక! ఆ సద్గుణములను ఉచ్చైస్వరముతో కీర్తించుటలో నా జిహ్వా విహ్వలమగునుగాక! శ్రీధామమునందలి నవకుంజలను మార్జనము (ఊడ్చుట) చేయుటలో రెండు చేతులు, బృందావన పరిక్రమ చేయుటలో కాళ్లు, ఆ మహిమను వినుటలో చెవులు, ధామమును దర్శించుటలో నేత్రములు, స్మరించుటలో నా మనసు నిత్యము లగ్నమై ఉండునుగాక!

**సమస్త సుభగాద్భుతం సకలమంగళాత్యద్భుతమ్**
**చిదాత్మ సకలోజ్జ్వలాద్భుతమశేష రమ్యాద్భుతమ్**
**సమస్త వరదాద్భుతం సకల కృష్ణధామాద్భుతమ్**
**తదేతదఖిలాద్భుతం భజ రసేన వృందావనమ్ 49**

సమస్త సౌభాగ్యముల చేత అద్భుతము, సమస్త మంగళములచేత అద్భుతము, సమస్త చిన్మయ వస్తువుల చేత అద్భుతము, సమస్త రమణీయత చేత అద్భుతము, సమస్త వరదానముల చేత అద్భుతము, శ్రీకృష్ణుని సమస్త ధామములయందును అద్భుతము, ఇక్కడి సమస్తము అద్భుతమే! కనుక ఈ శ్రీబృందావనమును భావసహితముగ సేవించు!

బృందావనమునందలి సమస్తము అద్భుతమే అని తాత్పర్యము!

**కలింద సుతయా యుతం ప్రణయ మాధురీ ధారయా**
**ప్రవృద్ధ సుఖచంద్రికా జలధి ఫుల్లవల్లీ ద్రుమమ్**
**కపోత శుక శారికా పిక మయూరకాలంకృతమ్**
**భ్రమద్భ్రమరఝంకృతం జయతి ధామ వృందావనమ్ 50**

ప్రణయ మాధుర్య ధారను ప్రవహింపజేయు యమునా నదిచే శోభితమైనది; సుఖ చంద్రికా సముద్రమును వృద్ధిచేయు వికసిత లతావృక్షాదికముచే పరివేష్టితమైనది (చుట్టివేయబడినది); పావురములు, చిలుకలు, సారికలు, కోకిలలు, నెమళ్లచే అలంకృతమైనది; ఇటునటు భ్రమించుచున్న భ్రమరముల ఝంకారముతో ప్రతిధ్వనించునదియునైన శ్రీబృందావనమునకు జయమగునుగాక!

**మహాజ్యోత్స్నారూపైః పరమ పరమానంద సుఘనై**
**ర్మహా మాధుర్యాణామివ పరమ సారేణ ఘటితైః**
**పరీణామైః ప్రేమ్ణామివ నవనవాశ్చర్య కుసుమా**
**ద్యుపేతైః శాఖీంద్రైః స్మర సుభగ వృందావన వనమ్ 51**

అతి పరమానంద ఘన మహాజ్యోత్స్నా రూపముతో విస్తరించినది, మహామాధుర్య రాశి యొక్క పరమ సారముచే నిర్మితమైనది, ప్రేమ పరిపాకము చేతనే తెలియదగిన నవనవ ఆశ్చర్యకర సుమములతో కూడిన వృక్షములచే శోభితమైనది, సుందరమైన తులసి వనములతో కూడినది అయిన శ్రీబృందావనమును స్మరింపుము!

**కృష్ణప్రేమరసం సదా రసయతే వృందావనాంతర్గతమ్**
**చేతః స్థాస్ను చరిష్ణు చిద్ఘన మహోరూపం తవాపీదృశమ్**
**ఏవంచేన్న హి భాతి తద్గురు ముఖాచ్ఛ్రుత్వా సదా చింతయ**
**న్నారబ్ధాంత మిహావసాతి సహసా స్వాదిష్యసే స్వం రసమ్ 52**

శ్రీబృందావనములో నివసించు వ్యక్తి యొక్క మనసు నిరంతరము శ్రీకృష్ణప్రేమ రసమును ఆస్వాదిస్తూ ఉంటుంది. ఇక్కడి సమస్త స్థావర జంగమ వస్తువులు చిద్ఘన జ్యోతిస్స్వరూపములు! నీకు చెందినవన్నియు (నీవు కూడ) అదే స్వరూపము! ఒక వేళ నీవు ఈ ప్రకారముగ ఉండకపోతే సద్గురుని ముఖతః

ఈ విషయమును విని, నిరంతరము చింతించు! ప్రారబ్ధము పూర్తియగు వరకు ఇక్కడ నివసించు. అనుకోకుండ (హఠాత్తుగ) నీవు ఈ రసమును ఆస్వాదింపగలుగుతావు.

**నిరస్త త్రైగుణ్యం హరిరసద పుణ్యం స్వకృపయా**
**ధరణ్యంతర్భాతం విమల పరమానంద సుఘనమ్**
**ఇదం వృందారణ్యం వహదతుల మాధుర్యసుషమా**
**మహావన్యం ధన్యః శ్రయతి బహుమాన్య స్త్రిజగతామ్ 53**

శ్రీధామము సత్వరజస్తమోగుణములకు ఆవలనున్నది, హరిరస దాయినియైనది, పుణ్యజనకమైనది, నిజకృపతో భువిపై ప్రకటితమైనది. విమలమైన పరమానంద ఘన స్వరూపము, సాటిలేని మహామాధుర్య సుఖసారము, మహారణ్య సదృశమునైన శ్రీబృందావనమును ఏ భాగ్యశాలి ఆశ్రయిస్తాడో అతడే మూడు లోకాలలోను గౌరవింపబడుతాడు.

**సాంద్రానందాబ్ధిమధ్యే లసతి రసమయం చిన్మణిద్వీపమేకమ్**
**వృందారణ్యం తదంతః స్ఫురతి పురుచమత్కారి వైచిత్ర్యధామ**
**తత్రైవేకాంతరత్యా నివస నను సఖే క్వాపి కుర్యా న ఖేదమ్**
**వేదాంతానాం సుదూరం కిమపి హరిజనాలభ్యమప్యత్ర లభ్యమ్ 54**

సాంద్రానంద సముద్రమునందు అత్యంత రసమయమైన ఒక మణిద్వీపము శోభిస్తున్నది. దానిలోపల అతిచమత్కారకారియైన, విచిత్రమైన శ్రీబృందావన ధామము విరాజితమై ఉన్నది. హే సఖా! ఈ ప్రదేశములో ఏకాంతభావముతో వసించు. అట ఎట్టి కష్టమును కలుగనీయవద్దు. ఎందుకంటే, వేదాంతులకు బహుదూరములో ఉన్నట్టి, హరిభక్తులకు కూడ అలభ్యమైనట్టి ఒకానొక అనిర్వచనీయ వస్తువు (శ్రీరాధ) అక్కడ ఉన్నది.

**శశ్వన్న్యస్తం వపుషి పరమ ప్రేమ హృష్టాలివృందై**
**స్త్రోటం త్రోటం మిథ ఉరు మదాన్మాల్య హారాంబరాది**
**అత్యుద్వేల స్మరజలనిధీ హాసయంతౌ ముహుస్తౌ**
**వృందారణ్యే స్మర రతికలా నాగరౌ తౌ కిశోరౌ 55**

ప్రియా ప్రియతములు ఒకరి మాలా, హార, వస్త్రాదికములను మరొకరు పరమానందముతో తుంపులు తుంపులుగ చేయుచుండ; సఖీబృందము హర్షాతిశయముతో వానిని పునః పునః వారికి ధరింపజేయుచున్నారు. అవధులు లేని ప్రేమసాగరులైన శ్రీయుగళ కిశోరులు మాటిమాటికీ సఖీమణులతో హాస్యమాడుచున్నారు. శ్రీబృందావనములో ఇట్టి స్మరకళానాగరులైన శ్రీయుగళమును స్మరింపుము!

**ఉచ్చావచా విగణిత బ్రహ్మాండావలి మండితామ్**
**త్రిగుణాం ప్రకృతింతీర్త్వా జడదుఃఖానృతాత్మికామ్ 56**

**అపారావార విస్తారమేకమానంద సాగరమ్**
**స్వప్రకాశ మహాస్వచ్ఛ జ్యోతీరూపం పరంపదమ్ 57**

అనేకములైన అగణిత బ్రహ్మాండములతో కూడినట్టి; జడ, దుఃఖ, మిథ్యా స్వభావము కలిగినట్టి త్రిగుణాత్మకమైన ప్రకృతిని దాటిన తరువాత; పారావారములేని, విస్తృతమైన ఒక ప్రేమానంద సాగరము ప్రకాశిస్తూ ఉంటుంది. అది స్వయం ప్రకాశకమైనది. అది మహాస్వచ్ఛము, జ్యోతిస్స్వరూపము, అతి ఉత్కృష్ట స్థానమునైన శ్రీబృందావనము! (56, 57)

**చైతన్యమాత్ర నిర్భాసం నిస్తరంగం నిరాకులమ్**
**నిరస్తాజ్ఞాన తత్కార్యం పరం బ్రహ్మేతి యద్విదుః 58**

ఏది చైతన్యమాత్రం చేతనే భాసిస్తుందని చెప్పటానికి వీలులేనిదో, నిస్తరంగమైనదో, చంచలత్వములేనిదో, అజ్ఞానము అజ్ఞాన కార్యములు లేనిదో అది పరబ్రహ్మమని తెలుస్తున్నది.

**తదంతః పరమాశ్చర్యం జ్యోతిరైశం విచింతయ**
**చర్వణీయ మహానంద సాంద్రాబ్ధిమతి నిర్మలమ్ 59**

దానికి పైన (పరబ్రహ్మమునకు పైన) పరమాశ్చర్యకరమైన ఈశ్వరజ్యోతిని చింతించు. అది మిక్కిలి ఆస్వాదనీయము, నిర్మలమునైన మహానంద ఘన సముద్ర స్వరూపము!

**మహాసువిస్తీర్ణతమం మహోజ్జ్వల తమం పరమ్**
**లోకాదిభిర్ఘనీభావైర్మహితం మహదద్భుతమ్ 60**

ఆ ఈశ్వరజ్యోతి అత్యంత విస్తృతము, పరమమహాఉజ్వలతమము, మహాద్భుతమునైనది. శ్రేష్ఠములైన లోకములన్నియు కూడ దానిని స్తుతించు చుండును.

**తదంతరే తతోఽప్యత్యాశ్చర్యం జ్యోతిరనుస్మర**
**కార్ష్ణ్యం మహాస్వచ్ఛతమం పారావార వివర్జితమ్ 61**

ఆ ఈశ్వరజ్యోతి కన్నను పరమునందు దానికన్న అధిక ఆశ్చర్యజనకమైయున్న జ్యోతిని స్మరింపుము. అది కృష్ణ వర్ణములో నుండి, మహాస్వచ్ఛతమమై, అవధిలేనిదై యుండును.

**మహాదీప్తం మహారమ్యం మహామోహనమద్భుతమ్**
**మహాప్రేమాతి సౌందర్యం మహానంద రసోత్సవమ్ 62**

అది మహాకాంతిమంతము, మహారమణీయము, మహామోహనము! మహాప్రేమతో కూడిన అత్యంత సుందరమైనది, మహానందకర రసోత్సవ పూర్ణమునైనది.

**తతో దూరాంతరే జ్యోతిః సర్వాశ్చర్యోచ్చతావధి**
**సర్వోజ్జ్వలాతి సుమహోజ్జ్వలం సర్వోత్తమోత్తమమ్ 63**

దానికన్న కూడ మిక్కిలి ఆవల సర్వాశ్చర్యకర స్థితికి చరమ స్వరూపమైన జ్యోతి ప్రకాశించుచున్నది. అది ఉజ్వలమైన సమస్త వస్తువుల కన్నను మహా ఉజ్వలతమమైనది. అది సర్వోత్తమమైనది.

**మహావైమల్య సీమాంతః పరానంద పరావధిః**
**కృష్ణప్రేమరసర్ధీనాం చరమః పరమోదయః 64**

అది మహా నిర్మలత్వమునకు చరమసీమ, పరమానందమునకు శేష సీమ! కృష్ణప్రేమరసము యొక్క సమస్త సంపత్తికిని అదియే చరమోదయము!

**కామాన్య రసమాత్రేయత్ స్పర్శ నిత్యవివర్జితమ్**
**మహా శుద్ధ కామబీజ రాజాత్మాత్యున్మదం రసమ్ 65**

అది నిత్యప్రేమ తప్ప అన్యరసముల స్పర్శ లవలేశము కూడ లేనిది. మహావిశుద్ధమైన కామబీజ రాజాత్మకము, అత్యున్మదము, రసమయమునైనట్టిది.

**తదంతస్తద్ఘనం భాతి శ్రీవృందావనం వనమ్**
**పూర్ణమాధుర్య సామ్రాజ్యం పూర్ణానంద చమత్కృతి 66**

దానికి (ఆకృష్ణవర్ణజ్యోతికి) మధ్య శ్రీమద్బృందావనీయ ఘన వనము భాసిస్తున్నది. అది పూర్ణమాధుర్య సామ్రాజ్యము, పూర్ణ చమత్కారదాయిని!

**పూర్ణాతి పూర్ణ మధుర ప్రకాశం పూర్ణసద్రసమ్**
**సర్వసౌభాగ్య పూర్ణ ద్రులతా ఖల మృగాదికమ్ 67**

ఆ శ్రీబృందావనము పూర్ణాతి పూర్ణమైన, మధురమైన ప్రకాశము కలది. అది పూర్ణరసయుక్తమై; సర్వసౌభాగ్యపూర్ణమైన వృక్షములు, లతలు, పశువులు, పక్షులు మున్నగు వానితో శోభిస్తూ ఉంటుంది.

**వాపీ కూప తడాకాద్యైః ప్రేమానంద రసాత్మభిః**
**చింతామణిమయైర్దివ్యైః కేలిశైలైః స్వలంకృతమ్ 68**

అది (బృందావనము) ప్రేమానంద రస విశిష్టములైన బావులు, నూతులు, తటాకములు మున్నగువానితో శోభిస్తున్నది. ఇంకను, చింతామణులతో కూడిన దివ్యాతిదివ్యకేళీ పర్వతాదులతో సుందరముగ అలంకృతమైనది.

**దివ్యకాంచన చిద్రత్న స్థలీభిరతి భాస్వరమ్**
**జ్యోతిర్మయైర్లతావృక్షైర్నిత్యోద్యత్పుష్ప పల్లవైః 69**

అది (బృందావనము) దివ్య కాంచనమయమైన, చిత్స్వరూపమైన రత్న స్థలములతో మిక్కిలి కాంతిని ప్రసరింపజేస్తున్నది. నిత్యము పుష్పపల్లవాదులతో కూడిన జ్యోతిర్మయ వృక్షలతాదులతో భూషితమైయున్నది.

**అసంఖ్యఫలవత్ వృక్షైరానంద ఘన మూర్తిభిః**
**ఖేలత్ఖగ కూలైర్మత్తైః కృతకోలాహలోత్సవమ్ 70**

అచట ఆనందఘనమూర్తియైన, అసంఖ్యాక ఫలములతో కూడిన వృక్ష సమూహము క్రీడాపరాయణోన్మత్తమైన పక్షుల కోలాహల పూర్వక ఉత్సవముతో ప్రతిధ్వనిస్తున్నది.

**ఇతస్తతో మదాంధాలి మాలా మధుర ఝంకృతమ్**
**ప్రతిపల్లవ పుష్పోరుధార స్యంది మరందకమ్ 71**

శ్రీబృందావనములో ఇటునటు సంచరిస్తున్న ఉన్మత్త భ్రమరములు మధురమైన ఝుంకారము చేస్తున్నాయి. ప్రతి పల్లవము, ప్రతిపుష్పము మధుధారను ప్రవహింపజేస్తున్నాయి.

**ప్రోత్సర్పద్భిః ప్రతిదిశం పరాగపటలైర్యుతమ్**
**కుంజ పుంజైర్మహాశ్చర్యై రసపుంజైరివాద్భుతమ్ 72**

అది (బృందావనము) అన్ని దిక్కులలోను ఎగసిపడుతున్న పరాగముతో శోభిస్తున్నది. మహాశ్చర్య పూర్ణములైన కుంజలు రస పుంజములతో సమానమై అత్యద్భుతముగ ఉన్నవి.

**స్థలీషు యూథశో మత్తమయూర కృత తాండవమ్**
**రసాలముకులోన్మత్త కోకిలోద్గీత పంచమమ్ 73**

శ్రీబృందావన భూమిపై గుంపులు గుంపులుగా మయూరాలు తాండవ నృత్యం చేస్తున్నాయి. మామిడి చివుళ్లను ఆస్వాదించి ఉన్మత్తమైన కోకిలలు ఉదాత్తపంచమ స్వరములో గానం చేస్తున్నాయి.

**ప్రఫుల్ల దివ్య కల్హార కమలోత్పల జాతిభిః**
**హంస సారస చక్రాంగ కారండవ కులాకులైః 74**

వికసించిన దివ్య కల్హార, కమల, కలువ మున్నగు విభిన్నజాతి పుష్పములతో (బృందావనము) శోభిస్తున్నది. హంస, సారస, చక్రవాక, కారండవాది పక్షులతో పరివ్యాప్తమై ఉన్నది. (వ్యాపించినది).

**సరిత్సరోభిః సుస్వచ్ఛ పరానందామృతాంబుభిః**
**రత్నబద్ధతటైర్దివ్యైర్మణి సోపాన శోభిభిః 75**

సుందరమైన, స్వచ్ఛమైన, పరమానందామృతము వంటి జలములతో పూర్ణములైన నదులు, సరోవరములు మున్నగువానితోను, దివ్యమణిమయ సోపానములతో కూడిన రత్ననిబద్ధములైన తీరములతోను శ్రీబృందావనము భూషితమైనది.

**కాలింద్యా చ మహానంద రసపీయూషధారయా**
**స్వర్ణరత్నమయానేక దివ్యపద్మోత్పలాఢ్యయా 76**

మహానందకరమైన, రసామృతధారా ప్రవాహమైన యమునా నదిలోని అనేక స్వర్ణ రత్నమయ దివ్య కమలములతోను, కలువలతోను బృందావనము శోభిస్తున్నది.

**ద్విజాలికుల సన్నాదదత్త శ్రవణ సౌఖ్యయా**
**దివ్యకోమల కర్పూర పరాగోజ్జ్వల బాలుకైః 77**

అట పక్షిగణములు, భ్రమరములు చేయుచుండు సుందరనాదము చెవులకు సుఖమునిస్తుంది. దివ్యము, కోమలము, కర్పూర పరాగము వంటి ఉజ్వలమైన ఇసుకతో పరివ్యాప్తమై ఉంటుంది.

**రమ్యయా పులినైః స్వచ్ఛః సంతోషాసార వర్షిభిః**
**తత్రాశ్చర్యా కుంజవాటీ కాచిదత్యంత మోహినీ 78**

అట స్వచ్ఛ, సంతోషామృత వర్షణకారియైన శ్రీయమునాజీ యొక్క రమణీయ తీరమునందు అత్యంత మోహనమైన, ఆశ్చర్యజనకమైన ఒక కుంజవాటి శోభిస్తున్నది.

**అత్యంతాద్భుత వైచిత్ర్యా శ్రీమద్బృందావనోజ్జ్వలా**
**యత్రత్యం సర్వమాశ్చర్యం రససారైక దీపకమ్ 79**

అత్యంత అద్భుతము, విచిత్రమునైన శ్రీబృందావనములో కుంజవాటి ప్రకాశిస్తున్నది. అచటి సమస్త వస్తువులు ఆశ్చర్యమును కలిగిస్తూ, రససారాన్ని ఉద్దీప్తం చేస్తూ ఉంటాయి.

**కామబీజ విలాసాత్మ సర్వసార సుఖాకరమ్**
**యత్ర శ్రీరాధికా కృష్ణౌ సర్వసుందర సుందరౌ 80**

అచట కామబీజ విలాసాత్మకులు, సర్వసార స్వరూపులు, సుఖప్రదాతలు, సుందర సుందరులునైన శ్రీరాధాకృష్ణులు విరాజమానులైనారు.

**సహజాశ్చర్య కైశోరవయః శ్రీవిశ్వమోహనౌ**
**మహావిమల కందర్పరసోన్మాద నిరంతరౌ 81**

వారు స్వాభావికమైన, ఆశ్చర్యకరమైన కిశోర వయస్కులు! తమ రూప సౌందర్యముతో విశ్వమును మోహింపజేస్తారు. మహావిమలమైన అనంగ రసములో నిరంతరము ఉన్మత్తులైయుండు శ్రీరాధాకృష్ణులు అట విరాజమానులైనారు.

**మహాదివ్యతమ స్నిగ్ధ గౌరశ్యామ తనుచ్ఛవీ**
**ఏకైకాంగోచ్ఛలత్ స్వచ్ఛటౌఘచ్ఛన్న దిక్చయౌ 82**

వారి అంగకాంతి మహాదివ్యతమము, స్నిగ్ధము, గౌర శ్యామ వర్ణరంజితమునై యుండును. వారి ఒక్కొక్క అంగమునుండి స్వచ్ఛ స్వచ్ఛములైన కాంతి సమూహములు ఎగసిపడుచు అన్ని దిక్కులను ఆచ్ఛాదించుచుండును (కప్పి వేయును).

**మహామోహన దివ్యాంగ కాంతి లీనాఖిల ద్వయౌ**
**లావణ్యసార సర్వస్వ దివ్యాంగ వలనాద్భుతౌ 83**

సమస్త వస్తువులు మహామోహనమైన శ్రీయుగళ దివ్య అంగ కాంతిలో లీనమైపోయాయి. అద్భుతమైన వారి దివ్య అంగములు సమస్త లావణ్యసారము చేత చుట్టివేయబడినాయి.

**అసమోర్ధ్వ మహాశ్చర్య సౌందర్యాపార వారిధీ**
**పరస్పరాత్యమర్యాద వర్ధిష్ణు ప్రేమసాగరౌ** **84**

శ్రీయుగళము సాటిలోని మహాశ్చర్యకరమైన అపార సౌందర్య సాగరము! వారు ఒకరిపట్ల మరొకరు అవధులు లేని భావము చేత వృద్ధి చెందుచున్న ప్రేమసాగరము నందు నిమగ్నులై ఉన్నారు.

**సదోన్మదానంగ రసఘూర్ణ మానాఖిలాంగకౌ**
**రత్యావేశవశ భ్రామ్యత్సర్వాంగోత్పులకావలీ** **85**

ఇరువురి యొక్క ప్రత్యంగము నిత్య ఉన్మత్తమైన అనంగ రసమునందు ఘూర్ణమానము (తరంగితము) ఔతున్నది. ప్రేమావేశవశము చేత వారి సర్వాంగముల యందు పులకరింతలు ఏర్పడినవి.

**ఖేలంతావత్యవిచ్ఛిన్న ప్రోన్మదానంగ కేలిభిః**
**అన్యోన్య సహితానంగ క్రీడాన్యాస్పర్శి మానసౌ** **86**

అత్యంత అవిచ్ఛిన్నమైన భావముతో నిరంతరము ఉన్మత్త అనంగ కేళీవిలాసాదులతో శ్రీయుగళ కిశోరులు క్రీడిస్తున్నారు. అందలి బిందుమాత్రము కూడ ఇతరులకు హృదయగమ్యముకాదు. (ఆ దివ్యకేళిని ఎవరును ఎంత మాత్రము తెలిసికొనలేరని భావము.)

**పరమాశ్చర్య సంగీత కలోజ్జృంభిత మన్మథౌ**
**అతి శుద్ధానురాగైక మహాభ్దావాద్య ఆప్లుతౌ** **87**

పరమాశ్చర్యకరమైన సంగీతకళ ద్వారా వారి అనంగస్థితి ప్రకాశితం ఔతున్నది. వారు అతి విశుద్ధమైన ఆద్య (శృంగార) అనురాగ మహాసాగరములో మునుక వేయుచున్నారు.

**నిత్యం విహరతో దివ్య సఖీమండల లాలితౌ**
**మహా విదగ్ధ స్వాత్మైక రసమగ్నాలి జీవనౌ 88**

దివ్యసఖీ మండలి చేత సేవింపబడుతూ శ్రీయుగళము నిత్యము విహరిస్తున్నారు. మహావిదగ్ధతాపూర్ణులైన శ్రీశ్యామాశ్యాముల రసమునందు మగ్నచిత్తులైన సఖీబృందమునకు వారు జీవన సర్వస్వమై ఉన్నారు.

**అథ స్వాత్మేశ్వరీ రాధా సుమహాభక్తి భావతః**
**సదానుస్మర్యతాం శుద్ధ స్వాద్యభావ రసాకృతిః 89**

నిజప్రాణేశ్వరియైన శ్రీరాధను మహాభక్తిభావముతో నిత్యము స్మరించు! రాధాజీ శుద్ధ ఆస్వాదనీయమైన భావరసాకృతి!

**సర్వాసాం నూతనాభీర సుందరీణాం శిఖామణిః**
**సర్వలక్షణ సంపన్న సర్వావయవ సుందరీ 90**

ఆమె (శ్రీరాధ) సమస్త నూతన గోపీమణులకు శిరోమణి! ఆ దేవి సర్వలక్షణ సంపన్న, సర్వాంగ సుందరి!

**శేషాశేష జగన్మూర్ఛాకారిణ్యాశ్చర్య రూపిణీ**
**మోహినీ పార్వతీ లక్ష్మీ రత్యాదిరూపిణీర్వరాః 91**

**కుర్వతీ యన్నఖ ప్రాంత సౌందర్యోఘైరవాఙ్ముఖీః**
**తప్తకాంచన గౌరాంగీ సుస్నిగ్ధానంత కాంతి భృత 92**

ఆమె (శ్రీరాధ) శేషాశేష ఈశ్వర సహితముగ సమస్త జగత్తులను విమూర్ఛితము చేయునట్టిది, ఆశ్చర్యకరమైన లావణ్యరూపిణి! అందరిని మోహింపజేయగల లక్ష్మి, పార్వతి, రతిమున్నగు శ్రేష్ఠ రూపవతులైన స్త్రీలను కూడ ఆదేవి తన నఖ ప్రాంత సౌందర్య ప్రవాహమునందు తేలియాడింపజేస్తుంది. ఆమె తప్తకాంచనము (బాగుగా కాల్చిన బంగారము) వంటి స్నిగ్ధ దేహకాంతి కలది.

**దశదిఙ్మండలాచ్ఛాది సుగౌరాంగోచ్ఛల చ్ఛవిః**
**చిదచిత్ ద్వైతమామజ్జ్యాత్యుచ్ఛలన్మధురచ్ఛవిః** **93**

ఆమె తన గౌరవర్ణ అంగముల కాంతిచేత దశదిశలను ఆచ్ఛాదితమగునట్లు చేస్తుంది. చేతనాచేతనములైన ద్వంద్వ వస్తువులను చక్కగా తన రూపసాగరము నందు నిమగ్నమగునట్లు చేసి, మధురమైన కాంతిని ప్రకాశింపజేస్తుంది.

**మహాప్రేమరసాంభోధి జృంభణైకాద్భుతచ్ఛవిః**
**శ్రీకృష్ణాత్మప్రాణకోటి నిర్మంచ్చైక రసచ్ఛవిః** **94**

ఆమె (శ్రీరాధ) మహాప్రేమరస సాగరమునందు ప్రకాశిస్తున్న ఒక అద్భుత శోభాశాలిని! శ్రీకృష్ణుని కోటి ప్రాణములను ఉద్దీప్తము చేయగల ఒక ముఖ్యరసమును శోభించునట్లు చేయగల దేవి!

**స్వయం ప్రభాచ్ఛిదద్వైత సత్ప్రేమైక రసచ్ఛవిః**
**ఆశ్చర్య నవకైశోరవ్యంజి దివ్యతమాకృతిః** **95**

ఆమె (రాధాజీ) స్వయం ప్రకాశము కలది. నిరంతర సంయోగాత్మకమైన సుందర ప్రేమకు ఆమెయే రసకాంతి స్వరూపిణి! ఆశ్చర్యకరమైన నవకైశోర స్థితి యందు ప్రకటితమయ్యేడి దివ్యాతి దివ్యమైన ఆకృతి కలది.

**నవలావణ్య పీయూష సింధు కోటి ప్రవాహినీ**
**పదే పదే మహాశ్చర్య సౌందర్యాశేష మోహినీ 96**

శ్రీరాధాజీ కోటి కోటి నవలావణ్యామృత సింధువులను ప్రవహింపజేయునట్టి దేవి! అడుగడుగునను మహాశ్చర్యకరమైన సౌందర్యము చేత చరాచరములనన్నిటిని మోహింపజేయునట్టి మోహనమూర్తి!

**మహామాధుర్యౌఘరూప మోహనాంగోచ్ఛలచ్ఛవిః**
**ఆకులీకృత భృంగాలిర్మల్లీ చంపక దామభిః 97**

ఆమె (శ్రీరాధ) మోహనాంగముల నుండి మహామాధుర్య పూర్ణమైన రూపము, కాంతి ఎగసిపడుతున్నవి. ఆమె ధరించిన మల్లెలు, సంపెంగలతో కూర్చిన మాలలపై భ్రమర సమూహములు వేగిరపాటుతో ఎగురుతున్నవి.

**వృతాం మూలే విచిత్రోరు పుష్పైర్మధ్యే సుగుంఫితామ్**
**ప్రచలద్రత్నగుచ్ఛాలి పుచ్ఛాం విశ్వవిమోహినీమ్ 98**

**శిరోగతాతి సూక్ష్మశ్రీర్లోచనాంత ర్వ్యలక్షితామ్**
**చారువేణీలతాం విభ్రత్యాపీన శ్రోణిలంబినీమ్ 99**

శ్రీరాధా వేణీమూలము (కేశరాశి) అనేకములైన విచిత్ర పుష్పములతో శోభిస్తున్నది. జడ యొక్క మధ్యభాగము సుందరమైన భావముతో అల్లబడినది. ఊగుతున్న రత్న గుచ్ఛములు భావాలంకృతమై విశ్వమోహనముగ ఉన్నవి. శిరస్సుపై అతిసూక్ష్మముగను, సుందరముగను ఉన్న మేలి ముసుగు నుండి గోచరిస్తున్నట్టి, జంఘల (పిక్కల) వరకు ఉన్నట్టి పొడవైన వేణీలత (జడ అనెడు లత)తో ఆమె శోభిస్తున్నది.

**సునీలాయత సుస్నిగ్ధ సుపీన మధురోజ్జ్వలామ్**
**పన్నగీమివ చాంపేయ వల్ల్యాః పశ్చాద్విలంబినీమ్ 100**

ఆ వేణీలత (లతవలె ఉన్న జడ) నల్లనై, విస్తృతమై, స్నిగ్ధమై, దట్టమై, మధురోజ్వలమై ఉన్నది. చూచుటకు ఆ జడ చంపకలతకు వెనుక వేలాడుచున్న ఒక నాగిని (సర్పము) వలె ఒప్పుచున్నది.

శ్రీరాధ యొక్క ముడిచిన కేశరాశి నల్లగా, ఒత్తుగా ఉండి; చూచుటకు సంపంగిలతను ఆశ్రయించిన నాగిని వలె ఉన్నది.

**జాంబునదమయానంత పూర్ణచంద్రాననచ్ఛవిః**
**అనంత చంద్రికా స్వర్ణ పద్మకోష ముఖచ్ఛవిః** **101**

స్వర్ణమయమైన, అనంతమైన పూర్ణచంద్రులతో సమానముగ శ్రీరాధా ముఖము శోభిస్తున్నది. లేదా, అనంత చంద్రికలతో భూషితమైన స్వర్ణకమల మధ్యమున వెలుగుచుండు కాంతితో సమానముగ ఆదేవి ముఖము శోభిస్తున్నది.

శ్రీరాధా ముఖ కమల శోభా వర్ణనముతో ప్రస్తుత శతకమును పూర్తి చేసిన శ్రీసరస్వతీపాదులు శ్రీరాధాముఖాబ్జ వర్ణనముతోనే తరువాతి శతకమును ఆరంభించినారు.

# ఎనిమిదవ శతకము

**ఉద్బుద్ధ ముగ్ధ కనకాంభోజకోష నిభాననా**
**పక్వ దాడిమబీజాభ స్ఫురద్దశన దీధితిః** 1

శ్రీరాధా సుందర వదనము మనోహరమై, ప్రఫుల్లిత స్వర్ణ కమలమువలె ఉన్నది. ఆమె దంతకాంతి పండిన దానిమ్మ గింజల తళుకు వలె స్ఫురిస్తున్నది.

**చారు బింబాధరజ్జ్యోతిర్వహన్మధురిమాంబుధిః**
**సౌందర్యసార చిబుక శ్యామబింద్వతి మోహినీ** 2

అందమైన ఆమె బింబాధరముల (పెదవుల) జ్యోతి నుండి మాధుర్య సాగరము ప్రవహిస్తున్నది. పరమ సుందరమైన గడ్డముపైనున్న నల్లని చుక్కతో ఆమె మోహినీమూర్తివలె ఉన్నది.

**సవ్రీడ స్మేర చపల ఖంచరీటాయతేక్షణా**
**భ్రూవిలాస వినిర్ధూత కామకార్ముక సౌభగా** 3

సిగ్గుతో కూడిన మృదుమధుర మందహాసముతోనున్న ఆమె (శ్రీరాధా) నేత్రములు ఖంజనముల (ఒక పక్షి విశేషము) వలె చంచలిస్తున్నవి. తన భ్రూ విలాసము (కనుబొమల కదలిక) చేత మన్మథుని చాపము (విల్లు)ను పరాజితము చేస్తున్న ఆ దేవి మహా సౌభాగ్యశాలినియై ఒప్పుచున్నది.

**శ్రీమన్నాసాపుట స్వర్ణ రత్నాక్త్రోజ్జ్వల మౌక్తికా**
**సురత్న కర్ణతాటంక కర్ణపూర మనోహరా** 4

శ్రీరాధ తన సుందర నాసికపై అరుణ వర్ణాంచిత, సువర్ణ రంజిత ముత్యమును ధరించినది. సుందర రత్న తాటంకము (చెవికి అలంకరించు ఆభరణము)ను, కర్ణపూర మున్నగు వానిని ధరించి ఆమె మనోహరముగ ఉన్నది.

**నవకాంచనకంబు శ్రీకంఠ నిష్కమణి చ్ఛటా**

**సుజాత నవవక్షోజ స్వర్ణకుట్మల యుగ్మకమ్ 5**

శంఖము వంటి సుందరమైన శ్రీరాధా కంఠసీమలోనున్న నూతన, సువర్ణమయ మణిమాల యందలి మణిచ్ఛటలు (కాంతి) అంతట వ్యాపించినవి. మనోజ్ఞమైన నవ వక్షోజములు బంగరు మొగ్గల వలె స్ఫురించుచున్నవి.

**పరమాశ్చర్య సౌందర్య మహాలావణ్య మండలమ్**

**మూర్త మాధుర్యైక రసం పీనవృత్త పృథూన్నతమ్ 6**

శ్రీకుచయుగళము పరమాశ్చర్య, సౌందర్య, లావణ్యమయములై ఉన్నవి. మాధుర్య రసమునకు సాకారమూర్తి వలెనున్న వక్షస్థలి అధికమై, వర్తులమై, పృథులమై ఉన్నతముగ ఉన్నది. (జగత్తులను పోషించు మాతృవక్షస్థల వర్ణనము.)

**సంవీతకంచుకం చేలాంచలేనావృణ్వతీ ముహుః**

**రత్నచూడావలీ రత్నకేయూర ప్రసరచ్ఛవిమ్ 7**

కంచుకము (రవిక) చేత ఆచ్ఛాదితమైన వక్షస్థలమును ఆమె మాటిమాటికి తన వస్త్రాంచలము (కొంగు)తో కప్పిపుచ్చుచున్నది. ఆమె ధరించిన రత్నచూడాభరణము, రత్నకేయూరము (అంగదము)ల శోభ అంతట ప్రసరించు చున్నది.

**దధానాం చారుదోర్వల్లీం మహాసువలితోజ్జ్వలామ్**

**సుస్నిగ్ధహేమదల వద్వలిమత్ పల్లవోదరీమ్ 8**

శ్రీరాధా బాహులతలు గుండ్రనివై, ఉజ్జ్వలములై, మనోజ్ఞముగ ఉన్నవి. స్నిగ్ధమైన స్వర్ణకమలము యొక్క పల్లవముల వలె ఆమె ఉదరము (పొట్ట) త్రివళులతో (మూడు రేఖలతో) శోభిస్తున్నది.

**అత్యంత చారుసుకృశ మధ్యదేశ మనోహరామ్**
**మహాసౌందర్యసారాతి పుష్యన్నవ నితంబినీమ్ 9**

అత్యంత సుందరమైన, సన్నని ఆమె కటి ప్రదేశము (నడుము) మనోహరముగ ఉన్నది. నితంబ ప్రదేశము (పిరుదులు) మహాసౌందర్యసారమై పరిపుష్టముగ ఉన్నది.

**చిత్ర కుంచిత కౌశేయ మంజర్యాగుల్ఫరంజితామ్**
**సుహేమ కదలీ కాండ సుస్నిగ్ధోరుయుగోజ్జ్వలామ్ 10**

మంజరి చేత కప్పబడిన విచిత్రమైన, కాంతిమంతమైన వస్త్రముచే ఆమె గుల్ఫ ప్రదేశము (పిక్కలు) రంజితమై ఉన్నది. ఊరువులు సుందరమైన, స్వర్ణకదళీ (అరటి) స్తంభముల వలె స్నిగ్ధములై ఉజ్వలముగ ఉన్నవి.

**జానుబింబమహాశోభాం దివ్యజంఘా మృణాలినీమ్**
**చరణాంబుజ సౌందర్య సమ్మోహిత చరాచరమ్ 11**

ఆమె (శ్రీరాధా) జానువులు (మోకాళ్లు) మహాశోభస్కరముగా ఉన్నవి, జంఘలు (ఊరువులు) దివ్యమైన తామరతూడుల వలె ఉన్నవి. ఆదేవి తన చరణ కమలముల సౌందర్యముతో చరాచరముల నన్నిటిని సమ్మోహితము చేస్తున్నది.

**సలీల పదవిన్యాస మహామోహన మోహినీమ్**
**కాంచీకలాప వలితాం క్వణత్కనక నూపురామ్ 12**

ఆమె తన పదవిన్యాసము (పాదముల కదలికల)చే మహామోహనుని (శ్రీకృష్ణుని) కూడ మోహితునిగ చేస్తున్నది. నడుమును చుట్టిన కాంచీకలాపము (వడ్డాణము) చేతను, ధ్వనిస్తున్న సువర్ణమంజీరముల చేతను శోభిస్తున్నది.

**దివ్య పాదాంగుళీయాఢ్య లసదంగుళి పల్లవామ్**
**మాణిక్యపాద కటకాముఱు జంఘాతి శోభితామ్ 13**

ఆమె పల్లవముల (చిగుళ్ల) వంటి వేళ్లకు దివ్యమైన పాదాంగుళీయకములను (కాలి వేళ్లకు పెట్టుకొను ఉంగరములను) ధరించి ఒప్పుచున్నది. రెండు పాదములకు మాణిక్యమయమైన కటకము (ఒకానొక ఆభరణము)ను ధరించినది.

**రత్నాంగుళీయ రాజిభిర్విరాజిత కరాంగుళీమ్**
**పదే పదే మహాశోభా సింధుకోటి విమోహినీమ్**
**మహాశ్చర్యానంతపార కేలివైదగ్ధ్య వారిధిమ్ 14**

ఆమె (శ్రీరాధ) చేతి వేళ్లు అన్నింటికి రత్నమయములైన ఉంగరములను ధరించినది. అడుగడుగునను కోటి మహా శోభా సముద్రములతో విముగ్ధము చేస్తున్నది. ఆదేవి మహాశ్చర్యకరమైనట్టి, అవధులు లేనట్టి విదగ్ధత (నైపుణ్యము)తో కూడినకేళీ సముద్రము వంటిది.

**మహాశ్చర్యానంగ రసమయ భంగీతరంగిభిః**
**సుగౌర సుకుమారాంగైః సకృష్ణాల్యాది మూర్ఛనమ్ 15**

శ్రీరాధాజీ మహాశ్చర్య, అనంగరసమయ తరంగములతోను; గౌరవర్ణములో నున్న సుకుమారమైన అంగములతోను శ్రీకృష్ణుని, సఖీమణులను కూడ మూర్ఛితులను చేస్తున్నది.

ఈ 8వ శతకములోని మొదటి శ్లోకము నుండి 15వ శ్లోకము వరకు శ్రీప్రబోధానందులు శ్రీరాధా ముఖ చంద్రుని నుండి పదనఖమణికాంతి వరకు మనోజ్ఞముగ వర్ణించినారు. శ్రీరాధా వక్షస్థల వర్ణనము జగన్మాతృసూచకము! ఆదేవి కటి ప్రదేశమును, ఊరువుల శోభను వర్ణించుట కూడ మాతృస్తుతియే తప్ప అన్యము కాదు.

**అథ వృందావనేశ్వర్యా రత్ననూపుర శోభితే**
**శ్రీపాదాంబుజయోః పూర్ణేజ్యోతిష్యతి రసోజ్జ్వలే**
**ఘనీభావాత్మికా దాసీయూథ కోటీరనుస్మర 16**

ఈ ప్రకారము శ్రీబృందావనేశ్వరియైన శ్రీరాధాజీ యొక్క రత్ననూపురములతో అలంకృతమైన పాదపద్మములను; రసోజ్వల పూర్ణజ్యోతిచే భావాత్మికలైన కోటికోటి దాసీమణులను స్మరించుము!

ఇక ఇట నుండి శ్రీరాధా దాసీమణుల దివ్యత్వము వర్ణితమగుచున్నది.

**తత్తద్యూథాదినాథాభిః శిక్షితాదృత లాలితాః**
**నానావిథ మహాశ్చర్య కైశోర శ్రీమనోహరాః 17**

ఆ దాసీమణులు తమ తమ యూథనాయికల ద్వారా (సేనానాయికలు) శిక్షణ, ఆదరణ, లాలనలను పొందుతూ ఉంటారు. అనేక విథములుగ మహాశ్చర్యకరమైన కిశోరావస్థ చేత మనోహరముగ ఉంటారు.

**నానావిథ మహాశ్చర్య వస్త్రాలంకార చర్చితాః**
**నానావిథ మహాశ్చర్య వర్ణాకార విచిత్రితాః 18**

వారు (శ్రీరాధా దాసీ బృందము) అనేక ప్రకారములైన, మహాశ్చర్యకరములైన వస్త్రములతో భూషితులై ఉన్నారు. ఇంకను, నానా విధములైన మహాశ్చర్యమయ వర్ణములతోను, ఆకృతులతోను విచిత్రపూర్ణులై ఉన్నారు.

**నానావిథ మహాశ్చర్య కలా నిర్మాణ పండితాః**
**స్వస్వ సంగీత శిక్షాభిః సంతోషిత ప్రియద్వయాః 19**

ఆ దాసీమణులు నానావిథములైన మహాశ్చర్యకర కళానిర్మాణములో పండితులు! వారు తమ తమ సంగీత శిక్ష ద్వారా ప్రియతమ యుగళ కిశోరులను సంతోషింపజేస్తూ ఉంటారు.

**వయః స్వభావ ప్రోన్మీలన్మధురానేక చేష్టితాః**
**అంగభంగిమ సవ్రీడ హసితాఽనృజు వీక్షితైః 20**

**సహజైరేవ సకలం స్థగయంతీః సహేశ్వరమ్**
**తత్ర కాంచిత్తనుం సౌమ్యాం శ్రీరాధాత్యనుకంపితామ్ 21**

వారు (శ్రీరాధాదాసీమణులు) కిశోరవయస్సు యొక్క స్వభావము చేత అనేకానేకములైన మధుర చేష్టలను చేస్తూ ఉంటారు. తమ సహజ అంగ భంగిమలతోను, సిగ్గుతో కూడిన మందహాసముతోను, కటాక్షవీక్షణములతోను వారు ఈశ్వరునితో సహా సమస్త జగత్తులను స్తంభింపజేస్తారు (విముగ్ధము చేస్తారు). వారికి మధ్యనున్న, శ్రీరాధాజీకి అత్యంత కృపాపాత్రయైన ఒకానొక స్వర్ణాంగిని (అంతరంగ సఖిని) స్మరించు!

**క్షణం చరణ విచ్ఛేదాచ్ఛ్రీశ్వర్యాః ప్రాణ హారిణీమ్**
**పదారవింద సంలగ్న తయైవాహర్నిశం స్థితామ్ 22**

ఆ ఏకాంత సఖి క్షణకాలమైనను శ్రీరాధాచరణ సేవను త్యజించినచో తన ప్రాణేశ్వరి ప్రాణములకు హాని కలిగించినదిగ అగును. కనుక ఆమె రాత్రింబవళ్లు శ్రీరాధాపదకమల సన్నిధిలోనే నిలచి ఉండుట దర్శనీయమగుచున్నది.

ఆ అంతరంగ సఖి క్షణకాలమైనను శ్రీచరణ కమలసేవను చేయకున్నచో, తన సఖికి ఏమైనదో అనుశంకతో రాధాజీ ప్రాణములకే హాని కలుగవచ్చునట! ఏలనన, ఆ సఖి క్షణకాల విరామమైనను లేకుండ తన స్వామినిని సేవిస్తూ ఉంటుంది. అట్టి యెడ విరామము వచ్చినచో సఖికి ఏమైనదో అని రాధాజీ శంకించును. ఆపాటి శంకకే సుకుమారియైన రాధాజీకి ప్రాణహాని కలుగవచ్చునట! అట్టి ఊహను ఊహయందైనను సహింపలేని సఖి అహర్నిశలు మిక్కిలి తత్పరయై

శ్రీరాధా చరణకమల సేవామాధుర్యములో మునిగియుండును. ఆహా! రాధాజీకి, రాధాసఖికి నడుమగల ఈ అన్యోన్య సేవా సుఖము వేదాతీతమై వెలుగుచున్నది.

ఈ శ్లోకము నుండి శ్రీరాధాసఖి వర్ణింపబడుచున్నది.

**బహునా కిం స్వకాంతేన క్రీడంత్యాపి లతాగృహే**
**పర్యంకాధిష్ఠాపితాం వా వస్త్రైర్వాచ్ఛాదితాం క్వచిత్ 23**

ఇంక ఏమి చెప్పాలి ? లతాగృహములో తన ప్రియతమునితో క్రీడించు సమయములో కూడ శ్రీరాధాజీ ఆ ఏకాంతసఖిని తన శయ్యపై కూర్చుండ బెట్టుకుంటుంది. ఒక్కొక్కసారి ఆమెను తన వస్త్రములతో ఆచ్ఛాదిస్తుంది. (కప్పుతుంది.)

తన స్వామినికి చేయుచుండు సేవకు క్షణకాలము విరామము వచ్చినను ప్రాణేశ్వరి ప్రాణములకు ముప్పు ఏర్పడునని అహర్నిశలు శ్రీసేవలో తత్పరయై యుండు అంతరంగసఖిపట్ల స్వామిని ఏరీతిగ వర్తించునో ఇట తెలుపుచున్నారు. శ్రీరాధ తన ప్రియతమునితో ఏకాంతముగ నుండు వేళలో కూడ ఆ ఏకాంత సఖిని తన శయ్యపై కూర్చుండబెట్టుకుంటుందట! తన మేలిముసుగును ఆ సఖికి కూడ కప్పుతుందట! అనగా అత్యంత దుర్లభమైన "రాధాభావము"ను సఖికి అనుగ్రహిస్తుంది. "బహునా కిమ్ ?" పెక్కు మాటలేల ?

**సుస్నిగ్ధలలిత స్వర్ణసుగౌరీం మధురచ్ఛవిమ్**
**కాంత్యానంతాం శ్రియానంతాం మాధుర్యైరప్యనంతకామ్ 24**

ఆమె గౌరవర్ణాంగియై స్నిగ్ధముగను, లలితముగను, స్వర్ణకాంతితోను మధుర శోభాయుక్తమై ఉన్నది. అనంత కాంతితోను, అనంత శోభా సంపత్తితోను రాశిపోసిన మాధుర్యమై యున్నది.

**వ్యంజదద్భుత కైశోరాం సుజాత ముకులస్తనీమ్**
**తారాహారావలీ చారుచిత్ర కంచుక ధారిణీమ్ 25**

ఆమె (ఆ సఖి) అద్భుత కిశోరావస్థలో ఉన్నది. వక్షస్థలము సుందర భావముతో ప్రకటితమైనది. తారాహారావళిని, విచిత్రమైన కంచుకము (రవిక)ను ధరించినది.

**స్నిగ్ధచ్ఛటా కందదోః కందలీ చూడాంగద శ్రియమ్**
**చారు శ్రోణితట క్రీడన్మహా వేణీలతోజ్జ్వలామ్ 26**

ఆమె స్నిగ్ధకాంతికి ఆధార స్వరూపమై, అరటి కాండముల వంటి బాహువులకు చూడ, అంగద (చేతులకు ధరించు ఆభరణములు)ములను ధరించి శోభిస్తున్నది. మనోహరమైన కటిప్రదేశముపై అటునిటు ఊగుచున్న లతవంటి పెద్దజడతో ఆమె అత్యంత ఉజ్వలముగ ఉన్నది.

**అత్యంతచారు సుకృశ మధ్యదేశ మనోహరామ్**
**దివ్య కుంచిత కౌశేయేనాగుల్ఫ పరిమండితామ్ 27**

ఆ దాసీమణి నడుము అత్యంత సుందరముగను, సన్నముగను, మనోహరముగను ఉన్నది. దివ్యకాంతితో కూడిన వస్త్రములతో కప్పబడిన గుల్ఫప్రదేశ పర్యంతము (పిక్కల వరకు) ఆమె అలంకృతయై ఉన్నది.

**నిచోలేనాతిసూక్ష్మేణ స్వగుచ్ఛాంచల శోభినా**
**అలకాంత పరివృతాం ముహుర్మోహన వీక్షితామ్ 28**

పత్రముల (ఆకుల), పుష్పముల గుచ్ఛములతో శోభిస్తున్న అత్యంత సూక్ష్మమైన (పలుచని) వస్త్రములతో ఆమె తన ముంగురుల పర్యంతము ఆచ్ఛాదితయై ఉన్నది. మాటిమాటికిని ఆమెను శ్రీమోహనుడు విశేషభావముతో చూస్తున్నాడు.

**సవ్రీడ మధురస్మేర సలీలాపాంగ వీక్షణామ్**
**నానాశ్చర్య కలోదారాం నానాభంగీమయాకృతిమ్ 29**

ఆమె సిగ్గుతో కూడిన మృదుమధుర మందహాసము చేస్తున్నది, విలాసపూర్ణమైన కటాక్షవీక్షణములను ప్రసరింపజేస్తున్నది. అనేకములైన ఆశ్చర్యకరకళలలో విశారదయై (నేర్పరి తనము కలిగి), నానా భంగిమలతో కూడిన రూప విశేషముతో ఉన్నది.

**రాధాకృష్ణ మహాప్రేమోదంచి రోమాంచ సంజయామ్**
**శ్రీశ్వరీ శిక్షితాశేష కలా కౌశల శాలినీమ్ 30**

శ్రీరాధాకృష్ణుల యందలి మహాప్రేమ వలన కలుగుచున్న పులకరింతలతో ఆమె ఉల్లసితయై ఉన్నది. ప్రాణేశ్వరియైన శ్రీరాధ నుండి శిక్షణ పొందిన సమస్త కళల యందు ఆమె ప్రవీణరాలు!

**ప్రేష్ఠద్వంద్వ ప్రసాద స్రగ్వస్త్ర భూషాది మోహినీమ్**
**మహావినయ సౌశీల్యాద్యనేకాశ్చర్య సద్గుణామ్ 31**

ప్రియాప్రియతములు ప్రసాదించిన మాల, వస్త్ర, భూషణాదులను ధరించుట చేత ఆమె మనోమోహిని వలె ఉన్నది. ఆమె యందు మహా వినయము, సౌశీల్యము మున్నగు ఆశ్చర్యకరములైన అనేక సద్గుణములు విరాజిల్లుచున్నవి.

**శ్రీశ్వరీదృష్టి వాగాది సర్వేంగిత విచక్షణామ్**
**శ్రీకృష్ణ దత్త తాంబూల చర్వితాం తత్తదాదృతామ్ 32**

ఆ దాసీమణి శ్రీరాధా నేత్రముల నుండి, వాక్యముల నుండి ప్రకటితమగుచున్న సమస్త ఈశ్వర లక్షణములను గ్రహించుటలో సమర్థురాలు! శ్రీకృష్ణుడు ప్రసాదించిన చర్విత తాంబూలమును ఆమె ఆస్వాదిస్తూ ఉంటుంది. శ్రీయుగళ కిశోరులు ఆమెను ఆదరిస్తారు.

**గూఢ శ్యామాభి సారాంగ భృంగారాదిభిరన్వితామ్**
**రాధా ప్రీత్యనుకంపాది ప్రవృద్ధప్రేమ విహ్వలామ్** **33**

ఆమె (ఆదాసీమణి) శ్రీశ్యాముని యొక్క నిగూఢ అభిసారోపయోగియైన శృంగారసామగ్రిని వహించి ఉంటుంది. (ఒకరికై మరొకరు ఎదురు చూచుచుండు స్థితి అభిసారము). శ్రీరాధాజీ యొక్క ప్రీతి, దయలచే అత్యంత ప్రేమవిహ్వలతను పొందుతుంది.

**రాధాపదాబ్జ సేవాన్య స్పృహా కాలత్రయోంగితామ్**
**రాధాప్రీతి సుఖాంభోధావపారే బుడితాం సదా** **34**

ఆమె శ్రీరాధా చరణకమల సేవయందు తత్పరయై ఉంటుంది, అది తప్ప ఇతరము ఏదీ ఎన్నటికీ ఉండదు. అపారమైన శ్రీరాధా ప్రీతి సుఖ సాగరము నందు ఆమె నిరంతరము నిమగ్నమై ఉంటుంది.

**రాధా పదాంబుజాదన్యత్ స్వప్నేఽపి చ న జానతీమ్**
**రాధా సంబంధ సంధావత్ప్రేమ సింధౌఘ శాలినీమ్** **35**

శ్రీరాధా పాదపద్మములు తప్ప స్వప్నమునందు కూడ ఆమె ఇతరము నెరుగదు. శ్రీరాధా సహిత సంబంధ రూపమైన ప్రేమ సముద్ర తరంగములలో ఆమె తేలియాడుతూ ఉంటుంది.

**సేశాశేష మహా విస్మాపక కైశోర రూపిణీమ్**
**క్షణే క్షణే రసాస్వాద ప్రోదంచత్పులకావలీమ్** **36**

ఆ ఏకాంత సఖి సమస్త జగత్తులకు మిక్కిలి విస్మయాన్ని కలిగించే కైశోరరూప శోభతో వెలుగొందుతూ ఉంటుంది. ప్రతిక్షణము రసాస్వాదనము చేయుచు, పులకరిస్తూ ఉంటుంది.

**సర్వాంగ కాంతి సౌందర్యైరపారైః సర్వమోహినీమ్**
**రాధా కర్మాకులతయా తత్ర తత్ర విచాలినీమ్ 37**

తన సర్వాంగ సౌందర్య ప్రకాశము చేత ఆమె అందరినీ మోహింపజేస్తుంది. శ్రీరాధా సేవా కార్యవశయై వ్యాకుల చిత్తముతో ఇటునటు సంచరిస్తూ ఉంటుంది.

అంటే రాధాజీకి ఏ సమయములో ఏ సేవ చేయవలెనను విషయము పట్ల తత్పరయై రాధాసఖి క్షణక్షణము వ్యాకులతతో ఉంటుంది.

**నవస్తవకినీం స్వర్ణలతాం సంచారిణీమివ**
**అంగచ్ఛటా తరంగౌఘైశ్ఛాదయంతీం దిశోదశ 38**

ఆమె ఇటునటు సంచరిస్తున్న నూత్నమైన పూగుత్తులతో కూడిన స్వర్ణలత వలె ఉన్నది. తన శ్రీ అంగముల సౌందర్య ప్రకాశము చేత దశదిశలను ప్రకాశింపజేస్తున్నది.

**చిత్రయంతీమివ దిశో విచిత్రాంగచ్ఛటా చయైః**
**సలీల పదవిన్యాసైః సునూపుర రణత్కృతైః 39**

**కాంచీవలయనాదైశ్చ మధురైర్విశ్వమోహినీమ్**
**రాధాకృష్ణ రహోగోష్ఠీ సుధా మధుర శీతలామ్ 40**

విచిత్రమైన తన శరీరకాంతితో ఆమె దశ దిశలను విచిత్రమయముగ చేస్తున్నది. విలాసమయమైన పాదవిన్యాసముతోను, సుందర నూపురముల ఝుంకారముతోను, వడ్డాణపుమువ్వల మధుర ధ్వనులతోను ఆమె విశ్వమును విమోహితము చేస్తున్నది. శ్రీరాధాకృష్ణుల ఏకాంత సల్లాపసుధను ఆస్వాదిస్తూ మధురమైన శీతలత్వాన్ని పొందుతున్నది.

**తత్తద్వచన పీయూషైర్మహా మధుర శీతలైః**
**శ్రీరాధాముఖచంద్రానుగలితైరభినందితామ్ 41**

శ్రీరాధాముఖ చంద్రుని నుండి వెలువడుతున్న మహామధురము, శీతలమునైన వచనామృతము నాస్వాదించుచు ఆమె ఆనందిస్తున్నది.

**శ్రుత్వా శ్రుత్వాతి సుఖితాం పునః శ్రవణలాలసామ్**
**ఏవమేవ స్మరన్నిత్యం సర్వావస్థాసు సర్వథా**
**అస్ఫూర్తితః కథాతోఽపి శ్రీమద్బృందావనే వస 42**

'ఆ వాక్యాలను అనేకమారులు వింటూ, వింటూ ఆమె మిక్కిలి సుఖాన్ని పొందుతున్నది. మళ్లీ మళ్లీ వినుటకై ఉత్సుకతతో ఉన్నది.' ఈ విధముగ నిత్యము సమస్తమైన అవస్థలలోను సమస్త ప్రకారములుగ స్మరించు! ఒకవేళ ఇదంతా స్ఫూర్తిని ఇవ్వకపోయినా ఈ కథాదులను స్మరిస్తూ, స్మరిస్తూ శ్రీబృందావనములో నివసించు!

**అత్యంతాశుచి బీభత్స దేహాదౌ నైవ కర్హిచిత్**
**దేహి దృష్టిం ప్రమాదాదప్యత్యనర్థ పరంపరామ్ 43**

అత్యంత అశుచియైనదియు, బీభత్సమైనదియునైన దేహాదికమునందు మరచిపోయి కూడ అతి అనర్థదాయకమైన దృష్టిని సారించవద్దు. (అనగా శరీరసంబంధమైన విషయములవైపు చూడవద్దు అని అర్థము) అట్టి దృష్టి అనర్థదాయకము!

**విన్మూత్రశ్లేష్మ పూషాదిక భరితమిదం స్నాయుమాంసాస్థిమజ్జా**
**రక్తాద్యాత్మ త్వచాచ్ఛాదితమహహ రహిః స్వార్థ నిర్మూలకారి**
**ఏకం బ్రహ్మోద్యతార్యం యువతిరితి మతం స్వీయసమ్మోహజాలమ్**
**త్యక్త్వా దూరేణ వృందావనమతి పరమస్వార్థమద్ధాశ్రయంతు 44**

మల, మూత్ర, శ్లేష్మ, పూషాదికములతో నిండి యున్నట్టి; స్నాయు, మాంస, అస్థి, మజ్జ, రక్తాదులతో కూడియున్నట్టి; చర్మముతో కప్పబడినట్టి, స్వీయ అర్థము (మంచిని)ను నిర్మూలించునట్టి, బ్రహ్మాదులకు కూడ జయింపరాని 'యువతి' నామకమైన స్వీయ సమ్మోహనకరమైనట్టి వస్తువు ఒకటి ఉన్నది. దానిని దూరము నుండియే త్యజించి, నీ పరమ పురుషార్థమైన శ్రీబృందావనమును ఆశ్రయించు!

**సర్వాత్మార్థోరువిఘ్నం కలయ యది మనో యోషితాం భావనిఘ్నమ్**
**నిఘ్నన్ దుష్టేంద్రియాణి ప్రసభముదయభాజ్ యుద్యతామర్షదండైః**
**తద్రూపం చైవ భూషాదికమపి నితరాం దూరదూరేణ కుర్వన్**
**ప్రత్యూహాభాసమన్యం తృణమివ గణయన్నాస్వ వృందావనే భోః 45**

ఒకవేళ సమస్తములైన స్వార్థ (నీవు కోరుకొనిన మంచి) విషయములకు విఘ్నకారియైన స్త్రీపట్ల నీ మనసు భావాధీనమై చూచినచో బలపూర్వకముగా దానిని వెలుపలికిలాగి, దుష్ట ఇంద్రియములను క్రోధరూపదండము (బెత్తము)తో అణచివేయి. ఈ విధముగ భూషాదికమును దూరదూరముగ నెట్టివేసి, విఘ్నముల వంటివి వచ్చినను వానిని గడ్డిపరక వలె నెంచి, శ్రీబృందావనములో నివసింపుము.

**ఆత్మారామేశ్వర శ్రీహరిమిహ న వినా నిస్తరేత్ కోఽపి మాయామ్**
**యాసౌ మాయాతిమాయాద్యనుహసిత కటాక్షాంగభంగాభిరామా**
**రామాఖ్యా కాలకూటాదపి విషమ తమాభాతి సౌధీవ ధారా**
**ధారావత్ కృష్ణనామాభిదధదిహ శమీ తిష్ఠ వృందావనేఽతః 46**

ఈ భూమిపై ఆత్మారామేశ్వరుడైన శ్రీహరి అనుగ్రహము లేకుండ ఎవ్వరైనను ఈ మాయను దాటలేరు. ఈ మాయ అత్యంత కపటమును విస్తరింపజేస్తూ చిరునవ్వు, క్రీగంటి చూపు, అంగభంగిమలు మున్నగువానితో మిక్కిలి సుందరిగా గోచరిస్తుంది. దాని పేరు 'రామా' (రమణీయమైనది) అయినప్పటికీ, చూచుటకు

అమృతధారవలె ఉన్నప్పటికీ అది విషముకన్న అధికముగ విషతమము! కనుక 'రాధా' నామముతో కలిపి 'కృష్ణ' నామాన్ని (రాధాకృష్ణ అని) ఉచ్చరిస్తూ ఈ శ్రీబృందావనములో శాంతి పూర్వకముగ వసించు!

**వృందారణ్యేఽద్భుత రసమయీ చేతసః కాప్యవస్థా**
**ప్రేమానందానపి చ పరమాన్ బిందుమాత్రీ కరోతి**
**మిథ్యా దుఃఖాత్మక విషయ గౌరింద్రియైర్వంచితస్తాన్**
**నైవ ప్రాప్తుం ప్రభవతి జనో దేవమాయా స్త్రియాంధః 47**

పరమప్రేమానంద సమూహములను కూడ బిందుమాత్రముగ చేయగల ఒకానొక అద్భుత రసమయ అవస్థ ఈ బృందావనములో చిత్తమునకు కలుగుతుంది. అయినప్పటికీ, హా! మిథ్యా దుఃఖాత్మక విషయములకై పరుగులు తీయు ఇంద్రియములతో వంచితులై జనులు మాయా రూప స్త్రీ వలన అంధులై ఆ ఆనందరాశిని పొందలేక పోతున్నారు.

**ద్వైతం ప్రోంచన్మధుర మధురానంత కాంతి ప్రవాహైః**
**సేశం సమ్మూర్ఛయదగజగద్దివ్య రూపాంగ భంగైః**
**సవ్రీడోద్యం స్మిత సుమధురాపాంగ దిగ్ధేషు విద్ధే**
**శ్యామే నానాజనిత వికృతి ధ్యాయ రాధాఖ్యమోజః 48**

మధుర మధురమైన, అనంతమైనకాంతి ప్రవాహము నందు శ్రీరాధ యుగళ కిశోరుని ముంచివేస్తూ; దివ్యమైన తన రూప అంగభంగిమలతో ఈశ్వరునితో సహా స్థావర జంగమములనన్నిటిని మూర్ఛితము చేస్తున్నది. సిగ్గుతో కూడిన మృదు మందహాసముతో, మధురమైన క్రీగంటి చూపులు అనెడు బాణములతో శ్రీశ్యామసుందరుడిని గాయపరుస్తూ (తీయని బాధను కలిగిస్తూ) ఆమె అనేక విధములైన, నిగూఢమైన ఆలోచనారీతిని పొందుతూ ఉంటుంది. అట్టి శ్రీరాధా నామక మూర్తిని ధ్యానింపుము!

**స్త్రీరాక్షస్యాః సువిషమకృతే రక్షతం రక్షతం చ**

**క్రోధాసూయా మదపిశునతా దంభ లోభానృతాద్యైః**

**వృందాటవ్యా విరహభయతో రక్షతం న్యూనభావాత్**

**రాధాకృష్ణౌ నిజకరుణయా సర్వతో రక్షతం మామ్ 49**

హే రాధాకృష్ణులారా! స్త్రీ అనెడు రాక్షసి చేసెడు విషమ కృత్యముల నుండి నన్ను రక్షించండి! క్రోధము, అసూయ, మదము, క్రూరత్వము, దంభము (అతిశయము), లోభము, కపటము మున్నగువాని నుండి రక్షించండి! శ్రీబృందావనము నుండి నాకు ఏ కొద్దిపాటి వియోగమైన ఎవరి వలన కలుగుతుందో వారి నుండి కూడ రక్షించండి! మీకృపతో నాకు అన్నిట రక్షణను అనుగ్రహించండి!

**క్షుధా దేహత్యాగో వరమిహ గృహస్థైర్నహి మిలా**

**మ్యపి శ్రేయః ప్రాప్త్యై న యువతి సమీపం క్షణమయే**

**న జహ్యాం శ్రీవృందావనమఖిల నాశేఽపి మనసా**

**ప్యహో క్షుద్రస్యాపి వ్యవసితిమిమాం కః సఫలయేత్ 50**

శ్రీబృందావనములో ఆకలితో మరణించినను మంచిదే కాని (భోజనార్థినై) గృహస్థులను కలసికొనను. శ్రేయస్కరమైన విషయమును పొందవలెనను ఉద్దేశ్యముతోనైనను ఏయువతి దగ్గరకు క్షణకాలమైనను వెళ్లను. సర్వనాశనము జరిగి పోయినను మానసికముగ శ్రీబృందావనమును త్యజింపను. ఓహో! క్షుద్రుడనైన నాయీ చేష్టితమును ఎవరు సఫలము చేస్తారు ?

అనగా, బృందావనమునందే నివసింపగోరు వ్యక్తి యొక్క సత్సంకల్పమును శ్రీరాధాకృష్ణులే సఫలము చేయుదురని ఆశ!

**నశాస్త్రగురుకోటిభిర్నఖలు లోకనిందాశతై**
**ర్మహా నరకదృష్టిభిర్నహి విపత్తి సౌఖ్యైర్న హి**
**మనాగపి చ నోత్సహే హతమనో యువత్యా హృతమ్**
**నిరోధ్యమత ఈదృశం కిమవితాసి వృందాటవి 51**

కోటికోటిమారులు శాస్త్రములు, గురువులు, లోకముల ద్వారా అది నింద్యమని తెలిసినను; మహా నరకరూపముగ చూచుచు లేశమాత్రపు సుఖమును కూడ పొందకపోయినను; అయ్యో! భాగ్యహీనుడనైన నా మనసు స్త్రీ చేత దొంగిలింపబడుటను ఏ విధముగను ఆపలేకున్నాను. అయినను హే బృందావనమా! నావంటి పతితుని నీవు రక్షింపలేవా!

ఎట్టి నింద్య కర్మలను చేసినను పరమదయాళువైన శ్రీబృందావనమును ఆశ్రయించినచో రక్షింపబడుదుము.

**జరీహర్తి స్వాంతః హరి హరి యువత్యాది విషయో**
**నరీనర్త్యాక్రమ్య త్వతి శిరసి మాయా భగవతః**
**వరీవర్తీత్యాశా చిరమిహ తు వృందావన వనే**
**న జానే రాధాయాః కథమివ చరీకర్తి కరుణా 52**

హరిహరీ! యువతులకు సంబంధించిన విషయాలు మాటిమాటికి నా మనసును హరిస్తున్నాయి. భగవంతుడి మాయ తలపైకెక్కి మాటిమాటికి నాట్యం చేస్తున్నది (పదే పదే మాయకు లొంగిపోతున్నాను అని భావం). అయినా, ఈ శ్రీ బృందావనంలో నివసించాలని చిరకాలంగా ఆశ కూడా ఉన్నది. ఏమో, నాకు తెలియదు; శ్రీరాధాజీ కరుణ దీనిని ఎట్లు సాధ్యం చేస్తుందో!

అంటే, శ్రీరాధాజీ దయవలన మాయనుదాటి బృందావనంలో జీవించటం సాధ్యపడుతుంది అని నమ్మకం!

**రాధాకీర్తిసుధారసేన రసనా రాత్రిందివం పూర్యతామ్**
**శ్రీవృందావిపినే తదీయ పదయోః కైంకర్యమేవార్థ్యతామ్**
**ధైర్యం స్వర్ణమయీ శితుర్నవ వయోరూప శ్రియా హార్యతామ్**
**ప్రేమాశ్రుత్పులకాది భావ విభవ వ్యక్త్యా జగత్తార్యతామ్ 53**

శ్రీరాధాకీర్తిసుధను రాత్రింబవళ్లు ఆస్వాదిస్తూ నీ జిహ్వను పూరించు (సార్థకం చేసుకో). శ్రీబృందావనంలో ఆదేవి యొక్క చరణకమల సేవకై ప్రార్థించు. స్వర్ణవర్ణ రంజితయైన ప్రాణేశ్వరీ నిత్యనూతన వయోరూప శోభాదికమును స్మరిస్తూ అధీరుడవై పొమ్ము (ఎప్పుడెప్పుడు శ్రీచరణకమల సాన్నిధ్యం లభిస్తుందా అని చంచలించటం). ప్రేమాశ్రువులు, పులకాది భావసంపత్తిని పొంది జగత్తును ఉద్ధరించు! (అనగా జీవుడు భగవదున్ముఖుడై తనను తాను ఉద్ధరించుకొనుట జగత్తును ఉద్ధరించుటయే అగును).

**అతిరసవివశం కిశోరయుగ్మం ద్రుతనవకాంచన నీలరత్న రోచిః**
**సువిమల వరభావమూర్తి వృందావిపిన నికుంజగృహోదరే చకాస్తి 54**

అత్యంతముగ రసవివశులై; నవస్వర్ణ, నీలమణి కాంతితో వెలుగుచున్న శ్రీయుగళ కిశోరులు విమలమైన, శ్రేష్ఠభావ పూర్ణమైన మూర్తులుగ శ్రీబృందావన నికుంజ మందిరములో శోభిస్తున్నారు.

**నవనవ రతిలోల గౌరనీల ద్వయమహ ఏకరసాత్మకం కిశోరమ్**
**నిరవధి భజ సత్కలావలీభిర్నవరస పుంజనికుంజ వాటికాయామ్ 55**

నిత్యనూతన ప్రేమ లంపటులు, ఏకరసాత్మక స్వరూపులు, గౌరనీల కాంతి యుక్తులునై శ్రీయుగళ కిశోరులు శోభిస్తున్నారు. సుందరమైన వారి కళా విలాసాదులతో కూడిన నవరస పుంజ నికుంజలలో వారిని నిరంతరము స్మరించు!

**వ్రజజన వరవర్ణినీ వివర్ణీకృత ముఖమోహన మోహనాంగరోచిః**
**సపతి రతి రమాది మూర్ఛన శ్రీనఖ సుషమా హృది రాధికా మమాస్తు 56**

ఎవరు తన మహామోహనమైన శరీరకాంతితో వ్రజవనితల సుందరమైన ముఖములను కూడ వెలవెల బోవునట్లు చేయునో; ఎవరి పరమసుందర నఖకాంతి వలన రతీ మన్మథులు, లక్ష్మీదేవి మున్నగువారు కూడ మూర్ఛితులు అగుదురో ఆ శ్రీరాధాజీ నా హృదయములో విరాజిల్లునుగాక!

**సర్వత్యద్భుత సద్గుణైర్విలసితం సర్వోజ్జ్వలాత్యుజ్జ్వలమ్**
**సర్వస్మాన్మధురాదతీవ మధురం సర్వార్థదాత్యర్థదమ్**
**సర్వస్మాచ్చ సుగంధశీతలతరాత్ సద్గంధవచ్ఛీతలమ్**
**సర్వానందమయాచ్చమత్కృత మహానందాబ్ధి వృందావనమ్ 57**

శ్రీబృందావనము సమస్తములైన సద్గుణములతో కూడినది. సమస్త ఉజ్వలత్వమునకు ఉజ్వలత్వమును ఇచ్చునది. మధురమైన వానికన్నిటికిని మాధుర్యమైన ధామము. సమస్త పురుషార్థములను ఇచ్చువారికిని మహాదాత! సుగంధ పూర్ణములు, శీతలములునైన సమస్తవస్తువులకన్నను అధికతర సుగంధమును శీతలత్వమును కలిగించునట్టిది. అది సమస్తములైన ఆనందమయ పదార్థములకు కూడ చమత్కృతిని (ఆశ్చర్యమును) కలిగించు మహానంద సాగరము! అదియే శ్రీబృందావనము!

**నిత్యానందాన్నిరవధి వివర్ధిష్ణు దివ్యావభాసామ్**
**వాసాన్ దివ్యాన్ ప్రతిపదమనోహారిణః ప్రోద్గిరంతీమ్**
**నిత్యం సుస్వస్తిక ముఖమహాదివ్య సంస్థాన వృందామ్**
**శ్రీమద్బృందావన భువమహం భావగమ్యాం భజామి 58**

నిత్యానందముచేత నిరవధికముగ వృద్ధి చెందుచుండు దివ్య ప్రకాశముతో కూడినది; అన్ని ప్రదేశములపై దివ్యమైన, మనోహరమైన గంధమును

ప్రకాశింపజేయునది; నిత్య సుందర గృహాదులను, మహాదివ్యవాస స్థానములను ప్రదానము చేయునది, భావగమ్య (భావము చేత మాత్రమే పొంద గలిగినది) అయిన శ్రీబృందావన భూమిని నేను భజిస్తున్నాను.

**శ్రీరాధామురళీధరౌ గుణనిధీ శ్రీమత్పదాంభోరుహ**
**ద్వంద్వేనైవ సుధా సుధాకర మహామాధుర్య నిస్యందినా**
**ఆశ్చర్యాతుల సౌకుమార్య పరమావత్యంత కౌతూహలాత్**
**యస్యాం సంచరతః సదాధివస తాం వృందావనీయావనీమ్ 59**

శ్రీబృందావనము ఆశ్చర్యకరమైన, అనుపమానమైన సౌకుమార్యమునకు పరమ ఆశ్రయమైనది. అమృతమును తిరస్కరించు మహామాధుర్యమును ఇచ్చునది; గుణనిధియైనది! శ్రీరాధా మురళీధరుల చరణ కమలముల పట్ల అత్యంత కుతూహలముతో నుండు అట్టి శ్రీబృందావనములో నిత్యనివాసము చేయుము!

**మహాచింతారత్న ప్రచయమయ కూర్పాదివలితామ్**
**సుకర్పూరక్షోదైః సుకుసుమ పరాగైశ్చ నిచితామ్**
**షడూర్మీణాం నిర్మూలనకర సకృతస్పర్శన లవామ్**
**భవాబ్ధిం శ్రీవృందావన భువమితః సంతర సుఖమ్ 60**

శ్రీధామము మహాచింతామణులతో నిండిన ప్రదేశములతోకూడినది; సుందరమైన కర్పూరము వంటి చూర్ణము (పొడి)తోను, పుష్పపరాగముతోను వ్యాపించి యున్నది. తన లేశమాత్రపు స్పర్శచేతనే శోక, మోహ, వృద్ధాప్య, మృత్యు, క్షుధ (ఆకలి), లోభములను నశింపజేయు 'రసము'ను ప్రదానము చేయునట్టి శ్రీబృందావనభూమిని పొంది (అచట నివసించి) సుఖముగ భవసాగరమును దాటుము!

**మహాజ్యోతిరూపామతి విమల నానా మణి ఘటా**
**చ్ఛటాభిర్వైచిత్ర్యం కిమపి దధతీం నిత్యసుఖదామ్**
**సమంతాచ్ఛ్రీరాధా మధుపతి పదాంకైః సుమధురామ్**
**స్మరామ శ్రీవృందావన భువమనంతాద్భుత గుణామ్ 61**

అది మహాజ్యోతిస్స్వరూపము, అతివిమలమైన అనేక మణుల కాంతి చేత అనిర్వచనీయ వైచిత్రిని పొందినది, నిత్యసుఖదమైనది! సర్వత్ర శ్రీరాధాకృష్ణుల చరణ చిహ్నములచే మధురమైనది, అనంత అద్భుత గుణములచే భూషిత అయినది అగు శ్రీబృందావన భూమిని ఎప్పుడు స్మరించగలను!

శ్రీబృందావనము భౌతికరూపము కాదు, అనంతమైన ప్రకాశముతో కూడిన మహాజ్యోతి! ఆ జ్యోతియందు అనేకానేక మణులకాంతి వ్యాపించియున్నది. ఆ రసభూమి శాశ్వత సుఖమును అనుగ్రహింపగల శ్రీరాధాకృష్ణుల చరణ చిహ్నములతో వెలుగుతూ ఉంటుంది. అనంతము, అద్భుతమునైన గుణమణులతో అలంకృతమైన అట్టి శ్రీధామమును సదా స్మరింపవలెను.

**భూరేషా హంత సేశాఖిలపరమ మహాప్రాజ్ఞ దుర్జ్ఞాన సర్వా**
**శ్చర్యానంత ప్రభావా భగవతి సహసోజ్జృంభితైకాంత భావా**
**స్వ జ్యోతిర్భాసమానా పరమ రసమయీ తుర్యతుర్యాతిధుర్యా**
**మాధుర్యౌఘైర్మనో మే రమయతి పరమానంద వృందావనీయా 62**

హా! పరమానందమయమైన ఈ బృందావన భూమి తమతమ ప్రభువులతో సహా మహా విజ్ఞులందరికి కూడ దుర్భేద్యమైనది. ఆశ్చర్యకరమైన తత్వస్వరూపము కల ఆ భూమి అనంత ప్రభావము కలది. ఆ క్షణముననే భగవంతుని పట్ల ఏకాంత భావము నీయగలిగి, తన కాంతి చేతనే స్వయముగ ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ శ్రీ ధామము పరమ రసమయము, తురీయమునకే తురీయమైనది, శ్రేష్ఠమైనది! మాధుర్యరాశియైన ఆభూమి నా మనస్సునకు పరమానందమునిచ్చుచున్నది.

**త్యక్తాసత్ఖ్యాత్యపేక్షా న గణితమయశో నాదృతా ధర్మనిష్ఠా**
**త్యక్తం విద్యావినోదాద్యఖిలమతి తపోజ్ఞాన యోగాద్యుపైక్షి**
**గుర్వాదీనాం వచో న శ్రుతమతి బహునా కిం న దేహోఽథవైక్షి**
**శ్రీవృందారణ్య! గత్వా తవ శరణమయం నహ్యుపేక్ష్యః కదాపి 63**

మంచి పేరు ప్రతిష్ఠల పట్ల అపేక్షను త్యజించి; అపఖ్యాతిని ఏమాత్రము పట్టించుకొనక; ధర్మనిష్ఠపై ఆదరమును చూపింపక; విద్యావినోదాదులనన్నిటినీ వదలివేసి; తపస్సు, జ్ఞానము, యోగము మున్నగువాని పట్ల కూడ ఉపేక్ష వహించి; గురువులు, పెద్దలు చెప్పెడు మాటలను కూడ వినక – పెక్కుమాటలేల ? తనదేహము పట్ల కూడ ధ్యాస చూపని పురుషుడు నిన్ను శరణు చెందితే హే బృందావనమా! నీవు ఎన్నటికిని ఆతనిని ఉపేక్షింపవు కదా!

'అన్యథా శరణం నాస్తి' అని తనను శరణుకోరినవారిని శ్రీబృందావనము ఉపేక్షింపదు.

**రాధా తదేకాలంకారౌ ప్రీత్యేక రస విగ్రహౌ**
**కిం భక్తిరంకాన్ పంకాబ్ధీన్ స్వవనే నోఽపి పశ్యతః 64**

శ్రీరాధ, ఆమెకు ముఖ్యభూషణమైన శ్రీశ్యామసుందరుడు ఇరువురును ఏకమాత్ర ప్రీతి రస స్వరూపులు! భక్తిహీనుడను, దీనుడను, బురదతో నిండిన సాగరముతో సమానుడను అయిన నావంటి పతితుని శ్రీబృందావనము అనుగ్రహించుట జరుగునా!

**రాధాపదారవింద శ్రీమంజు మంజీర శింజితా**
**మహాశ్చర్యాతి మాధుర్యా ధ్యేయా వృందావనేఽస్తు నః 65**

శ్రీబృందావనములో మహాశ్చర్యకరమైన, అతి మధురమైన శ్రీరాధా చరణ కమలముల మనోహర మంజీర (మువ్వల) ధ్వని మాకు ధ్యానింపతగినది.

**వీణా మృదంగ తాలాదియుక్తైర్హాసవిహాసిభిః**
**ఉల్లాసిభిః ప్రియసఖీమండలైః పరిమండితా 66**

వీణ, మృదంగ, తాళాదులతోను; హాసవిలాసాదులతోను ఉల్లాసముగనున్న ప్రియసఖీ మండలి చేత శ్రీరాధ పరివేష్టితయై ఉన్నది.

**రత్న శృంగార తాంబూల సంపుట వ్యజనాదిభిః**
**గృహీత్వా కింకరీవృందైరనుయాతా మనోహరైః 67**

రత్నాలంకారములు, తాంబూల పేటిక, వింజామరలు మున్నగువానిని చేతులలోధరించి దాసీమణులు ఆమెను (శ్రీరాధను) అనుసరించుచున్నారు.

**సమస్త చిదచిద్వైత ప్రపంచ ప్రోచ్ఛలచ్ఛవి**
**అనంత మాధురీ పూర్ణా స్వర్ణవల్లీ నిభాకృతిః 68**

సమస్తమైన చిదచిదాత్మక ప్రపంచములోని వస్తువులకు కాంతిని విస్తరింపజేయునది, అనంతమాధుర్యపూర్ణ అయినట్టిది, బంగారు తీగ వంటి ఆకృతి కలది (శ్రీరాధ).

ఇట నుండి వరుసగా శ్రీప్రబోధానందులు శ్రీరాధాజీని విశేషరీతిలో స్తుతించుచున్నారు.

**శిరీష పుష్పమృదుభిరంగైః సుస్నిగ్ధ సుందరైః**
**కైశోర మాధురీ కాంతి భంగిమాది చమత్కృతైః 69**

**ఉద్వేలమధురానంగ రసైకాంబుధి వాహిభిః**
**వృందావన స్థిర చర సర్వసత్వ విమూర్ఛనీ 70**

ఆమె శిరీష పుష్పమువలె కోమలము, స్నిగ్ధము, సుందరమునై; కైశోరావస్థయందలి మాధుర్య కాంతితోను, భంగిమల చమత్కృతితోను వెలుగుచున్నది. ఎగసిపడుచున్న మధుర ప్రేమరసైకాత్మక సాగరమును ప్రవహింప

జేయుచు శ్రీబృందావనము నందలి స్థావర, జంగమాత్మక ప్రాణులనన్నిటిని మూర్ఛితము చేస్తున్నది. (అట్టి రాధాజీ అని అన్వయము).

**అనేక దివ్యాలంకార దివ్యమాల్యానులేపనా**
**దివ్య కౌశేయ కూర్పాసగుచ్ఛాంచల నిచోలినీ 71**

ఆమె (శ్రీరాధ) అనేకములైన దివ్య అలంకారములను ధరించినది. దివ్యమైన హారమును ధరించి, చందనముచే చర్చిత అయినది (గంధము పూయబడినది). దివ్యకాంతితో కూడిన కంచుకమును (రవికను), గుత్తివలె వంపుతిరిగిన అంచును కలిగిన మేలి ముసుగును ధరించినది.

శ్రీరాధా సాకార స్వరూప సౌందర్య దివ్య దర్శనానుభూతిని పొందిన శ్రీప్రబోధానందులు రాధాజీ ధరించిన వస్త్రములు మొదలుకొని భూషణ పర్యంతము వివశులై వర్ణించుచున్నారు.

**శ్యామం సన్యస్త రోమాంచద్వామ శ్రీభుజవల్లరిః**
**దక్షిణ శ్రీకరాబ్జేన లీలాకమల ఘూర్ణనీ 72**

(ఆమె) శ్రీశ్యామసుందరుని భుజముపై రోమాంచితమైన (పులకరించిన) లతవంటి తన ఎడమ చేతిని ఉంచినది. కమలమువంటి కుడి చేతిలో లీలాకమలమును వహించినది.

**కింకరీభిర్ముహుః పథి పథి వీజ్యమానా నిజాంచలైః**
**భోజ్యమానా చ తాంబూలం భోజయంతీ స్వయం ప్రియమ్ 73**

మార్గమధ్యములో దాసీమణులు తమ తమ చేలాంచలములతో (పైట కొంగులతో) ఆమెకు (రాధాజీకి) వీస్తున్నారు, తాంబూలమును సమర్పిస్తున్నారు. ఆమె స్వయముగ తన కరకమలములతో ప్రియతమునికి భోజనము చేయిస్తున్నది.

**పాయ్యమానా క్వచిత్ ప్రేమ్ణారత్న శృంగార సంస్థితమ్**

**అమృతం శీతలం స్వాదు కర్పూరాది సువాసితమ్ 74**

ఒకానొక దాసీమణి రత్నశృంగార పాత్రలో కర్పూరాదికముతో సుగంధపూర్ణమైన, సుస్వాద్యమైన (స్వీకరింపదగిన), అమృతమయమైన శీతల జలమును ఉంచి ప్రేమపూర్వకముగ (రాధాజీకి) త్రాగించుచున్నది.

**దృష్ట్వా దృష్ట్వాద్భుతం రూపం శ్రుత్వా శ్రుత్వాద్భుతం రవమ్**

**కిమేతదితి పృచ్ఛంతీ విస్మయాన్నిజ నాగరమ్ 75**

అద్భుత రూపమును చూచిచూచి, అద్భుత శబ్దములను విని విని విస్మితయై (ఆశ్చర్యమును పొంది) ఆమె (శ్రీరాధ) తన నాగరుడిని (ప్రియతముని) "ఇదియేమి?" అని అడిగినది.

శ్రీబృందావనము అద్భుత స్వరూపము! అచటి పశుపక్ష్యాదులు చేయు కలకల ధ్వనులు కూడ అద్భుతమే! అమాయిక (భోలాభాలీ) అయిన శ్రీకిశోరి ఆశ్చర్యమును చూపుచు 'ఇదియేమి ?' అని శ్యామసుందరుని అడుగుటలోనే దయావర్షము కురిపించినది.

**మహామాధురిమాశ్చర్య పాదవిన్యాస లీలయా**

**రణన్నూపురయోత్సర్పి నఖచంద్రచ్ఛటౌఘయా 76**

**మహా మాధుర్య సౌభాగ్య ఘనే వృందావనే**

**చరంతీ చారు పరమ కౌతుకాక్రాంత మానసా 77**

వారి (శ్రీయుగళ) చరణములు శబ్దిస్తున్న నూపురములతో శోభిస్తున్నవి. చంద్రుని వంటి కాంతిగల వారి నఖములు (గోళ్లు) అన్ని వైపులకు కాంతిని ప్రసరింపజేస్తున్నవి. మహా మాధుర్యమయము, ఆశ్చర్యకరమునైన వారి పాదవిన్యాస

(పాదములను కదలించుట) లీలను ప్రకటించుచు మహామాధుర్యపూర్ణమైన శ్రీబృందావనములో పరమ సుందర కుతూహల చిత్తులై వారు సంచరిస్తున్నారు.

**తత్ర తత్ర మహాశ్చర్యే మహారమ్యతమ స్థలే**
**ఉపవిష్య ప్రగాయంతీ గాపయంతి ప్రియంసఖీ 78**

అక్కడక్కడ మహాశ్చర్యకరమైన, మహారమణీయమైన ప్రదేశములో కూర్చుండి సఖీబృందము గానము చేస్తున్నారు. ఒక్కొక్కమారు ప్రియతమయైన శ్రీరాధాజీ చేత పాడిస్తున్నారు.

సఖియలు రాధాజీచే పాడిస్తున్నారట! అంటే అంతటి స్వామిని తన సఖులకు ఎంతటి చనవును అనుగ్రహిస్తున్నదో కదా!

**వృందారణ్యానన్యగతేరంతరేవ దివానిశమ్**
**ఇత్థం భూతానంతలీలా సేవ్యా సాస్తు మమేశ్వరీ 79**

శ్రీబృందావనములో తననే అనన్యముగ శరణుచెందినవారి మనోమందిరములో ఈ ప్రకారముగ అనంత లీలా పరాయణయైన నా ప్రాణేశ్వరి శ్రీరాధ రాత్రింబవళ్లు సేవింపబడుతున్నది.

అహర్నిశలు సఖీమణులచే సేవింపబడుతున్న రాధాజీ తాను కూడ అహర్నిశలు వారి ప్రీతియందే తత్పరయై ఉంటుంది. ఇది శ్రీరాధకు, రాధాసఖికి గల అన్యోన్య ప్రీతిని చాటి చెప్పుచున్నది.

**యో వృందావన మాధురీం సకృదపి స్వాంతే సమాస్వాదయేత్**
**రాధామాధవ శుద్ధమన్మథ రసోల్లాసైశ్చమత్కారిణీమ్**
**శాస్త్రీయానపి లౌకికానపి జహచ్చేష్టా కలాపానసా**
**నానా ప్రేమవికార మోహన తనూరున్మత్తవత్ దృశ్యతే 80**

శ్రీరాధామాధవుల శుద్ధ అనంగ రసోల్లాసమయ చమత్కారమునకు నిలయము శ్రీబృందావనము. ఆ మాధుర్యము ఎవరి యందు ఒక్కసారి తన అంతఃకరణ స్వరూపముగా స్థితమై సమ్యక్ ప్రకారముగ ఆస్వాదింపజేస్తుందో అతడు శాస్త్రీయ, లౌకికములైన సమస్త ధర్మాచరణములను త్యజిస్తాడు. అనేకములైన దివ్యప్రేమ చేష్టలతో ఉన్మత్తునివలె అగుపిస్తాడు.

**యో రాధా మురళీధరాంఘ్రికమల ప్రేమైకమాత్రీయతి**
**మాత్రీయత్యపరాంగనాం స్థిరచరం సత్వం సుపుత్రీయతి**
**గోత్రీయత్యతి తర్జనాదిషు మహామిత్రీయతి ద్వేషిషు**
**శ్రీవృందావనమావసేత్ స ఖలు యః స్వాంగేఽన్యగాత్రీయతి 81**

ఎవరికి శ్రీరాధామాధవుల చరణకమలముల పట్ల ప్రేమయే ఏకమాత్ర జీవనమో; ఎవరు పరస్త్రీని తల్లివలెను, స్థావర జంగమ జీవులను పుత్రులవలెను గుర్తిస్తాడో; మిక్కిలి బెదరించువారిని జ్ఞాతుల వలెను, ద్వేషించువారిని గొప్ప మిత్రుల వలెను భావిస్తాడో; తన శరీరము పట్ల వలె పర శరీరము పట్ల ఆచరణ చూపిస్తాడో అతడే శ్రీబృందావనములో నివసించుటకు యోగ్యుడు!

సాధకుడు ఎట్టి లక్షణములను కలిగియున్నచో రాధాజీకి రెండవ రూపమైన శ్రీబృందావనములో జీవించుటకు అర్హత వస్తుందో శ్రీప్రబోధానందులు ఇందు స్పష్టము చేసినారు.

**కృష్ణప్రేమ సుధాంబుధావతితరాం మగ్నః సదా రాధికా**
**పదాంభోరుహ దాస్యలాస్యపదవీం స్వాంతేన సంతానయన్**
**వైరాగ్యైక రసేన విధ్వమధురాం కాంచిద్దశాముద్వహన్**
**శ్రీవృందా విపినే కదా ను సతతోదశ్రుర్నివత్స్యామ్యహమ్ 82**

హా! శ్రీకృష్ణ ప్రేమామృతములో మిక్కిలి మగ్నుడనై; శ్రీరాధా చరణ కమలముల దాస్యలాస్యము (పదవి) పట్ల ఆశగొని, స్వాంతములో వృద్ధిని సాధించి; ఏకమాత్రమైన వైరాగ్యరసము చేత ఒకానొక మధుర దశను పొంది; నిరంతర అశ్రుధారలతో నేను శ్రీబృందావనములో ఎప్పుడు నివసిస్తాను ?

**కాలిందీపులినే కదంబ విటపిచ్ఛాయా మణీమండపే**
**శ్రీరాధామురళీధరౌ ప్రియసఖీవృందైర్వహన్నర్మభిః**
**స్రక్తాంబూల విలేపనాదిభిరహో దివ్యైః సదా సేవితౌ**
**రూపౌదార్య వయో విలాసమధురౌ ధ్యాయామి వృందావనే 83**

శ్రీబృందావనములోని యమునా తీరములో కదంబ వృక్షము క్రింద మణిమండపములో ప్రియసఖీ బృందములు నర్మగర్భితములైన పరిహాస వాక్యములతోను; దివ్యహార, తాంబూల, విలేపనాదుల (మైపూతల)తోను నిరంతరము రూపవయో విలాసమూర్తులైన శ్రీరాధామురళీధరులను సేవిస్తూ ఉంటారు. నేను వారిని ధ్యానిస్తున్నాను.

**కాలింద్యానంద సాంద్రామృత సురస సరిత్కూలకల్పద్రుమూల**
**ప్రోన్మీలద్రత్నవల్లీమయ మధురమహామండపే మండితాంగౌ**
**ఆసీనౌ చిత్రతూలే స్మరమధుర వయోరూప లావణ్యలీలా**
**వైదగ్ధీపూర ముగ్ధీకృత సకల సఖీవృంద వృందావనౌ తౌ 84**

ఆనందఘన అమృతరస ప్రవాహినియైన శ్రీయమునా తీరమున, కల్పవృక్షము క్రింద విరాజితమైన రత్నలతలతో కూడిన మధురమహామండపము నందు శ్రీయుగళ కిశోరులు అలంకృతులై విచిత్రమైన తూలికాగద్దెపై ఆశీనులైనారు. వారి మధురమైన వయో, రూప, లావణ్య, లీలావైదగ్ధీ ప్రవాహములో సమస్త సఖీబృందము, శ్రీబృందావనము విముగ్ధములైనవి. ఈ విధముగా శ్రీయుగళ కిశోరులను స్మరింపుము!

**చిజ్జ్యోతిశ్చంద్రికాత్మ స్ఫురదమృతమయోత్ఫుల్ల వల్లీద్రుమవృందమ్**
**వృందారణ్యం విచిత్రైః శుకపిక శిఖిభిర్గీత నృత్యానుయాతమ్**
**మాధ్వీకాస్వాద మత్త భ్రమదలి పటలీర్ఝుంకృతం మంజుకుంజే**
**వ్యంజన్మాధుర్య పుంజం స్మరవిమల సరోవాపికాద్యైః సుహృద్యమ్ 85**

'చిజ్జ్యోతి యొక్క చంద్రికలచే పూర్ణమైన, అమృతమయమైన, వికాసమానమైన లతలతోను, వృక్షములతోను శోభిస్తున్నది. విచిత్రమైన శుక, కోకిల, మయూరముల నృత్యగానాదికముచే ప్రతిధ్వనిస్తున్నది. మనోహరమైన కుంజలలో మధువును ఆస్వాదించి మత్తిల్లిన భ్రమరములు గుంజారవము చేస్తున్నవి. స్వచ్ఛమైన సరోవరములు, తటాకములు మున్నగువాని యందు మాధుర్యము ప్రవహిస్తున్నది' – ఈ ప్రకారముగా సుందర బృందావనమును స్మరింపుము!

**స్వానందసాంద్ర చిజ్జ్యోతిర్ఘనం వృందావనం వనమ్**
**సర్వంచాత్ర తథా ధ్యాయన్ సుధీరోఽధి వసేత్ సుఖమ్ 86**

ఈ శ్రీబృందావనము స్వానందఘనము, చిజ్జ్యోతిర్మయము! ఇచటి సమస్త వస్తువులు కూడ ఇట్టివే! ఈ భావముతో చింతన చేస్తూ ధీరులు సుఖపూర్వకముగ బృందావనములో నివసించుచున్నారు.

**కామాదీనాం పరవశో యశోఽర్థీ త్యక్త సత్పథః**
**కథం వృందావనే సిద్ధిం న యాయాద్యది తత్ కృపా ? 87**

కామాదులకు వశమై, యశస్సును పొందగోరుచు, సన్మార్గమును త్యజించినప్పటికీ; ఒకవేళ ఎవరైనను శ్రీబృందావనములో బృందావన కృపను పొందినట్లు అయితే అతడు సిద్ధిని పొందలేడా! (తప్పక పొందగలడని భావము).

**అమర్యాద కృపాసింధోః పూర్ణేందోరపిశీతలాత్**
**వృందారణ్యాదనన్యాద్య భావం భావయసే న కిమ్ ? 88**

అవధులు లేని కృపాసింధువు, పూర్ణచంద్రునికన్నను శీతలమైనది అయిన ఈ శ్రీబృందావనము పట్ల ఏకాత్మ (బృందావనమయమైన) శ్రేష్ఠభావమును ఎందుకు భావింపలేదు ? (ఎట్టివానికైనను శ్రీబృందావనము అట్టి భావము నీయగలదు).

**విశుద్ధ సత్వపరమే శ్రీమద్బృందావన త్వయి**
**కృతానంతాపరాధస్య త్వమేవ శరణం మమ 89**

హే శ్రీబృందావనమా! పరమ విశుద్ధ సత్వమయివి అయిన నీపట్ల నేను అనంత అపరాధములను చేసినను, నీవే నాకు ఏకమాత్ర శరణ్యము!

**వృందారణ్య! తవాస్మీతి వదంతమపి మాం మృషా**
**మహాపతితమప్యాత్మ కారుణ్యాదాత్మసాత్ కురు 90**

హే శ్రీబృందావనమా! 'నేను నీ వాడను' – ఇట్టి మిథ్యా వచనములను పలుకు నావంటి మహాపాపిని నీవు నీకరుణతో నీవానినిగ చేసికొమ్ము!

**నిత్యోచ్ఛృంఖల కారుణ్యే వృందారణ్యేఽధమోఽప్యహమ్**
**కిమవిఘ్నం నివత్స్యామి వేత్స్యామి చ రసం హరే 91**

అవధులులేని నిత్యకృపామయి అయిన శ్రీబృందావనములో అధముడనైనప్పటికీ నేను నిర్విఘ్నముగ నివసింపగలుగుచున్నాను. ఏమి, శ్రీహరి యొక్క రసవిషయములను తెలిసికొనలేనా! (శ్రీబృందావన కృపచేత అయోగ్యుడనైననేను కూడ రసవిషయములను తెలిసికొనగలను).

**దిక్చక్రం ప్రసరత్పరాగ పటలైః సద్గంధ చూర్ణైరివా**
**పూర్ణం కుర్వదపూర్వసీధు జలధి స్యందైర్మహాతుందిలమ్**
**ఆచ్ఛన్నం చితిచంద్రికా లహరిభిః స్వానంద కోలాహలై**
**రాక్రాంతం మదఖేలినః ఖగకులస్యాభాతి వృందావనమ్ 92**

అన్ని దిక్కులలోను సుగంధ చూర్ణము వలె పరాగము (పుప్పొడి) విస్తరించినది. అపూర్వమైన అమృత సముద్రపు బిందువులతో విశాలమైన ఆ భూభాగము పూరితమైనది (నిండిపోయినది). చిత్ చంద్రికలతో ఆచ్ఛాదితమై (కప్పబడి)నది. మత్తిల్లిన, క్రీడాపరాయణమైన పక్షుల ఆనందపూర్ణమైన కోలాహలముతో ప్రతిధ్వనిస్తున్న ఈ శ్రీృందావనము మహా శోభాయమానముగ ఉన్నది.

**నీరంధ్రం తృణగుల్మపాదప లతాద్యానంద సచ్ఛిద్ఘనైః**
**శ్రీరాధారతికేలి కుంజ నికరైరానంద పుంజైర్వృతమ్**
**దివ్యానేక సరః సరిద్గిరివరం దివ్యైర్విహంగైర్మృగైః**
**చిత్రం మంజులగుంజ భృంగ పటలం పశ్యామి వృందావనమ్ 93**

శ్రీబృందావనము సచ్చిదానంద ఘనము! తృణము (గడ్డిపరక), పొదలు, వృక్షలతాదులతో ఆవృతమై (చుట్టివేయబడి); ఆనంద పుంజములతో కూడిన శ్రీరాధారతికేళీ కుంజలతో పరివృతమైనది (పరివేష్టితమైనది). దివ్యాతి దివ్యములైన సరోవరములు, నదులు, పర్వతములు మున్నగువానితో శోభితమైనట్టిది; దివ్యములైన పశుపక్ష్యాదులతో చిత్రితమైనట్టిది; మనోహరమైన గుంజారవము చేయుచున్న భ్రమరములతో విలసితమైనట్టిది అయిన ఆ శ్రీబృందావనమును నేను దర్శించుచున్నాను.

**నానారత్న మయ స్థలీభిరమితామోదాభిరత్యద్భుతమ్**
**ఫుల్లైర్వల్లిమతల్లికా తరువరైర్వీతం రసోల్లాసిభిః**
**అత్యానందమదాకులైః ఖగకులైరాబద్ధ కోలాహలమ్**
**కాలింద్యా రసధారయా వలయితం ధ్యాయామి వృందావనమ్ 94**

శ్రీధామము మిక్కిలి ఆనందదాయకమైన అనేక రత్నస్థలముల చేతను; అద్భుత రసోల్లాసమును కలిగించు ప్రఫుల్లిత లతలతోను, శ్రేష్ఠ వృక్షములతోను

శోభించుచున్నది. అత్యంత ఆనందముతో మత్తిల్లిన పక్షుల కోలాహలముతో నిండినది. నిరతిశయమైన శ్రీయమునా రసధారలతో పరివేష్టితమైన (చుట్టివేయబడిన) అట్టి బృందావనమును నేను ధ్యానించుచున్నాను.

**వినా స్వాత్మారామేశ్వర హరిమముగ్ధః త్రిభువనే**
**యువత్యా భావైః కో బత సురవరో వా మునివరః**
**స్థిత స్తస్మాత్తస్యాశ్చకిత చకితో దూరతరతః**
**సదా వృందారణ్యే నివస రసనోపస్థ విజయీ 95**

స్వాత్మా రామేశ్వరుడైన శ్రీహరి అనుగ్రహము లేనిచో మూడులోకాలలోను సురశ్రేష్ఠులు, ముని శ్రేష్ఠులతో సహా ఎవరు స్త్రీ పట్ల విముగ్ధులు కాకుందురు ? (అనగా భగవదనుగ్రహములేనిచో కామ వివశులగుదురని భావము). కనుక అత్యంత జాగరూకతతో స్త్రీకి దూరముగ నుండి; జిహ్వా (నాలుక)ను, ఉపస్థ (శరీరములోని క్రింది భాగము)ను జయించి శ్రీబృందావనములో నివసింపుము.

జిహ్వను జయించుట – రుచికరమైన ఆహారమునకై ఆరాటపడుట, మాటతూలుటలను జయించుట.

ఉపస్థను జయించుట – కామమును ప్రేరేపించు ఇంద్రియమును జయించుట.

**మహాపాపాచారే నిరవధి మహాదుర్మతి శతే**
**మహాకామక్రోధాద్యతి పరవశే దంభ వపుషి**
**న సత్సంసర్గైక ప్రణయిని మహద్ధర్మ విముఖే**
**మయి శ్రీమద్బృందావన! కురు కృపాం నాన్య శరణే 96**

మహా పాపములను చేయుచు, నిరంతరము మహాదుర్మతినై, మహా

కామక్రోధాదులచే బంధితుడనై, గర్వితుడినై, సత్సంగమును విడచి, మహద్ధర్మముల పట్ల విముఖుడినై ఉన్నాను. అయినప్పటికి, హే బృందావనమా! నేను నిన్నే అనన్యముగ శరణు చెందియున్నాను. నాపై కృప చూపుము!

ఎంతటి పాపియైనను శ్రీబృందావనమునకే అంకితమై, శరణు చెందితే దయగల ఆతల్లి అనుగ్రహిస్తుంది.

**అత్యంతోద్ధత ధావదింద్రియగణో యః సర్వదా సత్పథే**
**ష్వేకస్మిన్నిమిషేఽపి న స్మృత మహానందాబ్ధిరాధాప్రియః**
**సద్ధర్మైః సదుపాసనైర్విరహిత స్త్యక్తోఽఖిలైః సద్గుణైః**
**హాహా సోఽహమనల్పమోహ ఉపయామ్యేకం తు వృందావనమ్ 97**

హా! అయ్యో! సదా సర్వదా చెడుమార్గముల వైపుకే ఉద్ధతమైన (నియంత్రణలేని) ఇంద్రియములు పరుగు తీస్తున్నాయి. ఒక్క నిమిషము కూడ మహానందసాగరమైన శ్రీరాధాపతిని స్మరించుట లేదు. నేను సద్ధర్మములు, సదుపాసన లేనివాడినై; సమస్త సద్గుణములకు దూరుడనై మహామూఢుడినైనాను. అయినను శ్రీబృందావనమునే ఏకమాత్రముగ శరణుచెంది ఉన్నాను.

**వైరాగ్యేణ సముత్కటేన విషయ స్పర్శం మహాదుర్విష**
**జ్వాలావత్ కలయన్మనాగపి న తైః సంగేన రంగం దధత్**
**పాణౌ న్యస్య కపోలమశ్రుసలిలైః సంక్షాలయన్ రాధికా**
**కృష్ణాపార కృపావధారణ ధరోఽధ్యాసీయ వృందావనమ్ 98**

తీవ్రమైన వైరాగ్యవ్రతమును అవలంబించి, విషయాదుల స్పర్శను సైతము మహావిషముతో సమానముగ భావించి, ఆ విషయాదులతో లేశమాత్రపు సంబంధము కూడ లేకుండ జీవింతునా! చెక్కిలిపై చేయి చేర్చి, అశ్రువులు

ప్రవహించుచుండ శ్రీరాధాకృష్ణుల అనంతమైన కృపను మనసులో నిలుపుకొని నేను ఏదో ఒక విధముగ శ్రీబృందావనములో నివసింపగలనా! ఇదియే నా ప్రార్థన!

**నైవాలోకిత లోకవేద పదవిర్నాపేక్షిత స్వప్రియ**
**ద్వంద్వైకాంత రసాప్రవిష్ట హృదయాశేషాతిధన్యోత్తమః**
**రాధాకృష్ణరసాన్ముహుః పులకితో నిత్యాశ్రుధారాధర**
**శ్చిత్ర ప్రేమ వికారవాన్ బత! కదా నందామి వృందావనే 99**

హా! లోకమర్యాదను, వేదపదవి (వేద ధర్మములపట్ల ఆసక్తి)ని ఎన్నడును మనసులో ఎంచక; నా ప్రియతములైన యుగళ కిశోరుల ఏకాంతరస విహీనులైన వ్యక్తులతో సంబంధమును వదలి మిక్కిలి ధన్యుడనై; శ్రీరాధాకృష్ణ రసమునందు మాటిమాటికి పులకితుడనగుచు; నిత్య అశ్రుధారలతో విచిత్రప్రేమ వికాసశీలుడనై ఎప్పుడు నేను శ్రీబృందావనములో ఆనందమును పొందుతాను!

శ్రీసరస్వతీపాదులు 85వ శ్లోకము నుండి ఈ చివరి శ్లోకము వరకు శ్రీమద్బృందావనము యొక్క మహామహిమను, గరిమను, అపారమైన కరుణను, నిరంతర ప్రేమరస వివశతను, నిరవధిక శ్రీయుగళ పదచింతనను స్తుతించినారు. మానవుడు ఎట్టి దుష్కృత్యములను చేసినను పశ్చాత్తప్తుడై శ్రీబృందావనమునకే అంకితమై, శరణువేడినచో తల్లియై ఆదరించు శ్రీబృందావన నిత్యనివాస భాగ్యమే సర్వోత్కృష్ట సాధన!

# తొమ్మిదవ శతకము

**హసన్నృత్యన్ గాయన్నతి పులకితోఽత్యశ్రు నయనో**
**ముహుః స్తంభ స్వేదాద్యతి మధురభావైశ్చ వలితః**
**కదా వృందారణ్యం నిజ దయిత రాధా మధుపతీ**
**ముదా ధ్యాయం ధ్యాయం చిరమధివసామ్యున్మద రసః 1**

హాస, నృత్య, గానాదులను చేస్తూ చేస్తూ; మిక్కిలి పులకితుడనై; అశ్రు పూర్ణనేత్రాలతో మాటిమాటికి స్తంభము, స్వేదము (శృంగార రసానుభవములో కలుగు స్థితి) మున్నగు అతిమధుర భావయుక్తుడనౌతాను. అట్టి స్థితిలో నా ప్రియతముడైన శ్రీరాధాపతిని ధ్యానిస్తూ రసోన్మత్తుడనై నేను ఎప్పుడు చిరకాలము శ్రీబృందావనములో నివసిస్తాను ?

ఇట జీవుడు పరమాత్మను పతిగా భావించి; తాను స్త్రీగా భర్త పట్ల పొందుచుండు స్తంభము (నిశ్చేష్టత), స్వేదము (చెమట పట్టుట) మున్నగు సాత్త్విక భావములు వర్ణింపబడినవి.

**శ్రీగాంధర్వా చరణకమల ద్వంద్వ లావణ్యలీలా**
**మాధుర్యైకాంబుధిమతిమదం గాహతాం కర్హి చేతః**
**వృందారణ్యే తృణమివ పరిత్యజ్య సర్వామఖర్వామ్**
**నిర్వాణాది శ్రియమపి కదా వాసనిర్వాహకః స్యామ్ 2**

శ్రీరాధా చరణకమలముల యొక్క లావణ్యలీలామాధుర్య సాగరమునందు ఎప్పుడు నా మనసు మిక్కిలి మత్తిల్లి మునుకవేస్తుంది ? సమస్తములైన మహద్వస్తువులను, మోక్షాదిసంపత్తితో సహా తృణము (గడ్డిపోచ) వలె పరిత్యజించి; ఎప్పుడు శ్రీబృందావనములో జీవనమును నిర్వహించుకొనగలను ?

శ్రీరాధాచరణకమల మాధుర్యము ముందు మోక్షముతో సహా సమస్త లోకములు తృణప్రాయములని భావము!

**శ్రీమంజీర ధ్వని మధురయా శ్రీపదాంభోజ లక్ష్మ్యా**
**మాధుర్యౌఘైరుపరి చ తలే రమ్యయా గౌరశోణైః**
**స్ఫూర్జత్పాదాంగద మణిరుచా దివ్యపాదాంగులీయైః**
**భాజంత్యా హృన్నిజవనచరద్రాధయా వై హృతం మే 3**

సుందర, మధుర ధ్వనితో కూడిన మంజీరములతో శోభిస్తున్న శ్రీపద పద్మముల శోభతోను; శరీర పై భాగమున గౌరకాంతిని, పాదమునకు అడుగ భాగమున రక్తవర్ణమును కలిగి మాధుర్య ప్రవాహముతో వెలుగుచున్న పాదాంగదము (ఒక ఆభరణము) యొక్క మణికాంతితోను; దివ్యమైన పాదాంగుళుల (కాలివేళ్ల)తోను రమణీయముగనున్న శ్రీరాధ తన వనములో (బృందావనములో) తిరుగాడుచు నా మనసును హరించినది.

**రాధా పాదాంబుజ రసమహామాధురీమత్త చేతో**
**భృంగో నిర్భంగురపరిమిలల్లోక వేదప్రసంగః**
**కంచిద్భావ మధురమధురం భావయన్ విశ్వచేతో**
**దృష్ట్యాకృష్ట్యాకృతిరపి భవాన్యత్ర వృందావనే కిమ్ ? 4**

శ్రీరాధాచరణ కమలముల యొక్క రసమహామాధుర్యములో మనస్సు అనెడు భ్రమరము మత్తిల్లి; లౌకిక ప్రసంగములను, వేదప్రసంగములను పూర్తిగా వదలి; ఒకానొక మధురాతి మధుర భావమును నిరంతరము చింతిస్తూ లోకదృష్టికి, విశ్వ చిత్తమునకు ఆకర్షణ కలిగించు ఆకృతితో నేను బృందావనములో ఉండగలనా!

లౌకిక విషయాదులనన్నిటినీ త్యజించి, శ్రీరాధాచరణ కమల రస మాధుర్యములో తేలియాడుచు, ఒకానొక మధుర భావానుభూతిలో నుండు మహాత్ముడు ప్రపంచమంతటికినీ సేవింపదగినవాడు!

**తత్ కైశోరం తాః సుగౌరాంగ భంగీ**
**స్తత్ సౌందర్యం తాః సుధాశీత సూక్తీః**
**తాంస్తాన్ భావానశ్రు రోమోద్గమాదీన్**
**శ్రీరాధాయాః సంస్మరన్ కో న ముహ్యేత్ 5**

శ్రీరాధాజీ యొక్క ఆ కైశోర స్థితి, ఆ గౌరాంగముల వివిధ భంగిమలు, ఆ సౌందర్యము, ఆ అమృతతుల్యమైన శీతలసుందర వాక్కులు, ఆ సమస్త అశ్రురోమాంచాది (కన్నీరు, పులకలు) భావములను స్మరిస్తే ఎవరు ముగ్ధులు కాకుండ ఉండగలరు ? (రాధాజీ యొక్క ప్రతికదలిక, క్రీగంటి చూపు, తీయని మాటలు, ఇంకను ఆయా స్థితులను స్మరించినంతమాత్రముననే ఎవరైనను ముగ్ధులగుదురని భావము!)

**వ్యాకోశ కనక పంకజ కోశమివాఽనంత చంద్రికావర్షి**
**స్మర రాధాముఖమిందీవరరుచి హరిలోభ్య సాంద్ర మకరందమ్ 6**

నీలికమల వర్ణకాంతిగల శ్రీహరి శ్రీరాధాజీ యొక్క సాంద్రమధుర రసము పట్ల లోభమును కలిగియుండును. అనంత ప్రకాశముతో, ప్రఫుల్లిత స్వర్ణ కమలాంతర్భాగము వలెనుండు అట్టి శ్రీరాధా ముఖచంద్రుని స్మరింపుము!

**చిదచిద్ద్వైత ప్రోంజన కనకోజ్జ్వల సాంద్రచంద్రికా వర్షి**
**శ్రీరాధాముఖచంద్రం కృష్ణచకోరైక జీవనం స్మరత 7**

చేతనములు, జడములు అనుభేదమును దూరము చేయునదియు; స్వర్ణోజ్వలమైన చంద్రిక (కిరణము)లను ప్రసరింపజేయునదియు; శ్రీకృష్ణుడను చకోరమునకు ఏకమాత్రజీవనమైనదియునైన శ్రీరాధా ముఖచంద్రుని స్మరింపుము!

శ్రీరాధాముఖచంద్రుని స్మరించినంత మాత్రముననే ద్వంద్వములన్నియు నశించును. జగన్నాయకుడైన శ్రీకృష్ణచంద్రునికే ఆదేవి జీవనాధారము! అట్టి తల్లినే నిరవధికముగ ధ్యానించుట జీవుని పరమధర్మము!

**పరిపూర్ణ మధుర మధుర ప్రేమసుధాసార సుందరాకృతయే**
**నిత్యకైశోర్యై మమ నమ ఏతద్బృందావనేశ్వర్యై 8**

పరిపూర్ణమైన, మధుర మధురమైన ప్రేమామృత సారమైనదియు; సుందరమైన ఆకృతిచే విశిష్టమైనదియు; నిత్యకిశోరియునైన శ్రీబృందావనేశ్వరి రాధాజీకి నేను నమస్కరిస్తున్నాను.

**స్వాద్యప్రేమ మహారససార సుగౌరాంగ చంద్రికా జలధీన్**
**రాధాయాః స్మర పరమోచ్ఛలితాంశ్చిదచిద్ద్వయం సమాచ్ఛాద్య 9**

శ్రీరాధ చేతనములకు, జడములకు గల భేదమును దూరము చేస్తుంది. పరమ ఉచ్ఛలితయైన (మిక్కిలి ప్రేమతో చలించునది) శ్రీరాధ యొక్క ఆస్వాదింపదగిన మహాప్రేమరససార గౌరకిరణ సాగరమును స్మరింపుము!

శ్రీరాధ చేతనా చేతనముల భేదమును రూపుమాపి, సమదృష్టిని అనుగ్రహించుతల్లి! జీవులపైగల పరమప్రేమతో అమ్మహృదయము నిరంతరము ఎగసిపడుతూ ఉంటుంది. అట్టి మహాప్రేమ రససాగరమైన రాధాజీనే స్మరింపుడు!

**అప్రాకృత నవతరుణీ రూపతృణీకారి మోహినీవృందైః**
**పథిపథి మూర్ధ్ని ధృతాంఘ్రిర్వనభువి రాధా మమేశ్వరీ స్ఫురతి 10**

అప్రాకృతికమైన నూతన యువతుల రూపమును తృణము వలె తృణీకరించు (అనగా అప్రాకృతిక స్త్రీల రూప శోభ కూడ రాధాజీ ముందు తృణమువలె అత్యల్పమే) శ్రీ రాధాజీ బృందావనములో సంచరించునపుడు మోహినీ స్వరూపులైన సఖీమణులు ఆదేవి శ్రీచరణములను శిరసుపై ధరింతురు. నా స్వామినియైన ఆ శ్రీరాధ నాలో ప్రకాశించుచు స్ఫురిస్తున్నది.

శ్రీరాధా దివ్యసౌందర్యము దేవతా స్త్రీల అందమును కూడ తృణీకరించునట్టి తేజోవైభవము కలది! అట్టి ఆ తల్లి బృందావనములో విహరించుచున్నపుడు

ఆ మృదుల పాదములు కందిపోకుండ సఖీమణులు తమ శిరసులపై వహించి, సేవించుచుందురు.

**త్రైలోక్య మోహినీభిర్నవ తరుణీభిర్మహా విదగ్ధాభిః**
**ఆరాధ్యాం స్మర వృందావిపినే సర్వోజ్జ్వలాం రాధామ్ 11**

త్రిభువనములను మోహింపజేయునదియు, మహావిదగ్ధయు (నిపుణత కలది), నవతరుణీ బృందములకు ఆరాధ్యయు, సర్వోజ్వల స్వరూపిణియునైన శ్రీరాధాజీని శ్రీబృందావనములో స్మరింపుము!

**ఉన్మద మధుర ప్రేమానంద మరందైక సింధు నిస్యంది**
**రాధాపదారవిందం విశ్రమయన్నౌమి కింకరీ వృందమ్ 12**

ఉన్మదమైన, మధురమైన, ఏకమాత్ర (ఒకే ఒక)మైన ప్రేమానంద మాధుర్యమును ప్రవహింపజేయు శ్రీరాధా చరణకమలముల చెంత విశ్రాంతిని పొందు దాసీమణులకు నేను నమస్కరిస్తున్నాను.

**అపి సర్వధర్మహీనః సర్వకుకర్మావలేశ్చ నిర్మాతా**
**రాధేతి సిద్ధమంత్రం ద్వ్యక్షరముచ్చార్య కిం న సిధ్యేయమ్ ? 13**

సర్వధర్మహీనుడవైనను, సమస్తములైన కుకర్మలను చేయుచున్నప్పటికిని "రాధ" అను రెండక్షరముల సిద్ధమంత్రమును ఉచ్చరించినచో నీవు సిద్ధిని పొందలేవా ఏమి ?

అనగా "రాధ" అను రెండక్షరములు సిద్ధమంత్ర బీజాక్షరములు! ఆ దివ్యాక్షరద్వయిని ఉచ్చరించినంత మాత్రముననే ధర్మహీనుడు, కర్మదీనుడు కూడ తరింపగలడని భావము! 'రాధే, రాధే' అని ప్రేమతో పిలచిన చాలును 'ఓ' యని పలుకుటకు సిద్ధముగనున్న సిద్ధేశ్వరి శ్రీరాధ! ఎక్కడ ఉన్నది ఇటువంటి అమ్మ!

**అతిసాహసమాచరితం విరుధ్యగురు శాస్త్ర విద్వద్వర్యైః**
**త్వయి వృందావన! వాసాయేంద్రియ వశమప్యతో న హి త్యజ మామ్ 14**

హేశ్రీబృందావనమా! ఇంద్రియములకు వశుడనై యుండియు; శ్రేష్ఠమైన గురు, శాస్త్రవేత్తల మాటలకు విరుద్ధముగ ఆచరించుచు అత్యంత సాహసముతో ఇచట నివసించుటకు వచ్చితిని. నన్ను త్యజింపకుము!

రాధాజీకి రెండవ రూపమైన శ్రీబృందావనములో నివసించుటకు ఎట్టి యోగ్యతయు లేకపోయినను, బృందావనమునే ఆశ్రయించి శరణుకోరినచో ఆ తల్లి తప్పక స్వీకరించునని విశ్వాసము!

**త్వయి కృత కుకర్మకోటేరపి చాండాలాన్మహాధమస్యాస్య**
**ఈశోఽపి నైవ శరణం హా వృందారణ్య! కిం విధాస్యసి మే ? 15**

హేశ్రీబృందావనమా! చండాలుని కన్నను మహా అధముడనైన నేను నీ పట్ల ఎన్నో కుకర్మలను చేయలేదా ? ఈశ్వరుడిని కూడ నేను శరణు కోరుటలేదు. నీవు నన్ను ఏదో ఒక రీతిలో అనుగ్రహించవా ఏమి ? (దయామయియైన బృందావనము తప్పక అనుగ్రహిస్తుందని ఆంతర్యములో శరణము వేడుట).

**అతిదుర్లభపద ఆశావాసాయ సా హి తు దుర్ఘటా త్వయిమే**
**కృత సర్వేంద్రియ శత్రోర్హా వృందారణ్య! కిం ను మే భవితా 16**

హే బృందావనమా! అతిదుర్లభపదమైన ధామము నందు నివసింపవలెనని నా ఆశ! కాని ఇంద్రియములన్నియు శత్రువులగుటచే నా పట్ల అతి కఠినముగ నున్నవి. హా! నాగతి ఏమి కానున్నది ?

శ్రీధామమునందే నివసింపవలెనను ఆశ తీవ్రముగ ఉండుటచే ప్రీతిరీతి రూపమైన శ్రీబృందావనము తనను అనుగ్రహిస్తుందని విశ్వాసము!

**అస్తు మే నరకకోటిః సిధ్యతు నేష్టం న చేశ్వరో దయతామ్**
**శ్రీరాధా చరణాంబుజ మధురిమ లోభస్తు నో భవేచ్ఛిథిలః 17**

నేను కోటి నరకములను అనుభవింపవలసివచ్చినను, నామనోరథములు తీరకపోయినను, లేక ఈశ్వరుడు నాపై దయమాలినను – ఏమైనను శ్రీరాధా చరణకమలముల మాధుర్యముపై నా లాలస (తీవ్రమైన ఇష్టము) ఎన్నటికిని తగ్గదు.

**మంజీర మంజుతర శింజిత రంజితాంఘ్రి**
**శోభా హరేరపి మనో దృగపారలోభా**
**వృందావన భ్రమణ భంగి మనోహరాంగ్యాః**
**ప్రేమాతురే స్ఫురతు మే హృది రాధికాయాః 18**

శ్రీబృందావనములో సంచరించుచుండ మధురముగ ధ్వనించుచున్న నూపురములతోడి శ్రీరాధా చరణముల శోభ శ్రీహరి మనస్సును, దృష్టిని కూడ లోభపరచుచున్నవి. ఆ శోభయే ప్రేమాతురమైన నా హృదయములో స్ఫురించునుగాక! (శ్రీరాధను దర్శించుటకాదు, ఆ చరణ మంజీర ధ్వనిని విన్నంతనే శ్రీకృష్ణుడు వశీకృతుడగుచున్నాడు. ఏమి ప్రేమైకశోభ!)

**కైశోరకాంతి మదభంగి తరంగితోరు**
**మాధుర్య సింధుబుడితా హరిభావమూర్తిః**
**భ్రూభంగిమోన్నటనరంగదనంగ కోటిః**
**శ్రీరాధికా రసమయీ హృది మే చకాస్తు 19**

శ్రీరాధ కైశోరావస్థయందలి కాంతి చేతను, మత్తిల్లజేయు భంగిమల రూప తరంగములచేతను పరిపూర్ణమైన మాధుర్య సాగరము! అందు నిమగ్నమైన హరి యొక్క భావమూర్తి ఆమెయే! ఆ దేవి యొక్క భ్రూభంగ సంజ్ఞ (సైగ) మాత్రము

చేత అనంతకోటి మన్మథులు నాట్యము చేయుదురు. అట్టి రసమయి శ్రీరాధ నా హృదయము నందు ప్రకాశించునుగాక!

శ్రీరాధా ప్రేమకాంతి, రూపశోభ, మాధుర్యసారములు శ్రీకృష్ణునకు భావరూప దర్శనమునను‌గ్రహించినవి. రూపము లేదు, భావమే!

**అంగేంగే యః సదాత్యుచ్ఛలతి వలతి యో దివ్యకైశోరరూపే**
**యో దృగ్భంగీ సలజ్జస్మిత మధురతర శ్రీముఖేందుచ్ఛటాసు**
**యోవాఽశ్చర్యోక్తి గత్యాద్యఖిల రసధురా చేష్టితే రాధికాయాః**
**తత్తన్మాధుర్య సింధౌ వుడతు మమ మనో భావమాధుర్యధుర్యమ్ 20**

శ్రీరాధా అంగాంగములు సదా సర్వదా ఉచ్చలితమగుచు (ఎగసిపడుతూ) ఉంటాయి. ఆ దివ్యకైశోర రూప శోభ నిరంతరము వృద్ధి చెందుతూ ఉంటుంది. నయన భంగిమతోను, లజ్జతో కూడిన నవ్వుతోను మధురతర శోభామయమైన ముఖచంద్రుని కాంతి ప్రకాశిస్తూ ఉంటుంది. ఆశ్చర్యమయమైన మాట, కదలిక మున్నగు సమస్త రసమయ చేష్టలతో ఒప్పుతూ ఉంటుంది. శ్రీరాధ యొక్క అట్టి మాధుర్య సాగరములో భావ మాధుర్యముతో నిండిన నా మనసు నిమగ్నమైనది.

**తత్ కైశోరం మహామోహన మధుర దశాశ్చర్యవత్తద్దంగమ్**
**సాశ్చర్యాపాంగభంగీ స చ మధుర హ్రియా మోహనో మందహాసః**
**తత్ సౌందర్యం స కాంతిప్రసర ఉరువిధాస్తేఽంగభంగోత్తరంగా**
**స్తాస్తాః శ్యామానురాగ ప్రథమ వికృతయో భాంతు మే రాధికాయాః 21**

శ్రీరాధాజీ యొక్క ఆ కైశోరావస్థ, మహామోహన మధుర దశతో కూడిన ఆశ్చర్యమయమైన శరీరాకృతి, ఆ ఆశ్చర్యకరమైన కటాక్షవీక్షణరీతి, ఆ మధుర లజ్జాయుక్తమైన మోహన మందహాసము, ఆ సౌందర్యము, ఆ కాంతి విస్తారము, బహువిధములైన ఆ అంగ భంగీ తరంగములు, శ్యామునియందలి అనురాగముచే కలిగిన ఆ ప్రథమ భావరాశి నా హృదయములో స్ఫురించునుగాక!

శ్రీరాధాజీలో ప్రకాశిస్తున్న కైశోరావస్థ, ప్రేమరసాకృతి, మధురమోహన మందహాసము, సౌందర్యసారసారము ఇవయన్నియు శ్రీశ్యామునియందలి అనురాగము వలన ప్రకటితమైన ప్రథమ భావరాశియట! ఇట సాకారవర్ణనము ఉన్నను అంతయు భావస్వరూపమే!

**సౌందర్యానంతపూరైః కనకమణి శిలాఘృష్ట కాశ్మీర గౌరైః**
**అంగైరంగైః కిరంతీ మధురతర మహాకాంతి సింధూననంతాన్**
**శ్యామప్రేమాతి మాధ్వీమదవికృతి విచిత్రాకృతిః సర్వచేష్టా**
**మాధుర్యైరద్భుతైర్విస్మిత మనసి సదోదేతు రాధేశ్వరీ 22**

శ్రీరాధ అనంత సౌందర్య ప్రవాహరూపిణి. స్వర్ణమణి శిలచే ఏర్పడిన కాశ్మీర గౌరకాంతివంటి దేహకాంతి కలది. మధురతరమైన అనంత మహాకాంతి సముద్రము వంటి అంగాంగములతో ప్రకాశించునది. ఆమె శ్రీశ్యామసుందరుని ప్రేమాతిశయ రూపమధువునకు హేతువైన విచిత్ర ఆకృతి కలది. ప్రాణేశ్వరియైన ఆ రాధాజీ యొక్క సమస్త చేష్టల అద్భుత మాధుర్యము నిరంతరము నా మనసునకు విస్మయము కలిగిస్తూ ఉంటుంది.

**సర్వాత్యుత్తమతోఽ త్యుపరి భాత్యానంద సామ్రాజ్యభృత్**
**వృందారణ్యమిహైవ భాతి సకలాశ్చర్యం కిశోర ద్వయమ్**
**తత్ప్రాణాత్మ మహా శుభావ లలితాద్యాలీ నిదేశే స్థితో**
**యోఽ ంతః స్వేష్టతనుః స్ఫురన్ రసమయం చేష్టేత తస్మై నమః 23**

సమస్తములైన అత్యుత్తమ ధామములకన్నను ఉపరి స్థానములో ఆనంద సామ్రాజ్యమైన శ్రీబృందావనము శోభిస్తున్నది. ఈ స్థానమునందే సర్వాశ్చర్యమయమైన శ్రీయుగళకిశోరులు విరాజమానులైయున్నారు. ఆ యుగళ కిశోరులకు ప్రాణ స్వరూపులై, శ్రేష్ఠభావయుక్తులైన శ్రీలలితాది సఖీమణులు అట ఉన్నారు. ప్రేమాతిశయము వలన వారి ఆజ్ఞానుసారము వర్తించుచు,

అంతరంగ స్వీయ అభీష్ట స్వరూపమునందు స్ఫూర్తితో కూడిన రసమయ చేష్టలను రాధాజీ ప్రకటించుచున్నది. అట్టి తల్లికి నమస్కరిస్తున్నాను.

శ్రీకృష్ణునితో సహా సమస్త జగత్తులకును స్వామినియైన శ్రీరాధాజీ తనకే అంకితమైన సఖీమణులకు వశవర్తియై రసాత్మక లీలలను ప్రకటిస్తున్నది. 'భక్తానుగ్రహకాతర' కదా!

**మధుర రణ్మణి నూపుర రాధాపాదారవింద సౌందర్యమ్**
**వృందావనభువి సంతతమనుచింతయతో మమ క్షణాయాంతు 24**

మధురముగా ధ్వనిస్తున్న మణి నూపురములతో అలంకృతమైన శ్రీరాధా చరణ కమలముల సౌందర్యమును నిరంతరము చింతన చేస్తూ, చేస్తూ ఈ శ్రీబృందావనములో నా సమయము గడచునుగాక! (జీవునకు ఉండవలసిన ఆశయము ఇది!)

**సుస్నిగ్ధ కాంతిధారా పరిమల సౌందర్య సౌకుమార్యాద్యైః**
**తదమేయ చరణకమలం రాధాయాః సుకలనూపురం స్ఫురతు 25**

శ్రీరాధాజీ సుకుమారమైన కాంతిధారయై, పరిమళముతోకూడి, సౌందర్యము, సౌకుమార్యము మున్నగు గుణములతో శోభిస్తూ ఉంటుంది. రవళిస్తున్న నూపురములతో భూషితమైన శ్రీరాధా అనుపమ చరణకమలములు నాలో స్ఫురించునుగాక!

**అరుణతలముపరి గౌరం మధురైర్లసితై ర్వరైర్మనశ్చౌరమ్**
**రాధాయాస్త్వతి సుందర చరణ సరోజం మనో జపతు 26**

శ్రీరాధా పాదములు అరుణ వర్ణములో నుండి, దేహకాంతి గౌరవర్ణ రంజితమై ఉన్నది. మధుర మందహాసముతో శ్రీహరిమనసును హరించు ఆ శ్రీరాధా సుందర చరణకమలములను నామనసు జపిస్తున్నది.

శ్రీరాధా అరిపాదములు సుకుమారమైన అరుణవర్ణములో వెలుగుతూ ఉంటాయి. దివ్యశరీరకాంతి గాలిసోకినచో కందిపోవు స్వర్ణవర్ణముతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఇక చిరునవ్వు నవ్వెనా “నిరంతరం వశీకృత ప్రతీత నందనందనే”! అట్టి సుకుమారిని ఎంత సుకుమారముగ చూచుకొనవలెను ? ఇంకెంత భావపూర్ణముగ భావింపవలెను! భావుకులకే ఎరుక!

**పాదాంగుళీయ పాదాంగద నూపురరత్నరోచిషాం వీచీః**
**రాధాపదాబ్జ ఈక్షే నఖమణి చంద్రోచ్ఛలచ్ఛటాచ్ఛురితాః 27**

శ్రీరాధాజీ తన చరణకమలముల అంగుళులకు (వేళ్లకు) ధరించిన పాదాంగదముల (పాదములకు పెట్టుకొను ఆభరణములు), నూపురముల రత్నకాంతి కిరణముల చేతను; నఖమణిచంద్ర (గోళ్లు అనెడు మణుల) కాంతి చేతను ఎగసిపడుచున్న దీప్త తరంగములను దర్శింపవలెనని కోరుకొనుచున్నాను.

అత్యంత కాంతిమంతమైన దివ్యాభరణములు శ్రీరాధ యొక్క కదలికల వలన ప్రసరిస్తున్న కాంతిచేత మరింత దేదీప్యమానముగ వెలుగుచున్నవి.

**కృష్ణేందిందిర లోభ్యం పురు సౌరభ్యం న హీందిరాలభ్యమ్**
**సాంద్రానందమరంద పదారవిందం స్మరామి రాధాయాః 28**

శ్రీరాధా చరణకమలములు శ్రీకృష్ణుడు అను భ్రమరమునకు లోభనీయములు! అవి లక్ష్మీదేవికిని అలభ్యములు! అట్టి అత్యంత సుగంధపూర్ణమైన, సాంద్రానంద రసపూర్ణమైన శ్రీరాధాచరణములను స్మరిస్తున్నాను.

**అతిమృదులాంగులి పల్లవ విలసన్నఖచంద్రమండలం మధురమ్**
**మణి మంజీర మనోహర చరణయుగం మే చకాస్తు రాధాయాః 29**

అతి కోమలమైన పల్లవముల వంటి అంగుళులతోను, నఖచంద్రులతోను భూషితమై; మధుర మణినూపురములతో మనోహరమైన శ్రీరాధా చరణయుగళి నా హృదయములో ప్రకాశించునుగాక!

**రాధాచరణ రణన్మణి నూపుర మూకీకృతాం హరేర్మురలీమ్**
**విఫలిత తత్తత్ ఫుత్కృతిమఖిల సఖీసార్ధహాసినీం స్మరత 30**

శ్రీరాధాచరణ కమలముల నూపుర ధ్వనిచేత శ్రీశ్యాముని మురళి మూగబోయినది. శ్రీకృష్ణచంద్రుడు మాటిమాటికిని మురళిని ప్రయోగింప యత్నించియు విఫలుడైనాడు. అది చూచి సఖీ బృందము నవ్వసాగినారు. అట్టి లీలను స్మరింపుము!

శ్రీరాధ నడయాడునపుడు నూపురములు చేయు ధ్వని మాధుర్యమునకే మాధవుని మురళి మూగబోయెనన, ఇక ఆ స్వరదేవి కొలదిగ రాగమునాలపించిన ఏమగునో కదా!

**స్పర్శయదాననలోచన హృదయే జిఘ్రన్ముహుర్ముహుః**
**రాధాసురభి సుశీతల పదకమలం ధామ శోభతే శ్యామమ్ 31**

శ్రీరాధాజీ చరణ కమలములు సుగంధ పూర్ణమై, శీతలమై ఉంటాయి. ఆ శ్రీ చరణములను తన ముఖబింబముతోను, కన్నులతోను, హృదయముతోను మాటిమాటికి ఆఘ్రాణించుచు ఒకానొక అనిర్వచనీయ శ్యామ విగ్రహము (శ్రీశ్యామ సుందరుడు) విరాజమానమై ఉన్నది.

**రాధాపదారవిందోచ్ఛలదతి మాధుర్య సింధు నిస్స్యందైః**
**మమ హృదయం లయమయతాం వృందారణ్యే కదోన్మదప్రణయమ్ 32**

శ్రీరాధాచరణ కమలముల నుండి ఎగసిపడుతున్న మాధుర్య సాగరము నందలి బిందువులతో తడిసి ఎప్పుడు నా హృదయము ప్రేమోన్మత్తమై శ్రీబృందావనములో లీనము ఔతుంది ?

శ్రీరాధా శ్రీపాదములే మాధుర్యసాగరము అనుట ద్వారా ఇక ఆదేవి యొక్క సంపూర్ణరూపము "సాంద్రప్రేమామృత రస మహాసింధు కోటిర్విలాసము" అని ప్రత్యేకించి వర్ణింపనవసరములేదు. అది భావుకునకు భావనాగమ్యము!

**వృందావనేఽతి మధురాద్భుత రణిత మంజు మంజీరమ్**
**ప్రసరన్నఖమణిభాసం పదవిన్యాసం స్మరామి రాధాయాః 33**

శ్రీబృందావనములో అతిమధురముగ, అద్భుతముగ ప్రకటితమగుచున్న శ్రీలీలలు మనోహరమైన నూపుర ధ్వనితో శోభించుచున్నవి. నఖమణుల కాంతి నాలుగు దిక్కులలోను ప్రసరిస్తున్నది. అట్టి శ్రీరాధా పదవిన్యాసమును నేను ధ్యానించుచున్నాను.

శ్రీప్రబోధానందులు 24వ శ్లోకము నుండి 33వ శ్లోకము వరకు శ్రీరాధాపదకమల దివ్యరస శోభను తనివితీరని శైలితో వర్ణించినారు.

**వృందా కానన కుంజవేశ్మసు సదాఖేలత్కిశోర ద్వయమ్**
**గౌరశ్యామలమున్మదేన మదనేనాత్యంత లోలం భజే**
**స్వీయ స్వీయ కలా విచిత్ర సురత క్రీడా ప్రబంధైర్మిథో**
**విస్మేరీకృత మోహిత ప్రహసిత ప్రోత్సాహితోన్మాదితమ్ 34**

శ్రీబృందావన కుంజలలో నిరంతరము క్రీడా పరాయణులైన గౌరశ్యామాత్మక యుగళ కిశోరులను నేను భజిస్తున్నాను. వారు ఉన్మత్త అనంగ స్థితి వలన అతి చంచలురై ఉన్నారు. శ్రీయుగళము తమ తమ కళావైచిత్రితో కూడిన శృంగార కేళితో ఒకరి పట్ల మరొకరు విస్మితులు, మోహితులు ఔతున్నారు. నవ్వుకొనుచు, ప్రోత్సహించుకొనుచు ఉన్మత్తులగుచున్నారు.

**శ్యామేనాన్నృజునా కిమాలి! మమ కిం ధత్సే సదా తాదృశమ్**
**చంద్రావల్యతిపుల్లితేన మమ కిం తాదృక్ దధాసి శ్రుతౌ**
**విష్వక్ చంచల చంచలేన మమ కిం తాదృక్ వినా ధ్యాయసే**
**రాధేత్యాలిగిరా చకాస్త్యతి రుషా నీలాంబుజైస్తాం ఘ్నతీ 35**

"హేసఖీ! కుటిలుడైన శ్యామసుందరునితో ఏమిపని ? ఆతనిని నీవు ఎందుకు మనసులో గుర్తు చేసుకుంటున్నావు ? ఒకవేళ చంద్రావళి చెంత ఆతనికి మిక్కిలి ఆనందము కలిగితే మాత్రము మనకు ఏమిటి ?" అని రాధాజీ పలికినది.

"ఆ చంద్రావళిని (ఎర్రని ముత్యముతో కూడిన చంద్రహారము) మరినీవు ఏల కర్ణాభరణముగ ధరించితివి ?" అని సఖి ప్రశ్నించినది.

"అన్ని విధములుగా అతిచంచలుడైన ఆ శ్యామసుందరునితో మాకు ఏమీ అవసరము లేదు" అని రాధాజీ రోషముతో పలికినది.

"అయినచో చంచలుడైన ఆ శ్యాముని వదలి, వేరొకరిని ధ్యానింపుము" అను సఖి పలుకులను విని రాధాజీ అత్యంత క్రోధితయై చేతిలోని నీలిపద్మముతో ఆ సఖిని దెబ్బవేసినది. ఇట్టి లీలా శోభను ధ్యానింపుము!

శ్రీశ్యామాశ్యాముల నడుమ ఘటించిన ఈ లీలయు, సఖిచేసిన పరిహాసము – ఇదంతయు లీలార్థమే అని మరువరాదు.

**బ్రహ్మాద్యా అమరాః సురాసురనరా యేఽన్యే చ యోగీశ్వరా**
**నో మాయాం యువతీమయీం భగవతస్తర్తుం సముత్సేహిరే**
**క్షోదీయాం స్త్వహమేతయాస్మి విహితశ్చాండాల చాండాలకః**
**స్వీకారే తవ సాధువృంద తిలకైర్వంద్యేయ వృందాటవి 36**

బ్రహ్మాది శ్రేష్ఠ దేవతాగణములు, ఇంద్రాది అమరులు, రాక్షసులు, మానవులు, యోగీశ్వరులు ఎవ్వరు కూడ భగవంతుని యొక్క స్త్రీరూప మాయను దాటలేరు. అతి క్షుద్రుడనైన నేను కూడ ఈ మాయకు లోబడి చండాలునివలె కూర్రకర్మలను ఆచరిస్తున్నాను. హే బృందావనమా! అట్టి నన్ను నీవు స్వీకరించినచో సాధు పురుషులచే కూడ నమస్కరింపదగినవాడను ఔతాను కదా!

అంటే శ్రీబృందావనము అనుగ్రహించి స్వీకరించినచో ఎట్టివాడైనను పూజనీయుడు ఔతాడని భావము!

**విచిత్రమణిమౌక్తిక ప్రకరగుచ్ఛ నానా మణి**
**చ్ఛటౌఘ కనక స్ఫురన్మురలికాం నిధాయాధరే**
**సదా గృణతి రాధికోజ్జ్వల యశాంసి వృందావనే**
**మనో మమ మనోహరే క్వచన ధామని శ్యామలే 37**

శ్రీకృష్ణుని మురళి విచిత్రమైన మణులతోను, ముత్యములతోను, అనేకములైన మణుల కాంతితోను సువర్ణఖచితమై మనోహరముగ అలంకృతమై ఉన్నది. అట్టి మురళిని పెదవులపై వహించి అతడు శ్రీబృందావనములో నిరంతరము శ్రీరాధా ఉజ్వల యశోగానమును చేస్తూ ఉంటాడు. అటువంటి మనోమోహన శ్యామసుందరుడు నా మనసులో నిలచియుండునుగాక!

**ఏకైకాంగ ప్రోచ్ఛలత్ స్వర్ణగౌర స్నిగ్ధానంతజ్యోతిరాచ్ఛాదితాశా**
**వృందారణ్యే రూపశోభైక సీమా కాపి శ్యామాత్మైక చోరీ కిశోరీ 38**

శ్రీరాధ తన అంగాంగముల ఉజ్వల, స్వర్ణ, కోమల జ్యోతి (కాంతి) చేత దిశలనన్నిటిని ఆవరించియున్నది. శ్రీబృందావనములో రూపశోభకు చరమ సీమయైన ఆ కిశోరీజీ ఒకానొక శ్యామ ఆత్మను (వర్ణనాతీతమైన శ్రీశ్యాముని ఆత్మను) దొంగిలించి, విరాజమానయై ఉన్నది.

శ్రీరాధా అనంతరూప శోభ వర్ణనకు అందరాని శ్రీశ్యామసుందరుని ఆత్మనే అపహరించినదట! కనుక అది కేవల రూపశోభకాదు; అదియును వర్ణనాతీతమైన, వేదాతీతమైన దివ్యాతి దివ్యసౌందర్యమని భావము!

**హేమాంభోజ ద్వితయ ముకులాపూర్ణహేమైక చంద్రా**
**మధ్యేశూన్యా తత ఉరుతరానంత కాంతిం కిరంతీ**
**వృందారణ్యే కనకలతికా శ్యామమేకం తమాలమ్**
**దివ్యం కాఽప్యున్మద రసమహో వేష్టతే కుంజసీమ్ని 39**

ఓహో! శ్రీబృందావన కుంజలలో స్వర్ణ కమలముల వంటి రెండు మొగ్గలను (అనగా శ్రీరాధా వక్షస్థలము), ఒక పూర్ణచంద్రుడిని (అనగా ఆదేవి వదనము) ఒకరు ధరించి ఉన్నారు. వారి (ఆమెకు గౌరవవాచకము) నడుము మిక్కిలి సన్నమై అత్యంత కాంతిని ప్రసరింపజేస్తున్నది. అట్టి ఒక బంగారు తీగ (శ్రీరాధ) దివ్యోన్మాద రసముతో నిండిన ఒకానొక తమాల వృక్షమును (శ్రీశ్యామసుందరుని) కౌగిలించుకొనినది.

ఇట శ్రీసరస్వతీ పాదులు శ్రీశ్యామాశ్యాముల రసోన్మద స్థితిని మిక్కిలి ఆలంకారికముగ వర్ణించినారు.

**కర్ణాలంకృత కర్ణికార కుసుమం సంచుంబ్య బింబాధరమ్**
**గాయద్వేణు సుగంధ వేణువలిత శ్యామాభిరామాకృతి**
**చూడాలోల శిఖండముజ్జ్వల తడిత్ పీతాంబరం సుందరమ్**
**శ్రీరాధారతి లంపటం స్మర మనస్తద్ధామ వృందావనే 40**

శ్రీశ్యామసుందరుడు చెవులకు కర్ణికార కుసుమములను కుండలములుగ ధరించినాడు. ఆతని బింబాధరములను గోపీమణులు సదా ముద్దుగొంటూ ఉంటారు. సుగంధపూర్ణములైన పుష్పములనమర్చిన వేణువును మ్రోయించుచున్న ఆతని శ్యామవర్ణ శరీరము అత్యంత మనోహరముగ ఉన్నది. శ్రీశ్యామసుందరుడు శిరస్సుపై నెమలి పింఛమును వహించి, ఉజ్వలమైన కాంతితో కూడిన పీతాంబరములను ధరించినాడు. ఓ మనసా! శ్రీరాధా రతి లంపటుడైన (రాధాజీ యందు అత్యంత ప్రీతికల) ఆ సుందరాంగుని శ్రీబృందావనములో స్మరింపుము!

**జీయాదేకం దిశిదిశి మహాగౌరకాంతి ప్రసారమ్**

**సారం ప్రేమామృత రస మహావారిధేరత్యుదారమ్**

**వృందారణ్యే వివిధ కలయా మోహినీ వృంద సేవ్యమ్**

**ధామ శ్యామచ్ఛవి నవయువైకాత్మ చౌరం కిశోరమ్ 41**

శ్రీకిశోరీజీ నాలుగు దిక్కులలోను మహాగౌరకాంతిని విస్తరింపజేస్తుంది. ఆమె ప్రేమామృత రసమహాసాగరమునకు మహాసార స్వరూపము! శ్రీబృందావనములో అనేక కళలతో మోహినీ బృందములైన తన సఖీమణులతో సేవింపబడుతూ ఉంటుంది. నవయువకుడైన శ్యామవర్ణాంగుని చిత్తమును హరించు శ్రీకిశోరికి జయమగునుగాక!

**నిత్యోన్మీలన్మధుర మధురాశ్చర్య కైశోర లక్ష్మ్యా**

**నిత్యోద్వర్ధి స్మరరసమదానంగ వైవశ్య భాజోః**

**శ్రీగాంధర్వా మురళీధరయోః పశ్య సౌభాగ్యధామ్నోః**

**వృందారణ్యే మధుర మధురా దృష్టివాగంగ చేష్టాః 42**

శ్రీరాధా మురళీధరులు నిరంతరము ప్రకాశించుచుండు మధురాతి మధురమైన, ఆశ్చర్యకరమైన కైశోర శోభ కలవారు. నిత్యవర్ధన శీలమైన అనంగ రసము చేత ఉన్మత్తులైన శ్రీయుగళము యొక్క చూపులు, మాటలు, అంగ చేష్టాదికములను శ్రీబృందావనములో దర్శింపుడు!

**దేహాంతఃకరణేంద్రియాది సకలం తీవ్రానురాగాన్మిథః**

**సంప్రాప్తైక్యమివావహన్ నవనవాత్యాశ్చర్య కైశోరకమ్**

**ధామద్వంద్వమతీవ మోహనమహో తద్గౌరనీలం ముదా**

**వృందారణ్య కదంబ కుంజ కుహరే కందర్పలోలం భజే 43**

శ్రీబృందావన కదంబ కుంజాంతర్భాగములో తీవ్రమైన అనురాగ వశము చేత శ్రీయుగళము యొక్క దేహము, అంతఃకరణము, ఇంద్రియాది సమస్తము సమ్యక్ ప్రకారముగ ఏకత్వమును పొందినవి. నిత్యనూతనమైన, అత్యంత ఆశ్చర్యకరమైన వారి కిశోరావస్థ మిక్కిలి మోహనమై గౌరనీలకాంతితో వెలుగుచున్నది. అనంగరస విలోలతచే చంచలురైన ఆ శ్రీయుగళ కిశోరులను నేను ఆనందపూర్వకముగ భజిస్తున్నాను.

**పూర్ణ స్వర్ణ సుగౌరకాంతి జలధేస్తుంగై స్తరంగైర్దిశః**
**సించంతీ నవయౌవనోన్మద కలా సౌందర్య సమ్మోహనీ**
**స్వాద్య ప్రేమ మహారసాత్మక తనుః సా శ్యామసంజీవనీ**
**విద్యాకాఽపి చకాస్తు మేహృది సదా వృందావనాలంకృతి 44**

శ్రీరాధాజీ పరిపూర్ణమైన తన స్వర్ణగౌరకాంతి సాగర ఉత్తుంగ తరంగాలతో దిశలనన్నిటినీ తడిపివేస్తున్నది. నూతన యౌవనావస్థలోని కళావిలాసాదుల సౌందర్యముతో అందరినీ ఉన్మత్తులుగాను, మోహితులుగాను చేస్తున్నది. ఆస్వాదనీయమైనట్టి, మహాప్రేమతో రసాత్మకమైనట్టి శ్రీకిశోరి బృందావనమునకు భూషణ స్వరూపిణి! శ్రీశ్యామసంజీవనియు, ఒకానొక అపూర్వ విద్యారూపిణియునైన రాధాజీ నిరంతరము నా హృదయములో విరాజమానమై ఉండునుగాక!

**జయతి జయతి రాధా ప్రేమసారైరగాధా**
**జయతి జయతి కృష్ణస్తద్రసాపార తృష్ణః**
**జయతి జయతి వృందం సత్సఖీనాం ద్వయైక్యమ్**
**జయతి జయతి వృందాకాననం తత్ స్వధామ 45**

అగాధ ప్రేమసార స్వరూపిణియైన శ్రీరాధాజీకి జయము, జయము! శ్రీరాధారసము పట్ల అపారమైన తృష్ణతో నుండు శ్రీకృష్ణునకు జయము, జయము!

శ్రీయుగళ మిలనము (సంయోగము) పట్ల ఆకాంక్షతో నుండు సఖీబృందమునకు జయము, జయము! శ్రీరాధాకృష్ణుల నిజధామమైన శ్రీబృందావనమునకు జయము, జయము!

**నిత్యాద్భుతాద్భుత రసోత్సవ నిత్యసంగ**
**నిత్యార్త నిత్యనవ నిత్యకిశోరయుగ్మమ్**
**తద్గౌర నీలమతిమోహన రూప శోభమ్**
**వృందావనే కిమపి లోభయతే మనో మే** **46**

శ్రీబృందావనములో అద్భుతతమమైన నిత్య రసోత్సవములతోను, నిత్య సంయోగ వియోగాత్మకమైన స్థితితోను ఉండు నిత్యనూతన కిశోర మోహనీమూర్తులు శోభిస్తున్నారు. ఒకానొక అనిర్వచనీయమైన ఆ గౌరనీలాత్మక యుగళ కిశోరులు నా మనసును లోభింపజేస్తున్నారు.

శ్రీబృందావనము నిత్యరసోత్సవములతోను, నిత్యనూతన శ్రీమూర్తులైన శ్రీశ్యామశ్యామల లీలా విలాసాదులతోను వర్ణనాతీతమగు నిత్యశోభతో వెలుగుతూ ఉంటుంది.

**విచిత్ర నవకేశభృన్నవ విచిత్ర కైశోరకమ్**
**విచిత్రయతి మే మనో ద్వయమిదం విచిత్రం మహః** **47**

శ్రీయుగళ కిశోరులు విచిత్ర నవ చాతుర్యముతో విచిత్రమైన ప్రేమోత్సవమును ప్రకటితము చేస్తున్నారు. విచిత్రదేహకాంతితో వారు కుంజలను విచిత్రరీతిగ మలచుచున్నారు. విచిత్రమైన నవీన కేశరాశితో వెలుగుచు విచిత్రకైశోరావస్థలోనున్న విచిత్ర యుగళకిశోరులు నా మనసుకు విచిత్రతను కలిగిస్తున్నారు.

**చైతన్యామృత చంద్రికాంబుధిమతి స్వచ్ఛం ప్రకృత్యంతక**
**ద్వైతైః శూన్యమనంతపార పరమానందైక సారం స్మర**
**ఈశం జ్యోతిరిహానుభూయ కలయ శ్రీకామబీజాత్మకమ్**
**జ్యోతిస్తత్ర ఘనం మహామధురిమ ప్రేక్షస్వ వృందావనమ్ 48**

ప్రకృతికి ఆవల ద్వంద్వములకు అతీతమైన ఒక దివ్య సముద్రము ఉన్నది. అనంతము, అపారము, పరమానందసారము, అతిస్వచ్ఛము, చైతన్యామృతము, జ్యోత్స్నామయమునైనట్టి ఆ దివ్యసాగరమును స్మరింపుము! ఈ స్థానమునకన్నను ఆవల అనుభూతి చెందవలసిన ఈశ్వరజ్యోతి (భగవజ్జ్యోతి) ఉన్నది. ఆపై శ్రీకామబీజాత్మకమైన మహామాధుర్యమయ జ్యోతిగ వెలుగుచున్న శ్రీబృందావనమును దర్శింపుము!

**నానావర్ణమణిచ్ఛటాంబుధి ఘనం వల్లిద్రుమైః శోభితమ్**
**శాఖాపల్లవ పత్రగుచ్ఛముకులైః పుష్పైః ఫలైశ్చాద్భుతైః**
**నానారత్నమయైః ఖగైర్మృగ కులైః కీరైర్మయూరైః పికైః**
**గుంజద్భృంగ గణైః సరోవర సరిచ్ఛైలాదిభిశ్చాద్భుతమ్ 49**

శ్రీబృందావనము అనేక వర్ణముల మణికాంతులతో కూడిన ఘన సముద్రము! కొమ్మలు, ఆకులు, మొగ్గలు, పుష్పములు, ఫలాదులు నిండిన అద్భుతలతా వృక్షములతో శ్రీధామము శోభిస్తున్నది. ఇంకను నానారత్నమయములైన పశుపక్ష్యాదులతోను; చిలుకలు, నెమళ్లు, కోకిలలు, గుంజారవము చేస్తున్న భ్రమరములు, సరోవర నదీ పర్వతాదికములతోను అద్భుతముగ ఉన్నది.

**నానారత్నమయ స్థలీభిరమితామోదాభిరత్యద్భుతమ్**
**క్రీడాకుట్టిమ కోమలాభిరమితం కుంజావలీ మంజుభిః**
**నిత్యోత్సర్పి పరాగపుంజ మకరందౌఘైర్మహా సుందరమ్**
**సాంద్రానంద మహారసేన వివశీకుర్వత్ సహేశం జగత్ 50**

అనంతమైన, ఆనందదాయకమైన అనేక రత్నమయ ప్రదేశములతోను; అత్యద్భుతమైన క్రీడా స్థలముల కోమలత్వముతోను; అవధులులేని కుంజల మనోహరత్వముతోను; నిరంతరము అన్నివైపులకు వ్యాపిస్తున్న పరాగ పుంజములతోను; రసప్రవాహముతోను శ్రీధామము మహాసుందరముగ నున్నది. అట్టి శ్రీబృందావనము తన సాంద్రానంద మహారసవైభవము చేత ఈశ్వరునితో సహా సమస్త జగత్తులను వివశము చేస్తున్నది.

**కాలింద్యాః కలహంససారస లసత్ కారండవాద్యైః ఖగైః**
**ఆశ్చర్యైః పరిఘుష్టయా ద్విజకులైర్మత్తాలి ఝంకారయా**
**కల్హారైః కమలైః సదా వికసితైర్దివ్యైర్విచిత్రోత్పలైః**
**భ్రాజంత్యా పులిన శ్రియా మణితటోద్దీప్తశ్రియా చావృతమ్ 51**

శ్రీబృందావనము యమునా నదిలోని కలహంసలతోను, సారసములతోను (చక్రవాకములు), మనోహరమైన కారండవాదులతోను; ఆశ్చర్యమయములైన పక్షులతోను కోలాహలముగ ఉన్నది. మత్తిల్లిన భ్రమరముల గుంజారవముతో ప్రతిధ్వనిస్తున్నది. నిరంతరము వికసించిన కల్హారములతోను, కమలములతోను, దివ్యాతి దివ్యమైన విచిత్ర ఉత్పలములతోను శోభిస్తున్నది. తీరముల సౌందర్యముతోను, మణి జటితమైన తటములతోను శ్రీధామము ప్రకాశిస్తున్నది.

**తస్యాః ప్రోజ్జ్వల నిర్మలాద్భుత రసానందైక సందోహ వాః**
**పూరాయాస్తటరత్నభూమి లసితోత్తుంగా కదంబాటవీ**
**తత్సంసర్గి సుగంధి మంద శిశిరైర్మందానిలైర్లాలితా**
**తత్రాభాతి నికుంజ పుంజముదయత్కందర్పపుంజం సదా 52**

శ్రీయమునానది ఉజ్వలమైన, నిర్మలమైన, అద్భుతమైన రసానందము అనెడు జలములతో నిండియున్నది. ఆ తీరము నందలి రత్నభూమి ఎత్తైన కదంబ

వృక్షముల వనముతో శోభిస్తున్నది. యమునా నదీ స్పర్శతో సుగంధ పూర్ణము, శీతలము, మృదులమునైన వాయువు వలన ఆ కదంబవనము స్నిగ్ధముగ ఉన్నది. అట నిరంతరము ప్రేమ పుంజములచే ఉద్దీప్తిని పొందుచున్న నికుంజ పుంజములు గోచరిస్తున్నవి.

**తత్రానంగరసోన్మదైక సహజావాశ్చర్య కైశోరకా**
**వాశ్చర్యోజ్జ్వల గౌరనీల మధురాకారౌ మహామోహనౌ**
**వేణీదండ శిఖండ మండిత మహాచూడామణీ హారిణౌ**
**రాధామాధవనామ నాగరవరౌ లావణ్యమూర్తీ స్మర 53**

ఈ ప్రదేశములో (బృందావనములోని యమునా తీరములో) శ్రీరాధామాధవులు సహజమైన అనంగరసోన్మత్తులై, ఆశ్చర్యపూర్ణమైన కైశోరావస్థలో, ఆశ్చర్యమయమైన గౌరనీలాకృతితో మహామోహనముగ ఉన్నారు. అత్యంత సుందరమైన జడతోను, మయూర పింఛముతో అలంకృతమైన మహాచూడామణితోను "రాధామాధవ" నామక నాగరశ్రేష్ఠులు మనోహరముగ వెలుగుచున్నారు. లావణ్యమూర్తులైన అట్టి శ్రీయుగళమును స్మరింపుము!

**పూర్ణాస్వాద్య విశుద్ధభావ వపుషో రంగేషు యా మాధురీ**
**ధారాయేఽద్భుత భంగిమాన ఉరుధా యః కాంతిపూరోదయః**
**యా నేత్రాంచల చాతురీ స్మితపరీపాటీ చ యా వా మిథో**
**యా గోష్ఠీ చ రహః సునర్మమధురా భావేఽఖిలం భావయ 54**

పరిపూర్ణముగ ఆస్వాద్య, విశుద్ధ భావస్వరూపులైన శ్రీయుగళకిశోరుల అంగాంగముల నుండి మాధుర్యధార ప్రవహిస్తున్నది. ఆ అద్భుత భంగిమల నుండి అనేక ప్రకారములైన అపారకాంతి వెలువడుచున్నది. వారి నేత్ర చంచల చాతుర్యమును, మృదు మధురమందహాసరీతిని, నర్మగర్భమైన వారి మధుర ఏకాంతగోష్ఠిని – ఈ సమస్తమును చిత్తములో చింతింపుము!

**దాసీమండల ఇందుకోటివదనే శ్రీరాధికాయాః పదాం**
**భోజ భ్రాజదపార మాదకరసజ్యోతిర్ఘనైకాకృతౌ**
**ఆశ్చర్యాకృతి వర్ణభేద మధురేఽ త్యాశ్చర్య నానా కలా**
**నిర్మాతర్యతినూత్న యౌవనవయో నానా విచిత్రక్రమే 55**

శ్రీరాధా దాసీ మండలి శ్రీరాధాచరణ కమలముల అనంత మాదక మహాజ్యోతికి ఘనాకృతి స్వరూపము! అనగా, శ్రీదాసీమణులు మూర్తీభవించిన రాధా శ్రీచరణజ్యోతిస్స్వరూపులు! ఆ దాసీ బృందము కోటి చంద్రుల కాంతి వంటి ముఖకాంతి కలవారు. ఆశ్చర్యకరమైన ఆకృతితో, బహువిధములైన వర్ణములతో సౌందర్యపూర్ణులై ఉన్నారు. అత్యంత ఆశ్చర్యకరమైన నానా విధ కళలతోను, నూతన యౌవనముతోను, అనేకములైన విచిత్ర శక్తులతోను వారు శోభిస్తున్నారు.

ఈ శ్లోకము నుండి శ్రీప్రబోధానందులు శ్రీరాధా దాసీమణుల దివ్య, అనంత సౌందర్యమును, శ్రీసేవాసౌభాగ్యమును, శ్రీరాధాచరణముల పట్ల వారికి గల అనన్య నిష్ఠను వర్ణిస్తున్నారు.

**మూర్తిం కాంచన కాంచన ద్రవరుచిం సౌమ్యాం మహాసుందరీమ్**
**ప్రత్యంగోచ్ఛలదంతపార రహిత స్నిగ్ధాచ్ఛ గౌరచ్ఛటామ్**
**కైశోరేణ మనోహరామురసిజ స్వర్ణాబ్జ కోశద్వయీమ్**
**సంవీతాంబర కంచుకేన విలసత్ హారావలీం విభ్రతీమ్ 56**

ఆ దాసీమండలిలో ఒకరు కరగిన బంగారమువంటి శరీరవర్ణము కలవారు, ఒకరు మూర్తీభవించిన సౌమ్యసుందరి! వారి ప్రత్యంగము నుండి అనంతమైన, అవధులు లేని స్నిగ్ధ నిర్మల గౌరకాంతి ప్రకటితం ఔతున్నది. మరొకరు మనోహర కైశోరమూర్తి, స్వర్ణకమలముల వంటి వక్షస్థలముతో ఒప్పుచున్నది. వారు

సుందరమైన వస్త్రములను, కంచుకము (రవిక)ను, విచిత్రమైన హారములను ధరించి ప్రకాశిస్తున్నారు.

**మధ్యే కేశరివత్ కృశాం పృథుకటిం చిత్రోర్మిమచ్ఛాటికామ్**
**దోర్వల్లీ విలసన్మహాద్భుతమణీ కేయూర చూడావలిమ్**
**కర్ణోర్ధ్వాద్భుత కర్ణపూర విలసత్తాటంక దివ్యచ్ఛటామ్**
**శ్రీనాసా తిలపుష్ప రత్నకనకాబద్ధ స్ఫురన్మౌక్తికామ్ 57**

ఆమె (దాసీమణి) నడుము సింహమునకు వలె మిక్కిలి సన్నగా ఉన్నది. విశాల కటి స్థలముపై విచిత్రమైన తరంగములతో కూడిన చీర అందగిస్తున్నది. బాహులతలకు మహాద్భుతమైన మణి, కేయూర, చూడాభరణాదులను ధరించినది. చెవులకు పైన అద్భుత కర్ణపూరములను, వానికి క్రింద ధరించిన తాటంకములు (కుండలములు) దివ్యప్రకాశముతో ఉన్నవి. తిలపుష్పము వలెనున్న శ్రీనాసిక (ముక్కు)పై రత్న, స్వర్ణ జటితమైన ముత్యము శోభాయమానముగ ఉన్నది.

**దీవ్యద్దాడిమబీజ పంక్తిదశనాం మాధుర్యవన్యాబుదత్**
**బింబోష్ఠీం మదఖంజరీట నయనాని కందర్ప చాపభ్రువమ్**
**భ్రాజత్కాంచన పద్మకోశ వదనానంతేందు కోటిచ్ఛవిమ్**
**భంగీకోటి మహామనోహర నవస్వర్ణైక వల్లీతనుమ్ 58**

ఆమె దంతపంక్తి (పలువరుస) మెరుస్తున్న దానిమ్మగింజలవలె ఉన్నది. బింబాధరముల నుండి మాధుర్యము ప్రవహిస్తున్నది. కన్నులు మత్తిల్లిన ఖంజన పక్షులవలెను, కనుబొమ మన్మథుని చాపము వలెను ఉన్నవి. ప్రకాశిస్తున్న స్వర్ణకమలమువంటి ముఖబింబము నుండి అనంత చంద్రులకాంతుల వలె కోటి కోటి కాంతి పుంజములు వెలువడుతున్నవి. కోటి భంగిమలతో కూడిన మహామనోహర నవీన స్వర్ణలత వలె దేహము ప్రకాశిస్తున్నది.

**కూజన్నూపుర కింకిణీగణ తృణత్కారైర్మహా మంజులామ్**
**ప్రేయః కర్మసుసంభ్రమేణ ప్రణయాద్యాంతీం సదేతస్తతః**
**ఆలోలాంచల గుచ్ఛనీల సుతనూన్మీలన్నిచోలా వృతామ్**
**వ్రీడాభంగిమ మందహాస కుటిలేక్షాది స్వభావాద్భుతామ్ 59**

శ్రీరాధాదాసీమణి శబ్దిస్తున్న నూపురములతోను, వడ్డాణపు సవ్వడితోను మహామనోహరముగ ఉన్నది. ప్రియతమ యుగళకిశోరుల కార్యభారము చేత ప్రణయవశయై సదా ఇటు నటు సంచరిస్తూ ఉంటుంది. కదలాడుచున్న చీర అంచుల గుచ్ఛముల నీలకాంతితో ప్రకాశిస్తున్న సుందర దేహము మేలిముసుగుచేత ఆచ్ఛాదితమై ఉన్నది. సిగ్గుతో కూడిన భంగిమ, మందహాసము, కటాక్షవీక్షణములు ఆమెకు అద్భుత స్వభావము!

**ప్రోదంచత్పులకావలిం ముహురతి స్నేహాన్నిజ ప్రేష్ఠయో**
**స్తత్తద్గూఢతదింగితానుసరణైః సంతోష వన్యాకరీమ్**
**రాధా పక్షపరిగ్రహేణ దధతీం నర్మక్రియా దక్షతామ్**
**శ్రీశ్వర్యాశ్చరణైక సంగతతయా నిత్యస్థితాం తత్పరామ్ 60**

ఆమె తన ప్రియతమ యుగళ కిశోరుల పట్ల గల అత్యంతానురాగముతో మాటిమాటికి పులకిస్తూ ఉంటుంది. ఆ యిరువురి యొక్క నిగూఢమైన ప్రీతి నెరిగి, వారిని సంతోషంలో తేలియాడునట్లు చేస్తుంది. శ్రీదాసీమణి శ్రీరాధా పక్షపాతిని అగుటచే పరిహాసాదులలో విశేషనైపుణ్యమును కలిగి ఉంటుంది. శ్రీప్రాణేశ్వరీ చరణ సేవలో నియుక్తయై ఉండుటచేత నిత్య తత్పరయై ఉంటుంది.

**మంత్రాదౌ మృదుశీలామృతగిరా సంపృచ్ఛ్యమానాం క్వచిత్**
**సర్వాలీః పరివంచ్య కేలిఘటనాయాదిశ్యమానాం క్వచిత్**
**ఉక్త్వా కించన కర్హిచిత్ ప్రియమనుం ప్రేమ్ణైవ సంప్రేషితా**
**మానందాంబునిధావగాధ మధురే నిర్మజ్జ్య రోమాంచితామ్ 61**

ఆమె ఒకమారు మంత్రాది రూపమైన మధుర శీతల అమృతమయ వాక్కులతో ఏదియో అడుగుతుంది. ఒక్కొక్కమారు సమస్త సఖియలను అందముగ వంచించి, తానే కేళీ విలాసాది రచన చేయటానికి ఆదేశమును పొందుతుంది. ఇంకొకమారు గుప్తమంత్రమును గూర్చి తెలుపుతూ ప్రేమపూర్వకముగ చెప్తుంది. మరొకమారు అగాధమైన మధురానందములో నిమగ్నయై పులకరిస్తుంది.

**క్వాప్యుద్వర్తన కారిణీం క్వచన సద్గంధోదకైః స్నాపనీమ్**
**వస్త్రాలంకృతి గంధమాల్య విభవైః సంరాధయంతీం క్వచిత్**
**సంభోజ్య క్వచనామృతం ప్రవిలసత్తాంబూల కర్పూరదామ్**
**క్వాప్యంఘ్రి ద్వయలాలనీం మృదుపటః సంవీజనైః స్వాపినీమ్ 62**

ఆమె (దాసీమణి) ఒకమారు శ్రీయుగళ కిశోరులకు సుగంధ లేపనం చేస్తుంది. మరొకమారు వారికి సుగంధపూర్ణమైన నీటితో స్నానం చేయిస్తుంది. ఇంకొకమారు వస్త్రభూషణములతోను, సుగంధిత హారాదులతోను వారిని చక్కగా ఆరాధిస్తుంది. ఒకమారు అమృతమయమైన భోజనమును, కర్పూర తాంబూలమును సమర్పిస్తుంది. శ్రీయుగళ చరణద్వయమును లాలిస్తూ, మృదులమైన వస్త్రముతో వీచుచు వారు నిద్రించునట్లు చేస్తుంది.

**క్వాపి శ్యామల సంగఖేలన మహారంగం సమాతన్వతీమ్**
**శృంగార వ్యజనాదిభిర్విజయినీ కుత్రాప్యనుప్రస్థితామ్**
**ఉక్తే కించిదనుక్త ఏవ కిమపి ప్రేమ్ణానిశం కుర్వతీమ్**
**రాధాయాః ప్రియమేవ పూర్ణపరమానందే బుడంతీం ముహుః 63**

శ్రీదాసీమణి ఒకమారు శ్యామసుందరునితో కలసి లీలార్థమై మహాలీలాకేళిని విస్తరింపజేస్తుంది. అలంకార, వ్యజనాది సామగ్రిని చేత ధరించి వెనుక, వెనుక వెళ్తుంది. ఏదైన చెప్పినా, ఏదీ చెప్పకపోయినా కూడ నిరంతరము ప్రేమపూర్వకముగ

శ్రీరాధాజీకి అనిర్వచనీయమైన సేవ చేస్తూ పూర్ణపరమానందములో నిమగ్నయై ఉంటుంది.

**శ్రావం శ్రావమతి స్మరాకుల ప్రహదోస్తాస్తా రహః సంవిత్**
**స్తాతాః సుందరదృష్టిగాత్ర వికృతీస్తాస్తా విచిత్రాస్తయోః**
**వైదగ్ధీర్నవ సంగమేషు మధురాస్తాస్తా విచిత్రచ్ఛవీః**
**వీక్ష్యానంద మహారసోచ్ఛలనతో నాంగాని ధర్తుం క్షమామ్ 64**

అత్యంత ప్రేమాతురులైన శ్రీయుగళకిశోరుల ఏకాంతగోష్ఠిని వింటూ వింటూ; వారిసుందర నేత్రములను, శరీరాకృతిని, విచిత్ర వైదగ్ధిని చూస్తూ చూస్తూ; వారి నిత్యనూతన సంగమము యొక్క మధురకాంతి పుంజములను ఆనందంతో దర్శిస్తూ ఆమె (సఖి) మహారస తరంగాలలో తనను తాను నిలువరించుకొనలేక పోతూ ఉంటుంది.

55వ శ్లోకం నుండి 64వ శ్లోకం వరకు శ్రీప్రబోధానందులు శ్రీరాధా దాసీమణుల దివ్యప్రేమరసమగ్న జీవనమును దర్శిస్తూ అందించారు.

**ఏవం నిత్యమనుసరన్ననుసరన్ రాధా పదాంభోరుహ**
**చ్ఛాయామేవ తయోః సదైవ రసనాం నామామృతైః పూరయన్**
**స్త్రీ – తత్సంగి విదూర ఏవ విచరన్నత్యుత్కటత్వం నయన్**
**వైరాగ్యం క్రమశో వసత్యతి కృతీ కోఽప్యత్ర వృందావనే 65**

ఈ విధంగా శ్రీరాధా చరణకమల కాంతిని నిరంతరం స్మరిస్తూ స్మరిస్తూ; శ్రీయుగళ నామామృతముతో నిత్యము జిహ్వను పూర్ణము (సార్థకము) చేసుకుంటూ చేసుకుంటూ; స్త్రీ నుండి, స్త్రీ సంగములో ఉండువారి నుండి బహుదూరముగ ఉండాలి! ఇట్లు క్రమంగా అతితీవ్ర వైరాగ్యాన్ని అవలంబించిన ఒకానొక గొప్ప

భాగ్యశాలియే బృందావనంలో నివసిస్తాడు. ఈ శ్లోకం నుండి శ్రీబృందావనంలో నివసింపగోరేవారు ఎటువంటి లక్షణాలను కలిగి ఉండాలో చెప్తున్నారు.

**దినే దినేఽతి వర్ధిష్ణు మహాభక్తి విరక్తిమాన్**
**కోఽపి వృందావనే ధన్యోభాతి రాధాపదాశ్రితః 66**

ప్రతిదినము మిక్కిలి వృద్ధి చెందుతున్న మహాభక్తితోను, వైరాగ్యముతోను ఉండెడు ఒకానొక భాగ్యశాలియే శ్రీరాధా పదపద్మముల నాశ్రయించి శ్రీబృందావనములో నివసింపగలడు!

**రాధాకృష్ణ సుతత్వబోధ విగత వ్యర్థోరు శాస్త్రశ్రమః**
**శ్రీరాధా చరణారవింద సహజ స్వాత్మైక్య భావోజ్జ్వలః**
**వైరాగ్యేణ బలీయసా నహి మనాంగ్ దేహస్థితావప్యహో**
**జాతేహః సకలప్రియో నివసతి శ్రీధామ్ని వృందావనే 67**

శ్రీరాధాకృష్ణుల సుతత్వము నెరిగిన తరువాత అనేక శాస్త్రములను అభ్యసించుట వలన కలిగిన వ్యర్థశ్రమ అంతయుదూరమగును. శ్రీరాధాచరణ కమలములపై ప్రాణతుల్యమైన, సహజ, ఏకాంత, సముజ్వల భావము కలుగును. ఆహా! తీవ్రవైరాగ్యముతో, దేహరక్షణకై లేశ మాత్రపు ప్రయత్నము కూడ చేయకుండ నుండుచు, సమస్త జనులకు ప్రియమైన ఒకానొక భాగ్యశాలి శ్రీధామములో నుండగలడు.

**ఆయాతం న కుతుశ్చన క్వచన నో గంతు స్మరైకాంబుధౌ**
**పారావార వివర్జితేఽతి విషమేఽనాద్యంతకాలం లుఠత్**
**గౌరశ్యామల దివ్యకాంతి సహజాత్యాశ్చర్య కైశోరకమ్**
**యత్రాస్తే మిథునమ్ మిథోంగమిలనాజ్జీవన్నుమస్తద్వనమ్ 68**

వారు (శ్రీయుగళము) ఎక్కడి నుండియు రాలేదు, ఎక్కడికినీ వెళ్లుటలేదు. అనాదిగా అనంత కాలము నుండి అవధులులేని అత్యంత తీవ్రమైన అనంగరస సాగరములో వారు తేలియాడుచున్నారు. సహజ, అతిశయ, ఆశ్చర్యమయ శ్రీగౌరశ్యామ దివ్యకాంతిరూపులై ఆ శ్రీయుగళ కిశోరులు ఎక్కడ ప్రాణ స్వరూపులుగ విరాజమానులైనారో ఆ శ్రీబృందావనమునకు నమస్కరిస్తున్నాను.

**పూర్ణస్వాద్య విశుద్ధభావమయ చిన్మూర్తీ మహామోహనౌ**
**కైశోరాద్భుత రూపకాంతిగతిదృగ్వాగంగభంగ్యాదిభిః**
**కామోన్మాద మహావికార పరమాశ్చర్యాకృతీ నిస్సమో**
**ర్ధ్వాభిః సుందరతాభిరాశ్రయ వరౌ వృందావనే దంపతీ 69**

శ్రీయుగళకిశోరులు కిశోరావస్థలోని అద్భుత రూప, కాంతి, గతి, దృష్టి, వాక్య, అంగ భంగిమాదులతో సాటిలేని సౌందర్యరాశియై వెలుగుచున్నారు. పూర్ణ ఆస్వాదనీయము, విశుద్ధభావమయము, చిన్మయము, మహామోహనమునై; ప్రేమోన్మత్తతచే మహాశ్చర్యకరమైన ఆకృతితో ఉన్న పరమశ్రేష్ఠ యుగళమును శ్రీబృందావనములో శరణుచెందుము!

**సౌందర్యౌఘ మహాచమత్కృతిరహో మాధుర్యసీమాపరా**
**లావణ్యామృత చంద్రికాజలనిధేః కోఽప్యద్భుతః సంప్లవః**
**అత్యాశ్చర్య మహానురాగ విభవః కందర్పలీలావధిః**
**వృందారణ్య ఉదేతి నూతనవయః ప్రాణౌ మమ ద్వయాత్మకః 70**

ఓహో! వారు సౌందర్యపూర్ణమైన మహాచమత్కారము, అవధులులేని మాధుర్యమునకుసీమ, లావణ్యామృత చంద్రికా సాగరము యొక్క ఒకానొక అద్భుత ప్రవాహము! అత్యాశ్చర్య మహానురాగవైభవము, అనంగలీలాపరాకాష్ఠలతో కూడిన నిత్యకైశోర మూర్తులు! రెండు దేహములు, ఒకే ప్రాణము అయిన అట్టి శ్రీరాధాకృష్ణులు శ్రీబృందావనములో విరాజమానులై ఉన్నారు.

**శ్రీవృందావనమేకభావ సదఖండైకానురాగోన్మదమ్**
**కందర్పైక కలాచమత్కృత మహానందోర్మి దోలాయితమ్**
**విశ్రాంతిస్థలమేకమద్భుత వయోరూపచ్ఛవీనామహమ్**
**గౌరశ్యామముపాస ఏకహృదయ ప్రాణం కిశోరద్వయమ్ 71**

శ్రీబృందావనము ఏకభావమయ, అఖండ, అనురాగముచే ఉన్మత్తమై ఉన్నది. ఏకమాత్ర అనంగకళాచమత్కారము యొక్క మహానంద తరంగములలో ఓలలాడుతున్నది. శ్రీధామము శ్రీయుగళ అద్భుత వయో రూప కాంతులకు ఏకమాత్ర విశ్రామస్థలి! అట్టి ఒకే హృదయప్రాణ స్వరూపులైన గౌర శ్యామ యుగళ కిశోరులను నేను ఉపాసిస్తున్నాను.

**పరస్పర కథా సుధారస నిమగ్న కర్ణాస్తయోః**
**పరస్పర విలోకనాద్యుదిత రూపలీలేక్షణాః**
**పరస్పర సమాగమోత్సవ రసాతివత్తాంతరాః**
**స్మరామి హరిరాధయోర్నవ నికుంజఖేలాః సఖీః 72**

శ్రీరాధా సఖీమణుల చెవులు శ్రీయుగళ కథా సుధారసమునందు నిమగ్నమై ఉంటాయి. శ్రీయుగళము యొక్క పరస్పర విలోకనాదుల నుండి ఉదయించిన రూపలీలా నేత్రాదుల విశేషమును సఖియలు గమనిస్తూ ఉంటారు. పరస్పర సమాగమోత్సవ రసమునందు సఖీమణుల మనసు మిక్కిలి ఉన్మత్తమై ఉంటుంది. శ్రీరాధాకృష్ణుల నూతన నికుంజలీలల పట్ల పరాయణులైయుండు అట్టి సఖీమణులను స్మరిస్తున్నాను.

**యద్యద్ధార్ష్ట్య విజృంభితం స్మరరసాత్యున్మాదినః శ్రీహరేః**
**ప్రత్యాఖ్యాన విలజ్జితైర్విలసితం యద్యద్విశాఖాత్మనః**
**వైదగ్ధీమధురం తయోర్విలసితం యద్యన్నవే సంగమే**
**తద్వృందావనమావసన్ హృది మహాభావేఽనిశం భావయే 73**

ప్రేమరసము చేత మిక్కిలి ఉన్మత్తుడైన శ్రీహరి అనేకమైన చిలిపిచేష్టలు చేస్తూ ఉంటాడు. రసిక కథల వాద వివాదాలతో విశాఖాదేవిని సిగ్గిలునట్లు చేస్తాడు. నవసంగమ సమయములో ఇరువురి నడుమ విదగ్ధతా పూర్ణమైన మధురకేళీ ప్రసంగములు జరుగుతూ ఉంటాయి. ఈ అన్నింటిని నేను బృందావనములో నివసిస్తూ ఉండటం వలననే మహాభావ వివశుడనై నిరంతరము చింతన చేయగలుగుతున్నాను.

**బ్రహ్మాఖ్యం ధామ విష్ణోర్వహతి హృది సదా యః స పూజ్యోఽత్రలోకే**
**మూర్తింయాం కాంచిదేవార్చయతి భగవతో యః స తస్య ప్రియాత్మా**
**సాక్షాచ్ఛ్రీకృష్ణచంద్రం భజతి య ఉరుభిః సోఽనుభావైస్తుల్యో**
**మచ్చేతస్త్వేష జహ్యే త్యజతి రసికరాట్ నైవ వృందావనం యః 74**

ఎవరు శ్రీనారాయణుని యొక్క బ్రహ్మప్రకాశమూర్తిని హృదయములో నిలుపుకొందురో వారు ఈలోకంలో పూజ్యులు! ఎవరు ఏ భగవన్మూర్తినైనా అర్చిస్తూ ఉంటారో వారు భగవంతునికి ప్రియమైన ఆత్మస్వరూపులు! ఎవరు శ్రీకృష్ణ చంద్రుని అనేకములైన అనుభావములను (అనేకానేక కళలను) భజిస్తూ ఉంటారో వారికి సమానులు లేరు. కాని నా మనసు మాత్రము శ్రీబృందావనమును ఎన్నటికిని విడువని ఆ రసికరాజు (శ్రీకృష్ణుడు) చేత దొంగిలింపబడినది.

"బృందావనం పరిత్యజ్య పాదమేకం న గచ్ఛతి" – 'బృందావనాన్ని విడచి ఒక్క అడుగుకూడ ఆవలకువెళ్లను' అని శ్రీకృష్ణుని వాగ్దానము! అట్టి స్వామియే తన చిత్తచోరుడనుచున్నారు.

**భూర్భురేవాత్ర యేషాం జలమపి చ జలం శాఖివల్ల్యోద్రువల్యో**
**జ్యోత్స్నాది జ్యోతిరాద్యం ఖగపశుమనుజాదీని పక్ష్యాదికాని**
**శ్రీకృష్ణః కృష్ణ ఏవాఖిల దనుజరిపు రాధికా రాధికేవ**
**వ్యూహ్యేలం తేన వృందావనమను మమకాఽప్యస్తు దివ్యానుభూతిః 75**

(కొందరు) శ్రీబృందావనభూమిని సాధారణ భూమిగా భావిస్తారు. అచటి జలములను సాధారణ జలములుగాను, వృక్షలతలను సామాన్య వృక్షలతలుగాను, అచటి శ్రీచంద్రికలను సాధారణ జ్యోతిగాను భావిస్తారు. ఖగ, మృగ, మానవులను సాధారణ విహంగాదులుగాను, సాధారణ మానవులుగాను అనుకుంటారు. శ్రీకృష్ణుడు సమస్తరాక్షసులను సంహరించినవాడు అని మాత్రమే శ్రీకృష్ణుని గూర్చి భావిస్తారు. వారితో తర్కించటం వ్యర్థం! కాని, శ్రీబృందావనములో నాకు ఒకానొక దివ్యానుభూతి కలుగునుగాక! ఇదియే ప్రార్థన!

**శ్రీబృందావన తత్త్వమస్తు హృదిమే శశ్వన్మహా మాధురీ**
**పూరం పూర్ణవిశుద్ధమన్మథరసైకోద్దీపకం మోహనమ్**
**శ్రీవృందావన చంద్రతత్త్వమపి మే కందర్పలీలారసై**
**కాత్మస్ఫూర్తిముపైతు సాద్య విమలా రాధాపి పూర్ణారతిః 76**

మనోహరమైన బృందావనతత్త్వము శాశ్వతమాధుర్య ప్రవాహము, అది పూర్ణవిశుద్ధ అనంగ రసమును ఉద్దీపింపజేస్తుంది. అట్టి ఆతత్త్వము నాహృదయములో వెలుగుతున్నది. శృంగార లీలారసమునకు ఏకమాత్రమైన స్ఫూర్తిని కలిగించుట శ్రీబృందావనచంద్రుని తత్త్వము! శ్రీరాధ పరిపూర్ణ ప్రేమ స్వరూపిణి, పావనమూర్తి! ఆ శ్రీయుగళము నేడు నామనసులో ప్రకాశిస్తున్నారు.

**అనంతైర్మాధుర్యైర్భరిత నవకైశోర వయసౌ**
**మహా గౌరశ్యామ ప్రవిలసదనంతచ్ఛవి నిధీ**
**అనంతైర్వైదగ్ధ్యైరవిచలదనంత స్మర కలా**
**సుకేలిభిర్వృందా విపినమను కౌచిత్ విహరతః 77**

శ్రీయుగళ కిశోరులు అనంత మాధుర్య పూర్ణులు, నవకిశోర వయస్కులు! వారు మహా గౌరశ్యామ వర్ణముతోను, అనంత కాంతితోను ప్రకాశిస్తున్నారు.

అనంతమైన విదగ్ధతతోను (నేర్పరితనము), అనంతమైన అనంగ కళా విలాసాదులతోను కూడి ఉన్నారు. అనుపమానమైన అట్టి శ్రీయుగళకిశోరులు శ్రీబృందావనములో విహరించుచున్నారు.

**యయోః శ్రీదంపత్యోః సహజ నవ కైశోర వయసోః**
**సుగౌర శ్యామాంగచ్ఛవి మధుర లీలా లహరిభిః**
**సమస్తం శ్రీవృందావనమతిరసోన్మత్తమభవత్**
**తయోరేవాశ్వాస్యం మమ కిమపి దాస్యం రతిగృహే 78**

శ్రీయుగళ కిశోరులు సహజమైన నవకైశోరావస్థలో ఉన్నారు. వారి గౌరశ్యామ వర్ణకాంతి యొక్క మధుర లీలా తరంగాలలో సమస్త బృందావనము రసోన్మత్తమైనది. వారి శృంగారకేళీ గృహములోని అనిర్వచనీయమైన దాస్యరసమే నాకు ఆస్వాశనము (ఊరట)ను ఈయగలదు.

**బీభత్సం వపురేతదత్ర పతితాశ్చేష్టాః సమస్తా అపి**
**వ్యాలుప్య ప్రకృతిం భజన్ రసమయీమంతస్తథైవాకృతిమ్**
**శ్రీవృందావిపినేఽత్యకించనతయా యత్ర క్వచావస్థితః**
**శ్రీరాధాచరణారవిందమనిశం ప్రేమ్ణా కదారాధయే 79**

ఈ శరీరము, పతితమైన దీని చేష్టలు – వానినన్నిటిని విశేషభావముతో వదలివేయాలి. అంతర్యములో రసమయమైన ప్రకృతిని, ఆకృతిని భజన పూర్వకముగ భావించాలి. శ్రీబృందావనములోని ఏదో ఒక ప్రదేశములో అత్యంత అకించన (పేదనైన) భావముతో ఉంటూ, నేను ఎప్పుడు నిరంతరము శ్రీరాధాచరణ కమలములను ప్రేమపూర్వకముగ ఆరాధిస్తానో కదా!

**మాఽస్తు మమ కదాపి పాపరూపిణో నరకాదుద్ధారః కింతు**
**శ్రీవృందావన రాధా తన్నాగరనామ విస్మృతిం నైతు 80**

నావంటి పాపిని ఎన్నటికిని నరకము నుండి ఉద్ధరింపకపోయినను పోనీ! కాని శ్రీబృందావన నామము, శ్రీరాధా నామము, శ్రీరాధా నాగరుడైన శ్రీకృష్ణుని నామము మాత్రము ఎన్నడును మరువకుందునుగాక!

**మత్సమ ఇహ పాపాత్మా కోఽపి న భూతో న చాస్తి నో భవితా**
**తన్మే సహజ నిరంకుశ కరుణం వృందావనం పరం శరణమ్ 81**

నాతో సమానుడైన పాపాత్ముడు ఈ జగత్తులో ఎవడూ లేడు, ఉండడు, ఉండబోడు! ఐనను స్వభావ సిద్ధముగ అత్యంత కరుణగల శ్రీబృందావనమే నాకు ఏకమాత్రగతి!

**శ్రీవృందావన పరమేశాద్భుత కరుణా క్షమాదిగుణశక్తేః**
**స్వరసం ప్రాప్య నిహీనోఽప్యనన్యగతిరేషోఽహం నోపేక్ష్యః 82**

శ్రీబృందావనేశ్వరుని అద్భుతకరుణ, క్షమాది గుణముల శక్తి యొక్క నిజరసమును పొంది; నీచుడనైనప్పటికీ వారిని అనన్యముగ శరణు చెందుతాను. అప్పుడు వారు నన్ను ఉపేక్షింపరు కదా!

అంటే ఎట్టి నీచుడైనను శ్రీబృందావనేశ్వరుని శ్రీరసమును పొంది, శరణన్నచో రక్షింతురని భావము!

**వృందావన! తవ శరణం గతోఽహమితి వాగతీవ దుష్టాత్మా**
**హరిహరి తవానుకంపా విషయః స్యాం నీచతోపి కిము నీచః 83**

హే బృందావనమా! 'నేను నిన్ను శరణు చెంది ఉన్నాను' – ఇట్టి వాక్యమును పలికెడు నేను దుష్టాత్ముడను! హా! నీచాతి నీచుడనైనప్పటికీ నేను నీ దయకు పాత్రునిగనే ఉంటాను.

**ఉషితం వృందారణ్యే కతిదినాన్యుదితం చ నామ రాధేతి**
**కేవలమేతన్మమ బలమపార నరకే స్వకర్మణా విశతః 84**

శ్రీబృందావనములో అనేక దినములు వసించుచు, “రాధా” నామమునే ఉచ్చరిస్తాను. అప్పుడు నా కర్మవశము చేత వచ్చిన అపార నరకమునందు ఉన్నను, కేవలము రాధానామమే నా ఏకమాత్ర బలముగ ఉంటుంది.

**హే వృందాటవి మాతర్వా వృందాకాననాధీశౌ**
**శ్రీరాధా మురళీధరౌ కిం స్వపరాద్యైరుపేక్ష్య ఏవైషః 85**

హే బృందావనమా! మాతా! హే బృందావనాధీశ శ్రీరాధా మురళీధరా! ఏ అపరాధముల చేత నేను మీచే ఉపేక్షింపబడుతున్నాను ? (ఏల నాపట్ల ఉపేక్ష వహిస్తున్నారు ?)

**అహహ విగర్హిత కర్మణ ఆస్తాం యత్తన్మమాతి మూఢస్య**
**నైవ జహామి తు వృందావిపినం నైవాత్రనామ రాధాయాః 86**

అహహా! నేను దుష్కర్మలను చేసినవాడిని, మహామూర్ఖుడను. కాని, నేను శ్రీబృందావనమును విడువను. అట శ్రీరాధా నామమును కూడ విడువను!

**రాధారూప విలాసాన్ సమధిక మాధురీధుర భరితాన్**
**అపి వచసాపి గృణన్నహమిహ వృందాకాననేఽస్మి నిశ్చింతః 87**

మిక్కిలి మాధుర్యధారా పూర్ణ అయిన శ్రీరాధారూప విలాసాదికమును గానము చేస్తూ, నేను శ్రీబృందావనములో నిశ్చింతుడనై ఉంటాను.

**చంపక కువలయ కాంతీ రూపవయః శ్రీవిలాస విశ్రాంతీ**
**తౌ దంపతీ గతీ మే వృందావిపినే స్మరైక రసమూర్తీ 88**

చంపక, నీలి కమలముల వంటి కాంతితో శ్రీయుగళము వెలుగుతూ ఉంటారు. రూప, వయో, సౌందర్య, విలాసాదులకు వారే పరమ సీమ (హద్దు)! ప్రేమైక రసమూర్తులైన ఆ బృందావన సహజ జోడీయే నాకు గతి!

**వృందాకానన కుంజే మంజులరతి కేలి మాధురీ పుంజే**

**గౌర శ్యామ కిశోరౌ మానస చౌరౌ సదా మమ స్ఫురతామ్ 89**

శ్రీబృందావన కుంజలు మనోహరమైన రతివిలాసాదుల చేత అలంకృతమై ఉంటాయి. ఆ కుంజలలో నా చిత్తచోరులైన గౌరశ్యామ యుగళ కిశోరులు నిరంతరము ప్రకాశిస్తూ ఉంటారు.

**వేద్మి న ధర్మాధర్మౌ నేక్షే శాస్త్రాణి నాపి తత్సువిదః**

**రాధాకృష్ణ పదాంబుజ మధురిమ లోభ భ్రమన్మనో మధుపః 90**

ధర్మాధర్మములను గూర్చి నేను ఎరుగను. శాస్త్ర పరిచయము కూడ లేదు. విధివిధానములు కూడ తెలియవు. కాని, శ్రీరాధాకృష్ణుల చరణకమల మాధుర్యము పట్ల లోభముతో నా మనస్సు అనెడు భ్రమరము భ్రమిస్తూ ఉన్నది.

**అత్యున్మద రససాగర మగ్నం తన్నాగర ద్వయం కిమపి**

**విహరద్గౌర శ్యామం వృందావన కుంజ వీథికాసు భజే 91**

అత్యంత ఉన్మదమైన రససాగరములో నిమగ్నులై, శ్రీబృందావన కుంజ వీథులలో శ్రీయుగళము క్రీడా పరాయణులైనారు. గౌరశ్యామాత్మకమైన ఆ యుగళ నాగరులను నేను భజిస్తున్నాను.

**అప్యస్తు నరకకోటి వృందావనతోఽపి మాస్తు వా సకలా**

**రాధా పదాబ్జదాస్యే సుదుస్త్యజాశా మమాధమస్యాపి 92**

కోటి నరకములు ఉండనీ, లేకపోనీ; నేను అధముడినైనను కానీ, శ్రీరాధా చరణకమల దాస్యమును ఎన్నటికీ విడువరాదను ఆశతో ఉన్నాను.

**యది దుర్వాచ్య సహస్రం యది చ తృకచేన దీర్యతే దేహః**

**దుష్కర్మ కోట్యో యది తదపి న రాధాప్రియవనం జహ్యామ్ 93**

వేలాది చెడుమాటలను సహింపవలసి వచ్చినను, ఎవరైనను ఈ దేహమును కత్తితో తునుకలుగచేసినను, కోటికోటి దుష్కర్మలు చేయవలసి వచ్చినను రాధాజీకి ప్రియమైన ఈ బృందావనమును మాత్రము విడువను.

శ్రీబృందావనము రాధాజీకి అత్యంత ప్రియమైనది. ఎట్టి వ్యతిరేక పరిస్థితులలో కూడ ఆ ధామమును విడువరాదు.

**చండాలైరపి ధుత్కృత ఇహ చేద్బృందావనే లభే వసతిమ్**
**ఆమృతి యది తత్కృపయైవాథ సమస్తం తృణాయ మన్యేఽహమ్ 94**

శ్రీబృందావన కృపతో ఒకవేళ ఇక్కడ మృత్యుపర్యంతము నివసింపగలిగితే, చండాలురచేత ధిక్కారమును పొందినను అదినాకు తృణము (గడ్డిపరక)తో సమానమని అనుకుంటాను.

**అతి దుర్గంధాత్యశుచిన్యతి వికృతాంతాదిమధ్య దుఃఖౌఘమ్**
**యోషిద్వపుషి నిమగ్నం వృందారణ్యం వినోద్ధరేన్న పరమ్ 95**

అతిదుర్గంధ, అతి అపవిత్ర, అతి వికృతమైన స్త్రీ శరీరము పట్ల ఆసక్తుడినై ఉన్నాను. ఆద్యంతములలో (మొదలు, చివర) కేవలము దుఃఖమే మిగిలినది. నన్ను శ్రీబృందావనము తప్ప ఇంక ఏదియును ఉద్ధరింపజాలదు.

**అహహ మహాహతభాగ్యో మహా విపథ బుద్ధి పతిత చాండాలః**
**అహమపి కామప్యాశాం కరోమి వృందావన ప్రభావజ్ఞః 96**

అహహా! నేను మహా భాగ్యహీనుడను, చెడు బుద్ధికలవాడను, పతితుడను, చండాలుడను! అయినప్పటికీ, హా! నేను బృందావన ప్రభావమునెరిగి ఒకానొక ఆశతో ఉన్నాను.

శ్రీరాధా పదదాస్యమే ఒకానొక ఆశ!

**అత్యుచ్ఛృంఖల కరుణౌ నవతరుణౌ తౌ సుగౌరనీల రుచీ**

**స్వవనే మాం కలయేతాం తుంగ మహానంగ ఖేలనౌ క్వాపి 97**

శ్రీయుగళము అవధులులేని అత్యంత కరుణామూర్తులు, నవ తరుణ వయస్కులు, గౌరనీల కాంతిరూపులు, మహాసుందరరతి క్రీడా పరాయణులు! అట్టి యుగళకిశోరులు తమ బృందావనములో ఎక్కడైనను, ఎప్పుడైనను నాపై కృపా దృష్టిని ప్రసరింపకుందురా!

**విహరత్ ప్రాణ ద్వితయం వృందావన పుష్పవాటికాయాం తత్**

**గౌరశ్యామమతిస్మర వివశకిశోరం కదా ముదా సేవే 98**

గౌరశ్యామ విగ్రహులైన శ్రీశ్యామాశ్యాములు బృందావన పుష్పవాటికలో విహరిస్తున్నారు. అత్యంత ప్రేమవివశులైన ప్రాణప్రియతములకు ఎప్పుడు నేను ఆనందపూర్వకముగ సేవ చేస్తాను ?

**వృందావన నవకుంజద్వారి మనోహారి సారి ఖేలాయామ్**

**మధుర వివాదోజ్జృంభిత రసజలధీ పశ్య రాధికా కృష్ణౌ 99**

శ్రీబృందావన నవకుంజ ద్వారములో శ్రీరాధాకృష్ణులు మనోహరమైన చదరంగ క్రీడా పరాయణులై ఉన్నారు. క్రీడలో వారికి మధురమైన వివాదము వచ్చి, ఆ వివాదము వలన కలిగిన రససముద్రములో నిమగ్నులైనారు. అట్టి శ్రీరాధాకృష్ణులను దర్శింపుము!

**శ్రీవృషభాను వ్రజపతి దులారీ కుమారయోః స్మరాతురయోః**

**నవనవకుంజ విహారా హారావలివల్లుంఠంతు మే కంఠే 100**

శ్రీవృషభాను మహారాజపుత్రి, వ్రజపతియైన నందమహారాజ కుమారుడు లీలాపరాయణులైనారు. ప్రేమవివశులై వారు చేస్తున్న నవకుంజ విహారము నా కంఠమునందు హారము వలె శోభిస్తున్నది.

అనగా ఆ యుగళ ప్రేమలీలను శ్రీప్రబోధానందులు హృదయగతము చేసికొని ఆనందిస్తున్నారని భావము!

**దృష్టిం వ్యావృత్య దేహాద్యఖిల గుణమయ ద్వైత జాలాదనంతేఽ**
**పారే బ్రహ్మాత్మ చిజ్జ్యోతిషి గమయ మనోఽథైశ ఆనందసాంద్రే**
**జ్యోతిష్యావేశయాథో మధుర తరమహాకామబీజే రసాబ్ధౌ**
**తస్మిన్ వృందావనం తద్ఘనమిహ భజతౌ నాగరౌ గౌరనీలౌ 101**

దేహాదిగా కల సమస్త త్రిగుణాత్మక విషయముల నుండి దృష్టిని మరలించు. అనంతము, అపారమునైన బ్రహ్మాత్మ చిజ్జ్యోతియందు ప్రవేశించు. ఆపై ఆనందఘనమైన ఈశ్వర జ్యోతియందు మనసును నిలుపు. దానికి ఆవలనున్న మధురతరమహాకామ బీజాత్మకమైన రససాగర జ్యోతి యందు స్థిరపడు. ఆ రస సముద్రమే ఘనీభవించి, శ్రీబృందావనముగ ప్రకాశిస్తున్నది. అక్కడ గౌరనీల నాగరయుగళమైన శ్రీశ్యామాశ్యాములను భజించు!

శ్రీరాధా గోవిందుల స్వచ్ఛ, దివ్య, మధుర శృంగారకేళిని వర్ణిస్తున్న సందర్భాలలో రసికమహాత్ములు "మహాకామబీజము"ను గూర్చి ప్రస్తావిస్తూ ఉంటారు. అంగములే లేని, రసమే దేహముగా కల శ్రీయుగళ కేళిలో అంగములే లేని అనంగ లీల (శృంగారలీల) జరుగుతూ ఉంటుంది. ఆ కేళి సమస్తము భావమయమే తప్ప, రూపస్పర్శయే ఉండదు. అట్టి అప్రాకృతిక, పరమ విమల, దివ్యకేళికి సంబంధించినది "మహాకామ బీజము"! అది ఒక మహామంత్ర స్వరూపము! మహాకామమునకు (లౌకిక, పారలౌకిక కామమునకు అతీతమైనది) బీజస్వరూపము! 'బీజ' అను పదముచేత మంత్రాత్మకమైన స్థితి స్ఫురిస్తున్నది. అందునను రసధామేశ్వరియైన శ్రీరాధ తన రూపమే అయిన శ్రీకృష్ణునితో కలసి జీవకల్యాణమునకై ప్రకటిస్తున్న అనంగలీల! ఈ దివ్యస్థితిని శ్రీధ్రువదాస్‌జీ తమ "బయాలీస్ లీలా" అనుగ్రంథములో అద్భుతముగ వర్ణించినారు.

**సౌందర్యేణాసమోర్ధ్వౌ లలితనవవయో మాధురీణాం ధురీణామ్**
**విభ్రాణౌ దివ్యలీలామయ తనుమతనుక్షోభ సంశోభమానామ్**
**స్వావస్థాభిః సముచ్ఛృంఖల ఘటిత మహాశక్తి వృందౌ స్వయం తు**
**శ్రీవృందారణ్య నిత్యోన్మద మదన రసాంధ్యేన నాన్యద్విదంతౌ 102**

శ్రీయుగళ కిశోరులు లలితనవవయస్కులు, దివ్య మాధుర్యము చేత సాటిలేనివారు. వారు కామదేవుడైన మన్మథునే క్షుభితము (కకావికలమగునట్లు) చేయగల పరమ మనోహర, దివ్య, లీలామయ శరీరమును ధరించినారు. వారు ప్రకాశభేదముచేత తమ ఒకానొక అవస్థయందు అపరిమితమైన మహాశక్తులను వహించియున్నారు. శ్రీబృందావనములో నిత్యోన్మత్తతను కలిగించు కామరసము నందు శ్రీయుగళ కిశోరులు స్వయముగ మగ్నులై ఇతరము నేమియు తెలియకున్నారు.

**వైదగ్ధ్యాద్యైరతుల్యాధిక లలిత సఖీ మండలం దివ్యరూపమ్**
**స్మృత్వా కైశోరనిత్యం స్మర తదను సదా కింకరీస్తాః కిశోరీః**
**నానాశ్చర్యాకృతీరద్భుత రుచిరకలా వర్ణభేదైర్మనోజ్ఞా**
**దివ్యాలంకార వస్త్రా నిజదయిత తమమద్వంద్వభావైక పూర్ణాః 103**

విదగ్ధత మున్నగు వానిచే సాటిలేని, అత్యంత లలితమైన దివ్యరూపము కల నిత్యకిశోరీ సఖీ మండలిని స్మరింపుము. ఆపై నిత్యకిశోరీ దాసీమణులను స్మరింపుము. వారు అనేక ఆశ్చర్యమయ ఆకృతులు కలవారు; అద్భుతమైన, మనోహరమైన కళలు, వర్ణములు మున్నగువానిచే పరమ సుందరమూర్తులు! దివ్య అలంకారములు, వస్త్రములచే చక్కగా అలంకృతులై ఉన్నారు. వారు తమ ప్రియతమ శ్రీయుగళ కిశోరుల యందలి ఏకమాత్రభావముచే భావపూర్ణులై ఉన్నారు.

శ్రీరాధా సఖీమణులు, దాసీమణులు మహోజ్వలమైన రూపసౌందర్యముతో వెలుగుతూ ఉంటారు. నిత్యకిశోరీ స్వరూపులైన సఖీమండలి తమ ప్రియతమ శ్రీయుగళము పట్ల భావపూర్ణులై ఉంటారు. అట్టి సఖియల, దాసీ బృందముల స్మరణతో శ్రీప్రబోధానందులు తొమ్మిదవ శతకమును సమాప్తం చేశారు.

# పదవ శతకము

**కాంచిత్తప్తాచలత్కాంచన రుచిరరుచిం కోటిచంద్రాననాభామ్**
**నీలోరు స్నిగ్ధ పుష్పగ్రథిత నవమహావేణి పుష్పోరుగుచ్ఛామ్**
**శ్రీమన్నాసాపుట ప్రోజ్జ్వల కనకమణిద్యోతి దివ్యైక ముక్తామ్**
**ముక్తాపంక్తిచ్ఛటౌఘచ్ఛురిత సుదశనాం చారుబింబాధరోష్ఠీమ్ 1**

శ్రీబృందావనములో తప్తకాంచనము వంటి మనోహరకాంతితోను, కోటిచంద్రులవలెనున్న సుందర ముఖబింబముతోను (ఆమె) వెలుగుచున్నది. అత్యంత సుందరమైన నీలిపుష్పములతో కూర్చబడిన పెద్దజడకు చివర పుష్పగుచ్ఛము (లటకని) వేలాడుచున్నది. సుందరమైన నాసిక (ముక్కు)పై ఉజ్వలమైన, కనకమణిఖచితమైన ఒక దివ్యముత్యము ఊగుచున్నది. ముత్యముల కాంతిని కూడ తిరస్కరించు దంతములతో సుందరముగ ఉన్నది. అట్టి ఒకానొక సఖి అట విరాజమానయైనది.

తొమ్మిదవ శతకమును శ్రీరాధాసఖీమణుల దివ్య వర్ణనముతో ముగించిన శ్రీప్రబోధానందులు పదవ శతకమును కూడ సఖీవర్ణనముతోనే ఆరంభించినారు.

**కైశోరవ్యంజి మంజుస్తన ముకులయుగం గోపయంతీం పటాంతే**
**నాత్యంత క్షీణమధ్యామతిరుచిర మృదు శ్రోణిరాజద్దుకూలామ్**
**కాంచీ మంజీర హారావలి వలయ ఘటా దివ్యకేయూర శోభామ్**
**దిక్చక్రాచ్ఛాది పూర్ణచ్ఛవి కనకలతాచారుభంగీమయాంగీమ్ 2**

కైశోర వయసును సూచించుచున్న మనోహర వక్షస్థలమును ఆమె తన పై కొంగుతో దాచినది. ఆమె నడుము మిక్కిలి సన్నగా ఉన్నది. ఆమె యొక్క అతిసుందర, కోమలకటి ప్రదేశముపై నున్న సుందర వస్త్రము శోభాయమానముగ ఉన్నది. వడ్డాణము, నూపురములు, హారములు, కేయూరాదికములతో ఆమె

అలంకృతమైనది. ఆ సఖి దశదిశలలోను వ్యాపించిన పూర్ణకాంతితో బంగారు తీగవలె, సుందరమైన అంగ భంగిమలతో వెలుగుచున్నది.

**శ్రీరాధా స్నిగ్ధముగ్ధేహిత పులకవతీం స్వామినీ శిక్షితానామ్**
**సమ్యగ్వేత్రీం కలానాం తదతిశయకృపా స్నేహ విశ్వాసపాత్రీమ్**
**కోటి ప్రాణాత్మనిర్మంఛిత పదనఖమణ్యేక శోభాం స్వబంధోః**
**విభ్రాణాం చారుగుచ్ఛాంచల దలవిలసచ్చిత్ర సూక్ష్మం నిచోలమ్ 3**

స్నేహ పూర్ణమైన శ్రీరాధా మనోహర చేష్టలకు ఆమె పులకితఔతుంది. స్వామిని ఇచ్చిన శిక్షణతో సమస్త కళలను చక్కగా నేర్చింది. ఆమె శ్రీయుగళమునకు అత్యంత కృపా, స్నేహ, విశ్వాసపాత్రురాలు! తన ఏకమాత్రపదనఖమణి శోభచేత కోటికోటి ప్రాణములను స్వల్పములు అనిపింపజేస్తుంది. ఆమె ప్రియతమ యుగళకిశోరులకు సుందరమైన, విచిత్రమైన, సూక్ష్మమైన వస్త్రములను ధరింపజేస్తుంది. ఆ వస్త్రముల అంచులలో అనేక ప్రకారములైన పత్రాదిక, గుచ్ఛములు శోభిస్తూ; విచిత్ర భావమును కలిగిస్తున్నాయి.

**స్మరామి వృందావనకుంజవీథికాః స్మరామి తౌ నాగర దివ్యదంపతీ**
**సుగౌరనీలౌ స్మరకేలి సాగరే మగ్నావపారే దినరాత్ర్య వేదినౌ 4**

నేను శ్రీబృందావన కుంజలను స్మరిస్తున్నాను. ఆ దివ్య నాగరులను స్మరిస్తున్నాను. గౌరనీల వర్ణరంజితులైన ఆ శ్రీయుగళము అవధులులేని ప్రేమ విలాస సాగరములో నిమగ్నులై రాత్రింబవళ్లను ఎరుగకున్నారు.

**నిత్యోన్మదానంగ రసైక మూర్తీ నిత్యైక కైశోర విలాసమూర్తీ**
**తౌ దంపతీ నిత్యవిచిత్రకాంతీ సుగౌర నీలౌ భజ కుంజసీమ్ని 5**

నిత్యోన్మత్తతను కలిగించు అనంగరసమూర్తులు, నిత్యకైశోర విలాసమూర్తులు, నిత్యవిచిత్ర కాంతి స్వరూపులునైన గౌరనీలయుగళమును కుంజసీమలో సేవింపుము!

**పరస్పర ప్రేమరసాతి కాష్ఠాఘనాకృతీ మోహన దివ్యరూపా**
**ప్రీత్యాత్మ వృందావిపినే రసాంధసఖీసమస్తౌ సతతం స్మరామి 6**

శ్రీయుగళము ఒకరిపై మరొకరికి గల ప్రేమరస పరాకాష్ఠస్థితి చేత దివ్యమోహన ఘనాకృతిని దాల్చినారు. రసవివశత్వముచే కనులుమోడ్చిన సఖీ బృందములచే వారు పరివేష్టితులైనారు. అట్టి శ్రీశ్యామాశ్యాములను ప్రేమపూర్ణమైన బృందావనములో స్మరిస్తున్నాను.

**రాధా వల్లభమాత్మకోటి దయితం నిత్యార్తిరూపోన్నతిమ్**
**నిత్యప్రోచ్ఛలదంతపారరహిత శ్యామంగకాంత్యంబుధిమ్**
**నిత్యానంద రసోన్మదైక వికృతిం నిత్యైకకైశోరకమ్**
**శ్రీవృందావన నిత్యకేతనమహం నిత్యాత్మభావైర్భజే 7**

శ్రీరాధావల్లభుడు కోటి ప్రాణములకన్నను ప్రియమైన రాధాజీతో నిత్యమిలన స్థితిలో ఉండి కూడ నిత్యవిరహార్తితో ఉంటాడు. అతడు హద్దులులేని, అపార శ్యామకాంతికి సాగరము వంటివాడు. కేవలము అనంగ రసోన్మాదమునందే నిత్యము కాతరుడై ఉంటాడు. నిత్యకిశోరుడును, నిత్య బృందావనవాసియునైన శ్రీరాధావల్లభుని నేను నిత్య ఆత్మభావముతో (ఆత్మస్వరూపుడినై) భజిస్తున్నాను.

**రాధాయాస్తద్వయస్తన్నవ మదనకలా తన్నవాంగాంగరాజత్**
**రూపశ్రీహ్రీవిలాసస్మితతతి కుటిలాపాంగ లీలాంగభంగైః**
**ప్రేమానందైక మూర్చ్ఛాప్రద దదతి మహాగౌరసుస్నిగ్ధరోచిః**
**పుంజైర్మాధుర్యసారైర్హృదయమిహ మమాహారి వృందావనాంతః 8**

శ్రీరాధాజీ యొక్క ఆ వయో విలాసము, నిత్యనూతన రతికళలు, కటాక్షవీక్షణములు, లీలాత్మకమైన అంగభంగిమలతోకూడిన నవనవ అంగశోభ నిరుపమానములు! ఆదేవి యొక్క రూపము,లజ్జ, విలాసము, మందహాసము,

మొదలైనవి ప్రేమానందముతో మూర్ఛిల్లునట్లు చేస్తాయి. (ముగ్ధులను చేస్తాయని భావము). మహాగౌరవర్ణముతో కూడిన అట్టి శ్రీరాధా కోమలకాంతిరాశియు, మాధుర్యసారమైన శ్రీబృందావన వస్తుజాలము నా హృదయమును దొంగిలించినవి.

**అంగేంఽగే రూపలీలా మధురిమ సుషమాఽపార సింధౌ సుగౌరే**
**శ్రీకృష్ణాత్మైకచోరే లలితనవ వయోవిభ్రమే రాధికాయాః**
**వృందారణ్యానుభావాత్ కథమపి న మనాక్ కుంఠితాదేకభావా**
**విష్టం చేతః ప్రవిష్టం భవతు మమ కదా మాద్యదుచ్చై రసేన 9**

నా చిత్తము బృందావనములో రతిసూచకములైన గుణక్రియాదులతో ఎంతమాత్రము చలింపక, ఏకభావావిష్టమై ఉజ్వల రసములో మత్తిల్లవలెను. శ్రీరాధ తన రూప, లీలా, మాధుర్యముల శోభచే సుందరమై, గౌరవర్ణవిశిష్ట సింధువై శ్రీకృష్ణుని ఆత్మను హరించినది. లలిత నవవయోవిలాస విభ్రమములతో కూడిన ఆరాధాజీ అంగాంగముల దివ్యకాంతిలో నా మనసు ఎపుడు లగ్నమగునో!

**మద్గుణ దోష విచారం వినైవ వృందావనం మహాశక్తిమ్**
**నిత్యోచ్ఛృంఖల కరుణాద్యఖిల గుణం మాం ధ్రువం నయేత్ స్వపదమ్ 10**

నాగుణ దోషములను పట్టించుకొనక; మహాశక్తిమయమైనదియు; నిత్యమైన, అపారమైన కరుణాది గుణశీలములు కలదియునైన శ్రీబృందావనము నిశ్చయముగ నాకు తన శ్రీచరణముల చెంత స్థానము ఇస్తుంది.

**సర్వం త్యక్త్వా శరణమగమం శ్రీలవృందావన! త్వామ్**
**త్వయ్యత్యంతాక్షమమకరవం కోటిసంఖ్యాపరాధమ్**
**తన్మే నాలంబనమిహ కిమప్యస్తి రాధాపదాబ్జ**
**ద్వంద్వానందోన్మద మదవనం త్వం న చేన్నైవ నైవ 11**

హే బృందావనమా! అన్నింటినీ వదలి నిన్ను శరణుచెందాను. నీ ముందు క్షమింపరాని కోటికోటి అపరాధాలను చేశాను. ఇక్కడ నాకు వేరే ఆశ్రయం లేదు. శ్రీరాధా పాదారవింద ఆనందములో ఉన్మత్తవై ఉండు నీవు నన్ను రక్షింపకపోతే, ఇక నాకు ఎవరూ గతిలేరు, ఉపాయమూ లేదు.

**శ్రీవృందావనవర్తిని యత్ర క్వచనాపి సాపరాధస్య**
**రాధాకృష్ణ ద్రోహిణ ఉరుతర నరకాత్ కదాపి నోద్ధారః 12**

శ్రీబృందావనములో ఎక్కడనైనను ఎవరు అపరాధము చేసినను అతడు శ్రీరాధాకృష్ణుల పట్ల కూడ ద్రోహియే! అతడు చిరకాలము వరకు కూడ నరకము నుండి ఉద్ధరింపబడడు.

అనగా శాశ్వతముగ నరకములో పడి ఉండునని భావము!

**హే వృందావన! రాధా తత్ప్రియ సర్వస్వ! ఉచ్చకైరఘువాన్**
**త్వయ్యహమతి భయకంపిత ఆసం త్వం మేఽత్ర సంభవచ్ఛరణమ్ 13**

హే బృందావనమా! శ్రీరాధాజీపట్ల, ఆమెకు ప్రియతముడైన శ్రీశ్యామసుందరుని పట్ల, నీ పట్ల అందరి పట్ల నేను అనేక పాపములను చేశాను. వాని వలన ఇప్పుడు నేను భయకంపితుడినై ఉన్నాను. ఇప్పుడు నిన్నే ఏకమాత్రముగ శరణు చెందాను.

**రాధాకృష్ణ విలాసైరతి మధురిమ సింధుబంధురోల్లాసైః**
**రంజిత నికుంజవీథీం ధ్యాయతి వృందాటవీం మహాధన్యః 14**

'శ్రీరాధాకృష్ణుల విలాసము మహామాధుర్యసాగరము. ఆ మనోహర తరంగములలో శ్రీబృందావన నికుంజ మార్గము రంజితమైనది' – ఈ ప్రకారముగ ఒకానొక మహాభాగ్యశాలియే బృందావనమును ధ్యానిస్తున్నాడు.

**పతితమనాథం మూఢం దీనం దుశ్చేష్టైక రతం మామ్**

**రాధాంఘ్రి కమలదూరం న వేద్మి వృందావనం కథం కురుతే 15**

నేను పతితుడను, అనాథను, మూఢుడను, దీనుడను. దుశ్చేష్టలలోనే నిమగ్నుడినై ఉన్నాను. శ్రీరాధాచరణములకు దూరముగనున్న నన్ను బృందావనము ఏమి చేయదలచినదో ఎరుగకున్నాను.

**అత్యంత కుమతిమత్యుచ్ఛృంఖలమతి శోచ్య శోచ్యం మామ్**

**శ్రీవృందావనమేవ స్వాద్భుత కృపయాఽఽత్మసాత్ కురుతామ్ 16**

నేను అత్యంత దుర్మార్గుడను, విశృంఖలముగ జీవించువాడిని, అతి దయనీయమైన అవస్థలో ఉన్నవాడిని. అట్టి నన్ను శ్రీబృందావనము మాత్రమే తన అద్భుత కృపతో తన చెంతకు చేర్చుకొనునుగాక!

**శ్రీవృందావన నాగర కిశోర మిథునం సుగౌరశీలం తత్**

**స్వకామైక రసమగ్నం మమ హృదిలగ్నం మహాద్భుతం కిమపి 17**

శ్రీయుగళ కిశోరులు మహాద్భుత ప్రేమ రసమగ్నులు, గౌరనీల వర్ణ రంజితులు, శ్రీబృందావన నాగరులు! అట్టి శ్రీశ్యామాశ్యాములు నా హృదయములో వెలుగుతున్నారు.

**కందర్పకేలిలోలం నిరవధి వృందాటవీ నికుంజేషు**

**కనకేంద్రనీలరోచిః కిశోర యుగళం కదోన్మదః కలయే 18**

వారు శ్రీబృందావన నికుంజలలో ప్రేమలీలావిలాసమునందు నిత్యము చంచలించుచుందురు. స్వర్ణ, ఇంద్రనీలమణుల వంటి కాంతితో వెలుగుచుండు ఆ యుగళ కిశోరులను ఉన్మత్తుడినై ఎప్పుడు దర్శించుకుంటాను!

**వృందావనే ప్రజల్పన్ గచ్ఛన్ తిష్ఠన్ స్వపన్ శ్వసన్నాపి**

**స్మర తరల గౌరనీల జ్యోతిర్ద్వంద్వం కదా పురః కలయే 19**

గౌరనీల స్వరూపులైన యుగళ కిశోరులు శ్రీబృందావనములో సంభాషిస్తూ, నడయాడుతూ, ఆశీనులుఔతూ, నిద్రిస్తూ తమ ప్రతి ఉచ్వాస నిశ్వాసాలలోను ప్రేమ వివశులై ఉంటారు. వారిని నేను ఎప్పుడు సముఖంలో దర్శించుకుంటాను!

**రసమయ కిశోరమిథునం రతిమన్మథ కోటి మోహనం కిమపి**
**గౌరశ్యామలమత్తం స్మరతాం పదయోర్జగంతి నిపతంతి 20**

కోటిరతీమన్మథులను మించిన మోహన స్వరూపులు, రసమయ మత్త కిశోరులు, గౌరశ్యామవిగ్రహులునైన శ్రీరాధాకృష్ణులను ఎవరు స్మరిస్తూ ఉంటారో వారి పాదముల ముందు పదునాల్గు లోకములు వినీతమై ఉంటాయి.

**మోహన వృందావనభువి మోహన రాధా వ్రజేంద్రసుతయోస్తాః**
**మోహన మోహన రూపచ్ఛవిలీలా మే సదా స్ఫురత్వంతః 21**

మోహనమైన బృందావన భూమిపై మోహనుడైన నందనందనుడు, వృషభాను దులారీ ప్రకాశిస్తున్నారు. మోహనాతి మోహనమైన వారి రూప, కాంతి, లీలాదులు సర్వదా నాహృదయములో స్ఫురించునుగాక!

**ఆశ్చర్యనవవయః శ్రీరూప విలాసం నికుంజవీథిషు**
**గౌరశ్యామలధామ ద్వయమతిమధురం మమ స్ఫురతు 22**

ఆశ్చర్యకర నవ వయో, శోభా, రూప, విలాసాదులతో భూషితులైన గౌరశ్యామయుగళము నికుంజ వీథులలో విహరించుచున్నారు. అత్యంత మధురమూర్తులైన ఆ యుగళ కిశోరులు నాహృదయములో స్ఫురింతురుగాక!

**శ్రీరాధా మాధవ శ్రీవదనకమలయోః కోటిచంద్రాతి కాంత్యోః**
**సంపుల్ల స్వర్ణకోశ స్ఫుటితమరకతాంభోజ సౌభాగ్యభాజోః**
**పాయం పాయం సుశీతా మధురతర వహద్ధాస పీయూషవాణీః**
**మాద్యద్బృందావనేఽహం నిరవధి లలితాద్యాలి వృందం భజామి 23**

శ్రీరాధా మాధవులు కోటిచంద్రుల కాంతిని తిరస్కరించు వికసిత స్వర్ణకమల కోశమునందు ప్రకటితమైన నీలి కమలము వలె శోభాసౌభాగ్యముతో వెలుగొందుచున్నారు. వారి వదన కమలము నుండి వెలువడుతున్న శీతలము, మధురతరము, ప్రభావపూర్ణమునైన అమృతవాక్కులను ఆస్వాదించుచు బృందావనములో లలితాది సఖీమణులు మత్తిల్లియున్నారు. అట్టి సఖీమణులను నేను నిత్యము భజించుచున్నాను.

**సంవీతారుణ దివ్యపీతవసనం దివ్యప్రసూనోల్లసత్**
**వేణీదివ్య శిఖండ మండల లసచ్చూడా మిథోమండితమ్**
**తాటంకోజ్జ్వల దివ్యరత్న మకరోదార స్ఫురత్కుండలమ్**
**గౌరశ్యామ కిశోర దివ్యమిథునం ధ్యాయామి వృందావనే 24**

వారు ఎఱ్ఱని, దివ్యమైన పట్టువస్త్రములను ధరించినారు. ఒకరిని మించి మరొకరు దివ్యపుష్పములతో శోభిస్తున్న జడతోను, దివ్యమయూర పింఛముతో కూడిన శిరోభాగముతోను వారు అలంకృతులై ఉన్నారు. తాటంకములు (చెవులకు పెట్టుకొను రింగులు), ఉజ్వల దివ్యరత్నములతో కూడి మకరాకృతిలోనున్న సుందర కుండలములు వారి చెవులపై శోభిస్తున్నవి. అట్టి గౌర శ్యామ కిశోర దివ్య యుగళమును నేను బృందావనములో ధ్యానిస్తున్నాను.

**గోవత్సైః పరిమండితం క్వచిదహో హంబారవాడంబరమ్**
**కుర్వద్భిర్మహురంబరం క్వచిదతి క్రీడా విలోలార్భకమ్**
**కుత్రాప్యున్మద నవ్యగోప తరుణీ యూథోత్సవం కుత్రచిత్**
**రాధాకృష్ణ విలాసమోహనమహం ధ్యాయామి వృందావనమ్ 25**

శ్రీబృందావనములో కొన్ని చోట్ల దూడలు మాటిమాటికిని అంబారవము చేస్తూ ఇటునటు తిరుగుతూ శోభిస్తున్నాయి. మరికొన్ని తావులలో చంచలురైన బాలకులు క్రీడలతో ఉన్మత్తులై ఉన్నారు. ఇంక కొన్ని ప్రదేశములలో ఉన్మత్తులైన

నవగోపీమణులు ఉత్సవము చేస్తున్నారు. ఇంకను మరికొన్ని తావులలో శ్రీరాధాకృష్ణుల విలాసాదులతో శ్రీబృందావనము మహామనోహరముగ ఉన్నది. నేను అట్టి బృందావనమును ధ్యానిస్తున్నాను.

**రాధాకృష్ణానన్యభావైకగమ్యం రమ్యం దివ్యారణ్యతో నందనాదేః**
**వృందారణ్యం సచ్చిదానంద సాంద్ర జ్యోతిరూపం దివ్యదివ్యం శ్రయామి 26**

శ్రీరాధాకృష్ణుల పట్ల అనన్యభావముతో ఉన్నప్పుడే శ్రీబృందావనము ప్రాప్తిస్తుంది. దివ్యాతి దివ్యములైన నందనవనము మున్నగువానితో మహారమణీయమై, సచ్చిదానంద ఘనజ్యోతిస్వరూపమైన ఆ శ్రీబృందావనమును నేను ఆశ్రయిస్తున్నాను.

**ప్రాణాంతేఽపి న సంగతిం విరచయన్ స్త్రీణాం న తత్సంగినా**
**మేకం క్వాపి నిషద్య సత్తరుతలే సాస్రం ప్రియాఖ్యం జపన్**
**మౌనీ లోకసమాగమే నిరవధిక్షౌణీవ సర్వంసహో**
**రాధాకేలివనే తృణాదపి కదా నీచో నివత్స్యామ్యహమ్ 27**

నా ప్రాణములు పోయినను సరే స్త్రీ సంగము కాని, స్త్రీ సంగము చేయువారి సంగము కాని కలిగి ఉండను. ఏకాంతముగ ఒకానొక సుందర వృక్షము క్రింద కూర్చుండి, కన్నీరు కార్చుచు నా ప్రియమైన హరినామమును జపిస్తాను. లోకులు సమీపములోనికి వచ్చినపుడు మౌనముగా ఉంటాను. భూదేవి వలె నిత్యము అన్నిటిపట్ల సహనముతో ఉంటాను. ఈ విధముగ జీవిస్తూ శ్రీరాధాకేళివనములో నేను తృణముకన్నను దీనముగ ఎప్పుడు నివసిస్తాను ?

**కోటిః కామగవాం ద్యుసద్విటపినాం వాటీశ్చకోటిస్తృణైః**
**కౌదార్యాతి విభూతిభిర్విధువతీ పేటీశ్చ చింతామణైః**
**దివ్యైశ్చందన పారిజాత ప్రముఖైర్వృక్షైర్వృతా చిన్మయైః**
**జీయాత్ కుంజ కుటీ ఘటాతి మధురా రాధావిహారాటవీ 28**

శ్రీబృందావనములో కోటి కామధేనువులు, కోటి దివ్యవృక్ష వాటికలు విరాజమానమై ఉన్నాయి. సుందర తృణములతో ఆచ్ఛాదితమైన కుదార వృక్షములతో (ఎరుపు రంగులో ఉన్న కాంచన వృక్షములతో) అత్యంత శోభాయమానముగ ఉన్నది. ఎందరో చంద్రవదనలకు (చంద్రుని వంటి ముఖకాంతి కలవారు) అది నివాసస్థానము. అనంతమైన చింతామణులతోను; దివ్యచిన్మయములైన చందన, పారిజాతాది వృక్షములతోను చుట్టివేయబడిన కుంజ కుటీరములు శోభిస్తున్నాయి. అట్టి మహామధురమైన శ్రీరాధా విహార వనమునకు జయమగునుగాక!

**హాస్యోరుచ్ఛట యాంబరే విరచయన్నాశ్చర్య కుందస్రజమ్**
**దృక్పాతైర్దిశి దిశ్యహో కువలయ శ్రేణీం సమున్మీలయన్**
**ఉత్ఫుల్ల స్థల పంకజామివ భువం కుర్వన్ పదన్యాసతా**
**ధ్యేయా మే సహ రాధయా ముహురటన్ వృందావనే మాధవః 29**

శ్రీరాధా మాధవులు తమ మందహాసకాంతులతో ఆకాశములో ఆశ్చర్యకరమైన కుందమాలను (కుంద మొగ్గలతో అల్లిన దండ) రచిస్తున్నారు. (అనగా కుందమొగ్గల వరుస వలె ఉన్న వారి నవ్వులు అంతట వ్యాపించాయి అని భావము). వారి దృష్టిని ప్రసరించటం ద్వారా అన్ని దిక్కులలోను నీలకమల సమూహములను ప్రకాశింపజేస్తున్నారు. (అనగా వారి చూపు సర్వత్ర ప్రసరిస్తున్నది). వారు తమ పాదము మోపిన భూమి అంతయు వికసించిన పద్మమువలె గోచరిస్తున్నది. ఇట్లు శ్రీరాధా సహితముగ బృందావనములో శ్రీమాధవుడు విహరిస్తున్నాడు. వారే నా ధ్యేయమూర్తులు!

శ్రీరాధాకృష్ణుల సాకార దివ్యవర్ణము చేయుచునే శ్రీప్రబోధానందులు వారి నిరాకార, సర్వవ్యాపకమైన తేజస్సును స్ఫురింపజేశారు. శ్రీయుగళము దివ్యరస అంగములు కలవారు, ఆ అంగములు కూడ అంగములుగ కాక భావతేజో పూర్ణములై సర్వత్ర ప్రకాశిస్తున్నాయి.

**బారం బారముదశ్రు జీవనయుగాక్రీడే నికుంజే విశన్**
**గాయంస్తచ్చరితం ద్రవన్నతిభియా సంగాద్భుజంగాదివ**
**క్షుద్బాధే మిత శుష్క పత్ర ఫలభుక్ తర్షేంబు కామంపిబన్**
**శ్రీవృందావిపినే కదా తరుతలాన్యేవా వసన్ స్యాం సుఖీ 30**

ప్రాణ ప్రియతములైన శ్రీయుగళకిశోరుల ఆనందవన నికుంజలలో మాటిమాటికీ కన్నీరు కార్చుచు నిలచి ఉంటాను. వారి చరిత్రను గానం చేస్తాను. లోకుల సాంగత్యమును పాముతో సమానముగ భావించి భయముతో వారికి దూరంగా ఉంటాను. ఆకలిగా ఉన్నపుడు పరిమితముగ ఎండుటాకులను, ఫలములను భుజించి; యథేచ్ఛగా కావలసినన్ని నీటిని తాగుతాను – ఈ విధంగా జీవిస్తూ నేను ఎప్పుడు శ్రీబృందావన వృక్షముల క్రింద సుఖంగా ఉంటాను ?

శ్రీబృందావనములో జీవింపదలచిన వ్యక్తి బాహ్య లోకము పట్ల ఎంత నిస్సంగముగా ఉండాలో ఇక్కడ తెలియజేశారు.

**శ్రీగాంధర్వారసిక! మురళీమండిత శ్రీముఖేందో!**
**కాంతాక్లప్త స్వకరనిహితోదార గుంజోరు హార!**
**ప్రేయస్యైవ ప్రణయ రచితాశ్చర్యచూడా శిఖండ!**
**ప్రత్యంగోద్యత్ పులక! హృది మే క్రీడ వృందావనేద్య 31**

హే రాధారసికా! హేమురళీ శోభిత సుందర ముఖచంద్రా! ప్రియతమయైన శ్రీరాధ స్వయముగా తన చేతులతో కూర్చిన సుందర గుంజామాలను ధరించినవాడా! ప్రియతమయే ప్రీతిపూర్వకముగ తయారు చేసిన అద్భుతమయూర పింఛమును శిరముపై ధరించినవాడా! అంగాంగములయందును పులకరింతలు కలవాడా! నేడు నా హృదయమనెడు బృందావనములో క్రీడింపుము!

**సర్వాంగే పులకావలీమరుణతామక్ష్ణోర్వచోఽనన్వయమ్**
**యానంచస్ఖలితం మిథో కలహనం కేశాంబరా సంవృతిమ్**
**మాల్యాది తృటనం ముహుః ప్రహసితం భూయో రసాత్యున్మదమ్**
**యత్రాభుద్ద్వయ గౌరనీలమహసస్తన్నౌమి వృందావనమ్ 32**

గౌరవనీల శ్రీయుగళ కిశోరుల సర్వాంగములు పులకరించినవి. కన్నులు ఎర్రబారినవి. మాటలు ఇటునటుగ అగుచున్నవి. నడకలో తడబాటు వచ్చుచున్నది. ఇరువురి నడుమ ప్రేమకలహము చోటుచేసుకున్నది. కేశములు, వస్త్రములు జారిపోయినవి. హారములు విరిగిపోయినవి. వారు మాటిమాటికిని నవ్వుచున్నారు. పునఃపునః రసోన్మత్తులై ఇట్టి లీలలను బృందావనములో ప్రకటించుచున్నారు. అట్టి శ్రీధామమునకు నమస్కరించుచున్నాను.

**ప్రేమాంధాఖిల చిద్ఘన స్థిరచరం చంద్రైరనంతైరివో**
**ద్దీప్తం శ్రీముఖచంద్రికోచ్ఛలనతః శ్రీరాధికా కృష్ణయోః**
**సర్వార్థానతి తుచ్ఛయన్ నిజరస శ్రీణాం చమత్కారతః**
**శ్రీవృందావనమేవ సర్వపరమం సర్వానపేక్షో భజే 33**

శ్రీరాధాకృష్ణుల ముఖచంద్రప్రకాశముచేత శ్రీబృందావనము అనంతచంద్రుల కాంతిచేత వెలుగుచున్నట్లు ప్రకాశిస్తున్నది. అచటి స్థావర జంగమములన్నియు చిన్మయములు. ప్రేమచేత వానికి కనులు మూతపడియున్నవి. ఇచటి నిజరస సౌందర్య చమత్కారము సమస్త పురుషార్థములను తుచ్ఛము అనిపింపజేస్తుంది. ఇట్లు సర్వవిధములుగ శ్రేష్ఠమైన శ్రీబృందావనమును నేను ఎట్టి కోరికయు లేకుండ సర్వాత్మనా సేవిస్తున్నాను.

**సర్వేషామనుకంప్యతా మిహ సతాం శిక్షాకృతే దండ్యతామ్**
**వాత్సల్యాదభిమంద్యతాం కరుణయైవేష్టాయతౌ ఖండ్యతామ్**
**జానన్ స్వస్య సుదుర్ధియోఽపి న పరిత్యజ్యాహమత్యర్భవత్**
**శ్రీవృందావనమావసామి పరమానందాత్యసీమం కదా 34**

సమస్త సజ్జనులు నాపై కృప చూపండి, అవసరమైతే శిక్షగా దండించండి! వాత్సల్యభావంతో నన్ను పాలించండి. మంగళకరమైన నా భవిష్యత్తునకై అవసరమైతే కరుణామూర్తులైన మీరు నన్ను ముక్కలుగా నరకండి. మందబుద్ధినైన నేను అజ్ఞానిగా గుర్తింపబడినా ఈ ప్రదేశమును మాత్రము విడువను. ఇట్టి ప్రవర్తనతో పరమానందస్వరూపమైన శ్రీబృందావన ధామములో ఎప్పుడు నివసిస్తాను ?

**రాధాకృష్ణ గుణానేవ గాయం గాయమకించనః**
**అశ్రుభిః పంకిలీకుర్వే కదా వృందావన స్థలీమ్ 35**

ఏమియు లేనివాడినై దీనుడినై శ్రీరాధాకృష్ణుల గుణగానమును చేస్తూ చేస్తూ, ఎప్పుడు నేను అశ్రుధారలతో శ్రీబృందావనములోని ప్రదేశములను తడిపివేస్తాను ?

**స్ఫురద్రాధా పదాంభోజ దాస్యలాస్యః కదా హృది**
**ఆకృత్యా చ ప్రకృత్యా చ భవేయం విశ్వమోహనః 36**

హృదయములో శ్రీరాధాచరణ కమలముల పట్ల దాస్యభావమును పొంది; నృత్యపరాయణనై ఆకృతిచే, స్వభావముచే కూడ ఎప్పుడు నేను విశ్వవిమోహనముగ ఔతాను ?

శ్రీరాధాచరణ కమల దాస్యవైభవమును పొందుట ద్వారా బహిరంతరాలలో స్త్రీభావమును పొంది విశ్వమును విముగ్ధము చేయజాలిన "రాధాసఖి"గ నుండవలెనను ఆకాంక్షను శ్రీప్రబోధానందులు ఇట ప్రకటించినారు.

**కదాపి పులకాంచితః ప్రవహదశ్రుధారః క్వచిత్**
**కదాచిదతిగద్గదాక్షర గృహీత రాధాభిధః**
**కదాపి విలుఠన్ క్షితావథ కదాపి మూర్ఛాం గతో**
**మహా ప్రణయ విహ్వలో భ్రమతి కోఽపి వృందావనే 37**

ఒకమారు పులకితుడై, ఒకమారు అశ్రుధారలను ప్రవహింపజేస్తూ, మరొకమారు గద్గదకంఠముతో 'రాధా' నామమును ఉచ్చరిస్తూ, వేరొకమారు భూమిపై పడియుండి, ఇంకొకమారు మూర్ఛితుడై ఒకానొక ప్రేమస్థితిలో మహావిహ్వాలుడైన వ్యక్తి శ్రీబృందావనములో సంచరిస్తున్నాడు.

శ్రీబృందావనములో రాధాజీకి అంకితమై చరించు మహాత్ముల రసస్థితి ఇట వర్ణితమైనది.

**అనంత రతి మన్మథోన్మథన దర్పశోభామయమ్**
**మిథః ప్రణయకీలితం కిమపి గౌరనీలచ్ఛవి**
**అనంతరసవారిధౌ బుడితమంతపారోంగితే**
**మహః ప్రథమ యౌవనం ద్వయముదేతి వృందావనే 38**

శ్రీయుగళ కిశోరులు అనంత రతీ మన్మథులను మథింపగల దర్పముతో శోభిస్తున్నారు. పరస్పరము ప్రణయబద్ధులైన ఆ గౌరనీల స్వరూపులు అనంతము, అపారమునైన రస సముద్రములో మునిగిపోయినారు. నవయౌవనముతో, జ్యోతిస్స్వరూపులైన శ్రీయుగళము శ్రీబృందావనములో వెలుగుచున్నారు.

శ్రీరాధాకృష్ణుల సాకారవర్ణనము చేయుచునే, వారి నిరాకార అఖండ తేజస్స్వరూపమును శ్రీప్రబోధానందులు స్మరించుచున్నారు.

**పతతు మదుపరిష్టాత్ కోటిశో వజ్రపాతః**
**సకల భువన దాహీ వహ్నిరభ్యుత్థితోఽస్తు**
**ఉదయతు లయకాలోచ్చండ మార్తండ కోటిః**
**న ఖలు తదపి వృందాకాననం త్యక్తుమీశే 39**

నాపై కోటికోటి వజ్రాయుధపు దెబ్బలు తగులనీ, సమస్తలోకములను దహించు అగ్నికూడ నాపట్ల ఏర్పడనీ, ప్రళయ కాలములోని కోటికోటి ప్రచండ

సూర్యులు పుట్టనీ – ఏమైనను శ్రీబృందావనమును త్యజించుటకు నేను ఎన్నటికీ సిద్ధపడను!

ఆహా! శ్రీబృందావనము పట్ల ఎంతటి అనన్యనిష్ఠ!

**వ్యాలా ఉత్కృత్య ఖాదంత్వథ వికటతమాః కాలసర్పా దశంతు**
**రోగాః స్యుర్దుశ్చికిత్స్యా దదతు తత ఇతః సర్వ ఏవాతి దుఃఖమ్**
**అత్యుద్విగ్నోఽపి ధర్మైః సదన విరహితః శీత వర్షాతి వాతైః**
**క్షుత్ తృట్బాధాస్త్వ సహ్యాస్తదపి న హి పదం యామి వృందాటవీతః 40**

పెద్దపులులు మున్నగు క్రూర జంతువులు నన్ను చీల్చివేసి భుజించనీ, మహావికటమైన కాలసర్పము కాటువేయనీ, చికిత్సకు అసాధ్యమైన రోగము కబళించనీ బృందావనమును మాత్రము విడువను. సమస్తలోకములు నాకు దుఃఖమునే ఈయనీ; చలి, వర్షము, ఝంఝామారుతములతో కూడిన ఋతువులలో ఆశ్రయము లేక ఉద్విగ్నుడినైనను; ఆకలి, దాహము మున్నగు అనేకములైన సహింపరాని పీడలు బాధించినను – అప్పుడు కూడ శ్రీబృందావనము నుండి ఒక్క అడుగుకూడ ఆవలకు వేయను.

అనగా ఎట్టి విపత్కర పరిస్థితులలోనైనను బృందావనమును విడువక, ఆ దివ్యధామములోనే జీవించుటయే జీవుని ధర్మమని చెప్పుచున్నారు.

**నైవప్రేక్ష్యముఖం స్త్రియా విషయిణః సంభాష్యనైవ క్వచిత్**
**కేషామప్యతి పృచ్ఛతామపి పురో న వ్యజ్య దైన్యాని చ**
**నాశాం కస్యచిదాదధన్న చ దధద్యోషాన్ యథా లాభతః**
**సంతుష్టో వస రాధికాపద రసావిష్టోఽత్ర వృందావనే 41**

స్త్రీజాతి ముఖమును చూడక, విషయలోలురైన పురుషులతో ఎన్నడును సంభాషింపక, ఎవరైనను అతిశయముగ మాటాడినను నీ దీనస్థితిని తెలుపక

ఉండవలెను. దేనియందును ఆశలేకుండ, ఎవరి పట్ల దోషమును చూడక, లభించినదానితో సంతుష్టుడవై ఉండవలెను. శ్రీరాధాచరణకమల సేవారసము నందు నిమగ్నుడవై ఈ బృందావనములో నివసింపవలెను.

**నిత్యాశ్చర్యానంత మాధుర్యధుర్యం యస్మిన్నాస్తే ప్రస్ఫురద్దివ్య కుంజమ్**
**రాధాకృష్ణౌ భంగురానంగకేలీ శ్రీమద్బృందాకాననం తత్ ప్రపద్యే 42**

శ్రీబృందావనిలో నిత్యము, ఆశ్చర్యమయము, అనంత మాధుర్యము, దివ్యాతి దివ్యమునైన కుంజలో శ్రీరాధాకృష్ణులు ప్రకటరూపముతో వెలుగుచున్నారు. ఆ శ్రీయుగళము యొక్క నిత్యవర్ధనశీలమైన అనంగ విలాసముతో శోభిస్తున్న శ్రీబృందావనమును నేను ఆశ్రయించుచున్నాను.

**సాంద్రానందాపార చిజ్జ్యోతిరేకాంభోధిద్వీపే భాతి వృందాటవీయమ్**
**తత్రైవానాద్యంత కందర్పకేలి గౌరశ్యామావాశ్రయే శ్రీకిశోరౌ 43**

సాంద్రానంద పూర్ణమైన అపార చిన్మయ జ్యోతిసాగరము నందు ఒక శ్రేష్ఠ ద్వీపము ప్రకాశిస్తున్నది. అదియే శ్రీబృందావనము! అక్కడే అనాదియు, అనంతమునైన ప్రేమకళా పరాయణులు గౌరశ్యాములు వెలుగుచున్నారు. ఆ శ్రీయుగళ కిశోరులను నేను ఆశ్రయిస్తున్నాను.

**దివ్యస్నిగ్ధ స్వర్ణగౌరాంగ రోచిః సింధూల్లోలైర్లుంపతీ దిగ్విభాగమ్**
**జీయాత్ కృష్ణప్రేమ మాధుర్యసీమా వృందాటవ్యాం కాపి దివ్యకిశోరీ 44**

ఆమె (రాధాజీ) తన దివ్య, స్నిగ్ధ, స్వర్ణకాంతిమయమైన రససముద్ర తరంగములను దశదిశలలోను ప్రసరింపజేస్తున్నది. కృష్ణప్రేమ యొక్క మాధుర్యసీమ అయిన ఆ ఒకానొక దివ్యకిశోరి శ్రీబృందావనములో సర్వోత్కృష్టముగ విరాజమానయైనది.

**శుద్ధానంతాస్వాద్యరత్యాత్మ సచ్చిజ్జ్యోతిః సింధోరంతపారోంగితస్య**
**గౌరశ్యామం కామలోలం కిశోరం సారద్వంద్వం పశ్య వృందావనాంతః 45**

శ్రీగౌరశ్యాములు విశుద్ధము, అనంతము, ఆస్వాద్యము, సచ్చిజ్జ్యోతిర్మయము నైన అపార రస సాగర సార స్వరూపులు! ప్రేమవిలోలురైన అట్టి శ్రీయుగళ కిశోరులను శ్రీబృందావనములో దర్శింపుము!

**ఏకైకాంగచ్ఛవిభిరఖిల ద్వైతమాచ్ఛాదయంతీ**
**మాధుర్యౌఘం కిమపి దధతీ దివ్యలీలా కలాభిః**
**కాపి శ్యామ ప్రణయ వికల స్వర్ణగౌరాంగ వల్లిః**
**వృందారణ్యే విలసతి మహారూపరాశిః కిశోరీ 46**

శ్రీరాధాజీ తన ఒకే ఒక అంగ కాంతి కిరణముచేత సమస్త ద్వంద్వములను కప్పివేయుచున్నది. దివ్యలీలాకళలతో అనిర్వచనీయ, అపూర్వ, మాధుర్యముల రాశిగా వెలుగొందుచున్నది. శ్రీశ్యామసుందరుని యందలి ప్రేమచే వ్యాకులత్వమును పొందిన స్వర్ణగౌరలతవంటి ఆ ఒకానొక మహారూపరాశి కిశోరి శ్రీబృందావనములో విలసిల్లుచున్నది.

**శ్రీగాంధర్వా పదకమలయోర్దాస్య లాస్యోపలంభే**
**తజ్ఞా యత్సాధనముపదిశంత్యూషరో మాదృశోఽత్ర**
**తస్మాత్ పాపో యది చ సుకృతీ నిందితో వందితో వా**
**వృందారణ్యం సుశరణమయేఽకుంఠ రాధా ప్రకాశమ్ 47**

శ్రీరాధాచరణకమల దాస్యమును పొందుటకు తత్త్వజ్ఞుడైన (తత్త్వమునెరిగిన) వ్యక్తి ఆయా సాధనలను గూర్చి ఉపదేశించినాడు. ఆ సాధనల వలన, మావంటి వారికి ఎటువంటి ఫలితము దొరకలేదు. కనుక పాపాత్మునికైన, పుణ్యాత్మునికైన; నిందనీయునికైన, వందితునికైన నిశ్చయముగ శ్రీరాధాజీని ప్రకాశితం చేయగలది

శ్రీబృందావనమే! అది అత్యుత్తమముగ శరణాగతి నిచ్చుటకు యోగ్యమైనది! అనగా రాధాజీ పదదాస్యమును అనుగ్రహించగలిగినది శ్రీబృందావనము మాత్రమే అని తాత్పర్యము!

**దుశ్చేష్టానాం దుర్మతీనాంచ కోటిః కోటిర్ఘోరానర్థ దుర్వాసనానామ్**
**కామం వృందాకాననే మేఽస్తు శ్రీరాధాయా విస్మృతం నామమాత్రమ్ 48**

శ్రీబృందావనములో నాచే కోటికోటి దుశ్చేష్టలు కలుగనీ, చెడుబుద్ధి పుట్టనీ, ఘోర అనర్థములు దుర్వాసనలు వాటిల్లనీ, ఏకమాత్రమైన శ్రీరాధానామము మాత్రము ఎన్నటికినీ మరచిపోకుందునుగాక!

**ఉన్మీలన్మధురాంగ భంగిమ నటన్నేత్రాంచలీ లీలయా**
**సవ్రీడస్మితమాధురీ భిరసకృచ్ఛ్రీరాధయోత్థాపితైః**
**అత్యుగ్రైరమిత స్మరైః ప్రతిపదం దిగ్ధాలి విద్ధాంతరః**
**కోఽపి శ్యామ కిశోరకోఽతి వికలో వృందావనే భ్రామ్యతి 49**

శ్రీరాధాజీ తన అంగభంగిమలతోను, నృత్యపరాయణతతోను, క్రీగంటి చూపులతోను శోభిస్తున్నది. ఆమె యొక్క ఉద్దీప్తమైన లజ్జ, మధుర మందహాసము, మాధుర్యరూపము మన్మథుని విషమ బాణములవలె అడుగడుగునను శ్రీశ్యాముని మనసును బాధించుచున్నవి. అట్టి ఒకానొక శ్రీశ్యామకిశోరుడు అతిచంచలుడై బృందావనమునందే పరిభ్రమిస్తున్నాడు.

**యత్ సౌందర్యం యద్వయో యేచ భావా యా వైదగ్ధ్యా యాశ్చగౌరాంగభంగ్యః**
**యా దిక్చక్రాచ్ఛాది లావణ్యవన్యాస్తా నో భావే రాధికాయాః స్ఫురంతు 50**

శ్రీరాధాసౌందర్యము, వయోలావణ్యము, సమస్తభావములు, విదగ్ధత అద్భుతము! ఆమె గౌరదేహ భంగిమ, అన్ని దిక్కులను నింపివేస్తున్న లావణ్య ప్రవాహము అన్నియును నా భావములో స్ఫురించునుగాక!

**పూర్ణ ప్రేమామృత రసనిధీ దివ్యదివ్యౌ కిశోరీ**
**గౌర శ్యామాద్భుత నవవయో రూపలావణ్యరాశీ**
**వృందారణ్యే సహజ మదనోన్మత్తలీలా విహారౌ**
**నిత్యం భావామృత సుమధురే చేతసి ప్రస్ఫురేతామ్ 51**

శ్రీయుగళ కిశోరులు పూర్ణ ప్రేమామృత రససాగర స్వరూపులు! అతి దివ్యమైన, గౌరశ్యామ వర్ణముతోడి అద్భుత నవవయో మూర్తులు, రూపలావణ్య స్వరూపులు! బృందావనములో సహజ ప్రేమోన్మత్త లీలా విహారులైన ఆ యుగళ కిశోరులు మధుర భావామృతపూర్ణమైన హృదయములో నిత్యము స్ఫురించు చుందురుగాక!

**కుంజే కుంజేఽతిరంగాదహహ విహరతో యత్ర రాధా వ్రజేందు**
**వృక్షే వృక్షే చ యత్ర ప్రవిలసతి మహాదివ్యగంధ ప్రసూనమ్**
**పుష్పే పుష్పే మదాంధీకృత మధుపకులం స్యందమానామృతౌఘమ్**
**మోఘం జన్మాది సర్వం తవ యది భజసే నైవ వృందావనం తత్ 52**

ఓహో! కుంజనికుంజలలో శ్రీరాధాకృష్ణులు మిక్కిలి ఆనందముతో విహరిస్తున్నారు. అచటి వృక్షములన్నిట మహా దివ్య సుగంధ పూర్ణమైన పుష్పములు వికసించియున్నవి. ప్రతి పుష్పముపై మత్తిల్లిన భ్రమరములు చరిస్తున్నవి. అమృత ప్రవాహ స్వరూపమైన అట్టి బృందావనమును నీవు సేవింపనిచో నీ జన్మ మున్నగునవి అన్నియును వ్యర్థమే!

**యస్మిన్ సత్వరజస్తమాంసి న మనాక్ సంతి స్వకార్యైర్న వా**
**కాలస్య ప్రభుతాస్తి సర్వమహతో దేవాదయః కే పరే**
**స్వాత్మజ్యోతిషి శుద్ధ చిద్రసఘనే వృందావనే పావనే**
**తస్మిన్ మా కురు మూఢ! దృష్టిమనృతాం ధైర్యేణ నిత్యం వస 53**

శ్రీబృందావనములో సత్వరజస్తమో గుణములు లేశమాత్రముగ కూడ లేవు. సమస్త కార్యములను నడుపుచుండు కాలమునకు కూడ అట ఏ ప్రభావమును లేదు. సర్వశ్రేష్ఠులైన దేవతలను గూర్చి చెప్పనేల ? శ్రీబృందావనము స్వాత్మజ్యోతి స్స్వరూపము, విశుద్ధ చిద్రస ఘనమునైనది. ఓ మూర్ఖుడా! అట్టి పవిత్ర ధామము పట్ల అసత్య దృష్టితో ఉండక, ధైర్యముతో నిత్యనివాసము చేయుము!

**దేహార్థే హా సునీచాచరణ మతిరలం సంస్తుతౌ వాచ్యబుద్ధిః**
**సంపద్యాపన్మతిః క్వాప్యహహ న మమధీః స్త్రియాకృతౌ రాక్షసీ ధీః**
**వ్యర్థాత్యాభారబుద్ధిః కు వపుషి జనతా సంగతౌ సర్పబుద్ధిః**
**స్వస్మిన్ సర్వోత్తమేఽప్యత్యధమతమ మతిస్తిష్ఠ వృందావనే భోః 54**

ఓహో! జీవికను నడుపుకొనుటకు అతినీచ చేష్టలు చేయటం చాలు! గొప్ప ప్రశంసావాక్యాన్ని సాధారణ వాక్యంగా పరిగణించటం, సంపద లభించినపుడు ఆపదగా భావించటం చేయాలి! దేనియందును మమత్వబుద్ధివద్దు. స్త్రీజాతి పట్ల రాక్షసి అనే భావంతో ఉండాలి. ఈ మలినమైన దేహము వ్యర్థభారమని గుర్తించు. లోకుల సాంగత్యమును సర్పమువలె భావించు. సర్వోత్తముడివైనను నిన్ను నీవు అతి అధమునిగా నెంచి శ్రీబృందావనములో నివసించు!

**న స్త్రీ న స్త్రీప్రసంగీ మిలతి యత్ ఇదం స్థానమాశ్రిత్య సర్వ**
**ద్వంద్వాతీతోఽత్ర కందాది భిరపరవశైః కల్పయన్ దేహవృత్తిమ్**
**భావేనాత్యుజ్జ్వలేనాత్మని మధురతరే న్యస్యరాధాపదాబ్జ**
**ద్వంద్వం వృందావనాంతర్గమయ దిననిశా నిత్య తన్నామ జాపీ 55**

'స్త్రీ లేక స్త్రీని గూర్చిన ప్రసంగము ఉన్న చోటు కూడ వద్దు' అని భావించి శ్రీబృందావనమును ఆశ్రయించు. ద్వంద్వములన్నిటికిని అతీతముగ ఉంటూ, నిరపేక్షభావముతో దేహరక్షణకై కందమూల ఫలములను భుజించు. అత్యుజ్వల

భావముతో మధురతరమైన నీ చిత్తము నందు శ్రీరాధాచరణకమలములను నిలుపుకొని, నిత్యము ఆ నామమును జపిస్తూ, జపిస్తూ శ్రీబృందావనములో అహర్నిశలు గడుపు.

**విడ్ భాండేఽస్మిన్ కుదేహే హరి హరి మమతాం ముంచ నిష్కించనానామ్**
**సంగేరంగం వసేహి త్యజ కనక వధూ దర్శనం దూరతోఽపి**
**మత్వా మానావమానౌ విషమ విష సుధాసారవత్ సర్వదుఃఖమ్**
**సోఢ్వా సోఢ్వా దృఢీయాన్నతి రతి ప్రణయాదాస్వ వృందావనేఽస్మిన్ 56**

హా! హా! మలిన పదార్థములతో నిండియున్న ఈ కల్పిత దేహము పట్ల మమతను వదలిపెట్టు. నిస్సంగులైన సత్పురుషుల సాంగత్యములో ఉండు. కామినీ కాంచనములను చూడటాన్ని దూరము నుండియే త్యజించు. అవమానాన్ని సన్మానముగను, విషమ విషమును అమృతసారముగను భావించు. సమస్త దుఃఖములను సహిస్తూ సహిస్తూ, అత్యంత దృఢమైన అనురాగముతో శ్రీబృందావనములో నివసించు!

**కించిత్ వంచిత సాధ్యసాధనగణం నిర్ఘృష్టకాలాదిక**
**త్రాసం నిర్హత పాపపుణ్యవిషయం నిష్పీత తాపత్రయమ్**
**నిర్భాతం సకల త్రయీ హృదయతోఽప్యత్యంత దూరే మహా**
**చిత్రప్రేమ రసోర్మి దివ్యవనరాట్ చూడామణిం చింతయ 57**

శ్రీబృందావనము సమస్తములైన సాధ్యసాధనలను నెట్టివేయగలదు. కాలాదిగాకల భయములనన్నిటిని త్రోసివేయగలదు. పాపపుణ్య విషయములను నశింపజేయగలదు. తాపత్రయములను పోగొట్టగలదు. వేద హృదయమునకు అతీతముగ ఆధామము ప్రకాశిస్తున్నది. మహావిచిత్రమైన ప్రేమరస ప్రవాహముతో నిండియున్న దివ్యవనములకు అది రాజశిరోమణి! అట్టి బృందావనమును చింతింపుము!

**ద్వంద్వీభావ నిజ స్వభావ సహజాత్యాశ్చర్య కైశోరకమ్**
**శ్రీవృందావననిత్యకేలి మిథ ఆనందం మిథో జీవనమ్**
**తాదాత్మ్య ప్రణయాద్భజామి లలితా ప్రాణం మిథః సంతతో**
**త్తుంగానంగ తరంగ సంచయ చలం గౌరాసితాంగ మహః 58**

శ్రీయుగళ కిశోరులు యుగళ భావమును పొంది, తమ స్వభావమునకు సహజమైన అత్యాశ్చర్యకరమైన కిశోరావస్థలో వెలుగొందుచున్నారు. శ్రీబృందావనములో నిత్యకేళీ పరాయణులై ఒకరి నుండి ఒకరు ఆనందమును పొందుచున్నారు. వారు ఒకరికి మరొకరు ప్రాణజీవనులు, ఏకాత్మ ప్రణయ స్వరూపులు! నిత్యవర్ధనశీలమైన ప్రేమతరంగ ప్రవాహములో చంచలురై, శ్రీలలితా సఖికి ప్రాణ స్వరూపులైన అట్టి శ్రీగౌరశ్యామయుగళమును భజింపుము!

**నవ కనక సుగౌరనీల రత్న ప్రకర సునీల ముదార దివ్యలీలమ్**
**మిథునమభినవం నవానురాగోన్మద మదనాతుర మద్భుతం భజామి 59**

వారు తప్త కాంచనము వంటి గౌరవర్ణముతోను, నీలకాంతమణుల వంటి నీలవర్ణముతోను సుందరమైన మహాదివ్యలీలా స్వరూపులై ఉన్నారు. నిత్యనూతనమైన అనురాగము నందు ఉన్మత్తులై ప్రేమవశులైన అట్టి అద్భుత అభినవ యుగళ కిశోరులను భజిస్తున్నాను.

**పరమ రస సమృద్ధి కంద వృందావన భువి దివ్యకిశోరయోః కయోశ్చిత్**
**నవ మదన విలాస చాపలాని స్మర నవహేమ మహేంద్ర నీల భాసోః 60**

పరమ రస సమృద్ధికి మూల స్వరూపము బృందావనము! ఆ భూమిపై స్వర్ణ, ఇంద్రనీలమణుల కాంతి వంటి కాంతితో వెలుగుచున్న దివ్య యుగళ కిశోరుల నిత్యనూతన ప్రేమ చాంచల్యమును స్మరింపుము!

**ద్వయమతిరసధామ గౌరనీలాద్భుత రుచి నిత్యకిశోరమున్మదాంధమ్**
**నవనవ రతి లాలసేన వృందావన భువి తన్మమ నిత్యమస్తుసేవ్యమ్ 61**

శ్రీశ్యామాశ్యాములు అత్యంత రసమయ స్వరూపులు! గౌరనీల వర్ణ రంజితమైన అద్భుత కాంతి కలవారు. వారు నిత్యనూతనమైన ప్రేమ యందలి తమకముతో ఉన్మత్తులై కన్నులు మూతబడియుందురు. అట్టి నిత్యకిశోరులు శ్రీబృందావనములో మాకు నిత్యసేవామూర్తులు!

**భరిత దశదిగంత కాంతిపూరం ద్వయమతి దివ్యమహః సదా కిశోరమ్**
**కనక మరకతాభమస్తు వృందావనరస విహ్వలమేవ మే నిషేవ్యమ్ 62**

తమ కాంతి ప్రవాహంతో దశదిశలను నింపివేస్తున్నట్టి, దివ్యస్వరూపులైనట్టి, శ్రీబృందావన రసములో విహ్వలురైనట్టి ఆ స్వర్ణనీల నిత్యకిశోరులు నాకు సేవింపతగినవారు.

**సర్వానంద రహస్యమత్ర సకలప్రేమ్ణాం రహస్యం త్విహ**
**దీప్తీతాం సురహస్యమత్ర ప్రదస్యాస్మిన్ రహస్యం పరమ్**
**ఆమోదస్య రహస్యమత్ర మదనస్యాస్మిన్ రహస్యం పరమ్**
**వైదగ్ధీ సురహస్యమత్ర యదిదం వృందావనం మోహనమ్ 63**

శ్రీబృందావనము నందే సర్వానందముల రహస్యము ఉన్నది. సమస్తమైన ప్రేమరహస్యము, సమస్త తేజముల రహస్యము ఇట ఉన్నవి. ఈ ప్రదేశములోనే ప్రేమ మత్తత యొక్క పరమ రహస్యము, ఆమోదము యొక్క రహస్యము కూడ వెలుగొందుచున్నవి. మదనుని పరమ రహస్యము, విదగ్ధతా రహస్యము కూడ ఇట ప్రకటితమైనవి. అందువలననే శ్రీబృందావనము అన్ని విధములుగను మనసును హరిస్తున్నది.

శ్రీబృందావనము పరమానందముతోను, పూర్ణప్రేమతోను, కాంతి పుంజములతోను నిండియున్నది. అట ప్రకటితమగుచుండు ప్రేమోన్మత్తత, విదగ్ధతలు శ్రీయుగళ దివ్యఅనంగకేళీ విలాసమును చాటి చెప్పుచుండును.

**పూర్ణాః స్వర్ణాంబుజ మరకతాంభోజ గర్భాతిగౌర**
**శ్యామాః కామాత్మక రసఘనస్యాంతరధ్యేమి కాంతీః**
**కస్యాప్యేకాత్మన ఉరుమద శ్రీకిశోర ద్వయస్య**
**శ్రీమద్బృందావనమను సదా క్రీడతో వర్ధితృష్ణమ్ 64**

శ్రీయుగళ కిశోరులు శ్రీబృందావనములో క్షణక్షణమునకు పెరుగుచుండు తృష్ణతో క్రీడాపరాయణులై ఉంటారు. వారిది ఒకే ప్రాణము! రసఘన మూర్తులైన శ్రీశ్యామాశ్యాములు ప్రేమాతుర స్థితిలో అత్యంత ఉన్మత్తులై ఉంటారు. వారిలో వెలుగుచుండు స్వర్ణకమల, నీల కమలముల కాంతి వంటి గౌరనీల కాంతియొక్క ప్రకాశాన్ని నేను ధ్యానిస్తున్నాను.

లీలార్థమై సాకార రూపమును ధరించినను శ్రీయుగళము కేవలము రసఘనమూర్తులు, మహాకాంతి స్వరూపులు అనుట ద్వారా వారి అనంత నిరాకార తత్వమునిట స్తుతించినారు.

**శ్రీవృందారణ్యమేతద్ద్వయమపిచ తదేకాత్మకం ధామ గౌర**
**శ్యామం తత్ప్రాణ సఖ్యోఽపి చ పరమరసం ప్రీతిమాత్రం విదంతి**
**తేనాత్యంతాపరాధిన్యపి మయి మధురం తన్మహాశ్చర్యవృందమ్**
**నైవోపేక్షాం విదధ్యాదజని యది సకృత్తత్ స్వసంబంధ గంధః 65**

శ్రీబృందావనమును, శ్రీబృందావన ప్రాణ స్వరూపులైన శ్రీశ్యామా శ్యాములను, వారి ప్రాణ స్వరూపులైన సఖీబృందమును పరమరస ప్రీతి చేత మాత్రమే ఎరుగగలము! ఒక్కమారైనను శ్రీబృందావనముతో నాకు లేశ మాత్రపు సంబంధము ఏర్పడిన చాలు, అత్యాశ్చర్యకరమైన ఆమధుర బృందము నావంటి అపరాధిని ఉపేక్షింపకుండునుగాక!

జీవుడు భాగ్యవశాత్తు బృందావనముతో కొద్దిపాటి సంబంధమును కలిగి ఉంటే చాలు, అతడు ఎంతటి అపరాధియైనను శ్రీయుగళము, సఖియలు, బృందావనము ఆతనిని తిరస్కరింపరు.

**యస్మాదేవ ప్రవృత్తిః సకల తనుభృతాముత్తమే వాఽథ హీనే**
**కర్మణ్యస్యోత్కటేచ్ఛా సముదయతి యతస్తే వనే హేతవశ్చ**
**సంయోగం ప్రాప్నువంతి ప్రసరతి పరమా సర్వభోగే విరక్తిః**
**జ్ఞానం భక్తిర్మహత్సంగతి పరిచయతస్తం స్వతంత్రేశమీడే 66**

స్వతంత్ర ఈశ్వరీ శక్తి వలన సమస్తప్రాణులును ఉత్తమమైన లేదా నీచమైన కర్మలను ఆచరిస్తూ ఉంటారు. ఆ శక్తి యొక్క ప్రేరణ చేతనే జీవునిలో బృందావనములో నివసించాలి అనే తీవ్రమైన ఇచ్ఛ కలుగుతుంది. ఆ ఇచ్ఛను అనుసరించి బృందానివాసం చేస్తున్నప్పుడు పరంపరగా అనేక ఘటనలు సంఘటిస్తాయి. సమస్త భోగముల పట్ల పరమ వైరాగ్యము, మహనీయుల సాంగత్యము వలన జ్ఞానము, భక్తిమున్నగునవి ప్రాప్తిస్తాయి. అట్టి స్వతంత్ర శక్తిని నేను స్తుతిస్తున్నాను.

**సర్వోఽప్యద్భుత శక్తిరాశిరఖిలాధీశస్య తత్తత్తను**
**ష్వానందైక విలాసవాన్ నిజమహాపూర్ణాత్మ శక్త్యాశ్రయాత్**
**సంజీవత్యథ చేష్టతే నిజనిజే కార్యే తమేవాద్భుత**
**స్వాతంత్ర్యం పరమం పరేశమహమానందైక వృత్తిం శ్రయే 67**

అఖిలాధీశ్వరుని నిజ మహాపూర్ణమైన అద్భుత శక్తిని పొంది, సమస్త అద్భుత శక్తులు వేరువేరుగా దేహములను ధరించి ఆనందముగ విలాసపరాయణమైనవి. జీవనమును నడుపుకొనుచు తమతమ కార్యకలాపములందు నిలచినవి. అట్టి అద్భుతము, సర్వస్వతంత్రము, పరమ మహానంద ప్రవృత్తితో కూడిన ఆ పరమ పూర్ణ శక్తినే నేను ఆశ్రయిస్తున్నాను.

అనేక అద్భుత శక్తులను కలిగి ఉన్న సమస్త దేవతలకు, దిక్పాలకులకు అందరికిని ఆ శక్తులు అఖిలాధీశ్వరుని మహాద్భుత పూర్ణశక్తి నుండియే లభించినవి. అట్టి అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని స్మరిస్తే సమస్త దేవతలను స్మరించినట్లే ఔతుంది.

**ఆనందానాం పరమచరమో యోఽవధి ర్వైష్ణవానామ్**
**సర్వోర్ధ్వానాం సకల హరిశక్త్యున్నతీనాం చ యో వా**
**సంపూర్ణానాం పరమ భగవత్సద్గుణానాం చ యో వా**
**స శ్రీబృందావన భువి వరీవర్తి సర్వోర్ధ్వధామ్ని 68**

శ్రీబృందావనము సర్వోన్నతమైన ధామము! వైష్ణవులకు సమస్త ఆనందములకు చరమ సీమ, హరికిగల సర్వోర్ధ్వ శక్తులకు కూడ అదియే పరమ సీమ, పరమ పురుషుని యొక్క సమస్త ఉత్తమ గుణములకును అది అనన్యసీమ! ఇవి అన్నియు మహోన్నతధామమైన శ్రీబృందావనములో వేయింతలుగ వర్తిల్లుచున్నవి.

**స్వధర్మ విముఖం సదా సకలపాపకర్మాకరమ్**
**సమస్తగుణ వర్జితం సకలసత్తమోపేక్షితమ్**
**అహో సకలపామరైపరి బహిష్కృతం దూరతః**
**కథం సహజ వత్సలా త్యజతు మాఽపి వృందాటవీ 69**

నేను సర్వధర్మ విముఖుడను. నిరంతరం సకల పాపకర్మాచరణము చేస్తున్నవాడిని. గుణహీనుడను, సాధుపురుషులచే ఉపేక్షింపబడినవాడిని. ఓహో! నీచులైన పామరులు కూడ నన్ను బహిష్కరించారు. అట్టి నన్ను సహజవాత్సల్యము కల శ్రీబృందావనము త్యజిస్తుందా!

అనగా సహజంగా వాత్సల్యమూర్తియైన బృందావనము తనను ఆశ్రయిస్తే ఎట్టి జీవుడినైనా కరుణిస్తుందని భావము!

**అనాథజనపావనం సకల పాప విద్రావణమ్**
**మహారతి సుధాభరైః సకలచిత్తవిద్రావణమ్**
**సహేశకృతభావనం సహరి రాధికా జీవనమ్**
**మహాపతిత పావనం జయతి ధామ వృందావనమ్ 70**

శ్రీబృందావనము అనాథ జనుల పాలిటి పావన ధామము! అది సకల పాపములను నశింపజేయునట్టిది. మహాప్రేమ అనెడు అమృత వర్షముతో సమస్త జీవుల చిత్తములను ద్రవింపజేయునట్టిది. తమ తమ ప్రభువులతో సహాబ్రహ్మాండములన్నిటిచేత చింతింపబడుచున్నట్టిది. శ్రీరాధామాధవులకు జీవనమైన, మహాపతితపావనమైన అట్టి శ్రీబృందావనమునకు జయమగునుగాక!

**త్వం మాతేవ పితేవ సత్సుహృదివ భ్రాతేవ సద్బంధువత్**
**కాంతావత్ పరదేవతేవ గురువత్ సన్నేత్రవత్ ప్రాణవత్**
**సర్వస్వైక నిధానవత్ స్వమృతవత్ సత్పుత్రవత్ స్వాత్మవత్**
**శ్రీవృందావన! రాధికా రసికమౌళ్యానంద! నిత్యంభవ 71**

శ్రీరాధా రసిక శేఖరులకు ఆనందము నిచ్చు బృందావనమా! నీవే తల్లివి, తండ్రివి, స్నేహితుడివి, సోదరుడివి! నీవే బంధువు, కాంతవు, పరదేవతయైన గురుదేవుడివి! నీవే నా కన్నులు, నా ప్రాణము! సమస్తధనమునకు ఏకమాత్ర నిధివి నీవే! నీవే నాపాలిటి అమృతము, సత్పుత్రుడవు నీవే! నీవే నా ఆత్మవై సదా నిలచియుందువుగాక!

**స్నిగ్ధస్వర్ణ సుగౌర సుందర వపుర్లావణ్య పూర్ణార్ణవే**
**నవ్యప్రేమ రసాత్మకేన చిదచిద్ద్వైత ప్రథా లుంపకమ్**
**అంకే శ్యామ కిశోరకస్య జయతాద్రాధాభిధం కించన**
**శ్రీవృందావనసీమ్ని సౌరతకలాఽపారం కిశోరం మహః 72**

శ్రీరాధ ప్రేమరస పూర్ణమైనది! కోమలము, స్వర్ణమయ గౌర సుందరమునైన తన దేహము అనెడు లావణ్య పూర్ణసాగరము నందు చిత్, జడముల ద్వంద్వ భావముల నన్నిటిని ముంచి వేస్తుంది. అంటే ద్వంద్వములకు అతీత స్థితిని ఇస్తుంది అని భావము! శ్రీబృందావనములో స్థితుడైన శ్యామకిశోరుని అంకస్థలిపై ఎల్లలులేని శృంగారకళానిధియైన ఒకానొక "రాధ" అను కిశోరజ్యోతి వెలుగుచున్నది. అట్టి తల్లికి జయమగునుగాక!

రాధాజీని లావణ్య సాగరము, ఒకానొక అనిర్వచనీయ జ్యోతి అనుట ద్వారా శ్రీప్రబోధానందులు శ్రీరాధా నిరాకారమైన సర్వవ్యాపక తత్వమును వర్ణించినారు.

**ఐశ్వర్యాశ్చర్య సీమా యదపి భగవతః సద్గుణాశ్చర్య సీమా**
**లీలా మాధుర్య సీమా ప్రణయరసమధు స్వాద వైవశ్య సీమా**
**సౌందర్యాశ్చర్య సీమా నవలలిత వయః శ్రీచమత్కార సీమా**
**వృందారణ్య ఏవ ప్రవిలసతి యతోఽ తస్తదేవాశ్రయేఽ హమ్ 73**

శ్రీబృందావనము భగవంతుని ఐశ్వర్య, ఆశ్చర్యములకును, సద్గుణములకును సీమ (అవధి)! లీలా మాధుర్యమునకు సీమ! ప్రణయరస మధువును ఆస్వాదించుట చేత కలిగిన వివశత్వమునకు సీమ! సౌందర్య, ఆశ్చర్యములకును; నూతనమైన, లలితమైన వయస్సునందలి శ్రీచమత్కారమునకును సీమ! ఇట్లు అన్నిటికీ పరాకాష్ఠ అయిన బృందావనమునే ఆశ్రయించుచున్నాను.

**యత్స్ఫూర్త్యాదేవ సద్యః ప్రమద హరిరసావిష్ట చిన్మూర్తి భాజో**
**జీవాజీవాః పదార్థాస్త్రిగుణమయతయా నిత్యసంస్పర్శ శూన్యాః**
**సర్వేభాంతి స్వభాసా శుభవిమల మహాచిద్రసైకాత్మ శక్తిః**
**సేయం వృందాటవీయావనిరఖిల మహాచిన్మయా పర్యుదేతి 74**

శ్రీబృందావన స్పర్శమాత్రము చేత చరాచరములన్నియు త్రిగుణాత్మకమైన మాయయొక్క నిత్యస్పర్శ నుండి బయటపడుతాయి. అదే క్షణాన ఆనందమయమైన హరి రసమునందు మగ్నులు ఔతారు. చిన్మూర్తి స్వరూపులై అందరు తమ తేజస్సు చేత స్వప్రకాశాన్ని పొందుతారు. శ్రీబృందావనము అట్టి శుభప్రదమైన, విమలమైన మహాచిన్మయ రసస్వభావముతో కూడిన శక్తిశాలిని! అట్టి అఖిల మహాచిన్మయాత్మకమై శ్రీబృందావనభూమి ప్రకాశిస్తున్నది.

**శ్రీమద్రాధా మురలిధరయోస్తత్తదాశ్చర్యఖేలా**
**యోగ్యామృగ్యా భువి వరహ్రదా స్వచ్ఛచిద్రత్నభాసః**
**అత్యాశ్చర్యైర్మధుర మధురా వర్ణసంస్థానభేదైః**
**వందే వృందావనభువి ఇమాః ఖండయంతీః షడూర్మీన్ 75**

శ్రీరాధాకృష్ణుల ఆశ్చర్యకరములైన సమస్త క్రీడలు శ్రేష్ఠులైన మునులకు కూడ అన్వేషణీయములు! ఆ భూమి శ్రేష్ఠమైన సరస్సులతోను, స్వచ్ఛము, చిన్మయము, కాంతిమంతము, ఆశ్చర్యకరమునైన వర్ణములతోను, ప్రదేశముల వైవిధ్యముతోను మధురాతి మధురమై ఉన్నది. అరిషడ్వర్గములను నశింపజేయు ఈ బృందావనభూమికి నేను నమస్కరిస్తున్నాను.

**దివ్యైః కుత్రచిదింద్ర నీలమణిభిః జాంబూనదైః కుత్రచిత్**
**వైదూర్యైః క్వచన క్వచేందుమణిభిర్నీహారి హీరైః క్వచిత్**
**ముక్తాభిః క్వచన ప్రవాల నివహైః క్వాపి క్వచాలోక వి**
**జ్ఞాతైః క్వాపి వినిర్మితా విజయతే వృందాటవీయావనీ 76**

శ్రీబృందావన భూమి కొన్ని చోట్ల దివ్య ఇంద్రనీలమణులతోను, కొన్ని చోట్ల స్వర్ణరాశితోను, మరికొన్ని తావుల వైడూర్యమణులతోను, ఇంక కొన్ని చోట్ల చంద్రకాంతమణులతోను ప్రకాశిస్తున్నది. కొన్నిచోట్ల మంచుబిందువుల వంటి

తెల్లని వజ్రములతోను, కొన్ని తావుల ముత్యములతోను, ఇంకకొన్ని ప్రదేశములలో పగడములతోను వెలుగుతున్నది. మరికొన్ని తావులలో అప్రాకృతికమైన అపరిచిత మణులు, మాణిక్యములతో ఖచితమైన శ్రీబృందావనభూమి సర్వోత్కర్షమై ప్రకాశిస్తున్నది.

**కేచిత్ పీయూష సారోత్తమ పరిణతయః కేచన క్షీరసారైః**
**దివ్యైః సన్నిర్మితా కేఽప్యతుల మద కృతామాసవానాం ఘనాంగాః**
**కేచిత్ సైతోపలాః కేఽప్యతి హిమకరకాః కల్పరూపా ఇతి శ్రీ**
**వృందారణ్యే ద్రుమేంద్రా దధతి బహువిధా రాధికాకృష్ణ తుష్ట్యై 77**

శ్రీబృందావనమునందలి శ్రేష్ఠవృక్షములు శ్రీరాధాకృష్ణుల ప్రీతికై అనేక విధములైన రూపములతో ప్రకాశిస్తున్నాయి. కొన్ని వృక్షములు అమృత సారముతో ఉత్తమముగా పరిణతి చెంది ఉన్నాయి. మరికొన్ని దివ్యమైన క్షీరసారములతో సుందర భావముచే ఏర్పడి ఉన్నాయి. ఇంకకొన్ని సాటిలేని మత్తతను కలిగించు అమృతస్వరూపములై వెలుగొందుతూ ఉన్నాయి. కొన్ని కొన్ని వృక్షములు స్ఫటిక మణుల వలెను, మరికొన్ని చంద్రకాంతి వంటి కాంతితోను అత్యంత స్వచ్ఛ స్వరూపములై ప్రకాశిస్తూ ఉన్నాయి.

ఈ శ్లోకము నుండి శ్రీప్రబోధానందులు వరుసగా బృందావన వృక్షముల శోభను, తేజస్సును, మాధుర్యమును, దివ్యత్వమును వర్ణించుచున్నారు.

**శ్రీరాధాకృష్ణ నర్మోక్త్యనుసరణ పరా విభ్రతః కేఽపి శాఖా**
**భూలగ్నాః సూనభారా బహుశత పరితోమండపాకార రమ్యాః**
**హస్తగ్రాహ్యం ప్రసూనాద్యథ పరశిఖరస్థంచ సంధారయంతీ**
**శాఖీంద్రాయత్ర ధన్యా దిశతు మమ శివం సైవ వృందాటవీయమ్78**

శ్రీరాధాకృష్ణుల నిగూఢమైన మాటలననుసరించి కొన్ని వృక్షములు తమ కొమ్మలను భూమికి తగులునట్లు వంచినవి. అవి పుష్పముల భారముతో క్రిందికి

వంగి ఉన్నవి. ఆ వృక్షములు అధిక సంఖ్యలో ఉండి ఇటునటు మండపాకారముగా శోభిస్తున్నాయి. కొన్ని చెట్లు పుష్పములతోను, చిగుళ్లతోను చేతికి అందునట్లు ఉండగా; మరికొన్ని ఎత్తైన శాఖలతో ఒప్పుతున్నాయి. ఈ ప్రకారంగా భాగ్యశాలియైన శ్రేష్ఠ వృక్షము శోభిస్తున్నది. అట్టి శ్రీబృందావనము నాకు శుభమును కలిగించుగాక!

**కేచిన్మాధ్యాహ్నికాదప్యతివహల రుచశ్చండ మార్తాండకోటిః**
**భ్రాజత్ దివ్యప్రభా మండలత ఉరురుచః కేఽపి కల్పాగ్నికోటేః**
**కేచిత్ రాకేందు కోట్యుజ్జ్వల శిశిర లసచ్చంద్రికా చారురోచిః**
**పుంజాగుంజాభిరామద్యుతి వితత మహామంజులాః కేఽపియత్ర 79**

శ్రీబృందావనమునందలి కొన్ని వృక్షములు మధ్యాహ్నకాలపు ప్రచండమైన కోటి సూర్యుల దివ్యతేజస్సు కన్నను అధిక కాంతితో వెలుగుతున్నాయి. మరికొన్ని కోటికల్పాగ్ని కీలలకన్నను అధిక కాంతులతో ప్రకాశిస్తున్నాయి. ఇంక కొన్ని వృక్షములు కోటి పూర్ణచంద్రుల ఉజ్వల శీతల చంద్రికలతో (వెన్నెల కిరణములతో) కూడి మనోహర కాంతితో ఉన్నాయి. మరికొన్ని వృక్షములు పూలగుత్తుల మనోహర ప్రకాశమును విస్తరింపజేయుచు, మంజుల మనోజ్ఞశోభతో విరాజమానమైనవి.

శ్రీ ప్రబోధానందులు చేసిన ఈ దివ్యవర్ణన బృందావనము నందలి ప్రకృతి బాహ్య ప్రకృతికి అతీతమైనదని స్పష్టం చేస్తున్నది.

**కేచిద్విద్యోతమానా ద్యుతిభిరగణితోద్దీప్త విద్యుల్లతానామ్**
**విస్ఫూర్జద్దివ్యకోటి స్ఫటికమణి మహాస్వచ్ఛభాసోఽపి కేఽపి**
**కేచిద్బాల ప్రవాలాధిక లలిత మహః కందలీ సుందరాంగాః**
**కేచిన్నిర్భాన్త్యనంతద్రుత కనకరుచో హీరహారత్విషోఽన్యే 80**

కొన్ని కొన్ని వృక్షములు అసంఖ్యాకములైన విద్యుల్లతలవలె తళతళలాడుతున్నాయి. మరికొన్ని దివ్యస్ఫటిక మణులవలె మహా స్వచ్ఛకిరణములను

అన్ని దిశలలోను ప్రసరింపజేస్తున్నాయి. ఇంకకొన్ని చెట్లు లేత పగడముల కన్నను మిక్కిలి లలితములైన, తేజోమయమైన మొలకలతో శోభిస్తున్నాయి. కొన్ని వృక్షములు అనంతములైన తప్తకాంచన వర్ణములతో వెలుగుచుండ, మరికొన్ని వజ్రముల కన్నను అధికముగా మెరుస్తున్నాయి.

**కేఽపి ప్రోత్ఫుల్ల దివ్యస్థల కమల రుచః కేఽపి నీలోత్పలాభాః**
**కేచిత్ కీరానుకారిచ్ఛవినిక రచితాః కేఽపి కాశ్మీరభాసః**
**కేచిత్ భిన్నాంజనాభా మరకత మణివత్ కేచిదత్యుజ్జ్వలాభాః**
**కేచిత్ సత్పాటల ప్రోచ్చయ రుచిర రుచోఽన్యే జవాపుష్పభాసః 81**

కొన్ని వృక్షములు బాగుగా వికసించిన దివ్యస్థల పద్మముల కాంతి వంటి కాంతితో ఉన్నాయి. మరికొన్ని నీలి పద్మముల కాంతితో అలంకృతమైనాయి. కొన్ని శుభ్రవర్ణము వంటి కాంతిని కలిగి ఉన్నాయి. కొన్ని వృక్షములు కుంకుమ వర్ణముతోను, మరికొన్ని మరకత మణులవలెను, ఇంకకొన్ని అతి ఉజ్వల దీప్తితోను వెలుగుతున్నాయి. కొన్ని సుందరమైన గులాబీల వంటి మనోహరకాంతితోను, కొన్ని జవా పుష్పముల వంటి కాంతితోను శోభిస్తున్నాయి.

**ఇత్థం స్వానంద సచ్చిద్రస ఘన వపుషో యత్ర శాఖీంద్ర వృంద**
**స్యాశ్చర్యా వర్ణభేదా అథ వివిధరుచాం వీచయో దుర్నిరూపాః**
**ఆకారాణాం ప్రకారా అపి పరమచమత్కారిణాం యత్ర పుష్పా**
**ద్యత్యాశ్చర్యైక సీమ్నిః స్ఫురతు మమ సదా సైవ వృందాటవీయమ్ 82**

ఈ ప్రకారంగా అచటి శ్రేష్ఠ వృక్షములు స్వానంద సచ్చిత్, రసఘనములై ఉన్నాయి. ఆశ్చర్యకరమైన వర్ణభేదములతో అనిర్వచనీయములైన వివిధకాంతి తరంగములను ప్రసరింపజేస్తున్నాయి. పరమ చమత్కారపూర్ణములైన ఆకృతుల వివిధ భేదములతో పరమసుందరమైన పుష్పాదులు కూడ విరాజమానమైనవి. అట్టి ఈ శ్రీబృందావనము నిరంతరము నాహృదయములో స్ఫురించునుగాక!

**విచిత్రపత్ర పల్లవ ప్రసూనగుచ్ఛజాలకైః**
**అపారముల్లసన్మహా మరందసింధు నిర్ఝరమ్**
**విచిత్రరోచిషాచితం సుధారసాత్మకైః ఫలైః**
**స్మరామి కృష్ణకాననే విచిత్ర శాఖి మండలమ్ 83**

శ్రీకృష్ణవనమైన శ్రీబృందావనము విచిత్రమైన పల్లవములతోను, పూగుత్తులతోను కూడి ఉన్నది. అనంత భావములతో ఉల్లసితమై, మహాసుధాసముద్ర ప్రవాహమై, విచిత్రకాంతితో నిండిన అమృత రసఫలములతో పూర్ణమై ఉన్నది. అట్టి బృందావన విచిత్ర వృక్షములను స్మరిస్తున్నాను.

ఇట్లు శ్రీప్రబోధానందులు 77వ శ్లోకము నుండి 83వ శ్లోకము వరకు శ్రీబృందావనము నందలి చిదాత్మక, రసభరితములైన వృక్షముల దివ్యతత్వమును ప్రబోధించినారు.

**అనంత హరిరాధికా ప్రణయ ఫుల్లవల్లీద్రుమమ్**
**తదంఘ్రిరస విహ్వలైః ఖగ మృగాదిభిర్మండితమ్**
**తదద్భుత విలాసవన్నవ కుంజ పుంజోదయమ్**
**స్మరామ్యతి మహోజ్జ్వలన్మధుర వృంద వృందావనమ్ 84**

శ్రీబృందావనము శ్రీరాధాకృష్ణుల అనంత ప్రణయమునందు వికసించిన వృక్షలతలచే శోభిస్తున్నది. శ్రీయుగళకిశోరుల చరణకమల రసమునందు విహ్వలమైన పశుపక్ష్యాదులతో అది భూషితమైనది. అద్భుతమైన, విలాసపూర్ణమైన నవనవ నికుంజలతో శోభితమై; మహోజ్వల మాధుర్యగుణములచే అలంకృతమైనట్టి శ్రీబృందావనమును స్మరిస్తున్నాను.

**వైకుంఠే సకలోజ్జ్వలేఽతి మధురేఽప్యత్యుజ్జ్వలం మాధురీ**
**పూర్ణం చూర్ణయదద్భుతైర్నిజగుణైర్ని శ్రేయసాద్యాన్యపి**
**స్వర్ణజ్యోతిరథోన్మదం మరకతజ్యోతిర్ద్వయం తన్మహో**
**విభ్రన్నిర్భరకేలి నూతన వయః పశ్యామి వృందావనమ్ 85**

శ్రీబృందావనము సర్వోజ్వలమై, అతిమధురమైన వైకుంఠమునకన్నను అత్యుజ్వల మాధురీ పూర్ణమై ఉన్నది. సమస్త మోక్షముల గర్వమును కూడ శ్రీధామము అణచి వేస్తుంది. నూతన వయో విలాస పరాయణమై; స్వర్ణ ఇంద్రనీలమణికాంతితో విలసిల్లుతున్న శ్రీయుగళ శోభచేత ప్రకాశిస్తున్న శ్రీబృందావనమును దర్శిస్తున్నాను.

**ప్రకృత్యంతం గత్వా జడమనృత దుఃఖాత్మసకలమ్**
**పరబ్రహ్మజ్యోతిః పరిచిను మహావిస్తృతతమమ్**
**తతో దూరే శుద్ధస్మర రసమయాశ్చర్య మధురో**
**జ్జ్వలం జ్యోతిః పూర్ణం పరమిహ హి వృందావన వనమ్ 86**

ప్రాకృతికమైన, మిథ్యయైన, దుఃఖాత్మకమైన జడ వస్తువులను దాటి; మహా విస్తృతమైన పరబ్రహ్మజ్యోతి పరిచయమును పొందుము! (అనగా ఆ పరబ్రహ్మజ్యోతి సన్నిధానమునకు చేరుము). దానికి ఆవల శుద్ధ శృంగార రసమయము, అత్యాశ్చర్యమయము, మధురోజ్వల జ్యోతిర్మయమునైన 'శ్రీబృందావనము' అను పేరు గల పరమవనము శోభిస్తున్నది.

**ఇహాశ్చర్యం గౌరాసిత నవకిశోరద్వయమహో**
**మహాసౌందర్యౌఘం పరమ సుషమాపారమనిశన్**
**స్మరాంధ స్వాభావ్యాన్నవ నవ నికుంజేషు విహర**
**త్యతిక్రీడా వైదగ్ధ్యభినవ చమత్కార మధురమ్ 87**

ఓహో! ఆశ్చర్యమయమైన గౌరశ్యామ నవయుగళము మహాసౌందర్య మూర్తులు! వారు నిరంతరము పరమకాంతితో వెలుగుచు, ప్రేమ వివశత్వముచే కన్నులు మూతలుపడుచుండ అతిశయ క్రీడా వైదగ్ధిని ప్రకటించుచుందురు. నిత్యనూతనమైన చమత్కార మాధుర్యమును విస్తరింపజేయుచు శ్రీశ్యామాశ్యాములు నవనవ నికుంజలలో విహరించుచున్నారు.

**మహానందానాం యత్పరమ పరమం సారమమలమ్**
**మహాసౌందర్యాదేర్యదపి పరమాంతావధి పదమ్**
**మహాశ్చర్యానంగోన్మద రసవిలాసైక సుమహా**
**చమత్కారో యత్తత్తదుభయ మహాదివ్య మిథునమ్ 88**

శ్రీయుగళకిశోరులు మహా ఆనంద స్వరూపులు, స్వచ్ఛమైన పరమ సారరూపులు! వారు మహాసౌందర్యమునకు పరమసీమ, మహాశ్చర్యకరమైన అనంగ ఉన్మద రసవిలాసమునకు చమత్కారమూర్తులు! శ్రీశ్యామాశ్యాములు అట్టి మహాదివ్య శ్రీయుగళ స్వరూపులు!

**సదాహం తన్మధ్యేఽప్యతి మధురిమాత్యున్మదరసమ్**
**స్మరామి శ్రీరాధాచరణ కమల జ్యోతి రతులమ్**
**మహా విస్తీర్ణ తద్ఘన తను కిశోరీం నవ తడి**
**ల్లతా గౌరీం కాంతి ప్రమదిమ విజిత స్వర్ణలతికామ్ 89**

ఆ యిరువురిలోను (శ్రీశ్యామాశ్యాములలో) మాధుర్యము చేత అతి ఉన్మాదమును కలిగించు రసఖనియైన శ్రీరాధా చరణకమలముల యొక్క మహా విస్తృత అనుపమ జ్యోతిని నేను నిరంతరము స్మరిస్తున్నాను. ఆ రసఘన స్వరూపిణి తన మృదుకాంతి చేత మెరుపు తీగను కూడ పరాజితము చేస్తుంది. అట్టి ఒకానొక వర్ణనాతీతమైన విద్యుల్లత వంటి గౌరవర్ణ కిశోరిని చింతిస్తున్నాను.

**దిగంత ప్రచ్ఛాది చ్ఛవిమతుల సౌందర్య లహరీ**
**పరీతాం వైదగ్ధీనిధిమమిత భంగీమయ తనుమ్**
**అనన్యాం తద్దాసీమతి బహులతత్ స్నేహ వికలామ్**
**కలాంభోధేః పారం పరమితవతీం తత్కరుణయా 90**

ఆమె (సఖి) తన కాంతి చేత దశదిశలను కప్పివేస్తున్నది. సాటిలేని సౌందర్య తరంగములతో కూడిన విదగ్ధతా సాగరమైన శ్రీదాసీమణి అపరిమిత భంగిమలను

ప్రకటిస్తున్నది. శ్రీరాధా అనన్యదాసి తన స్వామిని చూపించు మహా స్నేహముచేత వివశఔతూ, తిరిగి ఆమె కృప చేతనే అనేక కళలలో ఉత్తీర్ణ ఔతూ ఉంటుంది.

**మహావేణీ పుచ్ఛస్ఫురితమణిగుచ్ఛాం నిదధతీమ్**
**దుకూలం సవీతస్తన ముకులయోర్మూర్ధ్ని చ ముహుః**
**సలజ్జం సస్నేహం సముదహసితం సాంగబలనమ్**
**విలోకైర్విశ్వేషాం సహజకుటిలైర్విస్మయకరీమ్ 91**

ఆమె యొక్క మహావేణి (పెద్ద జడ)తో కూడిన శిరస్సుపై మణిగుచ్ఛము శోభిస్తున్నది. వక్షస్థలముపైనను, శిరస్సుపైనను కప్పుకొనిన వస్త్రమును ఆమె మాటిమాటికిని పైకి లాగుకుంటున్నది. ఆ సఖి సిగ్గుతోను, స్నేహముతోను, మధుర మందహాసముతోను, అంగభంగిమలతోను, సహజమైన కటాక్ష వీక్షణములతోను అందరినీ విస్మితులను చేస్తున్నది.

**అతిక్షామాం మధ్యే పృథుతర నితంబాతి మసృణ**
**ప్రభాపూరం దివ్యోజ్జ్వల రుచిర శాట్యాపి దధతీమ్**
**క్వణత్కాంచీ దామాం రణిత మణిమంజీర చరణామ్**
**స్ఫురచ్చూడా రత్నాంగద మృదుల దోర్వల్లి లలితామ్ 92**

ఆమె నడుము మిక్కిలి సన్నమై ఉన్నది. విశాలమైన నితంబములు (పిరుదులు) అత్యంత కోమలమైన కాంతిని విస్తరింపజేస్తున్నాయి. ఆమె ఉజ్వలమైన, మనోహరమైన చీరను ధరించింది. నడుమునకు ఉన్న వడ్డాణము, చరణములకు గల మణినూపురములు మధురముగా ధ్వనిస్తున్నాయి. శిరసుపై ధరించిన చూడామణితోను, రత్నమయ అంగదములతో అలంకృతమైన మృదు బాహులతలతోను శ్రీసఖీమణి మిక్కిలి లలితముగ ఉన్నది.

**సుచారు గ్రైవేయోజ్జ్వల పదక హారావలీ రుచిమ్**
**సుకర్ణే తాటంకం మణిమయ ముదారంచ దధతీమ్**
**సుముక్తాం శ్రీనాసాపుటమను మణిస్వర్ణఖచితామ్**
**దధానాం బింబోష్ఠీం స్ఫురదసిత శ్రీచిబుకామ్ 93**

ఆమె అందమైన కంఠమునందు ధరించిన ఉజ్వల పతకముతోడి హారముల కాంతిచేత శోభిస్తున్నది. సుందరమైన చెవులకు మణిమయ సుందర కర్ణాభరణమును ధరించినది. శ్రీనాసికపై మణి, స్వర్ణఖచితమైన ఒక సుందర ముత్యము ఊగుచున్నది. బింబోష్ఠము (క్రింది పెదవి)తోను, నల్లని దృష్టిచుక్కతోను శోభిస్తున్న గడ్డము సుందరముగ వెలుగొందుచున్నది.

**లసన్ముక్తా పంక్తి ప్రతిమ దశన శ్రేణి విసర**
**చ్ఛటౌఘైః కుర్వాణాం దిశమివ చితాం కుందకుముదైః**
**సదా రాధాతీవ్రప్రణయ రస రోమాంచిత తనుమ్**
**నిచోలేనాచ్ఛన్నామతి రుచిర గుచ్ఛాంచలవతామ్ 94**

శ్రీసఖి యొక్క దంతపంక్తి (పలువరుస) ముత్యములవలె కాంతిని విస్తరింప జేయుచు; దశదిశలలోను కుంద, కుముద పుష్పములను వెదజల్లినట్లు ఉన్నది. నిరంతరము శ్రీరాధ యందలి తీవ్ర ప్రణయరసముచేత ఆమె పులకిత ఔతూ ఉంటుంది. సుందరమైన పూగుత్తుల అంచులతో ఉన్న మేలి ముసుగుతో దేహమునంతటిని కప్పుకున్నది.

**సదారాధా పదాంబురుహ పరిచర్యాకులతయా**
**ఝణత్ కుర్వన్మంజీరకమతి చలంతీం తత ఇతః**
**నిజ ప్రాణ ద్వంద్వాద్భుత సురుచి సౌందర్యలహరీ**
**విలాసైరానందామృత జలధిపూరేऽతి బుడితామ్ 95**

వారు (సఖీమణులు) శ్రీరాధా చరణకమల సేవ యందు వ్యగ్రులై, నూపురములు ధ్వనిస్తూ ఉండగా ఇటునటు అతివేగముగ తిరుగుతూ ఉంటారు. తమ ప్రాణ ప్రియతములైన శ్రీయుగళ కిశోరుల అద్భుత సౌందర్యకాంతి విలాస తరంగాలలో తేలియాడుతూ ఉంటారు. ఆ ఆనందామృత సాగరములో వారు మిక్కిలి నిమగ్నులై ఉంటారు.

శ్రీప్రబోధానందులు ఇట్లు వరుసగా శ్రీరాధా అనన్యదాసీమణి యొక్క సౌందర్య, భావ, సేవాతిశయరీతిని స్తుతించినారు.

**మహాదోషైరాఢ్యం న ఖలు గుణలేశ్య విషయమ్**
**న యోగ్యం దృక్పాతేఽప్యహహ స దయానాంచ మహతామ్**
**సుదుర్మర్త్యైః స్వస్మిన్నసకృదపరాధైరపి యుతమ్**
**సుతం మాతేవ త్వం విసృజ బత వృందాటవి! న మామ్ 96**

నేను మహా దోష పూర్ణుడను, లేశ మాత్రము కూడ సద్గుణములు లేనివాడను! ఓహో! దయాళురైన మహాత్ముల సన్నిధికి వచ్చుటకు కూడ యోగ్యత లేనివాడను. నీ పట్ల క్షమింపరాని అపరాధములను చేస్తున్నాను. అయినప్పటికి హే బృందావనమా! తల్లి పుత్రుని విడువనట్లు నీవునన్ను విడువకుము!

**మహామూఢం పాపైర్గురుభిరఖిలైః శోచ్యమసతా**
**మపి స్వప్నేఽపీషన్న నతహరి తద్భక్త చరణమ్**
**స్వకల్యాణోపాయోషరమశరణం మామవగుణైః**
**క్షమా వాత్సల్యాద్యైరతి మహిత వృందావన! నిజైః 97**

అత్యంత పూజనీయవైన ఓ బృందావనమా! మహామూఢులై అనేక పాపములను చేయుచుండు నీచులలో మిక్కిలి నీచుడను! కలలో కూడ ఏమాత్రము హరికికాని, హరిభక్తులకు కాని నమస్కరింపలేదు. నాకు మేలు కలిగించుపనిని

ఒక్కటి కూడ చేయలేదు. ఏ ఆశ్రయము లేక, అవగుణములతో ఉన్న నాకు క్షమా వాత్సల్యాది గుణమణివైన నీవే శరణ్యము!

**తవ ప్రేష్ఠద్వంద్వం త్వదమల నికుంజేషు విహరత్**
**సదైవోన్మర్యాదం న హి విధినిషేధాది కలయేత్**
**రమేశిత్రోస్తత్వం కిమపి పరమం ధ్యాన రసదమ్**
**తతస్త్వం మాం వృందావన! న విసృజోచ్ఛృంఖలమతిః 98**

హేబృందావనమా! రసప్రదాత, ఒకానొక అనిర్వచనీయ తత్వమునైన నీ ప్రియతమ యుగళ కిశోరులు నీ నిర్మల నికుంజలలో నిరంతరం విహరిస్తున్నారు. వారు శ్రీలక్ష్మీ నారాయణులకు కూడ పరమ ధ్యానమూర్తులు! అట (శ్రీధామములో) విధి నిషేధములను చూచుట లేదు. అమ్మా! నేను విశృంఖలుడినై చరిస్తున్నాను. అయినను నన్ను విడువకు!

**క్వ ధర్మః క్వాధర్మః క్వ చ వివిధ మర్యాదిక కథాః**
**క్వ భద్రం క్వాభద్రం క్వ చ విషమ దృష్ట్యుద్భవ లవః**
**ఇహ శ్రీమద్బృందావన భువి సమస్తం స్థిరచరమ్**
**యది జ్ఞాతం రాధాపతిరతి మహా చిద్రస ఘనమ్ 99**

ఈ బృందావన భూమిపైనున్న సమస్త స్థావర, జంగమములు శ్రీరాధారమణుని మహాప్రేమరస చిద్ఘన మూర్తులే అని తెలిసినపుడు ఇక ధర్మము, అధర్మము ఏమిటి ? అనేక విధి నిషేధముల హద్దులతో ఏమి పని ? మంచి, చెడు ఏమిటి ? విషమ దృష్టి వలన కలిగెది ద్వంద్వముల లేశమాత్రపు ఉనికి కూడ ఎక్కడ ఉంటుంది ?

బృందావనములోని జడ, చేతనములన్నియు శ్రీశ్యామాశ్యాముల చిద్ఘన స్వరూపములే! ఆ సత్యము అనుభవములోనికి వచ్చినపుడు అతడు ద్వంద్వములకు అతీతమైన స్థితిలో ఉంటాడని భావము!

**ప్రకృత్యంతర్ద్వైతం సకలమపి నిష్పీయ పరమో**
**జ్జ్వలం జ్యోతిర్మాత్ర కిమపి వితతం బ్రహ్మకలయే**
**తత్ద్వైశం జ్యోతిః పరమ పరమానంద వితతమ్**
**తతో దూరే ప్రేమోజ్జ్వల రసమయం జ్యోతిరసితమ్ 100**

ప్రకృతిలో అంతర్గతముగనున్న ద్వంద్వవస్తువుల యొక్క విశేషరూపాన్ని దర్శించిన తరువాత పరమోజ్వలమైన, విస్తృతమైన, జ్యోతిస్స్వరూపమైన బ్రహ్మపదార్థము వైపుకి దృష్టిమరలుతుంది. ఆపై, దానికి ఆవల పరమ పరమానంద విస్తృతమైన ఈశ్వరజ్యోతి దర్శనం ఇస్తుంది. అటుపై, దానికన్నను పైన పరమోజ్వల, రసమయ కృష్ణజ్యోతి విరాజమానమై ఉన్నది.

బృందావనములోని సమస్తవస్తువులు చిద్ఘనములే అనుఎరుక కలిగిన తరువాత సాధకుడు బ్రహ్మమును, ఈశ్వరజ్యోతిని దర్శిస్తాడు. ఇక అన్నిటికన్నను ఉపరి స్థానములో "కృష్ణజ్యోతి" వెలుగుచుండుటను తెలియగలడు.

**తదంతః శ్రీవృందావమిహ మహాశ్చర్య సుషమా**
**వయో రూపౌదార్యోన్మద మదన తృష్ణైక సహజమ్**
**మహాగౌర శ్యామం ద్వయమతి మహానంద సుధనమ్**
**మహాభావోన్మీలన్మధురతర దాస్యేన భజ భోః 101**

ఆ "కృష్ణజ్యోతి"కి మధ్య – అదియే శ్రీబృందావనము! అచట మహాశ్చర్య పూర్ణమైన శోభతో శ్రీయుగళము భూషితులై ఉన్నారు. వారు వయో, రూప, ఉదారతాది గుణములచే ఉన్మత్తమైన అనంగతృష్ణతో కూడిన స్వభావము కలవారు. అత్యంతానందఘన మూర్తులైన గౌరశ్యామ యుగళము యొక్క మహాభావ ప్రకాశమును మధురతరమైన దాస్యభావముతో భజింపుము!

**సుస్నిగ్ధాః సుకుమార సుందరతరాః స్వానంద నిస్స్యందినః**
**సుప్రజ్ఞాః సురుచః సుశీతలతరచ్ఛాయాః సుపుష్పాన్వితాః**
**స్వాదీయాః సుఫలైః సుగంధ మధుభిః పత్రైః శుభైః పల్లవైః**
**వృందాకానన ఉల్లసంతి తరవః కృష్ణే స్వభావోజ్జ్వలాః 102**

శ్రీబృందావనము నందలి వృక్షబృందములు స్నిగ్ధములై, సుకుమారములై, సుందరతర ఆనందధారలను వర్షిస్తూ ఉంటాయి. అవి సుందరమైన జ్ఞానముతోను, సుందరకాంతితోను, శీతలతరమైన నీడతోను, సుందర పుష్పములతోను శోభిస్తున్నాయి. సుగంధ పూర్ణమైన మధువుతో కూడిన సుందర ఫలములతో ఆస్వాదనీయమై ఉన్నవి. శుభ పత్ర పల్లవ సహితముగ ఉజ్వల స్వభావముతో ఆ వృక్షరాజములు శ్రీకృష్ణుని యందు ప్రకాశిస్తున్నాయి.

శ్రీరాధా మాధవుల దివ్యశోభను, మహాప్రేమమాధుర్యమును, రసార్ద్ర తేజస్సును తనివితీర వర్ణించి; శ్రీరాధాసఖియల అపూర్వ సేవారీతిని, ప్రేమగతిని, అనన్య నిష్ఠను అందించిన శ్రీప్రబోధానందులు బృందావనము నందలి వృక్షరాజముల మహిమను, గరిమను అపూర్వముగ ప్రకటించారు. శ్రీకృష్ణుని యందు ప్రకాశిస్తున్న శ్రేష్ఠ వృక్షముల స్నిగ్ధ, సుకుమార, సుందర కాంతిధారలతో ఈ పదవ శతకమును ముగించారు.

# పదకొండవ శతకము

**స్వోత్సంగే న్యస్యబాలం నిజమిమమితి దుశ్చేష్టముచ్చైరమేధ్య**
**క్రీడం సోఢ్వాఽపరాధాన్ సకరుణమతి సంమృజ్య వీతం రజోభిః**
**ఆత్మేశ ప్రేమదివ్యం స్తనభరమమలం పాయయిత్వా సు మాతః**
**శ్రీమద్బృందాటవి! త్వం సహజ నిరవధి స్నేహపురేఽభి రక్ష 1**

హేబృందావనమా! నీవు స్వభావతః నిరంతర అగాధ స్నేహశీలవు! నేను దురాచారిని, అపవిత్ర విషయములందు లగ్నమై ఉంటాను. అయినప్పటికి, నన్ను నీ బాలునిగ భావించి ఒడిలోకి తీసుకొని, నా సమస్త అపరాధములను మన్నించు. తల్లి తన బిడ్డకు అంటుకున్న ధూళిని ఏవిధముగ తుడిచి శుభ్రం చేస్తుందో ఆవిధముగ నా మాలిన్యమును దూరం చేసి, నా శరీరమును చక్కగా శుభ్రపరచు. ఓ అమ్మా! నీవు నీ ప్రియతములైన శ్రీరాధాకృష్ణుల శుద్ధ దివ్య ప్రేమామృతము అనెడు స్తన్యమును నాకు కడుపునిండుగ త్రాగించి, అన్నివిధములుగాను నన్ను రక్షింపుము తల్లీ!

శ్రీప్రబోధానందులు ఇటనుండి ఎంతటి పాపాత్ముడైనను శ్రీబృందావనమును శరణువేడినచో ఆతల్లి దయ వలన ఉద్ధరింపబడుటకు అవకాశము ఉండుటను వరుసగా వర్ణిస్తున్నారు.

**ధర్మాభాసోఽప్యహహ నహి మే నైవ పాపాచ్చ భీతిః**
**న శ్రీకృష్ణే రతిరపి న మే సౌహృదం సత్తమేషు**
**కింత్వత్యంతాహత జన మిమం స్వ ప్రవిష్టం కథంచిత్**
**జ్ఞాత్వాత్యంతాగతి మవకృత స్వీక్రియం యన్యసే చేత్ 2**

హే బృందావనమా! నాయందు ధర్మము యొక్క ఆభాస (ఉన్నట్లు అనిపించుట) కూడ లేదు. పాపములనిన భయములేదు. శ్రీకృష్ణుని యందు

ప్రీతి కూడ లేదు. సాధుజనులపట్ల స్నేహ భావము లేదు. కాని, ఏదో ఒక విథముగ నేను నీ ధామమునందు నివసిస్తున్నాను. నన్ను గూర్చి ఇంత మాత్రము నెరిగిన చాలును! అతిదౌర్భాగ్యులను, గతిహీనులను కూడ నీవు స్వీకరింతువట, అట్టియెడ నీవు నన్ను కూడ స్వీకరించుము తల్లీ!

**శ్రీవృందారణ్య! నిత్యం విహితబహుతరాక్షమ్య పాపః స్వధర్మ**
**త్యాగీ నో వేద గుర్వాదికమపి వచసా వందితస్యాంఘ్రి దూరః**
**హా హా జాతాపరాధో ముహురపి భగవద్భక్తిరతస్త్వాశ్రయం త్వా**
**మేకం జ్ఞాత్వాశ్రితో஽హం త్వయి చ భవదఘః కిం కరోమి క్వయామి 3**

హేబృందావనమా! నేను నిత్యము క్షమార్హము కాని అనేక పాపములను చేస్తున్నాను. స్వధర్మమును వదలిపెట్టాను. గురుదేవులు మున్నగు పెద్దలను కూడ ఎరుగను. భగవంతుని చరణ కమలములను స్తుతించుట, నమస్కరించుటలకు చాలా దూరముగ ఉన్నాను. హా! హా! భగవద్భక్తి పరాయణులైన మహనీయుల పట్ల కూడ మాటిమాటికి అపరాధము చేస్తున్నాను. నీవు మాత్రమే ఆశ్రయింపదగిన దానవని ఎరిగి నిన్ను శరణు చెందాను. కాని ఇప్పుడు నీపట్ల కూడ పాపాచరణము చేస్తున్నాను. ఏమి చేయను ? ఎక్కడికి వెళ్లను ?

**త్యక్తః సర్వో஽పి ధర్మో హరి హరి న మనృక్ త్యక్తమేకం వికర్మ**
**శ్రీకృష్ణే తస్య నామస్వథ తదనుచరే నాగసామస్తిమే஽ంతః**
**శ్రీమద్బృందావన త్వాశ్రయమగతి గతిం త్వేకలాం త్వయ్యసద్ధీః**
**కిం కుర్యాం కుత్ర యాయాం యదిహ బత భవేత్తద్భవత్వేవ కామమ్ 4**

సమస్త ధర్మములను వదలివేశాను. హా! హా! ఒక్క పాపాచరణము నా నుండి కొంచెమైనను దూరము కాలేదు. (అనగా, పాపాచరణము చేస్తున్నాను). శ్రీకృష్ణునిపట్ల, ఆయన నామముపట్ల, ఆయన భక్తులపట్ల నేను చేస్తున్న

అపరాధములకు అంతములేదు. హే బృందావనమా! నిరాధారులకు ఏకమాత్ర శరణ్యమా! నీవే నాకు ఏకమాత్ర ఆశ్రయము! కాని, నేను అత్యంత నీచుడను. ఏమి చేయను ? ఎక్కడికి వెళ్లను ? ఇక్కడే ఏమి జరగాలో అది జరుగుతుంది.

**సకలగతి విహీన సద్గతి సత్వం శ్రుతి తతిభిః సకలాభిరేవ గీతా**
**అత ఉరు మహిమా త్వమేవ వృందాటవి! మమ సచ్ఛరణం న చాన్యదస్తి 5**

హే బృందావనమా! గతిలేనివారికి నీవే ఏకమాత్రశరణ్యమని సమస్త వేదములు చాటి చెప్పాయి. కనుక అంతటి మహిమ కల నీవే నాకు సుందరమైన ఆశ్రయము! ఇక ఎవరూ లేరు.

**అసమహత మహాధమస్య వృందాటవి! మమ నిస్సమ దివ్యవస్తులిప్సోః**
**దృఢతరముపహాస్యతాం గతస్యోదయతి కృపా తవ చేన్మనాక్ కుతో హ్రీః 6**

హే బృందాటవీ! నేను అత్యంత అదృష్టహీనుడను, అధముడను. అయినను అనుపమానమైన దివ్యవస్తువును కోరుకుంటున్నాను. ఆ కారణంగా ఎంతగానో నవ్వులపాలు కూడ అయినాను. అయినను, ఒకవేళ లేశమాత్రమైనా నీకృప నాకు లభిస్తే ఇక సిగ్గుదేనికి ? అనగా, బృందావన కృప లభిస్తే చాలు, ఎవరు ఎంత ఎగతాళి చేసినా సిగ్గిలవలసిన పనిలేదు అని భావం!

**అహహ! పరమమగ్న సర్వసేతుర్వ్రజ యువరాజ ఇహాత్యుదారభావః**
**విహరతి యది రాధయైవ వృందావన! పరమ త్వయి మే తదా క్వ చింతా 7**

ఓహో! శ్రీబృందావనమా! విధి నిషేధాత్మకమైన సమస్త నియమాలను దాటించు వ్రజ యువరాజు (శ్రీకృష్ణుడు) అత్యంత ఉదార భావంతో నీ యందు (శ్రీధామంలో) శ్రీరాధా సహితుడై నిత్య విహారం చేస్తుంటే ఇక నాకు చింత ఎందుకు ?

**త్వయి చిరమధిరాప్య సర్వశక్తిం పరమ చమత్కృతిమత్యనంకుశాంస్వామ్**
**సుఖమ రమత రాధయైవ వృందావన! కథమత్ర తదా భవానుదాస్తామ్ 8**

పరమ చమత్కారియైన అతడు తన సమస్త శక్తులతోను చిరకాలముగ నీయందు శ్రీరాధాసహితుడై యథేచ్ఛగా సుఖంగా విహరిస్తున్నాడు. హే బృందావనమా! మరి నా విషయంలో నీవు ఉదాసీనంగా ఎలా ఉండగలవు ?

శ్రీరాధాకృష్ణుల లీలలకు వేదికయైన శ్రీబృందావనము తనపట్ల కృపచూపవలెనని ప్రార్థించుట!

**అపరిమిత మహామహిమ్ని ధామ్నిత్వయి పరమే పరమోల్లాసద్రసౌఘైః**
**యది న రసమహం లభేయ వృందావన! తపసా త్వయి కోటి వర్త్మహేయమ్ 9**

ఎల్లలులేని మహామహిమాన్విత పరమరసమును ప్రవహింపజేయు పరమధామమా! నీయందు నివసించియు రసమును పొందలేకపోతే, ఓ బృందావనమా! తపస్సు చేసి కోటి కోటి దేహములను నీయందే త్యజిస్తాను.

ఎన్ని జన్మలైనను బృందావనములోనే ఎత్తవలెనను ఆకాంక్ష!

**త్వయి మే శ్వసృగాల భక్ష్యమేతత్ యది దేహం నిపాతేదయత్నవృత్తి**
**అతి మంగలమేవ తర్హి వృందావన! నో తత్ భృతయో త్వదన్యదృక్ స్యామ్ 10**

కుక్కలు, నక్కలు తినుటవలన నా శరీరము చేష్టలుడిగి, నీ ధామములో మృత్యువు వచ్చినా అదినాకు ఎంతో మంగళకరమైనది. హే బృందావనమా! ఈ శరీర పాలన, పోషణలకై నిన్ను విడచి మరొక వైపు చూడనైన చూడను!

**స్వప్నే ఖలు జాగరేఽథవా తవ వృందే వనతః పరత్ర మే**
**అపి న శ్రుత రాధికా ప్రియాంతిక వృత్తే రుదియాత్ ప్రియాసుతా 11**

హే బృందావనమా! కలలోనైనా, మెలకువలోనైనా నిన్ను విడచి ఇతర ప్రదేశమునకు వెళ్లవలెనను ఇచ్ఛకూడ నాకు కలుగకుండునుగాక! ఎందుకంటే

శ్రీరాధా ప్రియతముడైన శ్రీశ్యామసుందరుడు సదా నీయందే విరాజమానుడై ఉన్నాడని విన్నాను.

**త్రుకచేన విదీర్యతాం వపు విలయో వాఽస్త్వపి జ్ఞాతి ధర్మయోః**
**న మనాగపి హాతుమస్తు ధీర్మమ వృందావిపినం సుదుర్లభమ్ 12**

ఈ శరీరం రంపంతో విదీర్ణం (ముక్కలుగా) కానీ; లేదా దీని వలన జ్ఞాతులు, ధర్మములు పోతే పోనీ సుదుర్లభమైన శ్రీబృందావనాన్ని విడిచిపెట్టటం అనే ఆలోచన లేశమాత్రంగానైనా నా బుద్ధికి కలుగకుండునుగాక!

**హరిభక్తిమహం న కామయే మమ ముక్తిః ప్రతిభాతి శుక్తివత్**
**నయనేన నిపీయ రాధికా రతికుంజైరతి మంజులం వనమ్ 13**

శ్రీరాధా రతి కుంజలతో శోభిస్తూ, అతి మనోహరముగా ఉన్న వన సౌందర్యమును కన్నులతో త్రాగుతూ (దర్శిస్తూ) ఉన్న నాకు హరిభక్తి పట్ల కూడ కోరిక కలగటం లేదు. ముక్తి కూడ నాకు ముత్యపు చిప్పతో సమానముగా తోస్తున్నది.

**అపి శుష్క ఫలాది భక్షయన్ క్షుధితో నిర్ఝరవాః పిబం తృషా**
**గిరిరాజగుహాసు విశ్రామో వస వృందా విపినే సుఖం సఖే! 14**

ఓ సఖా! ఆకలివేసినపుడు ఎండు పండ్లను భుజించు. దాహంగా ఉన్నప్పుడు ప్రవాహ జలాలను త్రాగు. గిరిరాజు యొక్క గుహలలో విశ్రమిస్తూ ఈ బృందావనములో సుఖంగా జీవించు!

**కురు మౌన మనీహఆస్వ వృందావన తరుమూల ఉదశ్రు రాధికాయాః**
**అధిపాణికపోల ఆద్యభావాత్ పులక కులః కలయన్ సుకేలి వృందమ్ 15**

మౌనంగా ఉంటూ, శరీరం పట్ల నిరాసక్తుడివై ఉండు. శ్రీబృందావన వృక్షం క్రింద అశ్రువులు కారుస్తూ, చెక్కిలిపై చేయిచేర్చి, దివ్యశృంగార రసభావాన్ని మనసులో నింపుకో! పులకితుడివై శ్రీరాధా సుందర కేళీవిలాసాలను దర్శించు!

ఇక, 16వ శ్లోకం నుండి 31వ శ్లోకం వరకు శ్రీకృష్ణుడు బృందావనమును స్తుతించుటను శ్రీప్రబోధానందులు వర్ణిస్తున్నారు.

**బర్హోల్లాసే వసతి శిథిలాం కేశభారః సుకేశ్యాః**
**పశ్యామ్యేతా మలక వితతం చారు భృంగావలీషు**
**స్మేరాస్యేందోరుదయతి కలా ఫుల్ల హేమాబ్జ కోశే**
**నేత్రాంచల్యాశ్చకిత హరిణీ చాతురీ మాధురీభూః 16**

(శ్రీకృష్ణ వచనము) : సుందరకేశయుక్త అయిన శ్రీరాధా కేశ శోభ మయూరముల పింఛ విస్తృతిలో ద్యోతకమౌతున్నది. ఆమె ముంగురులను నేను అందమైన భ్రమరములలో చూస్తున్నాను. మధుర మందహాసముతో కూడిన రాధాముఖచంద్రకళ వికసించిన స్వర్ణకమల కోశము (లోపలిభాగము) నందు విరాజమానమైనది. ఆమె కంటి కొసలు బెదరుచూపులు చూస్తున్న లేడి కన్నుల చాతుర్య, మాధుర్యములకు నెలవై ఉన్నాయి.

శ్రీకృష్ణునకు బృందావనములోని చరాచరములన్నిటి యందును శ్రీరాధాదర్శనమే! శ్రీప్రబోధానందులు కేవలము మహాపండితుడే కాక; భావుక కవియు, రసపండితుడు కూడ అగుటచే శ్రీరాధాజీకి, శ్రీబృందావనమునకు గల అభేదమును కృష్ణుని ముఖతః అత్యంత మధురముగాను, రసవంతముగాను పలికించినారు.

**శ్రీమన్నాసా సుతిలకుసుమే బంధు జీవాధర శ్రీః**
**కుందే దంతావలి విలసితంకైరవే చారుహాస్యమ్**
**వల్లీవృందే తనురనుపమా గుచ్ఛసత్ కుట్మలాదౌ**
**లక్ష్మీర్వక్షోరుహ ముకులయోర్బాహువల్లీ మృణాలే 17**

శ్రీరాధాజీ యొక్క సుందరమైన నాసిక మనోహర తిలపుష్పములోను, ఆమె అధరముల శోభ బంధులీ పుష్పము (ఒకానొక ఎర్రని పూవు)లోను, దంతపంక్తి యొక్క కాంతి కుందమొగ్గలలోను, అందమైన నవ్వు తెల్లని కమలములోను ప్రతిఫలిస్తున్నాయి. అనుపమానమైన ఆదేవి దేహము లతాబృందములోను, స్తనద్వయ శోభ ముడుచుకొని ఉన్న సుందరమైన మొగ్గలలోను, బాహులతలు తామర తూడులలోను వికాసమానమైనవి.

శ్రీబృందావన సాకారకాంతిలో శ్రీరాధా సాకారసౌందర్యశోభను శ్రీకృష్ణుడు దర్శిస్తున్నాడు.

**పీనశ్రోణిర్విపుల పులినే కోమలోరు కదల్యాః**
**రక్తాంభోజే కరచరణయోః కాఽపి శోభా విభాతి**
**వృందారణ్య! త్వయి నివసతి వ్యస్తరూపా ప్రియామే**
**సామస్త్యేనోల్లసతి తు మమాఽత్రాతి ధన్యాంకదేశే 18**

ఆమె కటిస్థలము విపులమైన తీరములందును, కోమలమైన ఊరువులు అరటి వృక్షములందును, కరచరణముల అనిర్వచనీయ శోభ ఎర్రని కమలములలోను ప్రకాశిస్తున్నాయి. హే బృందావనమా! నీయందు నా ప్రియతమయైన శ్రీరాధ వేరు వేరు రూపములతో నివసిస్తున్నది. ఇట్టి నీ ధన్యమైన ఒడిలో ఆమె సంపూర్ణ భావముతో ఉల్లాసమును పొందుతున్నది.

**యదా మే ప్రాణేశ్వర్యతి నికట ఏవాతి కుతుకా**
**న్నిలీనా పశ్యంతి వికల వికల మాస్థితవతా**
**తదా వల్లీ వృందావన! తవ ససంజ్ఞం కిసలయమ్**
**కరం ధుంత్ర్యా సూచయదిదమహో మే మహదృణమ్ 19**

నా ప్రాణేశ్వరి నాకు అతి సమీపములో ఉండి, అంతలోనే అత్యంత కుతూహలముతో పరుగున దూరముగా వెళ్తుంది. అప్పుడు నేను మిక్కిలి వ్యాకులుడినౌతాను. అపుడు ఆమె దాగి ఉండి, నాయీ అవస్థను చూస్తూ ఉంటుంది. హే బృందావనమా! అపుడు నీవు లతా సంకేతమును చూపించెడు మిషతో నీ పల్లవము అనెడు చేతిని ఊపుతూ ఆమె దాగి ఉన్న ప్రదేశమును నాకు తెలియజేయి. ఇందుకు నేను ఎంతగా ఋణపడి ఉంటాను! అనగా నేను నీకు మిక్కిలి ఋణపడి ఉంటాను.

అద్భుతమైన ఈ శ్లోకములో శ్రీప్రబోధానందులు శ్రీరాధాగోవిందుల దివ్యప్రేమలీలా విశేషములను, ఆ లీలలో శ్రీబృందావన పాత్రను అత్యంత రసాత్మకముగ అందించినారు.

**అహో! వృందారణ్య త్వయి వికసితానంత కుసుమః**
**పరాగైర్నిత్యాద్భిర్నయన యుగళం తత్కలుషితమ్**
**ప్రియాయాః ఫుత్కారః పదరజయతా చుంబన మహో**
**త్సవో లబ్ధస్తేన త్వమసి మమ జీవాతురహహ 20**

ఓహో బృందావనమా! వికసించిన నీ అనంత కుసుమముల సమీపములో నున్న నా ప్రియతమ కన్నులలో పుప్పొడి అంతయు అలముకున్నది. అపుడు ఆ కన్నులలో పడిన ధూళిని ఊదు సమయములో నాకు చుంబన మహోత్సవము (ముద్దు పెట్టుకొనుట) లభించినది. ఈ కారణము చేత నీవే నా జీవన పరమ ఔషధము!

**యదాచిత్ కాంతా మామిహ తవ తమాల ద్రుమవనే**
**నిలీన మా జ్ఞాత్వాఽ ప్యవదదతి ధూర్తో న మిలితః**
**స్తవానాం తం వృందావన వరతమాలోఽ సి దయిత**
**స్వమిత్యుక్త్వా యన్మాశ్లిషదహ మతః క్రీత ఇహతే 21**

నా ప్రియతమయైన రాధాజీ నేను నీ యీ తమాల వనములో దాగి ఉన్నానని ఎరిగి; "అతడు చాలా ధూర్తుడు! అతనిని కలసికొనను" అని అంటుంది. ఆపై, తమాల వృక్షమును స్తుతిస్తూ; "నీవు శ్రీబృందావనములోని శ్రేష్ఠమైన తమాల వృక్షానివి! నీవే నా ప్రియతముడివి" అని అంటూ శ్రీరాధ తమాలము అనుకొని నన్నే ఆలింగనం చేసుకుంటుంది. అందువలన నేను నీకు అమ్ముడైపోయాను.

శ్రీబృందావనములోని తమాల వృక్షమును నెపముగా చేసికొని, శ్రీరాధాగోవిందుల నడుమ నడచిన మధుర మధుర లీల ఇచట మధురాతి మధురముగ వర్ణితమైనది.

**సఖీభిః కాంతామన్నిలయన సుఖేలా సునిరతా**
**ప్రవిష్టా శ్రీవృందాటవి! తవలతా సద్మని మయా**
**సఖీవేశే నాట్యే మిలిత రమితాఽ ఽ గత్యచ రుషాఽ**
**క్షిపద్యత్ వః కృష్ణాయితమిదమితీహాస మమహృత్ 22**

హే బృందావనమా! సఖియలతో కలసి నా ప్రియతమ నీలతాగృహములో ప్రవేశించి, నారూపధారణతో అందమైన క్రీడలో నిమగ్న అయినది. అపుడు నేను సఖీ వేషముతో ఆ నాట్యవేదికపై వారితో కలసి క్రీడించాను. నాకు (కృష్ణునకు) దొరికిపోయినందుకు క్రోధితయైన రాధాజీ తర్జని (చూపుడువేలు) చూపుచు, "నీవే కృష్ణరూపధారణ చేశావు" అన్నది. ఆ మాట నా హృదయంలో ఇప్పటి వరకు పరమానందమును కలిగిస్తున్నది.

శ్రీయుగళములో ఎవరు రాధయో, ఎవరు కృష్ణుడో బ్రహ్మాదులు కూడ ఎరుగలేరు అను సత్యము ఈ లీలలో దాగి ఉన్నది.

**సుపుష్పం శ్రీవృందావన! తవ సుతుంగ ద్రుమశిరో**
**గతం కాంక్షంత్యాఽఽహేత్యనఘ భవ నీచో మమ ముదే**
**మయా నేత్యుక్తోఽపి ప్రహసన పరేణైవ విటపీ**
**యదుక్తం ప్రేయస్యా అకృత మమ తేనాఽతి ముదభూత్ 23**

హే బృందావనమా! నా ప్రియతమ రాధాజీ ఎత్తైన నీవృక్షాగ్రములో వికసించిన పూవుల పట్ల ఇచ్ఛతో, "ఓ పుణ్యాత్మా! నా ఆనందమునకై నీవు క్రిందికి వంగు" అని వృక్షముతో అన్నది. నేను నవ్వుతూ ఆవిధంగా క్రిందికి వంచవద్దు అన్నాను. కాని వృక్షము శ్రీరాధ చెప్పిన ప్రకారమే చేసినది. దాని వలన నాకు మిక్కిలి ఆనందం కలిగింది.

**విచిత్ర శ్రీవృందాటవి! తవ యదా చిత్ర కుసుమై**
**రపూర్వ ప్రేయస్యా వ్యరయయమహం వేశమమలమ్**
**ప్రసాదమేతత్ ప్రార్థితమథ సకృచ్చుంబన ముదా**
**ద్ధసంతీ యత్తేన త్వమపి వశగం మాం కృతవతీ 24**

హే విచిత్ర బృందావనమా! నా ప్రియతమకై నేను విచిత్రమైన నీ పూవులతో వేషధారణ చేసికొనినపుడు ఆమె చిరునవ్వులు చిందించింది. నా ప్రార్థనపై ప్రసాద రూపంగా ముద్దును ప్రసాదించింది. అప్పటి నుండి నేను నీకు అధీనుడినైపోయాను.

**అహో వృందారణ్య! త్వమసి పరమం ధన్యమిహ య**
**చ్ఛలంతీ శ్రీరాధా త్వదురు సుషమాలోక కుతుకాత్**
**ప్రసూనానాం వర్షైః పథి పథి సమాచ్ఛాదయసి తామ్**
**స్తవీషి శ్రోత్రైక ప్రియ శుక పికాద్యద్భుత గిరా 25**

ఓహో బృందావనమా! నీవు పరమ ధన్యురాలవు! ఏలనన, మిక్కిలి శోభస్కరమైన నీ రూపాన్ని దర్శింపవలెనను కుతూహలముతో రాధాజీ నీయందు నడయాడుతుంది. అపుడు నీవు ఆమె నడయాడుచున్న అడుగడుగునను పూలను వర్షించి ఆమెను ఆచ్ఛాదిస్తావు. వీనుల విందుగా శుక పికాదులు పలికెడు అద్భుత వాక్యములతో రాధాజీని స్తుతిస్తావు!

**స్మయధ్వం కిం సఖ్యః ప్రతిపద కదాఽశంక హృదయా**
**న కిం వృందారణ్యేఽద్భుత మహిమని స్వర్ణలతికాః**
**త్వరంతి స్వచ్ఛందం మరకతమయాశ్చ ద్రుమవరా**
**మిథః సంశ్లేషేణ స్ఫుటమతుల శోభాంచ దధతి 26**

ఓ సఖియలారా! (నేను, రాధాజీ పరస్పర మిలనములో ఉండుట చూచి) మనసులో వేరు భావమునుంచుకొని, నవ్వుతూ ఆటపట్టిస్తున్నారా ? అద్భుత మహిమాన్వితమైన ఈ బృందావనములో స్వర్ణలతలు లేవా ? ఇంద్రనీల మణిమయములైన వృక్షములు ఊగుచు స్వచ్ఛందరూపంతో అక్కడక్కడ కనిపించుట లేదా ? ఆ స్వర్ణలత, ఇంద్రనీలమణిమయ వృక్షముల పరస్పర మిలనము సాటిలేని శోభారూపముతో కనిపించుటలేదా ఏమి ? (అని శ్రీకృష్ణుడు పలికినాడు).

స్వర్ణలత వంటి రాధాజీ, ఇంద్రనీలమణి వంటి శ్రీకృష్ణుడు - వారి సంయోగలీలను చూచి సఖియలు ఆనందించుట ఇచట వర్ణింపబడినది.

**జయిన్యక్షద్యూతే చతురధర సంచుంబ మురలీ**
**గ్లహే మయాఽఽస్వాదిత్సతి తు జితకాశిన్యథ మృషా**
**ప్రియంతిర్భావజ్ఞా వ్యథిత తను వృందాటవి తవాఽఽ**
**ఖిలం సాక్ష్యం తన్మేత్వయి పర రతేర్హేతురతలః 27**

పరస్పర చుంబనము, మురళిని పణముగా పెట్టుట అను నియమములతో మేము పాచికలతో క్రీడించుచున్నపుడు రాధాజీ నన్ను నాలుగు మారులు

జయించినది. కాని "నేనే గెలిచాను" అని అబద్ధమాడుచు సఖియల సమక్షములోనే ఆమెను ముద్దుపెట్టుకొనుటకు ఉద్యుక్తుడనైనాను. అపుడు, హే బృందావనమా! నీవు ప్రియాజీ యొక్క ఆంతర్యమును గ్రహించి సాక్ష్యము చెప్పినావు. అదియే నీపట్ల నాకు గల పరమ ప్రీతికి సాటిలేని కారణము! (అని శ్రీకృష్ణుడు రాధాజీతోడి తమ దివ్యలీలలకు సాక్షియైన బృందావనమును స్తుతించినాడు).

**సఖీం దూరీకృత్య స్వయమరచి సంవాహన కలా**
**మయా యస్యప్రేమ్ణా మృదు చోరాస ముదా**
**తదేతచ్ఛ్రీరాధా చరణ కమలం కోమలతరాఽ**
**రుణజ్జ్యోతిర్వృందాటవి! కుతకతస్త్వాం సమటతి** **28**

హే బృందావనమా! సఖియలు దూరముగ వెళ్లునట్లు చేసి, నేను స్వయముగ (రాధాజీకి) పాదముల నొత్తుచున్నాను. శ్రీరాధా ప్రేమచేత నేను ఆనందపూర్వకముగ మృదుమధుర భావముతో ఆమెను హృదయములో ధరించుచున్నాను. అత్యంత కోమలము, అరుణజ్యోతి పూర్ణమునైన శ్రీరాధా చరణకమలములు నీ భూమిపై నడయాడుతూ ఉంటాయి.

సచ్చిదానందపూర్ణ పురుషోత్తముడైన శ్రీకృష్ణచంద్రుడు స్వయముగ రసరాజ్ఞియైన శ్రీరాధాజీకి పాదసంవాహనము చేయుచున్నాడు. ఆ రససాగరసారమూర్తులు నడయాడుచున్న శ్రీబృందావనభువి ధన్యమని శ్రీప్రబోధానందులు స్తుతించుచున్నారు.

**శ్రీరాధాయా యదనునిమిషం రూపలావణ్య లీలా**
**వైదగ్ధ్యాది పరమ సుచమత్కార భూమా మమాపి**
**ఆనందానామధికమధికం యచ్చమత్కారధారా**
**తచ్ఛ్రీవృందావన తవ మహానేషః కోఽపి ప్రభావః** **29**

హే శ్రీబృందావనమా! నిమిష నిమిషమునకు శ్రీరాధా రూప, లావణ్య, వైదగ్ధ్య, లీలాదుల పరమ సుందర చమత్కారము యొక్క పరాకాష్ఠ ప్రకటిత మగుచున్నది. నేను కూడ అత్యంత అధికముగ చమత్కార ప్రవాహములో ఉచ్ఛలితుడనై ఆనందమును పొందుచున్నాను. ఇది అంతయు నీ మహా ప్రభావము చేతనే జరుగుచున్నది.

**శ్రీరాధాయా సమ చ యదహో కేలి చాతుర్యధారా**
**యచ్చాత్యుచ్చైర్నిరవధి వరీవృధ్యతే కామతృష్ణా**
**గాఢం గాఢం యదతి వలతే కోఽపి నౌ ప్రేమబంధః**
**సర్వం వృందావన రసఖనైః భక్తి విస్ఫూర్జితం తే 30**

ఓహో! శ్రీబృందావనమా! శ్రీరాధతో కలసి నేను ప్రకటిస్తున్న విలాస చాతుర్యధార, మా ప్రేమతృష్ణ నిరంతరము వృద్ధి చెందుట, మా పరస్పర ప్రేమ బంధము దృఢతరమగుట – ఈ సమస్తము రసఖనివైన నీ భక్తిచేతనే జరుగుతున్నది.

**స్వాత్మేశర్యాస్తవ గుణనిధే రాధికాయాః సదైవ**
**ప్రీతిస్త్వయ్యుద్భవతి సహజాఽహం చ తే క్రీత ఏవ**
**యద్యత్యంతా ఘటిత ఘటనాం త్వం చికీర్షస్యవాధమ్**
**కుర్విత్యేవం హరికృతనుతి భాతి వృందాటవీయమ్ 31**

'హేగుణనిధి బృందావనమా! నీ స్వామినియైన శ్రీరాధ నీపట్ల నిరంతరము సహజప్రీతితో ఉంటుంది. నేను కూడ నీకు అమ్ముడైపోయాను. అత్యంత అసంభవమైన ఘటనను ఘటింపచేయాలని నీవు అనుకుంటే దానిని నీవు ఏ ఆటంకము లేకుండ చేయగలవు!' ఈ విధముగ శ్రీహరిచేత అనేక ప్రకారములుగ ప్రశంసింపబడుచు శ్రీబృందావనము శోభిస్తున్నది.

ఈ విధముగ 16వ శ్లోకము నుండి 31వ శ్లోకము వరకు శ్రీకృష్ణుడు చేసిన 'శ్రీబృందావనస్తుతి' బృందామహత్వమును చాటి చెప్పుటయేకాక, పరమ మధురమైన శ్రీరాధాకృష్ణుల లోక కల్యాణ లీలలను కూడ అభివర్ణించినది.

**యత్రాలకైరివ చలాలికులైః సువృత్త**
**వక్షోరుహేవ కుసుమ స్తబకేన వల్లీ**
**కాంచన్యధాత్మికలయేన సుపాణినేవ**
**తన్వాస్తదంగ సుషమా వృషభానుజాయాః 32**

శ్రీబృందావనములో వంకీలు తిరిగిన ముంగురులు అనెడు భ్రమరములతో పరివేష్టితమై, సుందర వక్షస్థలము అనెడు పూగుత్తులతో శోభిస్తూ, అందమైన చేయి అనెడు చిగుళ్లతో భూషితమైన ఒకానొక అనిర్వచనీయ స్వర్ణలత సుకుమారియైన వృషభానుదులారి యొక్క అంగముల శోభను వహించినది.

శ్రీసరస్వతీ పాదులు శ్రీరాధాజీకి, బృందావనములోని స్వర్ణలతకు అభేదమును ఆలంకారికముగా వర్ణించినారు.

**యత్రానిశం విహరతః సహరాధయైవ**
**వ్యంజత్ప్రతిక్షణమహోద్భుత రూపరాశేః**
**వైకుంఠగైరతి మహామధురచ్ఛటౌఘై**
**స్తన్నాయకః సహరమః సగణో ముమోహ 33**

ఇచట (బృందావనములో) నిరంతరము శ్రీరాధా సహితుడై విహరిస్తూ ఉండే శ్రీహరి కూడ ప్రతిక్షణ మహోద్భుతరూపరాశియైన రాధాజీ వలన ప్రకాశిస్తూ ఉంటాడు. వైకుంఠము వరకు ప్రవహిస్తున్న ఆ మహామధురకాంతి ప్రవాహములో వైకుంఠ నాయకుడైన శ్రీమన్నారాయణుడు, లక్ష్మీదేవి తమ పార్షదులతో సహా మోహితులు ఔతున్నారు.

**పరమ విముక్తిః సాక్షాత్ భూరిరస సర్వస్వమేవ వా సాక్షాత్**
**సాక్షాదథ విశ్వభాగ్యం జీయాత్ వృందావనం శ్రుతైర్మృగ్యమ్ 34**

సాక్షాత్తు పరమ విముక్తి ప్రదేశము, సాక్షాత్తు మహారస సర్వస్వము, సాక్షాత్తు విశ్వభాగ్య స్వరూపము, వేదములకు కూడ అన్వేషణీయమునైన శ్రీబృందావనమునకు జయమగునుగాక!

**హరిభక్తి సురస సింధో మంథాదివసారముత్థితం కిమపి**
**ఆశ్రయ పరమోదారం సకలా సారం విహాయ రాధికారామమ్ 35**

హరిభక్తి అనెడు రస సముద్రమును చిలుకుట చేత అనిర్వచనీయ సారస్వరూపమైన శ్రీబృందావనము ప్రకటితమైనది. నిస్సారమైన సమస్త వస్తువులను త్యజించి, పరమ ఉదారమైన ఆ శ్రీరాధా ఉపవనము (బృందావనము)ను ఆశ్రయింపుము!

**అస్తు వా మాఽస్తు వా వస్తు యద్వయం మృగయామహే**
**వృందారణ్యే న్యస్తమేవ స్వయమస్తం వ్రజత్ వపుః 36**

మేము ఏ వస్తువునకై అన్వేషిస్తున్నామో అది లభించనీ, లభించకపోనీ; కాని తనంతట తాను నశించిపోయెడి ఈ దేహాన్ని శ్రీబృందావనములోనే ఉండనీ!

**అహమత్యబుధోఽబోధ్య బుధో యూయం తు పండితాః**
**మండితాస్తు పరం వృందావన ధూల్యైవ మే తనుః 37**

నేను అత్యంత అజ్ఞానిని, బుద్ధిహీనుడను. మీరు బుద్ధిమంతులు, పండితులు! కాని నా యీ శరీరము మాత్రము శ్రీబృందావన రజము చేత భూషితము కావాలి. ఇదియే నా ప్రార్థన!

**శాస్త్రాణి మాకర్ణపథం ప్రయాత సద్యోక్తికాః సద్గురవో నమో వః**
**వృందావన ప్రేమరసోన్మదాంధం కిముత్ గ్రహం గ్రాహ్యతాఽతి హాస్యాః 38**

సమస్త శాస్త్రములు నా చెవులలో ప్రవేశించుట వలదు. హితోక్తులను పలికెడు ఆర్యులారా! సద్గురు జనులారా! మీకు కూడ నమస్కారం! బృందావన ప్రేమరసంలో ఉన్మత్తులై మత్తిల్లు వారిని ఏల గ్రహించటం లేదు ? (అనగా వారిని గుర్తించలేని విద్యా వివేకములతో ఏమి ప్రయోజనం ?) ఆ విధంగా చేయటం వలన మీరు నవ్వుల పాలు ఔతారు.

సమస్త శాస్త్రముల పరిచయము, విద్వజ్జనుల వాక్యములు – ఈ అన్నింటితో ఏమీ ప్రయోజనం లేదు. బృందావన ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ మత్తిల్లి ఉందటమే మానవ జన్మకు సార్థకమని శ్రీప్రబోధానందులు చాటి చెప్తున్నారు.

**అత్యంత మావిష్టమతి ప్రణష్టముపేక్షతాం మాం సకలోఽపి లోకః**
**స్వస్మిన్ ప్రవిష్టం కృమివన్నికృష్టం వృందాటవి మామురరీ కరోతు 39**

సమస్తలోకము నన్ను మిక్కిలి మాయావిగాను, అత్యంత నీచునిగాను భావించి నన్ను ఉపేక్షింపనీ! కాని, శ్రీబృందావనమా! నీ శ్రీధామములో ప్రవేశించుటకు తుచ్ఛమైన క్రిమితో సమానమైన నికృష్ట వ్యక్తిగా ఉండుట కూడ నాకు అంగీకారమే!

అంటే, ఏదో ఒక రూపంతో శ్రీబృందావనంలో నివసించటాన్ని మించిన మహాభాగ్యం మరొకటి లేదని భావం!

**దైవోపపన్నాన్న కృతాత్మవృత్తిః శ్రీకృష్ణచంద్రేఽతి రసానువృత్తిః**
**వృందావనైకార్పిత చిత్తవృత్తిః కిం స్యామహం త్యక్తపరం ప్రవృత్తిః 40**

దైవయోగం చేత లభించిన ఆహారంతో జీవితాన్ని నడుపుకుంటూ, అత్యంత రసావిష్టమైన చిత్తముతో శ్రీకృష్ణుని అన్వేషించాలి! శ్రీబృందావనమునందే చిత్తవృత్తిని నిలిపి, సమస్త ప్రవృత్తులను త్యజించాలి! ఇట్టి ప్రవర్తనతో నేను శ్రీబృందావనములో నివసింపగలనా!

ఏమి చేస్తే శ్రీబృందావన నివాస భాగ్యం లభిస్తుందో ఆ జీవన విధానాన్ని తెలియజేశారు.

**ధర్మం న జానామ్యథవాప్యధర్మం సాధ్యం న జానామ్యథవాప్యసాధ్యమ్**
**సంకల్ప ఏషోఽద్య కృతో గృహీత్వా తీర్థాంబు వృందావిపినం న హాతుమ్ 41**

నేను ధర్మాధర్మముల గూర్చి ఎరుగను. సాధ్యాసాధ్యముల గూర్చి కూడ ఎరుగను! కాని, తీర్థజలములను గ్రహించి (చేతిలో పట్టుకొని), "నేను శ్రీబృందావనమును వదలిపెట్టను" అని నేడు సంకల్పం చేసుకుంటున్నాను.

**సంకల్పోతి ప్రణయ వివశస్యాద్య మేఽభూదకస్మాత్**
**శ్రీమద్బృందావిపిన వలయే క్షేత్ర సన్న్యాస ఏవ**
**దృష్టాదృష్టం సకలమపితద్రక్షణార్థాదుపేక్షి**
**ప్రత్యూహశ్చేత్తదపి శరణం రాధికారామనామ 42**

అత్యంత ప్రేమ వివశమైన నా చిత్తములో నేడు అకస్మాత్తుగా క్షేత్రసన్న్యాసము స్వీకరింపవలెనను సంకల్పము కలిగినది. ఈ సంకల్పమును రక్షించుకొనుటకై కనబడుచున్న, కానరాకుండనున్న అంతటిని వదలివేసితిని. ఒకవేళ ఈ సంకల్పమునకు ఏదైన విఘ్నము వచ్చినచో శ్రీరాధా ఉపవనమైన శ్రీబృందావనమే నాకు శరణ్యము!

**శృంగారాఖ్యో మధుర మధురః కోఽపి దివ్యో రసేంద్రః**
**సాక్షాత్ వృందావన రసభువి మహాదివ్య మాధుర్య సీమా**
**స్ఫారజ్యోతిః ప్రసర సుమృగ శ్యామరత్నాయమానః**
**శ్రీరాధాయా నిరవధి లసత్కంఠ సంశ్లిష్ట ఆస్తే 43**

శ్రీబృందావన రసభూమిపై మహాదివ్య మాధుర్యమునకు చరమసీమయైన, సాక్షాత్తు శృంగార నామకమైన ఒకానొక దివ్యరసరాజు (శ్రీకృష్ణుడు) విస్తృతజ్యోతిని ప్రసరింపజేస్తున్నాడు. అతడు సుందర పురుష విశేషమైన శ్యామరత్న స్వరూపముతో సదా శ్రీరాధా కంఠమును ఆలింగనము చేసికొని విరాజమానుడై ఉన్నాడు.

**పశ్యప్రేయసి చారు చంపక తరోరుగ్రం ప్రసూనావలి**

**వ్యాజాత్ కామహుతాశనో బత సమారుహ్యాఽత్ర వృందావనే**

**సద్యోఽతిద్యుతిమాన్ దిధక్షురివ నౌ సంవీక్షతే కర్హ్యాామ్**

**కించిత్కౌతుకతోఽపిజాత విరహాభాసౌ భవేతా మితి 44**

హే ప్రేయసీ! చూడు, ఈ బృందావనము నందు సుందరమైన చంపక వృక్ష పుష్పముల మిషతో కామాగ్ని ఒక్కసారిగ తీవ్ర భావమునందు మిక్కిలి దీప్తిమంతమైనది. అది మన యిరువురుని దహింపవలెనను ఇచ్ఛతో ఉన్నది. మనము ఒకానొక కుతూహలముతోకాని, విరహాభాసతోకాని ఎప్పుడు వేరువేరుగా ఉందుమో అని ప్రతీక్షిస్తున్నది.

**శ్రీమద్బృందావనాధీశ్వరి! తమయది సత్కర్ణికా కర్ణికారమ్**

**మాలా మందారపుష్పైరలక విరచనా బంధుజీవ ప్రసూనైః**

**రక్తాంభోజం సువేణీ శిఖరమనుకరే కేలి కల్హార సంగే**

**కాశ్మీరం సోర్మిశాటీ పరిధి రథ మతా స్వానువృత్తి స్త్వమేవ 45**

హే శ్రీమద్బృందావనాధీశ్వరీ! చెవులకు కర్ణికను వహించి, మందార పుష్పమాలను ధరించి, బంధూక పుష్పములతో ముంగురులను దిద్ది అలంకృతవైనావు. సుందరమైన జడకు పైన ఎర్రని పద్మమును, చేతియందు నీలి పద్మమును వహించినావు. కుంకుమ ఛాయలో నుండి అలలు అలలుగనున్న చీరను ధరించి ఎప్పుడు నీవు అలంకృతవైతివో అప్పుడే నేను నిన్ను అనుసరించు ఇచ్ఛతో ఉన్నాను.

అలంకారములకే అలంకారమైన శ్రీరాధా సౌందర్య రసోపాసన చేయుచు సఖి ఆదేవిని క్షణక్షణము అనుసరించి ఉంటుంది.

**రతిః సా స్యాద్రాధా సకల జడచిల్లోక పరమా**
**రసాద్యత్యాశ్చర్యాంబుజ దృగనిశం ప్రార్థ్య దృగనుతః**
**స్మరః సాక్షాత్ కృష్ణోఽనవధి రతి తుష్టోఽఖిల పరః**
**పరేశ ప్రోన్మీలద్రుచి జలధి వర్ణైక రుగణుః 46**

సమస్తములైన ప్రాకృత, దివ్యలోకములలోను సర్వశ్రేష్ఠురాలైన లక్ష్మీదేవియు; అత్యాశ్చర్యకరమైన కమలనేత్రములు కల దేవతలు కూడ శ్రీరాధాజీ యొక్క లేశమాత్రపు కృపాదృష్టికై ప్రార్థిస్తూ ఉంటారు. అట్టి రాధాజీయే రతీదేవి!

**దివ్యస్త్రీ రత్నముఖ్యం విషయతి విషయం థూత్కరోత్యేవ ముక్తిమ్**
**కుంఠం వైకుంఠ సద్వైభవమపి తనుతే స్వాంత సంతోషనాయ**
**అన్యత్ కిం ధన్య గోపీ రసమపి రసయేదంత్య విశ్రాంతి శూన్యమ్**
**శ్రీవృందారణ్యమేతత్ యది పర కృపయా స్వేశ్వరీం దర్శయేత 47**

ఒకవేళ శ్రీబృందావనము పరమ కృపతో తన స్వామినియైన శ్రీరాధా దర్శనము లభించునట్లు చేసినచో దివ్య స్త్రీలు, రత్నముల వంటి శ్రేష్ఠ విషయములు విషమువలె తోచును. ముక్తిని కూడ తిరస్కరించుట జరుగును. తమకు సంతోషమును కలిగించు వైకుంఠ వైభవాదులు కూడ విలువలేనివిగ అన్పించును. పెక్కు మాటలేల ? (శ్రీరాధా దర్శనమును పొందిన) అతడు అనంతమైన, అవధులు లేని గోపీ (మధుర) రసమును కూడ ఆస్వాదింపగలడు.

**శ్రీవృందా కాననం సాలి శ్రీరాధా సాలికాననమ్**
**రసజ్ఞ తిలకామోది తిలకామోది సంస్మర 48**

ఎచట సఖీజన సహితయైన శ్రీరాధాజీ యొక్క వంకీలు తిరిగిన ముంగురులతోడి శ్రీముఖము శోభిస్తూ ఉంటుందో, శ్రేష్ఠులైన రసిక భక్తులకు

ఆనందమునిచ్చు శ్రీకృష్ణునకు ఆనందదాయినియైన శ్రీరాధ ఎచట ఆనందిస్తూ ఉంటుందో ఆ బృందావనమును బాగుగా స్మరింపుము!

లేదా

సాలి, బిల్వ, మరువక, సాల వనములతో శోభిస్తున్నట్టిదియు; రసాల, తిలక (కేతకి), ఆమోద వృక్షములతోను; తిల పుష్పముల సుగంధముతో నిండియున్నదియును అయిన శ్రీబృందావనమును చక్కగా స్మరింపుము!

**గోపీ ప్రియక పున్నాగోద్భూతి వృందావనేఽలస**
**గోపీ ప్రియక పున్నాగోద్భూతి వృందావనే లస 49**

ఓ అలసత్వముతో ఉండు మానవా! శ్రీబృందావనము గోపీలత, ప్రియక (వేప, గోరింట), పున్నాగ వృక్షములకు నిలయము! అట్టి బృందావనములో గోపీమణులకు ప్రియతముడైన శ్రీశ్యామ సుందరుని మనోజ్ఞమైన భావరస సంపదను ఆశ్రయించి, (అలసత్వమునువీడి) ఉల్లాసమును పొందుము!

**శ్యామాభిరామాశ్చర్యర్ధి ముకుంద రసవత్ కలిమ్**
**కుంజశయ్యాగతాం రాధామివ వృందాటవీం స్మర 50**

శ్రీశ్యామసుందరుని యొక్క మనోహరమైన ఆశ్చర్యకర సంపత్తితో కూడినదియు, పరమప్రియమైన ప్రియతమునితోడి రసమయ వివాదమునందు పరాయణత్వము కలదియు, కుంజశయ్యపై వేంచేసియున్న శ్రీరాధాజీకి సమానమైనదియునైన శ్రీబృందావనమును స్మరింపుము!

**నీలేందీవర వృంద చంపకరుచిర్నీలోల్లసత్ పీతక**
**శ్రీవాసః స్ఫురితా మహాద్భుతరతిర్మత్తాలి మాలాన్వితా**
**స్వారూప్యం స్వసుహృద్వయస్య దధతీ భూయాత్ ప్రభూయాద్భుతమ్**
**రాధాకృష్ణ విలాస వీక్షణ ముదాం వృందార వృందాటవీ 51**

నీలకమలములతోను, చంపకకాంతి విశిష్టతతోను శ్రీబృందావనము శోభిస్తున్నది. ఉజ్వలమైన నీల పీత వర్ణముల సుందర వస్త్రములను; అద్భుత ప్రేమావిష్టులై, మత్తిల్లిన సఖియలతో కూడి వెలుగుచున్న తన ప్రియతమ శ్రీయుగళ స్వరూపమును శ్రీబృందాటవి ధరించినది. శ్రీరాధాకృష్ణుల లీలా దర్శనము వలన కలిగెడు అత్యధిక ఆనందమునకై ఆ శ్రీధామము అనంతకాలము నుండి ప్రకాశిస్తున్నది.

శ్రీప్రబోధానందులు ఈ శ్లోకములో కూడ శ్రీబృందావనమును రాధాజీకి అభిన్న (రెండవ) రూపముగ వర్ణించినారు.

**అన్యోన్యాశ్చర్యరూప ప్రకటిత సకలైః స్పర్ధయాఽన్యోన్యముచ్చైః**
**దివ్యాద్దివ్యైరనంతైర్లసదతి మధురాఽనల్పసత్ కల్పవృక్షైః**
**లగ్నైశ్చానంత శాఖా స్వనఘ మణిమయైః ప్రేయసోర్భూషణౌఘైః**
**గంధ స్రగ్వస్త్ర భక్ష్యాదిభిరనుపతనైర్నౌమి వృందావనం తత్ 52**

శ్రీబృందావనమునందలి కల్పవృక్షములు తమ అనంతశాఖల నుండి ప్రియతమ యుగళ ప్రీతికై పరమ పవిత్రమైన మణి భూషణాదులను సమకూరుస్తూ ఉంటాయి. అవి నిరంతరము గంధ, మాల, వస్త్ర, భోజనాదికమును వర్షిస్తూ ఉంటాయి. శ్రీయుగళము యొక్క పరస్పర స్పర్ధతో కూడిన విభిన్న భావములకు అనుకూలముగ సమస్త సామగ్రిని చేకూర్చుతాయి. దివ్యాతి దివ్యములైన, అనంత మాధుర్యమును కలిగిన అట్టి సుందర కల్పవృక్షములతో శోభిస్తున్న శ్రీబృందావనమునకు నమస్కరిస్తున్నాను.

**ఇయం సర్వార్థానాం వితరణ మహాకల్పలతికా**
**మహా సంతప్తానామియమమృత వృష్టిః శిశిరతా**
**ఇయం కృష్ణప్రేమాధ్వసు విరచితాలోల మనసోఽ**
**ద్భుతా వృందాటవ్యుల్లసతి రస విశ్రాంతి రచనా 53**

శ్రీబృందాటవి సమస్త ప్రయోజనములను వితరణ చేయుటలో మహాకల్పలత వంటిది. మహా సంతప్తులైన జీవులకు అమృత వర్షాన్ని కురిపించి శీతలత్వాన్ని చేకూరుస్తుంది. అనురాగ మూర్తులైన వారు కృష్ణప్రేమను పొందుటకై సుందరమైన మార్గమును ఏర్పరుస్తుంది. అట్టి శ్రీబృందావనము మాత్రమే రసమునకు ఏకమాత్ర విశ్రామస్థానమై విలసిల్లుచున్నది.

అనేకములైన కల్పవృక్షశ్రేణులను తనయందు కలిగియున్న శ్రీబృందావనము ఇవ్వలేనిది ఏమున్నది ? శ్రీరాధాజీవలె సమస్తమును ఈయగలదు. అట్టి శ్రీబృందావన పదకమలముల నాశ్రయించుటయే పరమ ధర్మము!

**భృంగ శ్రేణీ విచలదలకా పంకజాన్యాననాని**
**నాలాని శ్రీమృదుభుజలతాః కేశరా దంతపంక్తిః**
**యాసాం రాజన్మృదుల దలతతిర్దంత వాసాంసి రాధా**
**సఖ్యో వృందావన భువి జయంత్యాద్భుతాః పంకజిన్యః** **54**

శ్రీరాధా సఖీమణుల నుదుటిపై కదలాడుచున్న ముంగురులు భ్రమరముల వలె ఉన్నాయి. వారి ముఖములు కమలముల వలెను, కోమలమైన భుజలతలు తామరతూడు వలెను శోభిస్తున్నాయి. వారి పలువరుస కమల కేసరము వలెను, పెదవులు మృదువైన కమల దళములతో సమానముగను ఉన్నాయి. అద్భుత కమల స్వరూపిణులైన అట్టి శ్రీరాధా సఖీమణులు శ్రీబృందావనములో వెలుగుచున్నారు.

అద్భుతమైన శ్రీరాధా సఖీమణుల సాకార వర్ణనము!

**యస్మిన్ సరోవర నభోవలయేషు దివ్య**
**పీయూష నిర్మల పయశ్చయ చంద్రికేషు**
**కాంతిశ్చకాస్తి కలహంస శశీ వికాసి**
**సత్ కైరవ ప్రకార తారక రాజి రమ్యైః** **55**

మనోహరమైన, ప్రఫుల్లమైన కలువలు అనెడు నక్షత్రములతో శ్రీబృందావనము శోభిస్తున్నది. సరోవరము అనెడు ఆకాశములో దివ్య అమృత పవిత్ర జలములు అనెడు చంద్రికలు ప్రకాశిస్తున్నాయి. కలహంస అనెడు సుందర చంద్రుడు అట శోభిస్తున్నాడు.

అప్రాకృతికమైన శ్రీబృందావన శోభను అప్రాకృతిక రీతిలో శ్రీప్రబోధానందులు ఆలంకారికముగ వర్ణించారు.

**అద్యాఽతి చిత్రమహమత్ర విలోక్య ముగ్ధా**
**ముగ్ధాక్షికాఽపి కమనీయ కలం నికుంజే**
**సత్ పద్మినా కనకమష్యతి దివ్యలీలా**
**నీలేందుబింబమభి చుంబిత పంకజేన** **56**

నేడు శ్రీబృందావన నికుంజలో ఒక విచిత్రలీలను చూచి ముగ్ధుడినైనాను. నా కన్నులు కూడ విముగ్ధమైనాయి. స్వర్ణవర్ణ రంజితమైన ఒక సుందర కమలము అతిదివ్య లీలా పూర్ణమైన నీల వర్ణ రంజిత చంద్రబింబము యొక్క ముఖకమలముచే చుంబింపబడుటను దర్శించినాను.

శ్రీప్రబోధానందులు బృందావనములోని సమస్త ప్రకృతిలోను శ్రీరాధాగోవిందులను దర్శిస్తున్నారు. ఒక సరోవరములో వికసించియున్న స్వర్ణ కమలమును శ్రీరాధగాను, నీలి కమలమును శ్రీకృష్ణునిగాను దర్శిస్తూ ఆ మహాత్ముడు ఒక విచిత్ర లీలను అనుభూతి చెందినారు.

**యత్రేతి కామపి సుధీర సఖీం వదంతీ**
**భ్రాంతిస్తవేయమితి సాధ్వభిధాయ రాధా**
**అన్యా భవేదపి కదాచిదితి ప్రకాశ**
**హాసోక్తిమక్షిపదురుస్ఫురితాధరౌష్ఠీ ॥ యుగ్మకమ్ ॥** **57**

ఒక సఖి ఒకానొక లీలను గూర్చి చెప్పగా, రాధాజీ అక్కడికి వెళ్లినది. "చూడు! నీయీ దర్శనములో పొరపాటు ఉన్నది. ఒక్కొక్కమారు పదేపదే పొరపాటు జరుగుతూ ఉండవచ్చును. (వేరొక వ్యక్తిని చూచుట కూడ జరిగి ఉండవచ్చును)"– ఈ విధముగ పలికిన శ్రీరాధాజీ నవ్వుచు, పెదవులు కంపించుచుండగా విరాజమానమైనది.

రాధాజీ సఖిమాటలను పైకి ఖండించినను, లోలోన అంగీకరించినట్లు ఆమె నవ్వు, కంపించుచున్న పెదవులు స్పష్టము చేయుచున్నవి.

**రాధాప్రేమ మహర్ధి భూషిత తను నిత్యం తయా శ్యామల**
**శ్చంద్రో భూషిత విగ్రహో విలసితా తేనాఽపి కుంజావలీ**
**వృందాటవ్యనయా తయా విలసితం శ్రీమాథురం మండలమ్**
**తేన శ్రీల వికుంఠధామ సుభగస్తేనాఽపి సర్వేశ్వరః 58**

శ్రీరాధాజీ నిత్యప్రేమ సమృద్ధితో తన రూపశోభను విస్తరింపజేస్తుంది. ఆమెతో పాటు శ్రీశ్యామచంద్రుడు కూడ శోభిస్తూ ఉంటాడు. దానితో కుంజల శోభకూడ వృద్ధి చెందుతుంది. ఈ కుంజల శోభతో శ్రీబృందావనము కూడ శోభిస్తుంది. దానివలన మథురా మండలము భూషిత ఔతుంది. ఆపై శ్రీకృష్ణుని యొక్క సమస్త ధామముల సౌభాగ్యము ప్రకటితం ఔతుంది. కనుక ఈ శ్రీబృందావనము సమస్త ధామములకును అధిపతి!

**సాంద్రానందమయాకృతిర్హరి రనంతాత్మ స్వరూపైః సదా**
**స్వానందాత్మక లీలయా నిజనిజైరేకాంతిభిశ్చిద్ఘనైః**
**క్రీడేత్ స్వాత్మపదే సమస్త పురుషార్థానాం కృతాపార్థతః**
**తేనాఽశేష చరాచరం శరణగం సర్వాత్మనా భూషితమ్ 59**

హే శ్రీబృందావనమా! సాంద్రానంద ఘనస్వరూపుడైన శ్రీహరి తన ఏకాంత, చిన్మయ, అనంత స్వరూపములతో శోభిస్తున్నాడు. ఆస్వామి తన ఆనందమయ లీలల ద్వారా సమస్త పురుషార్థములను వ్యర్థములుగ అన్పింపజేస్తూ నీ ధామములో క్రీడిస్తున్నాడు. నీవు శ్రీకృష్ణునిచే సర్వాత్మనా విభూషితమైన ధామానివి! కనుక నీవు స్థావర జంగమాత్మకమైన సమస్త బ్రహ్మాండములకును శరణ్యమైన దానవు!

**అన్నం క్షుత్పీడితానా మివ మధురతరం శీతవారీవ తీవ్రో**
**దన్యానాం కామినాం సద్యువతిరివ ధనం వాఽతి కార్పణ్య భాజామ్**
**ధర్మార్తానాం తుషారద్రుమ ఇవ పితరావర్భకానామివ శ్రీ**
**వృందారణ్యే మమాస్తాం హరిరివ భజతాం బ్రహ్మవత్ యోగభాజామ్ 60**

శ్రీబృందావనము ఆకలితో ఉన్నవారికి మధురాన్నము వంటిది. దాహార్తులకు శీతల జలములవంటిది, కామార్తులకు సుందర నారీమణి వంటిది, అతి కృపణులకు ధనము వంటిది. ధర్మార్తులకు అది తుషార (మంచు) శీతల వృక్షము వంటిది. బిడ్డలకు తలిదండ్రుల వంటిది. సాధకులకు అది శ్రీహరితో సమానమైనది. యోగులకు బ్రహ్మము వంటిది. అట్టి శ్రీబృందావనము నా బుద్ధిలో దృఢపూర్వకముగ నిలచి ఉన్నది.

శ్రీబృందావనము మహాదాత! ఆ ధామము ఆర్తులకు ఇవ్వలేనిది ఏమియు లేదు. సాక్షాత్తు శ్రీరాధాకృష్ణస్వరూపమైన శ్రీబృందావనమే సమస్తజనులకును ఏకైక శరణ్యము!

**శ్రీవృందావనమేవమస్తు పరమో లాభః పరం దైవతమ్**
**బంధుంచాపి పరో గురుశ్చపరమో ధర్మః పరః శ్రీపరాః**
**సత్కీర్తిః పరమా తపశ్చ పరమంజ్ఞానం పరంభూయసా**
**కిం వా సర్వమిదం పరం మమ సదా లోకేషు యన్మృగ్యతే 61**

శ్రీబృందావనమే నాకు పరమ ప్రయోజనము! ఆ ధామమే పరమ దేవత, పరమబంధువు, పరమగురువు, పరమ ధర్మము,పరమ సంపద, పరమ సత్కీర్తి, పరమ తపస్సు, పరమ జ్ఞానము! శ్రీవనమును గూర్చి అధికముగ ఇంక ఏమి చెప్పగలను ? భూమిపై పొందుటకు యోగ్యమైన పరమ వస్తువు ఏదైన ఉన్నచో అది అంతయు నాకు శ్రీబృందావనమే!

**బాప్యో యత్ర లసంతి దివ్యలలనా భృంగాలి కేశోచ్చయా**
**కూజత్ పక్షికస్తనాః ......................................**
**..................................................**
**తచ్ఛ్రీ మాధవరాధయోరతిపురం వృందావనం పాతు నః 62**

అచటి సరోవరములు దివ్యస్త్రీల వలె వెలుగొందుచున్నవి. భృంగములు ముంగురులవలెను, కూజితము (శబ్దము) చేయుచున్న చక్రవాకాది పక్షి సమూహము వక్షస్థలమువలెను ఉన్నవి. శ్రీరాధా మాధవుల ప్రేమచే పరిపూర్ణమై వెలుగుచున్న ఆ శ్రీబృందావనము మమ్ము రక్షించునుగాక!

శ్రీప్రబోధానందులు రచించిన నూరు శతకములలో ఎన్నియెా కాలగమనములో లుప్తమై పోయినవి కదా! అట్లే, లభించిన శ్లోకములలో కూడ కొన్ని తావులలోని కొన్ని భాగములు దొరుకకపోయి ఉండవచ్చును. ప్రస్తుత శ్లోకము అట్టిది. లభించినంత వరకు పరిష్కర్తలు అందించి ఉండవచ్చును.

**లావణ్యైక మహోదధి గుణమణి శ్రేణ్యైకకోశం మహా**
**శ్చర్యాస్త్రం పరమస్య కస్యచిదహో తద్వ్యక్తచేతోభవః**
**ప్రేమానంద రసేంద్ర మందిరమహో గోవింద జీవాలయః**
**సా రాధా పరధామ యత్ర తదహం ధ్యాయామి వృందావనమ్ 63**

ఓహో! శ్రీబృందావనము లావణ్యమునకు ఏకమాత్ర సాగరము, గుణమణులకు ఏకైక భాండాగారము! ఆ ధామము ఒకానొక పరమ దేవతకు

మహాశ్చర్యకరమైన అస్త్ర స్వరూపము, స్వప్రకాశముగల అనంగునకు అంగముల నిచ్చిన స్థలము! ఆ దివ్యధామము శ్రేష్ఠమైన పరమానంద రసమునకు మందిరము,గోవిందునకు జీవన గృహము, శ్రీరాధాజీ యొక్క పరమధామము! అట్టి శ్రీబృందావనమును నేను ధ్యానించుచున్నాను.

**చకాస్తి శ్రీరాధా యదధి పరమా శేష పరమా**
**హరేః సాంద్రానందాంబునిధి విధులేఖాతి విమలా**
**మహాలావణ్యాంభో భర పరమ సింధుః సకల సత్**
**కలాకేలి ప్రోన్మీలిత కమలినీ దివ్యసరసీ 64**

శ్రీహరి యొక్క ఆనందఘన సాగరములో శ్రీరాధ నిర్మలమైన చంద్రలేఖ వంటిది. ఆమె శ్రీబృందావనములో పరమతమ ఉత్కర్షతో పరమ శోభను విస్తరింపజేస్తున్నది. ఆదేవి మహాలావణ్యరూప జలములకు పూర్ణ, పరమ సముద్రము వంటిది. సమస్త మనోహర కళా విలాసాదులకును ఆమె వికసించిన కమలము వంటిది. శ్రీకృష్ణుని క్రీడకు ఆదేవి దివ్య సరస్సు వంటిది!

శ్రీరాధాజీ యొక్క సర్వోపరి స్థానమును ఈ దివ్య శ్లోకము మనోహరముగ వర్ణించినది.

**అహో! వేణుక్వాణైర్హృదయ హరిణం యత్ర సుదృశామ్**
**స్మరాబ్ధీందు రాధా ప్రణయ రససింధుర జయతి**
**స కోఽపి శ్యామాంగ సకల గుణ రంగస్థలమతి**
**స్ఫురచ్ఛృంగారైకోత్సవ నవ కలామంగల గృహమ్ 65**

ఓహో! ప్రేమ సముద్రములో ఉద్భవించిన చంద్రుని వంటి శ్రీరాధకు శ్రీశ్యామసుందరుడు ప్రణయ సముద్రము వంటివాడు. అతడు అందమైన గోపికల హృదయము అనెడు హరిణము (లేడి)ను తన వేణుగానము అనెడు బాణములతో

బాధించుచున్నాడు. ఆ శ్యామలాంగుడు సమస్త గుణములకును రంగస్థలము! అతడే ఏకమాత్ర శృంగార రసమునకు, ఉత్సవ పూర్ణమైన నవ కళలకు స్ఫూర్తినిచ్చు మంగళకర మందిరము!

**ప్రాయో వృందావన శ్రీస్త్వయి వసతి లసత్ పుష్పచా త్రిలోకీ**
**జైత్రాస్త్రే వార్షభాణవ్యతి కనకలతా కోమలాత్యుజ్జ్వలాంగీ**
**వక్త్రం తే చారుపద్మం దశన తతివియం కుంద సత్ కుట్మలాని**
**బంధుకం దంతవాసో దృగపి కువలయం పల్లవౌ పాణియుగ్మమ్ 66**

హే బృందావనమా! త్రిభువనములను జయింపగల అస్త్రములను ధరించి లక్ష్మీ కళలతో వెలుగుచున్న శ్రీరాధాజీ బహుశః నీ పుష్ప ధనుస్సును చేత ధరించి ఉంటుంది. అత్యంత కోమలమైన, ఉజ్వలమైన శరీరము కల వృషభానునందిని బంగారు తీగ యొక్క శోభను తిరస్కరిస్తూ విరాజమానయైనది. సుందరమైన నీ పద్మ సమూహమే ముఖబింబము, సుందరమైన కుంద మొగ్గలు దంత పంక్తి, బంధూక పుష్పము అధరము, నీలి కమలములు నేత్రములు, పల్లవములు కరములు!

ఈ శ్లోకము నుండి శ్రీసరస్వతీ పాదులు శ్రీబృందావనములోని ప్రత్యణువును శ్రీరాధా అంగాంగములుగ దర్శించుచు, బృందావనమునకును, శ్రీరాధకును అభిన్నత్వమును మనోహర లీలాత్మకముగ వర్ణించుచున్నారు.

**సా విద్యుల్లతికా చమత్కృతవతీ కాచిన్న రాధా సచాం**
**భోదః కోఽపి విజృంభతే స్మ న పునర్గోపాధిరాజాత్మజః**
**లీలా దైవత యోస్తయోర్నవలతా సద్మన్యాపిస్యాత్ సఖీ**
**యత్రాన్యాం ప్రతిబోధ్యకాఽపి చ ముదా సంతోషయేద్రాధికామ్ 67**

లీలావిలాస పరాయణులైన శ్రీయుగళకిశోరుల నవలతా నికుంజలో ఒకానొక సఖి ఈ విధంగా అంటున్నది – "ఆమె చమత్కారిణియైన విద్యుల్లతయే కాని శ్రీరాధాజీకాదు. అతడు కూడ ప్రకాశిస్తున్న మేఘమే కాని గోపాధిరాజ నందనుడైన శ్రీశ్యామసుందరుడు కాడు!" అని ఈ ప్రకారముగ మరొక సఖికి చెప్పుచు శ్రీరాధాజీకి ఆనందమును కలిగించి సంతుష్ట అయినది.

నిగూఢమైన ఈ లీలా విలాసము శ్రీయుగళమునకు, సఖీమణులకు, రసిక మహాత్ములకే ఎరుక!

**సంచారిణీ కాచన హేమవల్లీ వ్యాలౌకీ వృందావనమత్తమాలే**
**సా కాంచనాద్రి ద్వితయం దధాతి తత్రాపి దృష్టా బహవోఽర్ధచంద్రాః 68**

శ్రీబృందావనములోని తమాల వృక్షములతో శోభిస్తున్న ప్రదేశములో ఒకానొక చైతన్య స్వర్ణలత గోచరిస్తున్నది. ఇంకను హేమ పర్వత (స్తన) యుగళమును ధరించియున్నది. అట అనేకములైన అర్ధచంద్రులు (నఖక్షతములు) కూడ గోచరిస్తున్నారు.

శ్రీ సరస్వతీ పాదులు బృందావనములోని తమాల వృక్షములను, స్వర్ణలతలను, హేమపర్వతములను దర్శించుచు; వివశులై ఆ దర్శనములో శ్రీరాధాకృష్ణుల దివ్యశృంగార లీలను అనుభూతి చెందినారు. రసిక మహాత్ములకు శ్రీబృందావనమంతయును శ్రీరాధాకృష్ణ స్వరూపమే!

ఇచట తమాల వృక్షమును ఒకానొక బంగారు తీగ పెనవేసుకొనుటను శ్యామలాంగుడైన శ్రీకృష్ణుడు, స్వర్ణాంగియైన రాధాజీల దివ్య శృంగార లీలగా దర్శించినారు. ఒక్కొక్క శ్లోకము శ్రీయుగళము యొక్క ఒక్కొక్క మనోహర లీలను స్ఫురింపజేస్తున్నది.

**ధ్యాయన్ కాంచన కాంచనీం సులలితాం సంచారిణీం పద్మినీమ్**
**రసోల్లాస ప్రసవత్ కరో రమయితుం తామేవ రాత్రిందివమ్**
**నీలం కశ్చన చంద్రమాః సఖి చతుష్షష్టైః కలానాం నిధిః**
**శ్రీవృందావన దివ్యకుంజ కుహర ధ్వాంతాంతరే తామ్యతి 69**

హేసఖీ! ఒకానొక స్వర్ణవర్ణరంజితమైన, లలితమైన, సంచారణ శీలియైన పద్మినిని (శ్రీరాధాజీని) ఒకానొక నీలచంద్రుడు (శ్రీబృందావన చంద్రుడు) ధ్యానిస్తున్నాడు. ఆ ధ్యానామృతమును రాత్రింబవళ్లు ఆస్వాదింపగోరి చతుష్షష్టి (64) కళా ప్రవీణుడైన అతడు (శ్రీశ్యాముడు) రసోల్లాస కిరణములను ప్రసరింపజేయుచు శ్రీబృందావన దివ్య కుంజాంతర్భాగములో అంధకారములో క్రీడించుచున్నాడు.

**తదేతచ్ఛ్రీవృందావనమతి మహానంద రస సం**
**పదామేకం కందం నిరతిశయ కందర్ప విభవమ్**
**మహా మాద్యద్రాధా మురలిధర నానా విహరణౌః**
**మనోహారి ప్రేమ్ణా భజ పరమ భావేన సు సఖే 70**

సఖా! శ్రీరాధా మురలీధరులు అతి మహానంద సంపత్తికి ఏకమాత్ర బీజ స్వరూపులు! అనుపమానమైన ప్రేమ సంపత్తిచే మత్తిల్లి, వారు అనేక విధములుగ విహరిస్తున్నారు. వారి విహారముచే మనోహరమైన ఈ బృందావనమునే ప్రీతి పూర్వకముగ పరమ ఏకాంత భావముతో భజింపుము!

**కిమిదమలికులైర్మనోజ్ఞమంభోరుహ మలకావలి మండితం ముఖం కిమ్ ?**
**ఇతి విలసతి సంశయః సఖానాం త్వమిహ యదా సరసి ప్రియేఽవతీర్ణా 71**

హే ప్రియా! నీవు ఈ సరోవరములో తేలియాడుచుండ, "ఏమి ? ఇది భ్రమరములతో శోభిస్తున్న మనోహర కమలమా ? లేక నుదుటిపై నాట్యం

చేస్తున్న ముంగురులతో పరివేష్టితమైన ఒకానొకరి ముఖబింబమా" అని సఖియలకు సందేహము వచ్చినది.

శ్రీప్రబోధానందులు తాను సఖియై శ్రీరాధాజీ అన్ని విధములుగాను శ్రీబృందావనమునకు అభిన్నమై యుండుటను దర్శించుచు ఇట్లు పలికినారు.

**ఏతత్ కిం విధు మండలం విలసితం నాంకే కలంకేన కిమ్**
**వృందారణ్య విలాసినీ సువదనం కింవా సుబింబాధరమ్**
**స్యాదేవం సఖి కింత్వముష్య దశదిక్ వ్యాపి ప్రభామండలమ్**
**స్వాభావ్యాత్ కథమిత్య కుర్వత కథాం యత్రేతి రాధాఽఽలయః 72**

"ఏమి ? అది చంద్రమండలమా ? కాదు, కాదు. దాని యందు కళంక (మచ్చ) రేఖయైనను లేదు. అయినచో అది శ్రీబృందావన విలాసిని (శ్రీరాధ) యొక్క సుందర వదనమా ? లేక సుందర బింబాధరమా ?" – అని ఈ ప్రకారముగ ఒక సఖి చెప్పుచుండ, మరొక సఖి "హే సఖీ! నీవు అనినట్లు అట్లే అయి ఉండవచ్చును. కాని స్వభావతః దాని యొక్క కాంతి కిరణములు దశదిశలలోను ఎందుకు వ్యాపిస్తున్నాయి ?" ఈ ప్రకారముగ శ్రీరాధా సఖీమణులు అచట (శ్రీబృందావనములో) సంభాషించుకొనుచున్నారు.

ఇట శ్రీబృందావనములోని చరాచరములకును, శ్రీరాధాజీకిని అభేదమును లీలాత్మకముగ వర్ణించినారు.

**సఖి! వృందావన సరసి త్వయ్యాఽఽకంఠం నిమగ్నాయామ్**
**హ్యః సంశేత హరిస్తే వీక్ష్య ముఖం కివిందం మహద్వస్తు 73**

హే సఖీ! నీవు శ్రీబృందావన సరస్సులో కంఠము వరకు మునిగి యున్నప్పుడు శ్రీహరి నీముఖమును చూచి, "ఈ మహా వస్తువు ఎవరు" అని సంశయమును పొందినాడు.

శ్రీబృందావన సరసిలో వెలుగుచున్న శ్రీరాధా ముఖబింబము యొక్క మహాశోభ సాక్షాత్తు శ్రీకృష్ణునికే అందరాని మహద్వస్తువుగ గోచరించినది.

**ఏషా చంద్రకలా కిముల్లసతి మా ధత్తే ప్రఫుల్లం కుతః**
**పద్మం కిం కమలిన్యసౌ స్థలజల స్వచ్ఛంద కేలిః క్వ సా ?**
**సంశయేతి నికుంజ మంజు భవనం యస్య ప్రవిష్టో హరిః**
**సఖ్యా హాస్య మనోహరేణ వచసా నిశ్చత్యచామోదత 74**

'అదియేమి ? చంద్రకళా వికాసమా! అయితే దానియందు వికసిత కమలము లేదు. అయితే, అది కమలినియా ? జలములందును, భూమిపైనను కూడ విలాసమును ప్రకటిస్తున్నదా ?' ఈ ప్రకారముగా శ్రీహరి (శ్రీరాధా విషయములో) సంశయించుచు బృందావన మనోహర కుంజ భవనములో ప్రవేశించినాడు. అట సఖియల చతురోక్తులతో (శ్రీరాధయే అను) నిశ్చయమును పొంది ఆనందించినాడు.

**కిం శ్రీవృందావిపిన సరసీ రాజహంసీ గతిం స్వామ్**
**రాధామధ్యాపయదిహ తయాऽధ్యాపితా సైవ కిన్ను ?**
**కిం రాధాऽశిక్షయత్ చకిత ప్రేక్షితం తత్కురంగీః**
**కిం వా తాభ్యః సహజ మధురా సైవ జగ్రాహ బాలా 75**

శ్రీబృందావన సరస్సులో విహరించు రాజహంస తన నడకలోని సొగసును రాధాజీకి శిక్షణనిచ్చినదా ఏమి ? లేక రాధాజీయే రాజహంసకు అట్లు నడచుటలో శిక్షణను ఇచ్చినదా! శ్రీరాధ ఈ హరిణము (లేడి పిల్లలకు) లకు చకితదృష్టితో చూచుటలో శిక్షణ నిచ్చినదా ? లేక ఆ లేడి పిల్లల నుండి స్వభావతః మాధుర్యశాలినియైన శ్రీరాధ ఈ విద్యను నేర్చినదా!

శ్రీరాధాజీ యొక్క నడకలోని లావణ్యము, చూపులోని మాధుర్యము మున్నగువానిని వర్ణించుట ద్వారా శ్రీప్రబోధానందులు అనంత స్వరూపిణియైన శ్రీరాధా సాకార సౌందర్యమును స్తుతించినారు.

**వృందాటవ్యామతి హిమమమర్యాద మాధుర్యధుర్య**
**పాదం కశ్యాప్యతిరుచి భజన పూర్ణచంద్రస్య తస్య**
**సాంద్ర జ్యోత్స్నామృత రసధురా మంజరీ రంజయన్ వా**
**స్నేహైకాత్మ్యాత్ యదిహ లభతే నాత్ర హృద్వాక ప్రచారః 76**

శ్రీబృందావనములో అతిశీతలమైన, అనిర్వచనీయమైన పూర్ణచంద్రుని (శ్రీకృష్ణుని) యొక్క అవధులు లేని మాధుర్యముతో కూడిన చరణకమలములను మిక్కిలి అనురాగముతో భజింపుము! ఆ సఘనజ్యోతి యొక్క అమృత రసముతో నిండిపోయిన మంజరీ గణములను రంజింపజేయుటలో కలిగెడి స్నేహ తాదాత్మ్యము వలన ఒక వస్తువు లభిస్తుంది. ఆ మహద్వస్తువు మాటకు, మనసుకు అగోచరము!

**శ్రీమద్బృందావిపిన పరమాభంగుర క్రీడ రాధా**
**కృష్ణోన్మీలద్బహు రసమహః పుంజ తత్తద్విశేషాన్**
**నానావస్థా అథ వరతనూంశ్చాఽవతారాంశ్చ మన్యే**
**శాస్త్రే తద్విత్ సదసి విశృణోమ్యన్యథా కిం కరోమి 77**

శ్రీబృందావనములో శ్రీరాధాకృష్ణులు కలసి నానా ప్రకారములైన జ్యోతిర్మయ విశేష రసముల అవస్థలను (స్థితులను) ప్రకటిస్తున్నారు. సమస్తమైన శోభను, సౌందర్యసారమును, రససమూహమును ప్రకాశింపజేస్తూ నిరంతరము క్రీడిస్తున్నారు. వానిని గూర్చి నేను శాస్త్రవేత్తల సభలలో విశేషముగా వింటున్నాను, మననము చేసుకుంటున్నాను. ఇంతకన్న అధికముగ ఏమి చేయగలను ?

**శ్రీమద్బృందావన నవలతామండపే మండితాంగౌ**
**రాధాకృష్ణౌ నిరవధి మహానంగ తృష్ణౌ రమేతే**
**స్వజ్యోత్స్నానాం బహువిధ ఘనద్ధారతః సర్వమేవ**
**కుర్వంతౌ నిగదతి నిగమస్తౌ స్వతో వాఽన్యతోవా** **78**

శ్రీబృందావనములోని నవలతా మండపములో అలంకృతులైన శ్రీరాధాకృష్ణులు నిరంతరము మహాప్రేమ తృష్ణలో విహరిస్తున్నారు. వారు తమ జ్యోత్స్నా సమూహములను విస్తరింపజేయుచు అచటి సమస్త వస్తువులను రసమయము చేస్తున్నారు. ఈ విషయమును వేదములు స్వయముగాను, తమకు అనుగతములైన ఇతర గ్రంథముల ద్వారాను నిర్ధారణ పూర్వకముగ వ్యక్తము చేసినవి.

**అయే రాధాకృష్ణావితి కురుత సంకేతమనయో**
**ర్ముదా యూయం వృందావన నవ నికుంజే విహరతౌ**
**అహంతు స్వాత్మానం కనకరుచి ధామాఽత్ర కలయే**
**నిజాత్మైకాజీవాఽద్భుత సుఖభరం శ్యామలమహః** **79**

నీవు శ్రీబృందావన నవ కుంజలలో ఆనందముగా విహరించుచుండు వారిని 'హా రాధాకృష్ణా! హా రాధా కృష్ణా' అని పిలచుచు, సంకేత ధ్వనిని చేయి! నేను అచట ఆత్మస్వరూపమైన స్వర్ణకాంతి స్వరూపమును (శ్రీరాధాజీని); ఆమె ఆత్మకు ఏకమాత్ర ప్రాణధనమైన, అద్భుత సుఖపూర్ణుడైన శ్యామలాంగుని (శ్రీకృష్ణుడిని) దర్శించుకుంటాను.

శ్రీప్రబోధానందులు సఖీభావములో ఉండి, మరొక సఖితో సంభాషిస్తూ; తన ఆత్మస్వరూపమైన శ్రీరాధాజీని, ఆదేవికి ఏకమాత్ర ప్రాణధనమైన శ్రీకృష్ణచంద్రుని దర్శిస్తున్నట్లు తోస్తున్నది.

**అహో! వృందారణ్యం వనమితి మహానంద పరమమ్**
**వదంత్వేతే కామం స్ఫురతి హృదయేఽన్యన్మమ పునః**
**మిథః ప్రేమా రాధామురలిధరయోః కోఽపి మధురో**
**మహోస్ఫీతస్తస్య స్ఫురతి ఘనభావో వహిరయమ్ 80**

ఆహా! మహాపరమ ఆనందపూర్ణమైన శ్రీబృందావనమును 'ఇది సామాన్యవనము' అని అనవలదు. ఏలనన, నా హృదయములోను, ఇతరత్ర కూడ ఇది స్ఫురిస్తున్నది. శ్రీరాధా మురళీధరుల మహోన్నతమైన, పరమ మధురమైన పరస్పర ప్రేమయే ఘనభావముతో సాక్షాత్తు శ్రీబృందావనరూపముగ ప్రకటితమైనది.

శ్రీరాధాకృష్ణుల మధుర ప్రేమయే శ్రీబృందావన స్వరూపమని తాత్పర్యము!

**అహో! వృందారణ్యేఽద్భుత కనకచంద్రోఽస్తి సతతో**
**దితోఽనంత జ్యోత్స్నా స్నపిత దశదిక్ కోఽపి మధురః**
**సదా సోఽంతర్ధాతః ప్రథయతి రసం కంచన పరమ్**
**విచున్వత్యానందచ్ఛవి తిమిర పుంజో యమసకౌ 81**

ఆహా! శ్రీబృందారణ్యములో ఒకానొక మధుర, అద్భుత స్వర్ణచంద్రుడు (శ్రీరాధాజీ) నిరంతరము ప్రకటితమగుచు విరాజమానమైనది. వాని యొక్క అనంత చంద్రికలలో దశదిశలు తేలియాడుచున్నవి. శ్రీయుగళము నిత్యము మనసులో చింతన చేయుచు, ఒకానొక అనిర్వచనీయ రసమును విస్తరింప జేయుచున్నారు. తిమిర పుంజములతో (చీకట్లతో) ఉపమింపదగిన ఆ ఆనందమూర్తి (శ్రీశ్యామసుందరుడు) దాగియుండి, మాటిమాటికి ఆమెను ముద్దిడుకొనుచు ఒకానొక అపూర్వరసమును విస్తరింపజేయుచున్నాడు.

**యదేతచ్ఛ్రీరాధా వదనమితి వృందావన వనే**
**వదంత్యస్తత్ సఖ్యస్తిలక రచనాద్యం విదధతి**
**అహం మన్యే ప్రేమోజ్జ్వల మదనగోపాల రస స**
**న్మహాంభోధేర్మంథాద్వర విధురసావుత్థిత ఇతి 82**

శ్రీబృందావనములో శ్రీరాధా సఖీబృందము 'ఇది శ్రీరాధా ముఖబింబము' అనుచు తిలకరచనాదికమును చేసినారు. కాని అది ప్రేమోజ్వలమైన మదనగోపాలుని రసపూర్ణ మహాసాగరమును మథించుట చేత ఉద్భవించిన సుందరచంద్రుని (శ్రీకృష్ణుని) ఆవిర్భావము అని తలచుచున్నాను.

అత్యద్భుతమైన ఈ భావములో శ్రీరాధాకృష్ణులు ఏకస్వరూపులు అను సత్యము ప్రకటితమగుచున్నది.

**గౌరశ్యామల మేతదద్భుతతమం దివ్యం కిశోర ద్వయమ్**
**శ్రీవృందా విపినే మహాస్మర రసోన్మత్తం సదా క్రీడతి**
**రూపేనాథ వయః శ్రియా మధురవైదగ్ధ్యాత్మ తుల్యం పరే**
**శస్యా ప్యాహిత మూర్ఛామంఘ్రి నఖరచ్ఛాయా మనాగ్ దృష్టితః 83**

మహాద్భుత దివ్యయుగళ కిశోరులైన గౌరశ్యాములు శ్రీబృందావనములో దివ్యశృంగార రసములో మత్తులై నిరంతరము క్రీడిస్తున్నారు. వారు తమ అనన్య సామాన్యమైన రూప, వయో, సౌందర్య, మధుర వైదగ్ధతలతో సమ్మోహితము చేస్తున్నారు. వారి పదనఖముల (కాలిగోరు) ఛాయపై లేశ మాత్రపు దృష్టి ప్రసరించినంత మాత్రమున శ్రీనారాయణుని కూడ మూర్ఛితుని చేయుచు, విరాజమానులైనారు.

శ్రీశ్యామాశ్యాముల పదనఖములపై దృష్టిపడుట కాదు, ఆ నఖముల నీడపై దృష్టి పడినను సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు మూర్ఛితుడగునట! అట్టి

యెడ శ్రీయుగళము యొక్క సాకారమహా తేజస్సును ఎవరు వర్ణింపగలరు ? అది వర్ణనాతీతమైన నిరాకార మహాకాంతి!

**సౌందర్యైక మహాబ్ధి మగ్నమతి మాధుర్యైక సారాంబుధౌ**
**మగ్న స్నిగ్ధ సుగౌర మోహన మహాలావణ్య సింధౌ బుడత్**
**నానాచిత్రవిచిత్ర నూపురకలం కృష్ణేందు వక్షః స్థలీ**
**సౌభాగ్యం పురు భగవానిహ భజేద్రాధా పదాంభోరుహమ్ 84**

శ్రీరాధా చరణ కమలములు ఎల్లలులేని ఒకానొక సౌందర్య మహాసాగరములో మగ్నములై ఉంటాయి. (అవి) అత్యంత మాధుర్యసార సముద్రములో నిమజ్జితమై ఉంటాయి. స్నిగ్ధ, సుందర, గౌర, మోహన మహా లావణ్య సింధువులో సించితమై (తడుస్తూ) ఉంటాయి. అనేక ప్రకారములుగా, చిత్ర విచిత్రముగా నూపుర ధ్వనిని చేయుచు; శ్రీకృష్ణచంద్రుని వక్షస్థలమునకు సౌభాగ్యమునిచ్చు అట్టి శ్రీరాధా చరణ కమలములను అత్యంత భాగ్యశాలియే శ్రీబృందావనములో భజింపగలడు!

**ప్రాప్తాఽశేషః ప్రాకృతోఽప్రాకృతో వా**
**భోగః ప్రాప్తా ముక్తయో వా సమస్తాః**
**ప్రాప్తా భక్తి ర్వైష్ణవీ వా తతః కిమ్**
**క్వాఽఽస్తే రాధాదాస్య సౌఖ్యానిమాఽపి 85**

సమస్తములైన ప్రాకృత, అప్రాకృత భోగములు లభించనీ, ముక్తి సమూహములు కలుగనీ, ఐశ్వర్యమిశ్రితమైన భక్తి కూడ లభించనీ! అందు వలన ఏమిటి ? శ్రీరాధా దాస్య సుఖములో అణుమాత్రమైనను బృందావనములో తప్ప అన్యత్ర లభించునా!

శ్రీరాధా దాస్య మహాభాగ్యము ముందు ముక్తితో సహా సమస్త భోగభాగ్యములు తృణప్రాయములని తాత్పర్యము! శ్రీదాస్యసుఖము బృందావనములో మాత్రమే ప్రాప్తించునని భావము!

**అనిత్యేఽస్మిన్ దేహే బుధ న దృష్టిం క్షణ సుఖే**
**న మజ్జానంతార్తో బత యువతి సుఖ్యే కువిషయే**
**వపుష్యస్మిన్ శ్రోతప్రియ యశసి హిత్వా రుచిమయే**
**మనో రాధాపాదాంబుజ నిలయమేవాఽఽశు గమయ 86**

ఓ బుద్ధిమంతుడా! ఈ అనిత్యమైన, క్షణిక సుఖమునిచ్చు శరీరమును చూడకు. ఎన్నియో సుఖముల నిచ్చు స్త్రీసంబంధిత కువిషయములపట్ల మోహితుడవు కావలదు. వీనులకు విందుగా అనిపించెడు, శరీరము పట్ల అనురాగమును కలిగించెడు వానిని త్యజించి; నీ మనసును వెంటనే శ్రీరాధాచరణ కమలములకు నిలయమైన శ్రీబృందావనములో నిల్పుము!

**భ్రాతః! కిం మరణం ? మలైక నిలయ స్త్రీపిండ భోగ స్పృహా**
**రోగః కో బహిరంతరున్మథన కృత్ ద్వేషోఽథ రాగః పరః**
**కః స్వర్గః పరమో వ్రజేంద్ర తనయ ప్రేమోత్సవైః సంగతిః**
**కిం సర్వోపనిషద్రహస్య పరమం వృందాటవీ తత్ప్రియౌ 87**

ఓసోదరా! మృత్యువు అంటే ఏమిటి ? మలమూత్రాదులకు ఏకమాత్ర నిలయమైన స్త్రీ శరీరమును భోగింపవలెనను ఇచ్ఛయే మరణము! రోగమనిన ఏమి ? బాహ్యాంతరములలో క్షోభను కలిగించే ద్వేషమోహములే పెద్దరోగము! స్వర్గమంటే ఏమిటి ? శ్రీవ్రజేంద్రనందనుడైన శ్రీకృష్ణుని ప్రేమోత్సవముతో నిండియుండు భక్తుల సాంగత్యమే స్వర్గము! సమస్త ఉపనిషత్తుల పరమ రహస్యమేమి ? శ్రీబృందావనము, ఆధామమునకు ప్రియతములైన శ్రీయుగళమే పరమ రహస్యము!

పరమాద్భుతమైన ఈదివ్య శ్లోక సారమును వంటపట్టించుకున్న వ్యక్తికి జరా మరణములనిన భయము ఉండదు. వేద వేదాంగములకు అతీతమై పరమ రహస్యపూర్ణమైన శ్రీశ్యామాశ్యాములయందే మనసు నిలచి, ఆతడు శాశ్వతమైన రసానందమును పొందుచుండును.

**అహో! హసోత్తంసైరనుపమ ముదా సేవితమిదమ్**
**సదా గంధోన్మీలత్ సురస కమలాద్యుజ్జ్వల సరః**
**విహాయ త్వం కాకైః పరివృతమహో పల్లవమిదమ్**
**బలత్పంకం చేదిచ్ఛసి న ఖలు హంస స్త్వమసి భోః 88**

ఓయీ! సాటిలేని ఆనందపూర్ణములైన పరమహంసలచే సేవింపబడుచు, నిరంతరము ప్రఫుల్ల కమలములతో శోభాయమానముగ నుండు ఈ ఉజ్వల సరోవరమును త్యజించి; ఒకవేళ నీవు కాకులతోను, బురదతోను నిండిన క్షుద్ర జలాశయముపై ఇచ్ఛను కలిగి ఉన్నచో అపుడు నీవు హంసపదవికి యోగ్యుడవు కాజాలవు!

శ్రీబృందావనమే ఉజ్వల సరోవరము! అట వసించుచున్న పరమహంసలు, సత్పురుషులే హంసలు, కమలములు! విషయాదులతో విషమును చిమ్ముచుండు సంసారమే కాకులు, బురదతో కూడిన క్షుద్ర జలాశయము! సాధకుడు అట్టి సంసారమును త్యజించి, బృందా నిత్య నివాసియైనపుడే పరమహంసగ మారగలడు అని భావము!

**కృపాలో అద్యాత్యద్భుత గుణగణైరుజ్జ్వల తమః**
**సమః శ్రేష్ఠోఽపి త్వం కియదివ చిరం హంత న భవేః**
**అహో! శ్రీమద్బృందావన భువి లసచ్ఛిద్రసతనో**
**స్తనోత్యారబ్ధంతే కిమపి నహి కర్మాఽవహిత తామ్ 89**

హే కృపాళూ! నీవు నీ అద్భుత గుణములతో ఉజ్వలత, సమదర్శనీయత, సర్వశ్రేష్ఠతలను కలిగి ఉండియు ఇప్పటి వరకు నాకు ఆలస్యముగనైన నీ స్థాయీ ప్రకాశమును చూపించలేదు. అందులో ఆశ్చర్యమేమియులేదు. ఏలనన, బృందావనభువిపై విలాసపరాయణమైన, చిద్రసఘన స్వరూపులైన శ్రీయుగళము నీ విలాసరసమును తమ యందు లీనము చేసుకున్నారు.

**అహో! వృందారణ్యం మధుర మధురం సుందరతమమ్**
**భవేద్భాతం నిశ్శ్రేయసమివ సతాం సా కృతి చిరమ్**
**వసంతోఽసంతోషాదిహ యదపరాధాంకుర భృతేః**
**న సద్రాధాకృష్ణ ప్రణయరససారానుభవి నః 90**

ఆహా! మధురాతి మధురము, సుందర తమమునైన శ్రీబృందావనము మూర్తీభవించిన శ్రేయోరూపము! అనగా ముక్తజనులకు, భక్తజనులకు కూడ ఆధామము చిరకాలము నుండి సమానముగ ప్రకాశిస్తున్నది. కాని, సంతోషము లేకుండ అచట నివసిస్తే అపరాధభావము కలుగుతుంది. అట్టి అపరాధి శ్రీరాధాకృష్ణుల ప్రణయరససారమును పొందలేడు.

అనగా, జీవులందరికిని శ్రేయోభిలాషియైన శ్రీబృందావనములో సంతోషముగను, ప్రేమతోను జీవించువారే శ్రీరాధాకృష్ణుల ప్రణయ రసమును పొందగలరని భావము!

**ఆభీర సుందరి! వృథా త్వమనేన నేత్ర**
**ద్వంద్వేన గర్వభరముద్వహ సుందరేణ**
**వృందావనే తత ఇతః సరసీషు కామ**
**మిందీవరాణి కతి సంతి నహీదృశాని 91**

ఓ గోపసుందరీ! నీవు నీ సుందర నేత్రములను చూచుకొని వృథాగా గర్వపడుతున్నావు. ఈ బృందావనములో అక్కడక్కడ ఉన్న సరోవరములలో ఎన్నెన్నో అందమైన నీల కమలములు ప్రస్ఫుటముగ గోచరించుట లేదా ఏమి ?

అనగా అందమైన స్త్రీ కన్నుల సౌందర్యమునకన్నను మించి, బృందావన సరస్సులలో వికసించిన నీలి కమలముల సౌందర్యకాంతి అత్యధికమని భావము!

**రాధాస్తనకలశోపరి నితరాం మౌక్తికలతా శుశుభే**
**సద్వృత్తేన హి సంగం ప్రాప్యోచ్చైర్భాతి సద్వృతః 92**

శ్రీరాధా స్తన కలశములపై నున్న ముత్యపు లత సుందరమై శోభాయమానముగనున్నది. అది యెట్లనిన, సాధుపురుషుల సత్కర్మల సాంగత్యము చేత జీవితము మరింతగా శోభిస్తుందికదా!

**తవ కుటిల నీలే సుముఖి! హరావీదృశే దృశౌ**
**మగ్నౌ జగతి హి సమ శీలానామేవ ప్రాయేణ జాయతే మైత్రీ 93**

ఓ సుముఖీ! కుటిలమైన నీలవర్ణము కల శ్రీహరి పట్ల అట్టివే అయిన నీ కుటిల నేత్రములు నిమగ్నమైనవి. ఎందుకంటే, జగత్తులో సమాన స్వభావము కలవారికే బహుశః మైత్రి ఘటిస్తుందికదా!

**సువిమల సుమధుర హరిరసపూర్ణ నవ వపుర్విధిర్వృణుతే**
**శ్రీవృందావనభువి వంద్యాః సద్గుణ వృందాహి యే కేఽపి 94**

విమలము, మధురము, హరిరసపూర్ణమునైన నూతన శరీరమునకై బ్రహ్మదేవుడు ప్రార్థించినాడు. శ్రీబృందావనమును ఆశ్రయించినవారు సమస్త సద్గుణముల చేత గౌరవింపదగినవారు ఔతారు.

**కృష్ణరసాకర వృందావిపినం స్వగతం రసాత్మకం కురుతే**
**లవణాకరే హి పతితం సర్వం లవణాయతే నియతమ్ 95**

కృష్ణ రసఖనియైన శ్రీబృందావనము తన చెంతకు చేరిన సమస్త వస్తువులను రసమయముగ చేస్తుంది. లవణ సముద్రము తనయందు మునిగిన సమస్తవస్తువులను లవణమయముగ (ఉప్పగా) చేయుట నిశ్చయము కదా!

**రాధాదృక్ పాతానాం వృందావిపినేఽత్ర కో న వా పాత్రమ్ ?**
**స్వాత్యంబు హి శుక్తిగతం ముక్తా స్యాదేవ కంఠార్హా 96**

శ్రీబృందావనములో నివసించువారు శ్రీరాధాకృపాకటాక్షమునకు పాత్రులు కాకుండుట ఎట్లు ? (తప్పకుండ కృపాపాత్రులు ఔతారు). స్వాతి నక్షత్రపు వర్ష బిందువులు ముత్యపు చిప్పలోపడి, మెడలో ధరించుటకు యోగ్యమైన ముత్యముగ అగుట లేదా!

**సుఖదుఃఖమత్ర సర్వం భవతి యథా వాసనం తథాహి వరౌ**
**సుఖినౌ వృందారణ్యే భూతల శాయితౌచ రాధికా కృష్ణౌ 97**

జీవులు తమ లోపలనున్న వాసనల ననుసరించి సుఖ, దుఃఖములను భోగిస్తూ ఉంటారు. చూడుడు, ఈ బృందావనములో శ్రేష్ఠతమ సుఖస్వరూపులైన శ్రీరాధాకృష్ణులు భూతలముపై శయనిస్తున్నారు.

**అతిమధురిమ సారశుద్ధ వృందావన రసలాలస మానసస్య నూనమ్**
**అపి న రుచికరీశ్వరీయ వార్తా ప్రియమానుకూలతయా హి సర్వమత్ర 98**

అత్యంత మాధుర్య సార స్వరూపమైన, శుద్ధమైన శ్రీబృందావన రసమునందు లాలస (అత్యంతప్రీతిని)ను కలిగియున్న వ్యక్తికి భగవత్సంబంధిత విషయములతో కూడ అవసరములేదు. ఎందుకంటే, అచట జడ చైతన్యములైన సమస్త వస్తువులు ప్రియతమ యుగళకిశోరుల సేవకు అనుకూలమైన విధానమునందు ఉత్కంఠతతో ఉంటాయి.

శ్రీశ్యామాశ్యాముల సేవ కన్నను, వారియందే లాలసమ కలిగియుండుట కన్నను మించిన గొప్ప విషయము ఇంకొకటి లేదు!

**వృందారణ్యే యదపి సుమహాన్ చారువృత్తః పరస్య**
**కించిద్వర్తా పరమ కఠినశ్చారు రూపః సదంతః**
**యో వా వక్రః సహజ మలినః స్నిగ్ధహారీ తథాహి**
**శ్రీరాధాయా హరికృత కుచాపీడనం కేశబంధః 99**

శ్రీబృందావనములో కొన్ని వస్తువులు గొప్పవి, వర్తులాకృతిలోనున్నవి, కఠినముగనున్నవి, సుందరరూపముతో ఉన్నవి! మరికొన్ని వంపు తిరిగి ఉన్నవి, స్వాభావికముగ కృష్ణవర్ణములో నున్నవి, స్నిగ్ధముగ నుండి మనసును హరించునవి! ఈ సమస్తము శ్రీహరిచేత కౌగిలింపబడిన శ్రీరాధా వక్షస్థలమును, ఆమె కేశపాశమును స్ఫురింపజేస్తున్నాయి.

(బృందావనములోని కొన్ని వస్తువులు శ్రీరాధా వక్షస్థలమును, మరికొన్ని ఆమె కేశరాశిని స్ఫురింపజేస్తున్నాయి.)

**ధ్రువమిహ కథమత్య నిర్వృతే హృద్యహ**
**న కించన నిర్వృతిం తనోతి**
**హరిరమృత రుచాప్యస్వేది వృందావన**
**ఉపగుప్తతనౌ మనాజ్ ప్రియాయామ్ 100**

ఏదైన కారణము చేత ఎప్పుడైనను మనసు అస్వస్థతగా ఉంటే, ఏవస్తువు వలన కూడ ఆనందము కలుగదు. అట్లే, ప్రియాజీ బృందావనములో ఎక్కడైనను దాగియున్నచో అమృతకాంతి స్వరూపుడైన శ్రీహరి కూడ విచారగ్రస్తుడు ఔతాడు. (రాధాజీ కానరానిచో ఆనందము లేదు).

**సాధవోఽత్ర విరలాః శ్రిత వృందారణ్య సన్మదనమోహన కాంతాః**
**కేచిదేవ తరవో హి సుగంధ స్వాదు సుందర ఫలాః ఖలు లోకే 101**

శ్రీబృందావనమును ఆశ్రయించి, శ్రీమదనమోహనునే ఏకమాత్రస్వామిగ భావించువారు కొందరే సాధు పురుషులు ఉంటారు. ఈ జగత్తులో సుగంధముతో కూడి, ఆస్వాదింపదగిన మధురఫలములను కలిగియుండు వృక్షములు చాలా తక్కువగా ఉంటాయి.

**వృందాటవ్యటన సన్నీల కృష్ణ రాధే**
**పశ్యంతః స చపలనీలమేఘ శంకః**
**కేకాభిర్ముఖరిత దిఙ్ ముఖాః శిఖీంద్రా**
**నృత్యంతి ప్రమద భరాత్ ప్రసార్య బర్హాన్ 102**

శ్రీబృందావనములో లీలా పరాయణులై సంచరిస్తున్న శ్రీరాధాకృష్ణులను దర్శిస్తూ విద్యుల్లతతో కూడిన నీలిమేఘమను శంకతో నెమళ్లు తమ కేకారవముతో దిక్కులను ప్రతిధ్వనింపజేస్తున్నాయి. అవి పురివిప్పి ఆనందముగా నృత్యం చేస్తున్నాయి.

**వృందా వనేఽపి మందాశ్చిత్రం విదంతి సుందరేన రతిమ్**
**అథవా న చిత్రమేతత్ పిత్తరసనః సితాంబు థుత్కురుతే 103**

అదృష్టహీనులైనవారు శ్రీబృందావనములో కూడ ఆనందమును పొందలేరు. ఇది చాలా విచిత్రమైన విషయము! కాని ఇందులో ఆశ్చర్యపడవలసిన పని లేదు. ఎందుకంటె వాతరోగి (కామెర్ల రోగి) పంచదార కలసిన నీళ్లను కూడ థూ, థూ అంటూ థూత్కరిస్తాడు.

**చిద్రసఘనమపి వృందావనమిహ మందావతాన్యపీక్షంతే**
**అథవా కిమిదం చిత్రం శంఖః పీతో హి భాతి పిత్తదృశః 104**

ఓహో! చిద్రసఘన స్వరూపమైన శ్రీబృందావనమును కూడ బుద్ధిహీనుడు తన స్థితి ప్రకారమే చూస్తాడు. అందులో ఆశ్చర్యమేమి ఉన్నది ? కామెర్లరోగి తెల్లని శంఖమును కూడ పచ్చని రంగులో ఉన్నట్లే చూస్తాడు.

చిద్ఘన రస స్వరూపమైన శ్రీబృందావన నిజస్థితిని ఆంతర్యములో ఆనందింపవలెనన్న సాధకుడు బాహ్యముగనున్న వ్యతిరేక పరిస్థితులను దాటియే తీరవలెను.

**వృందారణ్యగుణాన్ రసేన గణయిష్యామోఽథబాలం ముహుః**
**ధిజ్ మామేవ మసత్ ప్రలాపినమహో సంభావయేత్ కోన్వదమ్**
**యన్మీయేత సమస్తమేవ కథమప్యంభో మహాంభోనిధేః**
**కుంభే నేదమతీవ హాస్య విషయో విశ్వంభరా మండలే 105**

“శ్రీబృందావన రసగుణములను ఆనంద పూర్వకముగా వర్ణిస్తాను” – అను ఇట్టి ప్రగల్భములను ప్రలాపించు వ్యక్తి నన్ను మాటిమాటికి యథేచ్ఛగా ధిక్కరిస్తున్నాడు. ఇట్లు భావించి ఆచరించుట సాధ్యమా! మహాసముద్రము నందలి నీటినంతటిని ఏదోఒక విధముగా ఒక్క ఘడియలో ఇంకింపజేయగలమా! లోకములో ఇట్టి కల్పనను కూడ కొందరు చేస్తూఉంటారు. అది హాస్యాస్పదమైన విషయము!

**పుమర్థాః పంచైవభ్రమణమిహ త్రిష్వక్ విధ్ధతే**
**సదానందే వృందావనగతజనైరాత్మ కలనే**
**ఇహస్థానాం త్వేతత్ పరమ కృపయా ప్రోన్మద మహా**
**రసౌఘ శ్రీరాధాపదయుగజుషాం క్వాఽపి న దృశిః 106**

నిత్యానందముతో నుండు శ్రీబృందావనవాసుల ఆత్మదృష్టి ప్రకారము పురుషార్థములు అయిదు విధములుగ నాలుగు దిక్కులలోను విస్తరించియున్నట్లు

తెలుస్తున్నది. కాని, అక్కడ ఉన్మద మహారసప్రవాహ స్వరూపిణియైన శ్రీరాధాజీ యొక్క చరణ కమలములను సేవించువారికి శ్రీరాధా పరమ కృప చేత ఇతర దృష్టి అనునదియే ఉండదు.

పురుషార్థములు, శాస్త్రములు, వేదవేదాంగములు - ఈ అన్నింటికిని అతీతముగ శ్రీరాధా ప్రేమకాంతి సర్వత్ర విస్తరించి యున్నది. ఆ తల్లి పదపద్మసేవా భాగ్యమును పొందిన భాగ్యశాలికి ఇక దేనియందును ఆసక్తి ఉండదు.

**శ్రీవృందావనరాజ్యే కృష్ణ సుభావా పరం ప్రజారాజాః**
**యే కృతరాజైకాత్మ్యా స్తేషాం రస సంపదోఽనర్ఘ్యాః 107**

శ్రీబృందావన రాజ్యములో శ్రీకృష్ణుని యందు పరమ భావమును కలిగియుండు వ్యక్తి అక్కడి ప్రజలలో ఒకడైనను అతడు రాజే! బృందావన రాజ్యముతో తాదాత్మ్యమును పొందిన వాని చెంత అమూల్యమైన రస సంపద ఉంటుంది!

**శ్రీవృందావన మహిమా నహి మానసమన్యగామి మే కురుతే**
**తస్మిన్ శాస్త్ర వ్యాఖ్యా బుధాముధా బధిరగీతరంగో వః 108**

శ్రీబృందావన మహిమ నా మనసును అన్యత్ర పోనిచ్చుట లేదు. ఓ బుద్ధిమంతులారా! అందువలన, మీరు చేస్తున్న శాస్త్ర వ్యాఖ్య చెవిటివాని ముందు సంగీతము వలె నాకు వ్యర్థముగ తోస్తున్నది.

**యత్ కారుణ్యమగణ్యమేవ సుసుఖం నాస్త్యేవ యస్మాత్ పరమ్**
**నిర్మర్యాద విచిత్రశక్తి సహజా ఖేలంచ వృందావనమ్**
**తద్రాధా కరుణాకటాక్ష రహితే కించిత్ కరం నైవ తత్**
**దృష్టాంతోఽహమబోధమాత్ర విరహా తీవ్రార్తిభారః స్థితః 109**

శ్రీబృందావనము యొక్క కరుణ అనంతము, అంతకు మించిన సుఖము ఇక ఎచటను లభించదు. అట్టి శ్రీబృందావనము శ్రీరాధాజీకి అవధులు లేని

శక్తియుక్తమైన క్రీడా ఉద్యానవనము! అట్టి శ్రీరాధా కరుణాకటాక్షము లేనిచో సమస్తము అత్యంత తుచ్ఛముగ గోచరిస్తుంది. నేను అజ్ఞానమునకు వశుడనై 'నా పట్ల శ్రీరాధాకృప లేదు' అని మనసులో అనుకుంటూ, తీవ్రమైన ఆర్తితో వ్యాకులతను పొందుతూ ఉన్నాను.

ప్రేమస్వరూపిణియైన శ్రీరాధాజీ తన కృపను అందరిపైనను సమానముగా వర్షిస్తూ ఉంటుంది. ఆ ధారను అందుకొనుట వారివారి స్థితిగతులను బట్టి ఉంటుంది.

**ఆనందకందేఽపి న విందతే మనో**
**వృందావనే సుందరి సౌఖ్య బిందుకమ్**
**మనాగవీక్ష్య స్మితచారు తే ముఖం**
**వినా క్వ చంద్ర కుముదం ముదం వ్రజేత్ 110**

హేసుందరీ (శ్రీరాధా)! నీ మృదుమధుర మందహాసముతో కూడిన ముఖమును క్షణమాత్రము చూడకపోయినను ఆనందకందమైన శ్రీబృందావనము కూడ బిందు మాత్రపు సుఖమునైనను అనుభవింపలేదు. ఎక్కడైన, చంద్రుడు లేకుండ కలువ ఆనందమును పొందుతుందా!

శ్రీరాధా దివ్యరససౌందర్యధారయే బృందావనములో ప్రకటితమగుచున్న ఆనందధార!

**వృందావన ఇహ కతి వా న మిలంతి విదగ్ధ గోపసుందర్యః**
**రాధే! త్వయి పరమక్షి క్వ చకోరశ్చరతి చంద్రికా పరతః 111**

హే శ్రీరాధా! ఈ బృందావనములో ఎంత మంది చతురులైన గోపీమణులు లేరు ?కాని నాకన్నులు కేవలము నిన్నే చూస్తూ ఉంటాయి! వెన్నెలను విడచి, చకోర పక్షి ఇతరత్ర వెళ్తుందా ?

చకోరము వెన్నెలను మాత్రమే ఆస్వాదించునట్లు రసికమహాత్ములు శ్రీరాధా దివ్యప్రేమనే ఆస్వాదిస్తూ ఉంటారు.

**శ్రీరాధికే త్వం యది న ప్రసీదేః సీదేయమత్రాప్యఽ ముద్ధిజబ్ధీః**
**తదేష వృందావనగాత్మలోకః కృపాకటాక్షేణ సదేక్షనీయః 112**

హే రాధికా! ఒకవేళ నీవు ప్రసన్నురాలివి కాకపోతే, నేను ఇక్కడే వ్యాకుల చిత్తముతో శరీరాన్ని చాలిస్తాను. కనుక బృందావనములో నివసిస్తున్న నీయీ దాసునిపై నీ కపాకటాక్షమును ప్రసరింపజేసి, నిరంతరము ఆనందింపజేయుము తల్లీ!

**శ్రీరాధాఖ్య రూపం పరమం చరమం రమాదేవ్యాః**
**శ్రీభగవతశ్చ పరమం చరమరూపం ప్రియస్తస్యాః 113**

శ్రీరాధా రూపము లక్ష్మీదేవికి పరమ చరమ సీమ! శ్రీరాధా ప్రియతముడైన శ్రీశ్యామసుందరుని రూపము శ్రీభగవత్స్వరూపులందరికినీ పరమచరమ రూపము!

**వృందావన భువి తద నాద్యంత కాలం స్మరైక రసఖేలామ్**
**కుర్వత్ కిశోర నాగర మోహన మిథునం మమాఽస్తు భజనీయమ్ 114**

శ్రీబృందావన భూమిపై అనాదిగా, అనంతకాలము నుండి జరుగుచున్న ఏకమాత్ర స్మర రస క్రీడలో ఉన్మత్తులగుచుండు నాగరమోహన యుగళ కిశోరులే నాకు భజింపతగినవారు.

**మోహన వృందారణ్యే మోహన కుంజేషు మోహన కృత్యా**
**మోహన రాధాకృష్ణౌ మోహన కేలి సదా భజత 115**

మోహనమైన శ్రీబృందావనములోని మోహన కుంజలలో కేళీ పరాయణులైన మోహన శ్రీరాధా కృష్ణులను మోహన సేవతో నిత్యము భజింపుము!

**రాధా దాస్య లసత్ వపురనిశం రాధాపదసేవీ**

**అంతస్తోషిత రాధారసికో రాధావనే సదా నివస 116**

శ్రీరాధాదాస్యమునకు యోగ్యమైన ఉజ్వల శరీరమును పొంది, నిరంతరము శ్రీరాధా పదపద్మసేవా నిరతుడవై, శ్రీరాధారసికుడైన శ్రీశ్యామసుందరునకు సంతోషము కలిగించుచు, నిరంతరము శ్రీబృందావనములో నివసింపుము!

**రాధే త్వన్ముఖ సన్ముఖమేవ వికాస్యక్షి మే సుముఖి**

**ఆనందయతి హి కుముదం సుహృత్ కేవలం చంద్రః 117**

హే సుముఖీ! రాధే! నీ శ్రీముఖ సముఖము (సన్నిధి)లోనే నా కన్నులు వికసించి, ఆనందమును పొందుతాయి. కలువకు ఆప్తుడైన చంద్రుడే కలువకు ఆనందమును ప్రదానం చేయగలడు.

కలువలు చంద్రుడు ఉదయించినపుడే వికాసాన్ని పొందుతాయి. లేనిచో ముడుచుకుంటాయి. అట్లే సఖి శ్రీరాధాముఖచంద్ర దర్శనమాత్రము చేతనే సంపూర్ణ వికాసమును,ఆనందమును పొందుతుంది.

శ్రీప్రబోధానందులు శ్రీబృందావన మహిమను ఒక శతకమును మించి మరొక శతకములో అమృతధారాపాతముగ అందించినారు. సమస్త వేదవేదాంగములకును అతీతమై, పరమ రహస్యపూర్ణులైన శ్రీరాధాకృష్ణులే రాధాసఖికి జీవము, జీవనము అని చాటి చెప్పుచు ఆమహాత్ముడు ఈ 11వ శతకమును ముగించినారు.

శ్రీరాధే

# శ్రీబృందావన మహిమ

శ్రీబృందావన మహిమ ఎల్లలులేని ఒక మహారస సాగరము! సాక్షాత్తు రాధాజీ స్వరూపముగ స్తుతింపబడుతున్న బృందావనమును ఎంత వర్ణించినను అది అసంపూర్ణమే! శ్రీరాధ ఎట్లు వేదాతీతయో, తద్రూపమే అయిన బృందాధామము కూడ అట్లు వేదాతీతమే అగుటచే అది వర్ణనాతీతమై వెలుగుచున్నది. బృందావనమునందలి స్థావర, జంగమము లన్నియు చిద్రసఘన స్వరూపములని బృందామహాత్మ్యులు వేనోళ్ల చాటి చెప్పినారు. బ్రహ్మాది దేవతలతో సహా ఆధామములో తాము గడ్డిపరకగా పుట్టినను చాలునని కోరుకొనుటకు అది మహానంద రససాగరము అగుటయే కారణము!

సాక్షాత్తు శ్రీరాధాగోవిందులు బృందావనమును ప్రస్తుతించుట, నమస్కరించుట, ఆధామము తమ ఆత్మస్వరూపమని సంభావించుట గమనించినచో శ్రీబృందావనము ఎంతటి మహిమాన్వితమో స్పష్టము కాగలదు. అందలి వృక్షరాజములు, నదీ నదములు, పశుపక్ష్యాదులు అన్నియు జ్యోతిర్మయములై వెలుగుచుండుటను గ్రంథకర్త దర్శించి; తనివితీర వర్ణించినారు.

బృందావనము రాధాజీవలెనే పరమప్రేమస్వరూపిణి! శరణువేడినవాడు ఎంతటి పాపాత్ముడైనను, తల్లివలె ఒడిలోనికి స్వీకరించి ఉద్ధరించు పావనమూర్తి! శ్రీరాధాగోవిందులు, సఖీమణి, బృందావనము – ఈ నలుగురు పరస్పర పరిపోషకములై జీవకల్యాణలీలలను ధారగా కురియుచుందురు.

**జయతు జయతు శ్రీబృందావనధామ్!**